

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 304

గురువారం 25-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్యాంకులకు బూస్ట్

ఈ ఆర్థిక సంవత్సరం రూ. 88 వేల కోట్ల అదనపు మూలధనం - 14లో



సెమీస్‌లో ఫెడరర్

ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్స్‌లో బెర్డిచ్‌పై విజయం – స్పోర్ట్స్‌లో

తూచేస్తున్నారా.. దోచేస్తున్నారా?

వినియోగదారులను నిలువునా దోపిడీ చేస్తున్న వ్యాపారులు

నగరంలో ఏదికొన్నా తప్పడు తూకమే..

- మార్కెట్ల నుంచి మాల్స్ దాకా ఇదే పరిస్థితి.. నిస్తేజంగా తూనికలు, కొలతల శాఖ
- మూడు లక్షల వ్యాపార సంస్థలు.. తనిఖీ సిబ్బంది 16 మందే..!
- నామమాత్రపు తనిఖీలు.. స్వల్ప పెనాల్టీలతోనే సరి

- వివరాలు 2లో



కిలో అంటే ఎంత..?

850 నుంచి 950 గ్రాములు

లీటర్ అంటే..?

800 నుంచి 900 మిల్లీలీటర్లు.

మరి క్వింటాల్ అంటే.. ?

95-96 కిలోలు..

ఇదేంటి ఇష్టం వచ్చినట్లు రాసేస్తున్నారు అనుకుంటున్నారా..? హైదరాబాద్‌లో అంతే!?

ఉప్పులు, పప్పులు, కాయగూరల నుంచి పాలు, నూనె వరకు ఏది కొన్నా మనకు వచ్చేది ఈ లెక్కనే! ఇంటి ముందు కిరాణా షాపు నుంచి పెద్ద పెద్ద సూపర్ మార్కెట్ల దాకా.. సాధారణ త్రాసుల నుంచి ఎలక్ట్రానిక్ తూకం యంత్రాల దాకా దేనిపై తూచినా ఇంతే! కావాలంటే మీరే చూడండి. ఇది కిలో అని చెప్పి అమ్మిన కందిపప్పు.. కానీ ఉన్నది 855 గ్రాములే! నగరంలోని పలు ప్రాంతాల్లో 'సాక్షి' జరిపిన పరిశీలనలో తూకం పేరిట జరుగుతున్న దోపిడీ బయటపడింది. ఇంత జరుగుతున్నా తూనికలు కొలతల శాఖ పట్టించుకోవడం లేదు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి.



అలనాటి ప్రముఖ నటీమణి

కృష్ణకుమారి ఇకలేరు

- కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న నటి
- బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూత
- ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో ఎన్నో మరుపురాని చిత్రాలు

సాక్షి, బెంగళూరు: తెలుగు చలనచిత్ర రంగంలో తన ముగ్ధ మనోహర రూపంతో, అద్వితీయ నటనా కౌశలంతో ప్రేక్షకులను కట్టిపడేసిన అలనాటి అందాల తార, ప్రముఖ నటీమణి కృష్ణకుమారి ఇకలేరు. సుమారు


మిగతా 2వ పేజీలో ▶

కృష్ణ సౌందర్యం

- ఫ్యామిలీలో

'ఫిట్‌నెస్' ఉంటేనే పదోన్నతి!

- ఐపీఎస్‌లకు శారీరక దృఢత్వం తప్పనిసరి
- 'స్మార్ట్ పోలీసింగ్' పేరుతో కేంద్ర హోంశాఖ ప్రతిపాదన
- పోలీసు మెడల్ ఇవ్వాలన్నా ఫిట్‌నెస్ ఉండాల్సిందే..
- వ్యతిరేకించిన మహారాష్ట్ర, కేరళ
- మిశ్రమ అభిప్రాయం వ్యక్తం చేసిన తెలంగాణ.. మాకే ఎందుకీ నిబంధన అంటున్న ఐపీఎస్‌లు
- ఆలిండియా సర్వీసు అధికారులందరికీ వర్తింపజేయాలని డిమాండ్



ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్).. దీనికోసం ఎంతో కష్టపడి చదవాలి.. రాత పరీక్షల్లో పాసవడంతోపాటు శారీరకంగా కూడా దృఢం (ఫిట్)గా ఉండాలి. ఆ తర్వాతే ఐపీఎస్‌కు ఎంపిక.. శిక్షణ.. ఉద్యోగ బాధ్యతలు. కానీ ఇప్పుడా 'ఫిట్‌నెస్'అంశం ఐపీఎస్ అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఎంపిక, శిక్షణ సమయంలోనే ఫిట్‌నెస్‌తో ఉంటే సరిపోదని, సర్వీసు మొత్తం ఫిట్‌గా ఉండాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అలా ఫిట్‌గా ఉండే అధికారులకే పదోన్నతులు, పోలీసు మెడల్స్ ఇవ్వాలని రాష్ట్రాలకు ప్రతిపాదించింది.

- వివరాలు 2లో

విశ్వనగరానికి ఓ విజన్..!

- 'గ్రేటర్' గ్లోబల్ సిటీగా మారాలంటే విజన్ అవసరం
- ఫ్యూచరిస్టిక్ సిటీస్ రౌండ్ టేబుల్ సదస్సులో నిపుణులు

6లో

మూడో కేసులోనూ

లాలూ దోషే

- వివరాలు 11లో

140 ఏళ్లు

బతికేస్తాం!

- వివరాలు 11లో

ఐదు వేదికలు.. ఆరు ప్లీనరీలు

రేపటి నుంచి మూడు రోజులు 'హైదరాబాద్ సాహిత్యోత్సవం' 18లో

‘నీళ్ల శాఖ’ మెయిల్ హ్యాక్

- ‘వుయ్ నీడ్ ఏ ఫేవర్’ అంటూ ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు మెయిల్
- బ్యాంకు పెద్దల నుంచి ఫోన్‌లు రావడంతో అప్రమత్తమైన ‘కాడా’ కమిషనర్
- పోలీసులకు ఫిర్యాదు, నైజీరియన్‌ల పనిగా గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: ఫేస్‌బుక్, ట్వీటర్‌లను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ఏకంగా నీటిపారుదల శాఖనే టార్గెట్ చేశారు. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) పరిధిలోని నాగార్జునసాగర్ ఆధునీకరణ పనులకు సంబంధించి వినియోగిస్తున్న మెయిల్‌నే హ్యాక్ చేశారు. హ్యాక్ చేసిన మెయిల్ నుంచే ఏకంగా ప్రపంచబ్యాంకు ప్రతినిధులకు ‘వుయ్ నీడ్ ఏ ఫేవర్’అంటూ మెయిళ్లు పంపారు. మెయిల్‌ను రిసీవ్ చేసుకున్న కొందరు ఎలాంటి ఫేవర్ కావాలంటూ శాఖ అధికారులకే ఫోన్‌లు చేయడంతో హ్యాక్ విషయం బయటపడింది.

అసలేం జరిగిందంటే...

రాష్ట్ర ప్రభుత్వం 2008లో ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనులకు సంబంధించి ‘కాడా’అధికారులు అప్పట్లోనే ఆంధ్రప్రదేశ్ వాటర్ సెక్టార్ ఇంప్లిమెంట్ ప్లాన్‌ను తయారు చేశారు. అదే అర్థం వచ్చేలా ఏపీడబ్ల్యూఎస్ఐపీ’పేరుతో ఒక మెయిల్ అడ్రస్‌ను క్రియేట్ చేసి దాని నుంచే ప్రపంచబ్యాంకు ప్రతినిధులు, ఇతర శాఖల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే మంగళవారం రాత్రి ఈ మెయిల్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, దాన్నుంచి అందులోని ప్రధాన మెయిల్ అడ్రస్‌లన్నింటికీ ‘వుయ్ నీడ్ ఏ ఫేవర్’అంటూ మెయిల్ సందేశం పంపారు. సుమారు 50 నుంచి 60 మంది వరకు ఇదే రకమైన మెయిల్ వెళ్లింది. ఈ మెయిల్ రాత్రిపూట పంపడంతో దీన్ని శాఖ అధికారులెవరూ గుర్తించలేదు. అయితే ఉదయం ఈ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్, ‘కాడా’కమిషనర్‌గా ఉన్న మల్సూర్‌కు ప్రపంచ బ్యాంకు ప్రతినిధి నుంచి ఫోన్ వచ్చింది. ‘రాత్రి మెయిల్ పంపారు. మీకు ఎలాంటి ఫేవర్ కావాలి’అని ఆ ప్రపంచబ్యాంకు ప్రతినిధి అడగడంతో ఆయన అవాక్కయ్యారు. ఎలాంటి మెయిల్ పంపలేదని చెప్పడంతో ఫోన్ చేసిన ప్రతినిధి సైతం కంగుతిన్నారు. ‘ఉదయం ప్రపంచబ్యాంకు ప్రతినిధి ఫోన్‌చేసి ఎలాంటి ఫేవర్ కావాలని అడగ్గానే కంగారు పడ్డా. తరువాత మెయిల్ విషయం చెప్పాడు. మరికొద్ది సేపటికే మరో ప్రపంచ బ్యాంకు అధికారి నుంచి ఫోన్‌చేసి మెయిల్ విషయమే అడిగారు. అయితే నేను హైదరాబాద్‌లో లేకపోవడంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. మళ్లీ కొద్దిసేపటికే ప్రస్తుతం ఏపీలో సెక్రటరీ స్థాయిలో ఉన్న ఐఏఎస్ అధికారి నుంచి ఇదే మెయిల్ గురించి ఫోన్ వచ్చింది. వెంటనే మా సిబ్బందిని అప్రమత్తం చేయడంతో అసలు విషయం బయటపడింది’అని మల్సూర్ ‘సాక్షి’కి తెలిపారు. వెంటనే దీనిపై బషీర్‌బాగ్‌లోని సైబర్ సెల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణలో దీన్ని నైజీరియన్‌కు చెందిన సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లుగా గుర్తించినట్లు తెలిసింది. అనంతరం మెయిల్ సందేశం పంపిన అడ్రస్‌లన్నింటికీ ‘ఈ మెయిల్ హ్యాక్ చేయబడింది. ఫేవర్ చేయాలంటూ వచ్చిన మెయిల్‌ను పరిగణనలోకి తీసుకోవద్దు’అంటూ తిరిగి మెయిల్ పంపారు.

‘ఫిట్‌నెస్’ ఉంటేనే పదోన్నతి!

‘స్మార్ట్ పోలీసింగ్’ పేరుతో కేంద్ర హోంశాఖ ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: పోలీసుల జీవితాల్లో భాగమైన ‘ఫిట్‌నెస్’అంశం ఐపీఎస్ అధి కారుల పదోన్నతులకు ఎసరుపెడుతోంది. ‘స్మార్ట్ పోలీసింగ్’చేయాలంటే ఐపీఎస్ అధికారులు శారీరకంగా కూడా దృఢంగా ఉండాలని, అలా ఫిట్‌గా ఉన్నవారికే పదోన్నతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పదోన్నతుల సమయంలో ఐపీఎస్ అధికారులకు ఫిట్‌నెస్ పరీక్ష తప్పనిసరి చేయాలని, ఈ ప్రతిపాదనలపై అభిప్రాయాలు తెలియజేయాలంటూ రాష్ట్రాలకు లేఖలు రాసింది. అంతేగా కుండా ఉత్తమ సేవలు అందించినవారికి ఇచ్చే పోలీస్ మెడల్ పొందాలన్నా కూడా ఫిట్‌నెస్ పరీక్ష తప్పనిసరి చేయాలని కూడా ఆ లేఖలో పేర్కొంది.

స్పందించింది మూడు రాష్ట్రాలే..

కేంద్రం రెండు నెలల కిందే ఈ ప్రతిపాదన చేసినా ఇప్పటివరకు మూడు రాష్ట్రాలు మాత్రమే అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఇందులో మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలు కేంద్ర ప్రతిపాదనను వ్యతిరేకించగా.. తెలంగాణ మాత్రం మిశ్రమ అభిప్రాయం వ్యక్తం చేశాయి. మహారాష్ట్ర ఆసక్తికరంగా సమాధానమిచ్చినట్టు కేంద్ర హోంశాఖ (ఎంహెచ్‌ఏ) వర్గాలు చెబుతున్నాయి. ఐపీఎస్ అధికారులు రోజంతా పనిచేయాల్సి ఉంటుందని, వారికి తమ శరీరాకృతి, ఫిట్‌నెస్ కోసం చెమటోడ్చే సమయం ఉండదని పేర్కొన్నట్లు తెలిసింది. ఇక తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రతిపాదనను వ్యతిరేకించలేదు, ఆమోదయోగ్యమని అంగీకరించలేదు. కేవలం కేంద్ర ప్రతిపాదనల పట్ల సానుకూలంగా ఉన్నామని, వాటిని అమలు చేయాలంటూ సంబంధిత విభాగాలకు ఆదేశాలిస్తామని పేర్కొంది.

ఐపీఎస్‌లలో వ్యతిరేకత!

‘ఫిట్‌నెస్’ప్రతిపాదనలపై దేశవ్యాప్తంగా ఐపీఎస్ అధికారులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ఐపీఎస్ అధికారి ఒకరు స్పందిస్తూ.. ‘‘పోలీసులు అంటే అందరికీ చులకనే! శ్రమకు తగిన గౌరవం, ప్రతిఫలం లేని ఉద్యోగంలో ఉన్నప్పుడు ఇలాంటివన్నీ ఎదుర్కోవాల్సిందే..!’’అని వ్యాఖ్యానించారు. ఏ ఆలిండియా సర్వీసు అధికారులకు లేని నిబంధన తమకు ఎందుకని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న మరో ఐపీఎస్ అధికారి పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలు సరికాదని.. మానసికంగా దృఢంగా ఉండి, ఎలాంటి శారీరక రుగ్మతలతో బాధపడకుండా ఉంటే చాలని రాష్ట్ర ఐపీఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అమలుకు కేంద్రం యోచన!

ఐపీఎస్ అధికారులకు ఫిట్‌నెస్ అంశంపై కేంద్ర హోంశాఖ వెనక్కి తగ్గే అవకాశాల్లేవని సమాచారం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అభిప్రాయం తెలుసుకున్న తర్వాత.. ఐపీఎస్‌ల పదోన్నతులకు మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రం భావిస్తోంది. సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఈ తదితర పారామిలటరీ అధికారులకు వర్తింపజేసే శారీరక దృఢత్వ నిబంధనలను వర్తింపజేయాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే.. శారీరకంగా దృఢంగా లేని ఐపీఎస్ అధికారుల మెడికల్ బిల్లులు భారంగా మారాయని కేంద్రం భావిస్తోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) కింద ఆ మెడికల్ బిల్లులు క్లియర్ అవుతున్నందున ఆ కోణంలోనూ ‘ఫిట్‌నెస్’ప్రతిపాదనను పెట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ అంశంపై ఇప్పటివరకు మూడు రాష్ట్రాలే అభిప్రాయం తెలపడం పట్ల కేంద్ర హోంశాఖ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఐపీఎస్ అధికారులు ‘ఫిట్‌నెస్’అంశానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రభావితం చేస్తున్నారని సందేహిస్తున్నట్లు తెలుస్తోంది.

జాబిల్లి.. రంగులు వెదజల్లి



ఈనెల 31న చందమామ పెద్ద పరిమాణంలో..
నీలం, ఎరుపు రంగుల్లో కనిపించనున్నాడు!
150 ఏళ్ల తర్వాత సంభవిస్తున్న ఈ అరుదైన సంఘటన నిజంగానే ఓ భ్రమ..
నిజానికి జాబిల్లి సైజు.. రంగు వీసమెత్తు కూడా మారదు.
అయినా సైజు పెరిగినట్లు ఎందుకు కనిపిస్తాడు?
రక్తం చిమ్ముతున్నట్లు ఎందుకు భయపెడతాడు?

సూపర్ ఎలా?

భూమి చుట్టూ జాబిల్లి తిరుగుతూ ఉంటుందని మనకు తెలిసిందే. చంద్రుడు గుండ్రంగా కాకుండా గజిబిజిగా (ఆప్సిడల్ ప్రెసెషన్‌లో) తిరుగుతాడు. దీంతో కొన్నిసార్లు చంద్రుడు భూమికి కొంత దగ్గరగా వస్తాడు. ఇలాంటి సమయాల్లో అంటే పౌర్ణమి రోజున సూర్యుడికి చంద్రుడు అభిముఖంగా వస్తాడు. దీంతో జాబిల్లి పరిమాణం పెరిగినట్లు అనిపిస్తుంది. ఏదైనా పున్నమి రోజున భూమికి అతి దగ్గరగా వస్తే దాన్ని ‘సూపర్ మూన్’ అంటారు.

నీలాల జాబిలి ఎందుకైంది?

కొన్ని ప్రాంతాల్లోని అరుదైన ధూళి కణాల కారణంగా పున్నమి నాటి చంద్రుడు నీలంగా కనిపిస్తాడు. దీంతో అక్కడి వారు బ్లూమూన్ అని పేరు పెట్టుకున్నారు. ఇదే ప్రపంచం మొత్తం వాడుకలోకి వచ్చింది. ఈ బ్లూమూన్‌కు రెండు నిర్వచనాలు ఉన్నాయి. ఒక్కో రుతువులోని 4 పున్నమి రాత్రుల్లో మూడోదాన్ని బ్లూమూన్ అంటారని ఒక నిర్వచనం చెబితే.. ఒక నెలలోనే వచ్చే రెండో పున్నమిని బ్లూమూన్ అంటారని ఇంకో నిర్వచనం చెబుతోంది. ఈ నెల 31న కనిపించే జాబిలి రెండో నిర్వచనానికి సరిపోతుంది.

ఎరుపు రంగు ఏమిటి?

సంపూర్ణ చంద్రగ్రహణం రోజున చందమామ అరుణవర్ణంలో వెలుగులు వెదజల్లుతుంది. దీన్నే ఇంగ్లిష్‌లో బ్లడ్‌మూన్ అంటారు. సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడినప్పుడు భూమి నీడ మొత్తం జాబిల్లిపై పడుతూ ఉంటుంది. అదే సమయంలో భూమి వెనుక వైపు నుంచి ప్రసారమయ్యే సూర్యుడి కాంతి కొంత జాబిల్లిపై పడుతుంది. ఈ క్రమంలో అది ఎక్కువ దూరం ప్రయాణిస్తుంది. ఫలితంగా ఎక్కువ తరంగ దైర్ఘ్యమున్న ఎరుపు కాంతి జాబిల్లిని చేరుతుంది. దీంతో బ్లడ్‌మూన్ ఆవిష్కృతమవుతుంది. సూర్యుడు ఉదయిస్తున్న.. అస్తమిస్తున్న వేళల్లో కొంత సమయం ఎరుపు రంగు కనిపిస్తుందే.. అలా అన్నమాట!

ఎక్కడ చూడొచ్చు ?

సూపర్ బ్లూ, బ్లడ్ మూన్ ప్రపంచం మొత్తమ్మీద చూసే అవకాశాలు తక్కువే. అలాస్కాతోపాటు ఉత్తర అమెరికా, హవాయిలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యోదయానికి ముందు భారీసైజున్న ఎర్రటి జాబిల్లిని చూడొచ్చు. ఆసియాతో పాటు మధ్యప్రాచ్య దేశాలు, రష్యా తూర్పు ప్రాంతం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో రాత్రి సమయంలో చూడొచ్చు. భారత్‌లో సాయంత్రం 4.21 గంటల సమయంలో పాక్షికంగా, 6.21 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణ సమయంలో చూడొచ్చని కోజికోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్ టెక్నికల్ ఆఫీసర్ జయంత్ గంగూలీ తెలిపారు. దాదాపు గంటపాటు ఎర్రటి జాబిల్లిని చూడొచ్చని చెప్పారు.

– సాక్షి, హైదరాబాద్

తూచేస్తున్నారా.. దోచేస్తున్నారా?



కిలో టమాటాల బరువు 835 గ్రాములే

సాక్షి, హైదరాబాద్

ఓ కిరాణా దుకాణానికో, సూపర్ మార్కెట్‌కో వెళ్లారు.. కిలో కందిపప్పు, అర కిలో చక్కెర కొనుక్కొచ్చారు.. ఎలక్ట్రానిక్ కాంటాపై తూచి ఇవ్వడంతో అంతా బాగానే ఉందనుకున్నారు. కానీ ఆ కందిపప్పు ఉండేది కిలో కాదు.. 850 నుంచి 950 గ్రాములే! చక్కెర కూడా 400 నుంచి 450 గ్రాములే. ఇదే కాదు లీటర్ నూనెగానీ, పాలుగానీ తీసుకుంటే వస్తున్నది 850 నుంచి 950 మిల్లీలీటర్లే.. ఇవేకాదు బియ్యం, ఉప్పులు, పప్పుల నుంచి బంగారం దాకా తూకంలో మోసం జరుగుతోంది. వ్యాపారులు సాధారణ త్రాసులతోపాటు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలను ట్యాంపర్ చేసి వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక్క తూకంలోనే కాదు గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ)లోనూ మోసం జరుగుతోంది.

తనిఖీ సిబ్బంది ఏరీ?

గ్రేటర్ హైదరాబాద్‌వ్యాప్తంగా సుమారు 3 లక్షలకు పైగా వ్యాపార సంస్థలు ఉన్నాయి. దాడు లు, తనిఖీలు చేసి అక్రమాలను నియంత్రించే అధికారమున్న తూనికలు, కొలతల శాఖ సిబ్బంది ఉన్నది 16 మందే. వారు కూడా తూతూమంత్రపు తనిఖీలు, నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఎలక్ట్రానిక్ కాంటాల ట్యాంపరింగ్

సాధారణ త్రాసులతో మోసం చేస్తారని, ఎలక్ట్రానిక్ కాంటాలతో మోసం ఉండదని జనంలో అభిప్రాయముంది. కానీ వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాంటాలను ట్యాంపర్ చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. అసలు సాధారణ త్రాసుల కన్నా వీటితో మరింత సులువుగా మోసం చేసేందుకు అవకాశం ఉండటమే దీనికి కారణం. ఎలక్ట్రానిక్ కాంటాలు ఖాళీగా ఉన్నప్పుడు డిస్‌ప్లేపై సున్నా (0) బరువును చూపిస్తుంది. తర్వాత సరుకులు/వస్తువులు పెట్టి బరువు లెక్కిస్తారు. అయితే ఎలక్ట్రానిక్ కాంటాలపై ఉండే ఆప్షన్లను మార్చడం ద్వారా తక్కువ సరుకులు పెట్టినా ఎక్కువ బరువు డిస్‌ప్లేపై కనిపించేలా చేస్తున్నారు. ఉదాహరణకు కాంటాపై 20 కిలోల సరుకు పెడితే 21.2 కిలోలు ఉన్నట్లుగా చూపుతుంది. అదే ఆప్షన్‌ను మార్చితే సక్రమంగా 20 కిలోల బరువు చూపుతుంది.

జాగ్రత్తగా ఉండాలి..



తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి. వినియోగదారులకు చైతన్యం అవసరం. కొనుగోళ్లలో జాగ్రత్త వహించాలి. మోసాలను అరికట్టేందుకు వారంలో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. సీజన్ వారీగా కూడా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. తూకం మోసాలపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం..

– వి.శ్రీనివాస్, రీజినల్ డిప్యూటీ కంట్రోలర్, తూనికలు కొలతల శాఖ, రంగారెడ్డి

తూకాల్లో మోసమే



గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కిలో కూరగాయలు కొంటే 800 గ్రాములే వస్తున్నాయి. త్రాసుతో పాటు ఎలక్ట్రానిక్ కాంటాలతోనూ మోసం చేస్తున్నారు. తూనికలు, కొలతల శాఖ పట్టించుకోని కారణంగానే ఈ దోపిడీ కొనసాగుతోంది..

– శ్రీనివాస్‌యాదవ్, ప్రైవేటు ఉద్యోగి, ఆసిఫ్‌నగర్, హైదరాబాద్

ఏది కొన్నా తక్కువ తూకమే..

- మార్కెట్‌లో కిలో పండ్లు, కూరగాయలు, మటన్, చికెన్, చేపలు వంటివి ఏవి కొన్నా 800–900 గ్రాములే ఉంటున్నాయి. కొందరు వినియోగదారులు అది గుర్తించి ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. సికింద్రాబాద్, గడ్డిఅన్నారం, మాదన్నపేట, గుడిమల్కాపూర్, కొత్తపేట మార్కెట్లలో ఇలాంటి ఘటనలు జరిగాయి.
- ఇక మార్కెట్‌లో వివిధ బ్రాండ్ల నూనె ప్యాకెట్లలో నిర్దేశించిన బరువు కంటే తక్కువగా నూనె ఉంటోంది. లీటర్ ప్యాకెట్లలో 50 నుంచి 100 గ్రాములు, ఐదు లీటర్ల బాటిళ్లలో 200 నుంచి 400 గ్రాముల వరకు తక్కు వగా ఉంటున్నాయి. ఇటీవల తూనికలు, కొలతల శాఖ దాడుల్లో ఇలాంటి వాటిని గుర్తించారు కూడా.
- పెట్రోల్ బంకుల్లో కొనుగోలు చేస్తున్న ప్రతి లీటర్ పెట్రోల్, డీజిల్‌లలో 50 మిల్లీలీటర్ల నుంచి 100 మిల్లీలీటర్ల వరకు తక్కువగా ఉంటోంది.
- రేషన్ దుకాణాల డీలర్ల చేతివాటమైతే మరీ ఎక్కువగా ఉంటోంది. ఇటీవల హైదరాబాద్ శివార్లలోని బాలనగర్‌లో ఉన్న రేషన్ దుకాణంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు చేసిన దాడిలో విస్తుపోయే విషయం వెల్లడైంది. అందులోని ఎలక్ట్రానిక్ కాంటాను ట్యాంపర్ చేయడంతో.. 20 కిలోల బరువును పెడితే, 21.2 కిలోల బరువు చూపుతున్నట్లు గుర్తించారు.
- నేరుగా లారీలు, ట్రక్కులతోనే బరువు తూచే ఇసుక, ఇనుము వంటి వాటి తూకంలోనూ భారీగా మోసాలు జరుగుతున్నాయి. వ్యాపారులు వేబ్రిడ్జిల నిర్వాహకులతో కుమ్మక్కై తక్కువ తూకం వేస్తున్నారు.

మోసం జరుగుతోందిలా..

- సాధారణంగా ఎలక్ట్రానిక్ కాంటాలను సమతలంలో ఏర్పాటు చేయాలి. సమతలంగా లేకున్నా, ఓ వైపు ఎత్తుగా, మరోవైపు పల్లంగా ఉన్నా.. తప్పుడు తూకం చూపిస్తుంది. ఇది తెలియక కొందరు, మోసం చేసే ఉద్దేశంతో మరికొందరు వ్యాపారులు కాంటాలను తప్పుగా అమర్చుతున్నారు.
- ఎలక్ట్రానిక్ కాంటాలపై నేరుగా తూచలేని సరుకులు, వస్తువుల కోసం కాంటాపై ఏదైనా బుట్ట, పళ్లెం వంటిది పెట్టి దానిలో తూకం వేస్తారు. అలాంటప్పుడు కాంటాలో బరువును ‘జీరో (0)’సెట్టింగ్‌కు మార్చుతారు. దీంతో ఆ బుట్ట, పళ్లెం బరువు కూడా కలిసిపోయి సున్నాగా చూపిస్తుంది. అయితే తర్వాత ఇతర వస్తువులను తూచేప్పుడు ఆ బుట్ట/పళ్లెం తీసేసినా.. తిరిగి బరువును ‘జీరో (0)’సెట్టింగ్‌కు మార్చడం లేదు.
- ఎలక్ట్రానిక్ కాంటాల్లో బరువు తూచే విధానాన్ని సవరించేందుకు మోడ్ ఆప్షన్ ఉంటుంది. దీనిని వ్యాపారులు దుర్వినియోగం చేసి.. తప్పుడు తూకానికి పాల్పడుతున్నారు.
- ఇక సాధారణ టేబుల్ త్రాసులో తూకం రాళ్లు (బాట్లు), సరుకులు పెట్టే ప్లేట్ల కింద ఉండే సెట్టింగ్‌ను అటూ ఇటూ జరపడం ద్వారా తక్కువ తూకం వచ్చేలా చేస్తున్నారు.
- ముఖ్యంగా కూరగాయల మార్కెట్ల వంటి చోట్ల అడుగున కట్ చేసిన తప్పుడు తూకం రాళ్లను వినియోగిస్తున్నారు.

ఉద్యాన శాఖలో కారుణ్య నియామకాలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యాన శాఖలో కారుణ్య నియామకాల కింద ఏడుగురు తోటమాలీలుగా నియమితులయ్యారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్లో సాధారణ పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) అధర్ సిన్హా వారికి నియామక పత్రాలను అందచేశారు. ఉద్యోగం పొందిన వారిలో అస్లాం, సయ్యద్ అలీ, కరన్, వెంకటేశ్, లక్ష్మణ్, మిరాజుద్దీన్, అలీముద్దీన్ ఉన్నారు.

లొసుగుల్ని వాడుకుంటున్నాయి

- పార్టీల నిధుల సమీకరణపై రేవంత్ పిటిషన్
- పరిశీలించాలని ఎన్నికల సంఘానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చట్టంలోని లొసుగుల్ని అడ్డుపెట్టుకుని నిధుల సమీకరణ చేస్తున్న రాజకీయపార్టీలపై చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ నిధుల కోసం టీఆర్ఎస్ చేసిన నిధుల సేకరణ ఎన్నికల సంఘం మార్గదర్శకాల పరిధిలోకి వస్తుందో లేదో కూడా తేల్చాలని ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యాన్ని బుధవారం విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, న్యాయమూర్తి జస్టిస్ సి.హరిశంకర్‌ల ధర్మాసనం పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓ అభిప్రాయానికి రావాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. పార్టీ ప్లీనరీ నిమిత్తం ‘బంగారు కూలీ’పేరుతో టీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

జర్నలిస్టు సంక్షేమ నిధి లబ్ధిదారులకు

ఫిబ్రవరిలో చెక్కులు

ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఇచ్చే ఆర్థిక సాయానికి ఎంపికైన లబ్ధిదారులకు ఫిబ్రవరిలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా గతేడాది 71 మందికి, తర్వాత 30 మందికి ఈ సంక్షేమ నిధి ద్వారా ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు. బుధవారం తెలుగు వర్సిటీలో తెలంగాణ మీడియా అకాడమీ పాలక మండలి సమావేశంతో పాటు జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ సమావేశం నిర్వహించారు. సంక్షేమ నిధి ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులను ఈ సందర్భంగా కమిటీ ఆమోదించింది. ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా తరగతులు, మోనోగ్రాఫ్స్ తదితర అంశాలపై పాలకమండలి సభ్యులు ఆమోదం తెలిపారు.

కృష్ణకుమారి ఇకలేరు



కృష్ణకుమారి భౌతికకాయం

▶ మొదటి పేజీ తరువాయి

పాతికేళ్లపాటు వెండితెరను ఏలిన ఈ నటీమణి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం బెంగళూరులోని తన స్వగృహంలో కన్నుమూశారు. 1933, మార్చి 6న పశ్చిమ బెంగాల్‌లోని నౌహతిలో కృష్ణకుమారి జన్మించారు. ఆమె భర్త ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మాజీ ఎడిటర్ అజయ్ మోహన్ ఖైతాన్. ఆయన కొన్నేళ్ల క్రితమే మరణించారు. అప్పటి నుంచి తన ఏకైక కుమార్తె దీపిక, అల్లుడు, మనవడితో కలిసి నివసిస్తున్నారు. ప్రముఖ నటీమణి షావుకారు జానకి కృష్ణకుమారికి స్వయానా సోదరి. బుధవారం మధ్యాహ్నం బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య కృష్ణకుమారి అంత్యక్రియలను పూర్తిచేశారు. ఆమె మృతికి పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

నవ్వితే నవరత్నాలతో వెండితెర ప్రస్థానం

1951లో ‘నవ్వితే నవరత్నాలు’ చిత్రం ద్వారా కృష్ణకుమారి తెరంగ్రేటం చేశారు. అనంతరం పల్లెపడుచు, బంగారు పాప, ఇలవేల్పు, అభిమానం, దేవాంతకుడు, భార్యాభర్తలు, కులగోత్రాలు తదితర చిత్రాల్లో నటించి తెలుగు చిత్ర సీమపై చెరగని ముద్ర వేశారు. అందచందాలకు తోడు నటనను మేళవించి తెలుగు, తమిళ, కన్నడ ప్రేక్షకుల మది దోచుకున్నారు. కన్నడ కంఠీరవ దివంగత డాక్టర్ రాజ్‌కుమార్‌తో ఎన్నో చిత్రాల్లో ఆడిపాడారు. తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కాంతారావులతో కృష్ణకుమారి నటించిన చిత్రాలు సూపర్‌హిట్లుగా నిలిచాయి. తమిళుల ఇలవేల్పు శివాజీ గణేషన్‌తోనూ అనేక చిత్రాల్లో నటించి మెప్పించారు. తెలుగులో ఎన్టీఆర్‌తో ఆమె అధిక సినిమాల్లో హీరోయిన్‌గా నటించి హిట్‌పెయిర్‌గా ఖ్యాతి పొందారు. ఆమె నటనా కౌశలానికి మూడుసార్లు జాతీయ అవార్డు, రాష్ట్ర స్థాయి నంది అవార్డు, కాంచనమాల, సావిత్రి, ఎన్టీఆర్ జాతీయ అవార్డులు వరించాయి.

కలలో కూడా హాని చేయని మనిషి

నా సోదరి కృష్ణకుమారి ఇంత హఠాత్తుగా నన్ను విడిచి వెళ్లిపోవడం చాలా బాధగా ఉంది. నేను చెన్నై నుంచి వచ్చాక 20 ఏళ్ల నుంచి ఒకే కాంపౌండ్‌లో కలసి ఉంటున్నాం. ఆమె ఎంతో సున్నిత మనస్కురాలు. కలలో కూడా ఎవరికీ హాని చేసే మనిషి కాదు. సినీ పరిశ్రమలో అందరి దగ్గర ఎంతో మంచి పేరు తెచ్చుకుంది. సినిమాలంటే తనకు ఎంతో మక్కువ. ఎంతో మంది చదువుకోవడానికి ఆర్థికంగా సహాయపడింది. ఆమె మనవడు పవన్ అంటే కృష్ణకుమారికి ఎనలేని ప్రేమ. పవన్ పెద్దవాడయ్యే వరకు జీవించాలని ఉంది అని తరచూ నాతో చెప్పేది.

– షావుకారు జానకి, ప్రముఖ నటి

అమ్మ నాకు అన్నీ ఇచ్చింది



అమ్మ నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయింది. ఇటీవలే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కొద్దినెలలుగా తరచూ అనారోగ్యంతో బాధ పడుతూ ఉంది. ఆస్పత్రిలో చికిత్స తర్వాత కొద్దిగా ఆరోగ్యం కుదుటపడింది. మళ్లీ కొద్ది రోజులకే జబ్బు తిరగబెట్టింది. అమ్మ నాకు అన్నీ ఇచ్చింది. ఎంతో మందికి ఎన్నో రకాలుగా అమ్మ సహాయం చేసింది.

–దీపిక, కృష్ణకుమారి కుమార్తె



... కుర్చీ కూడా ఇక్కడకు తెచ్చేసుకుంటే పోయేదేమో సార్!

రైలుతో సెల్ఫీ తీసుకోవాలని..

ఎంఎంటీఎస్ ముందు సెల్ఫీ వీడియోకు యత్నం

అదే రైలు ఢీకొట్టడంతో గాయపడిన జిమ్‌ట్రైనర్

సాక్షి,హైదరాబాద్: వేగంగా వస్తున్న ఎంఎంటీఎస్ ముందు సెల్ఫీ వీడియో దిగడానికి ప్రయత్నించిన ఓ యువకుడు అదే రైలు ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. ఈ వీడియో బుధవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కి చెందిన కృష్ణమూర్తి కుమారుడు తోటం శివ(25) జిమ్ ట్రైనర్. ఇతడి సోదరుడు సతీష్ హైదరాబాద్‌లోని బోరబండ సమీపంలో ఉన్న పర్వత్‌నగర్‌లో నివసిస్తున్నాడు. శివ కొన్నిరోజుల క్రితం సతీష్ వద్దకు వచ్చాడు. టైమ్‌పాస్ కావట్లేదంటూ ఆదివారం బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్ వద్దకు వచ్చాడు. రైలు పట్టాలకు సమీపంలో నిల్చొని వెనుక నుంచి వస్తున్న ఎంఎంటీఎస్‌తో సెల్ఫీ తీసుకునేందుకు యత్నించాడు. రైల్వే హోంగార్డ్ వారిస్తున్నా ఎడమ చేత్తో సెల్‌ఫోన్ పట్టుకున్న శివ కుడిచేత్తో రైలును చూపిస్తూ ఫోజు ఇచ్చాడు. ఇంతలో ఎంఎంటీఎస్ డ్రైవర్ ఎమర్జెన్సీ బ్రేక్ వేశారు. వేగం తగ్గిన రైలు వచ్చి శివ కుడిచేతిని ఢీ కొట్టింది. దీంతో పట్టాల పక్కన పడిపోయిన శివ తలకు రాయి తగలడంతో గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. సోమవారం భరత్‌నగర్ ఆర్పీఎఫ్ పోలీసులు శివకు సెల్‌ఫోన్ అప్పగించి అతడిపై కేసు నమోదు చేశారు. కౌన్సెలింగ్ అనంతరం రైల్వే కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం విధించిన రూ.500 జరిమానా శివ చెల్లించాడు. ఈ సెల్ఫీ 'సైట్'ను నాంపల్లి రైల్వే ఎస్పీ జి.అశోక్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి బుధవారం సందర్శించారు.

రైలు వెడల్పు ఎక్కువ ఉండడం వల్లే?

రైళ్ల ముందు, వాటి సమీపంలో సెల్ఫీలు దిగే అలవాటు శివకు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వరంగల్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అతడు సాధారణ రైళ్ల ముందు సెల్ఫీలు దిగి ఉంటాడని, వాటి వెడల్పు కేవలం రెండు మీటర్లేనని, ఎంఎంటీఎస్ రెండున్నర మీటర్లు ఉంటుందని చెప్పారు. అందు వల్లే రైలు శివ చేతికి తగిలి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విషయం తెలియని శివ తప్పుడు అంచనాతో ఎంఎంటీఎస్ వస్తుండగా సెల్ఫీ వీడియోకు ప్రయత్నించి ఉంటాడని భావిస్తున్నారు.



రైలు ముందు సెల్ఫీ వీడియో తీసుకుంటున్న శివ

2019లో మరో 119 గురుకులాలు: జోగు రామన్న



హైదరాబాద్: వచ్చే ఏడాది మరో 119 గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ సంక్షేమ మంత్రి జోగు రామన్న చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని గురుకుల పాఠశాల విద్యార్థులకు నీట్, ఐఐటీలో ప్రత్యేక శిక్షణ కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కార్యక్రమాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితారాజేంద్ర హాజరయ్యారు. గురుకులాల సంఖ్య పెంచడంతో పాటు కొత్త జిల్లాల ప్రకారం ప్రతి జిల్లాకు 2 డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేస్తామన్నారు. గురుకుల విద్యార్థులు ఉన్నత చదువుల్లో పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రయోగాత్మకంగా నీట్, ఐఐటీ శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. దీనిలో భాగంగా 19 గురుకులాలకు చెందిన 3,779 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 386 మందిని ఎంపిక చేశామని, వారికి ఈ శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. గురుకులాలకు పక్కా భవనాలను నిర్మించేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు అధ్యాపకులను నగదు పురస్కారంతో సత్కరించారు.

కోటి చెల్లింపుతో హైస్కూల్ భవనానికి పేరు

విరాళాల మొత్తాన్ని పెంచిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, భవన నిర్మాణాలకు విరాళాలిస్తే పాఠశాల పేరును మార్పు చేసేలా ఉన్న నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఇకపై కేవలం స్కూల్ భవనాలు, బ్లాక్‌లకు మాత్రమే పేర్లను పెట్టుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పేరు మార్పునకు సంబంధించిన విరాళాల మొత్తాన్ని కూడా ప్రభుత్వం పెంచింది. గతంలో రూ.5 లక్షలు చెల్లిస్తే ప్రాథమిక పాఠశాలకు తమకు ఇష్టమైన వారి పేరు పెట్టుకునే అవకాశం ఉండేది. ఇకపై పాఠశాల భవనం లేదా బ్లాక్‌కు పేరు పెట్టుకోవాలంటే రూ.25 లక్షలు చెల్లించాలి. ప్రాథమికోన్నత పాఠశాలకు పేరు పెట్టుకునేందుకు గతంలో రూ.7.5 లక్షలుగా ఉన్న మొత్తాన్ని రూ.50 లక్షలకు పెంచింది. ఉన్నత పాఠశాలకు పేరు పెట్టుకోవాలంటే గతంలో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. ప్రస్తుతం దీనిని కోటి రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిబంధనలు సవరించింది.

5న టీఎస్‌సెట్-2018 నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్-2018 (టీఎస్‌సెట్) నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 5న విడుదల చేయనున్నట్లు సెట్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ యాదగిరిస్వామి బుధవారం తెలిపారు. అధ్యాపక ఉద్యోగాల అర్హత కోసం 29 సబ్జెక్టుల పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెట్‌లో అర్హత సాధించిన వారు అధ్యాపక ఉద్యోగాలు, ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులతో పాటు పీహెచ్‌డీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈసారి పరీక్షల్లో రెండు పేపర్లే ఉంటాయని పేర్కొన్నారు.

28న పల్స్ పోలియో

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పల్స్ పోలియో నిర్వహణకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మొదటి దశలో జనవరి 28న, రెండో దశలో మార్చి 11న పల్స్ పోలియో రోజును నిర్వహించనుంది. ప్రతి ఒక్క చిన్నారికి పోలియో నిర్మూలన వ్యాక్సిన్ వేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి దశలో జనవరి 28 నుంచి జనవరి 30 వరకు, రెండో దశలో మార్చి 11 నుంచి మార్చి 14 వరకు వ్యాక్సిన్ వేస్తారు. రెండు దశల్లో సామూహిక వ్యాక్సిన్ నిర్వహణతోపాటు ఇంటింటికీ వెళ్లడం, స్కూళ్లు, ఇతర జనసమీకరణ కేంద్రాల్లో వ్యాక్సిన్ వేస్తారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉండేవారి పిల్లలకు, భిక్షాటన చేసే వారి పిల్లలకు వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో పల్స్ పోలియో వివరాలు..	
ఐదేళ్లలోపు వారు	41,57,210
పోలియో బూత్‌లు	27,210
మొబైల్ టీమ్స్	787
ట్రాన్‌సిట్ పాయింట్స్	737
ఏఎన్‌ఎంలు	8,711
ఆశ వర్కర్లు	27,045
అంగన్‌వాడీ వర్కర్లు	32,082
వ్యాక్సిన్ డోస్‌లు	55 లక్షలు

సాక్షి

గురువారం, జనవరి, 25


పాలన ఇలాగేనా?!

ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ 'రాణి పద్మిని' పేరుతో ప్రారంభించిన చిత్రం 'పద్మావతి'గా, ఆ తర్వాత 'పద్మావత్'గా మారడమే కాదు... సెన్సార్ బోర్డు కత్తిరింపులనూ, ఆ సినిమాపై కత్తులు నూరిన కర్ణిసేన 'మనో భావాలను' గుర్తించి మసులుకున్నా దానికి కష్టాలు తప్పలేదు. 68వ గణతంత్ర దినోత్సవానికి ముందు రోజు గురువారం అది దేశవ్యాప్తంగా విడుదల కాబో తుండగా అన్ని రాష్ట్రాల్లో, మరీ ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో అల్లరి మూకలు వీధుల్లో వీరంగం వేస్తున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. గుజరాత్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలు రణరంగాన్ని తలపిస్తున్నాయి. థియేటర్లు, షాపింగ్ మాల్స్, బస్సులు, కార్లు, మోటారు సైకిళ్లు, ఇతర ఆస్తులు తగలబడుతున్నాయి. హర్యానాలోని గురుగ్రాంలో పసివాళ్లతో వెళ్తున్న పాఠశాల బస్సును కూడా వదలకుండా రాళ్లు రువ్వి ధ్వంసం చేశారు. అందులోని పిల్లలనూ, టీచర్లనూ భీతావహుల్ని చేశారు. మరో పాఠశాల బస్సును దహనం చేశారు. సెన్సార్ బోర్డు అనుమతి లభించిన 'పద్మావత్'ను అడ్డుకుంటే తీవ్రంగా పరిగణిస్తామని, దానికి అన్నివిధాలా భద్రత కల్పించాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పాక కూడా ఇదంతా యధేచ్ఛగా సాగుతోంది. వీధుల్లోకి వస్తున్న వేలమందిని నియంత్రించడానికి అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించకుండా ఆ ప్రభుత్వాలన్నీ అటు రాజ్యాంగబద్ధమైన కర్తవ్యాన్ని, ఇటు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలనూ బేఖాతరు చేశాయి. ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులే కర్ణిసేనతో సమానంగా, కొన్నిసార్లు అంతకన్నా ఎక్కువగా ఆ చిత్రానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని గుర్తుంచుకుంటే ఇలాంటి హింసాత్మక ఘటనలు అక్కడే ఎందుకు చోటుచేసుకుంటున్నాయో సులభంగానే అర్ధమవుతుంది. పైగా ఈ గొడవంతకూ బాధ్యత 'పద్మావత్' తీసిన సంజయ్ లీలా భన్సాలీదేనని హర్యానా మంత్రి అనిల్ విజ్ ప్రకటించి అందరినీ నివ్వెరపరిచారు. ఈసారి గణతంత్ర దినోత్సవానికి సింగపూర్, ఇండొనేసియా, మలేసియా, వియత్నాం, బ్రూనై తదితర ఆగ్నేయాసియా దేశాల(ఆసియాన్) అధినేతలు పదిమంది ముఖ్య అతిథులుగా వస్తున్నారని, వారు దేశంలో అడుగుపెట్టిన రోజున చానెళ్లన్నిటా ఈ హింసే ప్రధాన వార్తయితే దేశం పరువు పోతుందన్న కనీస జ్ఞానం కూడా అక్కడి ప్రభుత్వాలకు కొరవడింది.

గురుగ్రామ్ బహుళజాతి సంస్థలకు ప్రసిద్ధి. అక్కడ అనేక భారీ పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు పనిచేస్తున్నాయి. వేలకొలది కార్మికులు, ఉద్యోగులు ఆ నగరంలో పనిచేస్తున్నారు. పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకూ అక్కడ వందల సంఖ్యలో విద్యా సంస్థలున్నాయి. అది దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో భాగం. అలాంటిచోట అల్లరిమూకలు రోడ్లపైకొస్తే అది రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే కాదు... కేంద్ర ప్రభుత్వానికి సైతం అప్రదిష్ట. చిత్రమేమంటే ఇంతచేటు హింస జరిగినా బీజేపీ ప్రతినిధులెవరూ చానెళ్లలో జరిగిన చర్చలకు రాలేదు. ఆ పార్టీ వైఫల్యాలను సొమ్ము చేసుకోవడానికి నిరంతరం ప్రయత్నించే ప్రతిపక్షం కాంగ్రెస్ కూడా మోహం చాటేసింది. ఈమధ్య వ్యంగ్యమైన ట్వీట్లు ఇవ్వడంలో ముందుంటున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సైతం పత్తాలేరు. కులాల పేరిటా, మనోభావాల పేరిటా ఎవరు ఏం చేసినా దేశ ప్రజలకు దిక్కూ మొక్కూ లేదన్నమాట!

మన రాజ్యాంగం పౌరులకు భావ ప్రకటనా స్వేచ్ఛతో సహా ఎన్నో హక్కుల్ని కల్పించింది. చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పింది. ఏవో కొన్ని గ్రూపులు మతం పేరు చెప్పుకుని, కులం పేరు చెప్పుకుని మనోభావాలు దెబ్బతిన్నాయని రోడ్డెక్కుతుంటే, సమాజం మొత్తంపై తమ అభిప్రాయాలను బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తుంటే ప్రభుత్వాలన్నీ చేష్టలుడిగి చూస్తున్నాయి. తమకు నచ్చని అభిప్రాయాలను వ్యక్తం చేసిన వ్యక్తులపై, సంస్థలపై విరుచుకుపడే ఈ ప్రభుత్వాలు ఇలాంటి గ్రూపుల ముందు సాగిలపడుతున్నాయి. వాటికి వ్యతిరేకిస్తే తమ ఓటు బ్యాంకు దెబ్బతింటుందన్న భయంతో వణుకుతున్నాయి. ఆ క్రమంలో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలనైనా ధిక్కరించడానికి సాహసిస్తున్నాయి. అది చలనచిత్రం కావొచ్చు... ఒక పుస్తకం కావొచ్చు... మరో కళాత్మక చిత్రం కావొచ్చు–దేన్నయినా నచ్చలేదని, విభేదిస్తున్నానని చెప్పే హక్కు ఎవరికైనా ఉంది. మన రాజ్యాంగం సైతం హక్కులకు కొన్ని పరిమితులను కూడా విధించింది. కానీ ఆ పరిమితుల పేరిట భావప్రకటన హక్కునే కాలరాయాలని చూడటం ప్రభుత్వాలకైనా, ప్రైవేటు గ్రూపులకైనా తగని పని. కేజ్రీవాల్‌పై 'యాన్ ఇన్‌సిగ్నిఫికెంట్ మాన్' పేరిట నిర్మించిన డాక్యుమెంటరీలో తనకు సంబంధించి పెట్టిన పాత్రను వక్రీకరించారని, అది న్యాయస్థానంలో తనపై ఉన్న కేసును ప్రభావితం చేసేలా ఉన్నదని ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై మొన్న నవంబర్‌లో తీర్పునిస్తూ సృజనాత్మకతకు సంకెళ్లు విధించే ధోరణులను అనుమతించరాదని సుప్రీంకోర్టు చెప్పింది. మనోభావాలు దెబ్బతిన్నాయన్న పేరిట సృజనాత్మక వ్యక్తీకరణలను శిలువ ఎక్కించడం తగదన్నది.

ఆ తీర్పు వెలువడి మూడు నెలలైనా కాలేదు... ప్రభుత్వాలన్నీ 'పద్మావత్'పై పగబట్టినట్టు వ్యవహరించాయి. ఆ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ వచ్చి దాదాపు 25 రోజులవుతోంది. ఆ సినిమా చూడనే చూడం... మేం వద్దన్నాం గనుక విడుదలను ఆపాల్సిందేనని ఆగ్రహించే కర్ణిసేన సంగతలా ఉంచి ప్రభుత్వాల్లో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారో, బీజేపీ ముఖ్యులో దాన్ని వీక్షించి ఏమున్నదో తెలుసుకుంటే, వాటిపై తమకున్న అభ్యంతరాలేమిటో న్యాయస్థానం దృష్టికి తీసుకొస్తే వేరుగా ఉండేది. నిజానికి చిత్రం చూసినవారు అది రాజపుట్ గౌరవప్రతిష్టలను, పద్మావతి పాత్రను ఉన్నతంగా చూపిందని అంటున్నారు. కనీసం నిజానిజాలేమిటో తెలుసుకోవాలన్న స్పృహ కూడా లేకుండా ప్రవర్తించేవారిని అదుపు చేయలేకపోతే చట్టబద్ధ పాలన దెబ్బతింటుందని, అది అంతిమంగా అరాచకానికి దారితీస్తుందని ప్రభుత్వాలు గ్రహించాలి.




దాడులతో, ఘర్షణలతో స్వేచ్ఛను నియంత్రించదల్చేవారు తమపై తమకు నియంత్రణ లేనివారే.

– రాబర్ట్ లీ
అమెరికన్ సైనిక కమాండర్

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.అష్టమి ఉ.10.38 వరకు, తదుపరి నవమి, నక్షత్రం భరణి రా.3.33 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం ప.1.40 నుంచి 3.12 వరకు దుర్ముహూర్తం ఉ.10.18 నుంచి 11.04 వరకు, తదుపరి ప.2.46 నుంచి 3.31 వరకు, అమృతఘడియలు రా.10.55 నుంచి 12.54 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.46
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.34	మగ్రీబ్	6.08
జొహర్	12.28	ఇషా	7.23
అసర్	4.32		

జీవించే హక్కుకు దిక్కెవరు?



వేదాంతం సీతారామావధాని


దేశ సేవంటే పేదరికాన్నీ, నిరక్షరాస్యతనూ, ఆరోగ్య నిర్భాగ్యాన్నీ, ఆర్థిక అసమానతలనూ రూపుమాపటమేనని నెహ్రూ అభిప్రాయపడ్డారు. ముందుతరాలు రాజ్యాంగ వైఫల్యాన్ని ఎత్తిచూపితే అందుకు కారణం రాజ్యాంగం కాదనీ, దాని అమలుకై గద్దెనెక్కిన శక్తులేననీ అంబేడ్కర్ హెచ్చరించారు. ఒక గొప్ప వ్యవస్థను రూపొందించుకుని, మనకు మనం సమర్పించుకున్న పవిత్ర రాజ్యాంగం దశాబ్దాలు గడచినా సజావైన అమలుకు నోచుకోకపోవటం బాధాకరం.

మరో గణతంత్ర దినోత్సవానికి దేశం సిద్ధమవుతోంది. ఎర్రకోట సాక్షిగా మాటలు కోటలు దాటి జనాన్ని ముంచెత్తుతాయి. అద్భుతాలు జరుగుతాయని అరవయ్యేళ్లుగా ఎదురుచూస్తున్న జనం తమవి పగటి కలలేనని మరో మారు పెదవి విరుస్తారు. ప్రజలు నిర్లిప్తంగా, నిస్తేజంగా జీవించేందుకేనా ఒక మహత్తర రాజ్యాంగం నిర్మితమైంది? రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులతో తమ తలరాతలు మారిపోతాయని ఆశించే ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీ కాదా? మానవ హక్కుల, ప్రాథమిక హక్కుల పరిరక్షణలే ప్రాతిపదికగా మన గణతంత్ర వ్యవస్థలో రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వాలు తమ పాత్రను ఏ మేరకు అర్థవంతంగా పోషిస్తున్నాయి? ఓట్లు వేసి ఏలికలనెన్నుకునే ఓటున్న మారాజులు ప్రభుత్వాల పనితీరుని సమీక్షించుకోవలసిన అవసరముంది కదా!

1948 నాటి విశ్వజనీన సమాన హక్కుల పత్రం మనిషి జన్మతః స్వేచ్ఛాప్రియుడనీ, సమభావన, సమానావకాశాలతో ఎదగడానికి వ్యక్తి స్వేచ్ఛను సభ్యదేశాలు కాపు కాయాలనీ పేర్కొనగా, ఇదే పత్రం అనేకానేక పౌర, రాజకీయ హక్కులను మానవ హక్కులుగా నిర్ధారించింది. భారత రాజ్యాంగం సైతం దాదాపు మానవ హక్కులన్నింటినీ ప్రాథమిక హక్కులనే పేరిట పౌరులకు హామీ ఇచ్చి, వీటి అమలుకు ప్రభుత్వాన్నే జవాబుదారీ చేసింది. జనమంతటికీ కూడూ, గూడూ కల్పించడం జీవించే హక్కుకు పునాది కాగా ఈ హక్కు కల్పనతో సర్కారీ వైఫల్యాలు మనలని నివ్వెరపరుస్తున్నాయి. మానవ హక్కులను కాలరాసి జనం తలరాతలని తారుమారు చేసే ఏలికల గుణగణాలను ఈ సందర్భంగా తర్కించుకోవాలి. శాంతి స్టార్ బిల్డర్స్ కేసులో భారత అత్యున్నత న్యాయస్థానం కూడూ గూడూ ప్రజలకు ఇవ్వలేని ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం విఫలమైనట్టేనని వ్యాఖ్యానించింది. ఈ తీర్పు తరువాత పదిహేడేళ్ల కాలంలో పరిస్థితి ఎలా ఉంది?

దారిద్ర్య రేఖ దిగువ దృశ్యం

ప్రపంచంలోని 119 ఆకలి పీడిత దేశాల జాబితాలో భారత్ నూరవ స్థానంలో ఉంది. అన్నపూర్ణ వంటి మన దేశంలో 194 మిలియన్ల ప్రజలు పస్తుల పాలవుతున్నారు. అంతర్జాతీయ పేదరిక సూచీ (2013)లో భారత్ స్థానం ప్రముఖంగానే ఉంది. జనాభాలో 30 శాతం దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. సవరించిన ప్రమాణాల ప్రాతిపదికగానే 2012 నాటికి జనాభాలో 20.6 శాతం దారిద్ర్య రేఖకు కింద ఉన్న వారితో చేరారు. 2011–2012 నాటికి జనాభా పద్దులో 12.4 శాతం దరిద్ర నారాయణులే. 2013 అంతానికి గూడు కరువైన భారతీయులు 78 మిలియన్లు. 11 మిలియన్ల జనం రోడ్లు, ప్లాట్‌ఫారాల మీద బతుకులు వెళ్లదీస్తున్నారు. 10.78 మిలియన్ల నివాస గృహాల కొరత ఉందని కేంద్రమే తేల్చింది. ఆర్థిక సంస్కరణల పుణ్యమా అని నిరుద్యోగం 8.3 శాతం (1983) నుంచి 3.46 శాతానికి (2016) తగ్గినట్టు కాకి లెక్కలు వేసినా ఇదంతా వాపేననీ, బలుపు కాదనీ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాలతో మూతపడుతున్న పరిశ్రమలు ఉపాధికి గండికొట్టాయనీ, 2016లో 17.7 మిలియన్లుగా ఉన్న ఉద్యోగ భద్రత లేని చిరుద్యోగులు, వచ్చే రెండేళ్లలో 18 మిలియన్లు దాటిపోతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ జోస్యం చెప్పింది. ఏతావాతా ప్రైవేటు, పారిశ్రామిక రంగాలలో ఉపాధి పొందుతున్న 475 మిలియన్ల బడుగుజీవులకు గాను 400 మిలియన్లకు ఉద్యోగ భద్రత నాస్తి. ఇదిలా ఉండగా ప్రపంచ ఆహార భద్రతా నివేదిక ప్రకారం (2017) దేశంలో 190.7 మిలియన్ల ప్రజలకు పోషకాహార సరఫరా లేదు. 51.4 శాతం గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుండగా, 30



శాతం నవజాత శిశు మరణాలు సంభవిస్తున్నాయి. ఎదిగే బాలలు పౌష్టికాహార లేమి కారణంగా రోజూ 3,000 మంది అసువులు బాస్తున్నారు. 65 మిలియన్ల జనం మురికివాడలలో మగ్గుతుంటే వీరిలో 17 శాతం దాకా పట్టణాలలో జీవిస్తున్నారు. కేటాయించిన సబ్సిడీ ఆహారంలో సగం పైగా అర్హులకు చేరడం లేదు. 410 మిలియన్ల బతుకులు ఒక్కపూట, అరకొర తిండితో గడుస్తున్నాయి. ఆకలిచావులు సాధారణమైపోయాయి.

ఇదీ వర్తమాన భారతం. 'వెలిగిపోతోంద'ని నమ్మబలికిన మన దేశంలో కోట్లాది ఓటర్ల జీవించే హక్కు పట్టపగలు దోపిడీకి గురవుతుండగా మానవ హక్కులను రక్షిస్తున్నామని మనకి మనం కితాబిచ్చుకుంటామా? వేల కోట్లు గుమ్మరించి ఎన్నికల ప్రక్రియ ద్వారా మనం ఏలికలనెన్నుకోవడం ఎవరి ప్రయోజనం కోసం? కనీస అవసరాలు తీర్చమని ప్రభుత్వాన్ని అడుక్కోవలసిన దుస్థితి ఎందుకు దాపురిస్తోంది?

ఆ చురకలు అవమానం కాదా?

ప్రభుత్వ పరంగా మానవహక్కుల చట్టం, ఆ చట్టం అమలు కోసం దేశ వ్యాప్తంగా హక్కుల కమిషన్, ఉపాధి హామీ కోసం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమలులోకి తెచ్చినా, ఈ చట్టాలూ, ఈ పథకాల అమలు తీరుతెన్నుల మీద నీలినీడలు కమ్ముకున్నాయి. కాగా దేశ న్యాయవ్యవస్థ అనేక సందర్భాలలో ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం మీద చురకలు వేయడం, సజావైన ప్రజా పాలన కోసం కోర్టులు సూచనలు ఇవ్వడం ప్రభుత్వానికి తలవంపులు కాదా? బతికే హక్కు అర్థవంతంగా ఉండాలనీ, 'మృగజీవనం' కారాదనీ జస్టిస్ భగవతి ఫ్రాన్సిస్ కొరాలీ కేసులో స్పష్టం చేశారు. రాజ్యాంగపు 21వ అధికరణాన్ని విశ్వజనీన మానవహక్కు పత్రంలోని 5వ ఆర్టికల్ తోనూ, అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల అవగాహనలోని 7వ ఆర్టికల్‌తోనూ అనుసంధానించి జీవించే ప్రాథమిక హక్కును నిర్వచించిన 80వ దశకపు ఫ్రాన్సిస్ కొరాలీ తీర్పు తర్వాతి కాలంలో రాజ్యాంగ ధర్మాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. మహిళలూ, బాలల రక్షణ, సంక్షేమం ప్రభుత్వ విధిగా పేర్కొన్న హుస్సేనీరా ఖాటూన్ తీర్పు తర్వాత కూడా విచారణ ఖైదీల అంశంలో సరైన సంస్కరణలు చేపట్టలేదు. దేశంలోని 1,387 జైళ్లలో 68 శాతం అండర్‌ట్రయల్ ఖైదీలే. వీరిలో 40 శాతం ఆర్నెల్లకు పైబడి బందీలుగా కాలం గడిపేశారు. వీరిలో సగంపైగా జామీనుదార్లను సమర్పించుకోలేని నిస్సహాయులే. వీరందరి జీవించే హక్కును చట్టం సాక్షిగా చట్టుబండలు చేయడం ప్రాథమిక హక్కులకు పాతర వేయడమే కదా!

చదువుకోవటం ప్రాథమిక హక్కు. ప్రభుత్వం అందరికీ విద్యావకాశాలు కల్పించాలని సుప్రీంకోర్టు 1992లో మోహినీజైన్ కేసులో ప్రకటించింది. ఏళ్లూ పూళ్లూ గడిపి చట్టం తెచ్చినప్పటికీ అమలులో మాత్రం ప్రభుత్వం నీరసించింది. 2011 జనాభా లెక్కల రీత్యా 78 లక్షలమంది బాలలు బతుకుతెరువు కోసం బరువులెత్తుతుంటే, 8.4 కోట్లమంది చిన్నారులు స్కూళ్లకు వెళ్లలేని దురదృష్టవంతులు. ఉపాధి కోసం శ్రమించే చిట్టితల్లులు 43 శాతమైతే, బాలురు 57 శాతం. 2016 వార్షిక విద్యా సర్వే నివేదిక ప్రకారం గ్రామీణ భారతంలో 11–14 ఏళ్ల లోపు 3.5 శాతం, 15–16 ఏళ్లలోపు 13.5 శాతం బాలలున్నారు. వీరిలో 25 శాతం పాఠశాల చదువుకు అర్ధాంతరంగా మంగళం పాడేస్తున్నారు. 14 ఏళ్లలోపు చిన్నారులను శ్రమకు గురిచేయడం వారి బాల్యాన్ని దోపిడీ చేయడమవుతుందని ఇటు భారత రాజ్యాంగమూ, అటు పీపుల్స్ యూనియన్ ఫర్ డెమోక్రాటిక్ రైట్స్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేస్తున్నప్పటికీ, బాలల హక్కులను దోపిడీకి గురిచేయడం, రాజ్యాంగ వ్యవస్థ మన్ను తిన్న పాములా మిన్నకుండిపోవటం తన వైఫల్యం కాదని ప్రభుత్వం దబాయించగలదా? 'బాండెడ్ లేబర్' అరాచకత్వాన్ని రూపుమాపాలని బంధు ముక్తి మోర్చా కేసు (1983)లో సుప్రీంకోర్టు ప్రభుత్వానికి తాఖీదునిచ్చింది. అయితే 1978–2015 మధ్యకాలంలో కట్టు బానిసల పునరావాసానికై విడుదల చేసిన రూ. 81.826 కోట్లలో సగంపైగా నిధుల్ని రాష్ట్రాలు వాపసు చేసినట్లు మే 2016లో కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ నివేదిక వెల్లడించింది. ఇదీ మన అధికార యంత్రాంగపు నిర్వాకం.

మరణశయ్య మీద ఆరోగ్యం

ఇక ఆరోగ్య హక్కు అనారోగ్యం పాలై మరణశయ్య ఎక్కింది. ఆరోగ్య హామీకి ప్రభుత్వం పూచీకత్తు నివ్వకపోవటం మానవ హక్కులకు గండి కొట్టటమేనని జాతీయ మానవ హక్కుల కమిషన్ అభిప్రాయం. సుప్రీంకోర్టు సైతం ఈ దిశలో కొన్ని తీర్పులిచ్చింది. విన్సెంట్–పనికుర్లంగార కేసు (1987)లో జస్టిస్ రంగనాథ మిశ్రా ఆరోగ్యం మహా భాగ్యాన్ని ప్రాథమిక హక్కుగా ప్రస్తావించగా, మహీందర్ సింగ్ చావ్లా కేసులో (1996) జస్టిస్ రామస్వామి, పట్నాయక్‌ల ధర్మాసనం, ఈ హక్కును పటిష్టంగా ప్రభుత్వం అమలు చేయాలని వక్కాణించింది. అయితే 2000–01లో జీడీపీలో ఒక్క శాతం కూడా ఆరోగ్య హక్కు కోసం కేటాయింపు చేయలేని కేంద్రం 2009–10కి ఈ పద్దుకింద ఖర్చు అంచనాను 1.45 శాతంగా నిర్ధారించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం 1999–2002 కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ, ప్రాదేశిక పాలనా సంస్థలూ జీడీపీలో కేవలం 1.3 శాతమే ఆరోగ్యం కోసం వెచ్చించాయని వెల్లడించింది. పేద దేశాలుగా పేరొందిన ఆఫ్రికా దేశాల్లోనే జీడీపీలో 3 శాతంపైన ఆరోగ్యం ఖాతాలో ఖర్చు రాయడం విశేషం. కేంద్రం ఇటీవల వెలువరించిన 2017 నాటి జాతీయ ఆరోగ్య పాలసీలో జీడీపీలో 2.5 శాతం మొత్తాన్ని ప్రజారోగ్యం పద్దుకు కేటాయించాలని సంకల్పించింది. దీంతో దేశం ఆరోగ్యకరమైన జనాభాతో కిక్కిరిసిపోతుందని మురిసిపోతోంది. దేశంలోని 12,760 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సరిపడా మంచాలే లేవు. పెరిగే రోగులకు ఆసుపత్రులూ, వైద్యులూ, వైద్య నిపుణులూ, సహాయ సిబ్బంది, పరికరాల లేమీ కొట్టొచ్చినట్లున్న దుస్థితిలో నిధుల లేమి మాయదారి రోగంగా సంతరించుకోవటం ఆరోగ్య దౌర్భాగ్యానికి నిలువెత్తు నిదర్శనం.

దేశ సేవంటే పేదరికాన్నీ, నిరక్షరాస్యతనూ, ఆరోగ్య నిర్భాగ్యాన్నీ, ఆర్థిక అసమానతలనూ రూపుమాపటమేనని నెహ్రూ అభిప్రాయపడ్డారు. ముందు తరాలు రాజ్యాంగ వైఫల్యాన్ని ఎత్తిచూపితే అందుకు కారణం రాజ్యాంగం కాదనీ, దాని అమలుకై గద్దెనెక్కిన శక్తులేననీ అంబేడ్కర్ హెచ్చరించారు. ఒక గొప్ప వ్యవస్థను రూపొందించుకుని, మనకు మనం సమర్పించుకున్న పవిత్ర రాజ్యాంగం దశాబ్దాలు గడచినా సజావైన అమలుకు నోచుకోకపోవటం బాధాకరం. వెలుగులు విరజిమ్మే భారత్‌ను ఆవిష్కరించడం కోసం రాజ్యాంగ సందేశాల్ని తు.చ. తప్పకుండా అమలు చేయాలనీ మరోసారి నేతలూ, ప్రజలూ గుర్తు చేసుకోవాలి.

(రేపు గణతంత్ర దినోత్సవం)

వ్యాసకర్త భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్
ఈ–మెయిల్ : sitharam.avadhani@gmail.com

కోరెగావ్ ఓ శౌర్య ప్రతీక

మహర్ తెగ ప్రజలు యుద్ధవీరులు. శివాజీ సైన్యంలో వీరి శౌర్యం దేదీప్యమానంగా వెలిగింది. కశ్మీర్‌పై పాక్ దండయాత్రను వీరోచితంగా అడ్డుకున్న చరిత్ర వీరిది. కానీ దాన్ని సమాజంలో చీలికలకు ఉపయోగించుకోవడం కూడనిపని.

సందర్భం



రమేష్ పతంగే

రెండువందల సంవత్సరాల క్రితం పూనాకు 40 కి.మీ.ల దూరంలో భీమానది ఒడ్డున ఆంగ్లేయుల సైన్యానికి, పీష్వా సైన్యానికి మధ్య యుద్ధం జరిగింది. 1818 సం॥లో కోరేగావ్ వద్ద జరిగిన యుద్ధంవల్ల మరాఠా సామ్రాజ్యం పూర్తిగా పరాజితం అయింది. ఆనాటి ఆంగ్లసైన్యంలో 'మహర్'లు గణనీయంగా ఉన్నారు. ఆ యుద్ధంలో చనిపోయిన మహర్ సైనికులను స్మరిస్తూ అంబేడ్కర్ అనుయాయులు గత అనేక సంవత్సరాలుగా శౌర్యదినంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ శౌర్య దినాన్ని నిర్వహించడానికి వేలాదిమంది అంబేడ్కర్ అనుయాయులు కోరేగావ్ వద్దగల స్మారకం వద్ద కలుస్తుంటారు. ఈ ఉత్సవాలను ఇంతకాలం మిగిలిన సమాజం పెద్దగా పట్టించుకోలేదు. జనవరి 2వ తేదీన నిర్వహించిన ప్రదర్శనపై రాళ్ళురువ్వటం, 3వ తారీఖున నిర్వహించిన బంద్‌తో జరిగిన దుర్ఘటనలవల్ల కోరేగావ్ చరిత్ర మహారాష్ట్రలోని ఇంటింటికీ తెలిసింది.

మహర్ తెగ ప్రజలు యుద్ధవీరులు. శివాజీ సైన్యంలో వీరి పరాక్రమం దేదీప్యమానంగా వెలిగింది. 1947లో పాకిస్తాన్ కశ్మీర్‌పై దండయాత్ర చేసినపుడు డా॥బాబా సాహెబ్ అంబేడ్కర్ సలహా మేరకు పాకిస్తాన్ దురాక్రమణను ఎదుర్కొనడానికి మహర్ బెటాలియన్‌ని పంపారు. అక్కడ మహర్ సైనికులు చేసిన వీరోచిత యుద్ధం స్వర్ణాక్షరాలతో రాయగలిగిన చరిత్ర. భారత సేనాపతి, తదితర ఉన్నత అధికారులు, ''హిందూ సైన్యంలో మహర్ సైనికులు అత్యంత శ్రేష్ఠవీరులు'' అని బహిరంగంగా అనేకసార్లు కొనియాడారు. 1947 డిసెంబర్ 24న ఝూంగర్ వద్ద భీషణ సంగ్రామం జరిగింది. మహర్ సైనికుల వద్ద గల తుపాకులలో గుండ్లు అయిపోయాయి. అయినా మహర్ సైనికులు ముష్టి యుద్ధంతోనే పాక్ సైన్యం ఆక్రమణను విజయవంతంగా ఎదుర్కొన్నారు. తర్వాత మహర్ సైనికులలో ఒకరిని 'మహావీర చక్ర,' మరొక 5 మందిని 'వీరచక్ర' లతో సన్మానించారు. డిసెంబర్ 24ని మహర్లు, మొత్తం భారత సమాజం నిజమైన శౌర్యదినోత్సవంగా జరుపుకోవాలి.

ప్రకాశ్ అంబేడ్కర్, వామపక్ష భావజాల మేధావులకు 24 డిసెంబర్‌ని శౌర్యదినంగా నిర్వహించటం ఇష్టం ఉండదు. పీష్వాలు జన్మతః బ్రాహ్మణులు. కానీ వీరు స్వయంగా రాజులు కాదు, శివాజీ అనుయాయులకు ప్రతినిధులుగా వారు యుద్ధం చేశారు. పీష్వాల పరాజయమంటే మరాఠా మహాసామ్రాజ్యపు పతనమే. ఇంత సరళమైన విషయాన్ని 'బ్రాహ్మణ పరాజయం'గా పేర్కొనడం వామపక్ష చరిత్రకారుల ప్రత్యేకత.

జనవరి 2న కోరేగావ్ ప్రదర్శనపై రాళ్లురువ్విన సంఘటనలు, దాడులు అత్యంత ఖండనీయం. అయితే దీన్ని ఆధారంగా చేసుకుని ప్రకాశ్ అంబేడ్కర్ మహారాష్ట్ర 3 రోజుల బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్ ప్రారంభమైన పదిగంటలకే ప్రకాశ్ అంబేడ్కర్ బంద్‌ను ఉపసంహ



రించుకోవలసి వచ్చింది. ప్రభుత్వ బస్సులపై, ప్రైవేటు వాహనాలపై నీలం జెండాలతో ఉద్యమకారులు రాళ్లు రువ్వారు, దాడులు చేశారు. పలువురు అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అదుపు తప్పిన ఉద్యమ కారుల వ్యవహారశైలి కారణంగా సామాన్య మహారాష్ట్ర ప్రజానీకంలో ఒక అసంతృప్తి ఏర్పడింది.

డా॥ బాబాసాహేబ్ అంబేడ్కర్ బంధుభావనకు (సోదర భావనకు) అత్యంత ప్రముఖస్థానం ఇచ్చారు. 'బంధుభావం అంటే మానవత్వం, ధర్మానికి మరో పేరు' అని వారు పేర్కొన్నారు. పౌరులందరిలో బంధు భావన అనుభూతిని కలిగించాలి. భారతీయులమందరమూ మన మొక్కటే, మనమందరం సమానులం అనే భావన ఆలోచనలో, ఆచరణలో వ్యక్తం కావాలి, ఇది అత్యంత కష్టమైన పనే అని పేర్కొన్నారు. ఈ అనుభూతిని, సమరసతను నిర్మాణం చేయటంకోసం వివిధ వర్గాల ప్రజలమధ్య సద్భావన కోసం గత 30 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఈ బంద్ కారణంగా ప్రకాశ్ అంబేడ్కర్ వంటి కొద్దిమంది అంబేడ్కర్‌వాదులకు రాజకీయ లబ్ధి లభించవచ్చునేమో, సాధారణ అంబేడ్కర్ వాదులకు ఈ సంఘటనలు మింగుడుపడని ఘటనలుగా మిగిలిపోయాయి. అంబేడ్కర్ అనుయాయులకు మిగిలిన సమాజం మధ్య అగాధాన్ని ఇవి మరింతగా పెంచాయి.

ఒకనాడు మరాఠా విశ్వవిద్యాలయం పేరును డా॥ బాబా సాహెబ్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పేరుగా మార్చే ప్రతిపాదన పెద్ద వివాదం లేవదీసింది. ఈ వివాదం చాలాకాలం కొనసాగింది. సామాజిక సమరసతా మంచ్ కార్యకర్తగా ''డా॥అంబేడ్కర్ జాతీయ నాయకుడు, ఒక కులనాయకుడు కాదు'' అంటూ మహారాష్ట్ర సమాజంలోని అన్ని కులాలు, వర్గాల ప్రజలను కలిసి నచ్చచెప్పి, మరాఠా విశ్వవిద్యాలయం పేరును డా॥ అంబేడ్కర్ మరాఠా విశ్వవిద్యాలయంగా ప్రజలందరి ఏకాభిప్రాయంతో మార్పుచేయించిన ఘటనలో నేను ఒక కార్యకర్తగా పనిచేయటం నా జీవితంలో మర్చిపోలేని ఆనందకరమైన సంఘటన. ప్రకాశ్ అంబేడ్కర్ వంటి కొద్దిమంది నాయకుల ధోరణివల్ల నేడు మహారాష్ట్ర సమాజం రెండుముక్కలైంది. దీనికి ఎవరు బాధ్యులు? ఫడ్నవిస్, మోదీ, భాగవత్‌లను కొత్త పీష్వాలుగా బ్రాహ్మణ ద్వేషంతో దూషించటం ప్రకాష్ అంబేడ్కర్ తదితర నాయకులకు ఆనందం కలిగి ఉండవచ్చును. కానీ ఈ దుర్ఘటన సందర్భంగా ఏర్పడిన పరిణామాలపై వీరు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త, ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యులు

రచ్చకెక్కిన 'రచ్చబండ'

చీఫ్ జస్టిస్ స్థాయిలో పరిపాలనా సరళిలో కొన్ని మర్యాదలు పాటించలేదని అనుకున్నప్పటికీ... దేశమంతా నెత్తిన పెట్టుకునే, గౌరవించే, ఒకే ఒక్క గొప్ప వ్యవస్థని 'బజారు'న పెట్టవలసిన అగత్యం లేదని చాలామంది పెద్దల భావన.



గొల్లపూడి మారుతీరావు

బీచిలో ఓ అమ్మాయి ఎప్పుడూ కనిపిస్తూంటుంది. బాగా చదువుకున్న అమ్మాయి. ఆ అమ్మాయి లక్ష్యం చక్కగా పెళ్లి చేసుకుని భర్తకి వండిపెడుతూ సుఖంగా గడపాలని. తర్వాత ఆ అమ్మాయికి పెళ్లయింది. లక్షణంగా తాళిబొట్టుతో, పసుపుతాడుతో, భర్తతో కనిపించింది. ఆమె కల సాకా రమౌతున్నందుకు ఆనందం కలిగింది. కొన్ని నెలలు గడిచాయి. భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు ప్రారంభమయ్యాయి. భర్తమీద కారాలూ, మిరియాలూ నూరింది. నేను ఆమె పాత కలని గుర్తు చేసి, కాస్త సంయమనాన్ని పాటించమని హితవు చెప్ప బోయాను. భర్త అనుచిత ప్రవర్తనను ఏకరువుపెట్టి– హితవు చెప్పిన నామీదే కోపం తెచ్చుకుని వెళ్లి పోయింది.

దరిమిలాను భార్యాభర్తల మధ్య 'వార' పెరిగింది. ఇప్పుడు పోలీసు డిపార్టుమెంటులో పనిచేస్తున్న ఆమె తండ్రి అల్లుడిని రెండు రోజులు జైల్లో పెట్టించాడు. ముందు ముందు సామరస్యం కుదిరే అవకాశాన్ని ఆ విధంగా శాశ్వతంగా మూసేశాడు. ఆమె కలలు గన్న వ్యవస్థ– ఆమె తండ్రి సహాయంతో పూర్తిగా కూలి పోయింది. కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామ తన అల్లుడిని జైలుకి పంపితే ఆ అల్లుడు ఇక ఏ విధంగానూ జైలు శిక్షని మరిచిపోయి– ఆమెని జీవితంలోకి ఆహ్వానిస్తాడనుకోను. వ్యవస్థను గౌరవించే గాంభీర్యం, పెద్దరికాన్ని పెద్దలే వదులుకున్నప్పుడు– ఆ వ్యవస్థ 'పెద్దరికానికి' మాలిన్యం అంటుతుంది.

ఈ కథకీ మొన్న నలుగురు మేధావులయిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు– పత్రికల ముందుకు రావడానికీ పోలికలున్నాయని నాకనిపిస్తుంది. ఈ దేశంలో గత 70 సంవత్సరాలుగా అత్యున్నత న్యాయ వ్యవస్థగా నిలిచిన ప్రధాన న్యాయస్థానంలోని 'అభిప్రాయ భేదాలు' ఒక్కసారి ప్రజల మధ్యకి రావడం దేశాన్నే దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దేశంలో న్యాయాధిపతులే అరిగించుకోలేకపోతున్నారు. ''సుప్రీంకోర్టు పరిపాలనా సరళిని ఏ విధంగా పత్రికా సమావేశం సంస్కరిస్తుంది? ప్రజాభిప్రాయ సేకరణ చేసి– సుప్రీంకోర్టు నిర్వహణ సరియైనదో కాదో ప్రజలు నిర్ణయించాలని ఈ సమావేశం ఉద్దేశమా?'' అని జస్టిస్ శోధీ అన్నారు.

మరో న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే ''ఈ నలుగురి పెద్దల ఉద్దేశం ఏమిటి? ప్రజల్ని ఈ అవ్యవస్థలో జోక్యం చేసుకుని తీర్పు చెప్పాలనా? సవరణ జరపాలనా? సలహాలివ్వాలనా? ప్రధాన న్యాయమూర్తిని బోనులో నిలబెట్టాలనా?'' సోలీ సొరాబ్జీ, కె.టి.ఎస్. తులసి, జస్టిస్ ముకుల్ ముద్గల్ వంటివారు షాక్ అవడమే కాకుండా చాలా బాధపడ్డారు. ఒక ప్రముఖ పత్రిక– ఈ పత్రికా సమావేశం భారతీయ న్యాయ వ్యవస్థ చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయం అని పేర్కొంది.

విచిత్రం ఏమిటంటే గత 20 సంవత్సరాలుగా ఈ దేశంలోని అత్యంత ప్రముఖమైన కేసులన్నీ యాదృచ్ఛికంగానో, కాకతాళీయంగానో జూనియర్ బెంచిలకే వెళ్లాయని ఇదే పత్రిక పతాక శీర్షికలో మరునాడు పూర్తి వివరాలతో పేర్కొంది. మరి ఇన్ని సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో తమ విధులను నిర్వహిస్తున్న ఈ గౌరవ న్యాయమూర్తులకు పత్రికలకు తెలిసేపాటి నిజానిజాలు తెలియవా? తెలిస్తే రచ్చకెక్కడానికి ఇప్పుడెందుకు ముహూర్తం పెట్టినట్టు? ఇందులో వృత్తిపరమైన, రాజకీయ పరమైన కోణాలేమైనా ఉన్నాయా? ఒకానొక రాజకీయ నాయకుడు ఒకానొక న్యాయమూర్తి తలుపు తట్టడం వెనుక ఈ ఛాయలు తెలుస్తున్నాయా? ఇవీ ప్రశ్నలు. లేని తీగెని లాగి ఓ గొప్ప వ్యవస్థని 'డొంక'గా రూప కల్పన చేసిన దయనీయమైన పరిస్థితిగా దీనిని భావించాలా? అని మేధావి వర్గాలు బుగ్గలు నొక్కుకుంటున్నాయి.

జీవన కాలమ్



అయితే– ప్రధాన న్యాయమూర్తి స్థాయిలో పరిపాలనా సరళిలో కొన్ని మర్యాదలు పాటించనప్పుడు, జరుగుతున్నది సబబు కాదని మేధావులైన న్యాయమూర్తులు భావిస్తున్నప్పుడు ఏం చెయ్యాలి? ఏం చేసినా చేయలేకపోయినా దేశమంతా నెత్తిన పెట్టుకునే, గౌరవించే, నిర్ణయాలకు భేషరతుగా తలవొంచే, మార్గదర్శకత్వానికి ఎదురుచూసే– ఒకే ఒక్క గొప్ప వ్యవస్థని 'బజారు'న పెట్టవలసిన అగత్యం లేదని చాలామంది పెద్దల భావన.

ఇలా రచ్చకెక్కడంవల్ల దేశంలో అడ్డమైనవారూ (వారిలో నేనూ ఉన్నాను)– రాజకీయ పార్టీలు సరేసరి – నోరు పారేసుకునే అవకాశాన్ని కల్పించినట్టు అవుతుందని సంతోష్ హెగ్డే అన్నారు. ప్రతీ దిన పత్రికలోనూ సంపాదకునికి లేఖలు కోకొల్లలు. ఈ సంక్షోభాన్ని ఎవరి అవసరాలకు వారు అన్వయించుకుంటున్నారు.

సంయమనం, మేధస్సు, విచక్షణ, అపూర్వమైన గాంభీర్యమూ చూపే వ్యవస్థ– అలక, కించిత్తు అసహనమూ, కోపమూ– చూపనక్కరలేని, చూపినా ఉపయోగం లేని, చూపకూడని స్థితిలో రచ్చకెక్కడం– తొందరపాటుతో ఒకటి రెండు మెట్లు దిగి వచ్చిందని, ఆ మేరకు 'వ్యవస్థ' పరపతి– దిగజారిందని భావించడంలో ఆశ్చర్యం లేదు.



తిండి కలిగితే.. కండ కలదోయ్!

అయితే.. అది సమతులమైనదైతేనే సుమా

మీ టూత్‌పేస్టులో ఉప్పుందా? ఇదో ఫేమస్ యాడ్‌లోని ప్రశ్న..

నిజానికి ఇప్పుడు మనోళ్లను అడగాల్సిన ప్రశ్న మీ తిండిలో బలముందా అనే..

ఎందుకంటే.. భారతీయులు ఏది పడితే అది తినేస్తున్నారట.. జనాభాలో సగం మంది సమతుల ఆహారం తీసుకోవడమే లేదట. 2015–16 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశ జనాభాలో సగం మంది.. ముఖ్యంగా మహిళలు సమతుల ఆహారానికి దూరంగా ఉంటున్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి తోడ్పడే పళ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, మాంసం, పాల ఉత్పత్తులు చాలా తక్కువగా తీసుకుంటున్నారు. పది శాతం మంది నిత్యం వేయించిన ఆహార పదార్థాలే తింటుంటే.. మరో 36 శాతం మంది వారానికోసారి ఫ్రైడ్ ఫుడ్ తింటున్నారు.

– సాక్షి, తెలంగాణ డెస్క్

సమతుల ఆహారం అంటే..

సమతుల ఆహారం అంటే సరిపడా ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, విటమిన్లు, మినరల్స్ మొదలైన వాటిని సమపాళ్లలో తీసుకోవడమే. అయితే 45 శాతం మంది మహిళలు మాత్రమే రోజూ పప్పు ధాన్యాలు, బీన్స్ మొదలైనవి తింటున్నారని, పాలు, పెరుగు నిత్యం తీసుకునేవారి సంఖ్య 45 శాతమే అని వారానికి ఒకసారి వీటిని వినియోగించే వారి సంఖ్య 23 శాతమని సర్వే పేర్కొంది. 7 శాతం మంది అసలు పెరుగుగానీ, పాలుగానీ తీసుకోవడం లేదని, మరో 25 శాతం మంది వీటిని అప్పుడప్పుడే తీసుకుంటున్నారని స్పష్టం చేసింది. 54 శాతం మంది మహిళలు వారానికి ఒకసారి కూడా తాజా పళ్లు తినడం లేదని, చాలా తక్కువ మంది మహిళలే రోజువారీగా చికెన్, మటన్, చేప, కోడిగుడ్డు వంటివి తింటున్నారని తేలింది. పురుషుల పరిస్థితీ ఇంత తీవ్రంగా లేకున్నా.. వీళ్లతో పోలిస్తే.. కొంచెం బెటర్‌గా ఉందట. దేశ జనాభాలోని మొత్తం మహిళల్లో 47 శాతం మంది నిత్యం కూరగాయలను, ఆకు కూరలను తింటున్నారు. మరో 38 శాతం మంది వారానికి ఒకసారి మాత్రమే వీటిని తీసుకుంటున్నారని వెల్లడైంది.

పేదరికం.. వివక్ష.. జంక్‌ఫుడ్..



మహిళలు అసమతుల ఆహారం తీసుకోవడానికి ప్రధాన కారణం పేదరికం, వివక్ష, జంక్‌ఫుడ్ అని ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చ్ డైరెక్టర్ రంజనా కుమారి చెప్పారు. దేశ ఆహార అలవాట్లలో కూడా లింగ వివక్ష ఉందన్నారు. ఇక్కడ మహిళలు తక్కువ ఆహారం తినడానికి అలవాటు పడిపోయారని, వారి ఆహార అవసరాలను గుర్తించే పరిస్థితులు కూడా లేవని, దీని వల్ల అనేక మంది రక్తహీనతతో బాధపడుతున్నారని వెల్లడించారు. మరోవైపు ఇటీవలి కాలంలో మార్కెట్ పరిణామాలు మారిపోయాయని, దీంతో జంక్‌ఫుడ్‌కు ప్రాధాన్యత పెరిగిందని, ఎక్కువ మంది మహిళలు ముఖ్యంగా యువతులు ఈ అనారోగ్యకర ఆహారం తీసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అవకాశముంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రైమరీ స్థాయిలో మినీ గురుకులాలు!

సంక్షేమ శాఖల ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి తరగతులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం గురుకుల పాఠశాలలు ఐదో తరగతి స్థాయి నుంచి మొదలవుతున్నాయి. నాలుగో తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు, గురుకుల ప్రవేశ పరీక్షలు రాసి ఐదో తరగతి నుంచి ఆంగ్లమాధ్యమంలో అడ్మిషన్లు పొందుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించిన స్కూళ్ల నుంచి వచ్చినవారు, పట్టణ ప్రాంతాల విద్యార్థులు ముందుకు వెళ్తుండగా... గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు మాత్రం మిగిలిన వారితో పోటీ పడలేకపోతున్నారు. ఇది టీచర్లకు కొన్ని ఇబ్బందులు తెస్తోంది. దీంతో ప్రాథమిక స్థాయి నుంచే గురుకుల విద్యను ప్రవేశపెడితే విద్యార్థులు సమాన స్థాయిలో అభివృద్ధి చెందుతారని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగానే మినీ గురుకులాల పేరిట కొత్త విద్యా సంస్థల్ని ప్రారంభించాలని యోచిస్తోంది. వీటిని ప్రస్తుత గురుకులాలకు అనుసంధానంగా నిర్వహించాలనే అంశంపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

29 మినీ గురుకులాలు

ప్రస్తుతం గిరిజన అభివృద్ధి శాఖ పరిధిలో మినీ గురుకులాలను నిర్వహిస్తున్నారు. అక్కడ ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 మినీ గురుకులాల్లో 5వేల మంది పిల్లలున్నారు. మినీ గురుకులాల్లో చదివి, అనంతరం సాధారణ గురుకులాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు, ఇతరుల కంటే మెరుగ్గా ఉన్నట్లు గిరిజన అభివృద్ధి శాఖ పరిశీలనలో తేలింది. ఈ క్రమంలో వాటి సంఖ్యను పెంచాలని గిరిజన అభివృద్ధి శాఖ యోచిస్తోంది. అన్ని సంక్షేమ శాఖల పరిధిలో వీటిని ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎస్సీ అభివృద్ధి శాఖ సైతం ఈ తరహా పాఠశాలల ఏర్పాటుపై ఇటీవల పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది. కొత్తగా రూపొందించే బడ్జెట్‌లో మినీ గురుకులాల అంశాన్ని ప్రతిపాదించేందుకు ఆయా సంక్షేమ శాఖ చర్యలు చేపట్టాయి. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వచ్చే ఏడాది నుంచే మినీ గురుకులాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

బ్యాంకుల తీరుపై సర్కారు అసంతృప్తి

- గత ఖరీఫ్‌లో 10 జిల్లాల్లో రైతులకు 65 శాతంలోపే పంటరుణాలు
- రబీలో పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు వ్యవసాయశాఖ లేఖ



సాక్షి, హైదరాబాద్: పంటరుణాల మంజూరులో బ్యాంకర్ల తీరుపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. రుణ లక్ష్యానికి అనుగుణంగా రైతులకు రుణాలివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గత ఖరీఫ్ పంటల రుణ ప్రణాళిక లక్ష్యం రూ.23,851 కోట్లు కాగా, బ్యాంకులు రూ.21,025 కోట్లు మాత్రమే ఇచ్చాయి. లక్ష్యంలో 88 శాతం రుణాలిచ్చాయి. రుణాలను సకాలంలో ఇవ్వకపోవడమే కాకుండా ఆయా జిల్లాల మధ్య తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. దీనిపై ప్రజా పద్దుల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా బ్యాంకర్ల కమిటీలు, జిల్లాస్థాయి రుణ సమీక్ష కమిటీల సమావేశాలు నిత్యం జరగకపోవడం వల్లే ఈ వ్యత్యాసముందని భావించింది. ఆయా కమిటీల సమావేశాలు సక్రమంగా జరపాలని, రబీలో మార్పు తీసుకురావాలని కోరుతూ వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు.

10 జిల్లాల్లో 65 శాతం లోపే

పెద్దపల్లి జిల్లాలో రైతులకు కేవలం 48 శాతం రుణాలిచ్చాయి. ఆ జిల్లా ఖరీఫ్ పంటరుణ లక్ష్యం రూ.638 కోట్లు కాగా, రూ.308 కోట్లు మాత్రమే అందజేశాయి. 10 జిల్లాల్లో కేవలం 65 శాతం రుణాలే ఇచ్చారు. మంచిర్యాల జిల్లా 50, వనపర్తి 53, నిజామాబాద్ 54, కొమురంభీం 55, జయశంకర్ 56, మహబూబ్‌నగర్ 58, జోగులాంబ 63, జగిత్యాల, వికారాబాద్ జిల్లాలు 64 శాతం చొప్పున రుణాలిచ్చాయి. ఇంత తక్కువ రుణాలివ్వడానికి అధికారులకు, బ్యాంకర్లకు మధ్య సమన్వయలోపమే కారణమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మరో పది జిల్లాల్లో బ్యాంకులు 100 శాతానికిపైగా రుణాలిచ్చి రికార్డు సృష్టించాయి. మేడ్చల్ జిల్లాలో 172, భద్రాద్రి జిల్లాలో 162, రంగారెడ్డి 136, యాదాద్రి 134, మహబూబాబాద్ 132, రాజన్న సిరిసిల్ల 128, మెదక్ 125, కరీంనగర్ 117, ఖమ్మం జిల్లాలో 110 శాతం చొప్పున పంటరుణాలు అందించాయి. దీర్ఘకాలిక రుణాలు 25 శాతమే ఇవ్వడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపైనా దృష్టి సారించాలని వ్యవసాయశాఖ కలెక్టర్లను కోరింది.

రాష్ట్ర సర్కార్ మెమోపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరానికి (2018–19) ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులను పెంచరాదని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ దాఖలైన కేసుపై హైకోర్టు స్పందించింది. ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఇస్మా) దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి. శేషసాయి విచారించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో అమలును నిలిపివేస్తూ న్యాయమూర్తి ఇటీవల మధ్యంతర ఆదేశాలిచ్చారు. మెమో అమలుపై తాజాగా న్యాయమూర్తి స్టే విధించారు. కాగా, మెమోలో పేర్కొన్నదానికంటే ఎక్కువ ఫీజు వసూలు చేస్తే ఆ మొత్తాన్ని ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, తుది ఉత్తర్వులు వెలువడే వరకూ ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేయరాదని అసోసియేషన్‌ను న్యాయమూర్తి ఆదేశించారు.

వర్సిటీలకు అధ్యాపక నియామక మార్గదర్శకాలు

డ్రాఫ్ట్ నిబంధనల రూపకల్పనలో యూనివర్సిటీలు



సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీల్లో అధ్యాపక నియామకాలపై ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. పోస్టుల భర్తీకి అవసరమైన మార్గదర్శకాలకు సంబంధించిన ఉత్తర్వులను ఇటీవల జారీ చేసిన ప్రభుత్వం.. తాజాగా వాటిని ఆయా వర్సిటీలకు పంపింది. వర్సిటీల వైస్ చాన్స్‌లర్ల కమిటీ ఇచ్చిన సిఫార్సులను యథాతథంగా ఆమోదించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకే భర్తీ చేయాలని పేర్కొంది. యూనివర్సిటీల్లో మొత్తం 1,551 పోస్టులు ఖాళీ ఉండగా, తొలి విడతలో 1,061 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. కేటగిరీ, సబ్జెక్టుల వారీగా 1,061పోస్టుల భర్తీని ప్రభుత్వం గతంలోనే ఆమోదించింది. తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వర్సిటీలు డ్రాఫ్ట్ నిబంధనలను రూపొందించే పనిలోపడ్డాయి. ఇది పూర్తి కాగానే వర్సిటీల ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాల్లో వీటి భర్తీకి ఆమోదం తెలుపుతాయి. పోస్టుల వారీగా రోస్టర్ పాయింట్లపై పలు సంక్షేమ శాఖల ఆమోదం తీసుకోవాల్సి ఉంది. ఇదంతా పూర్తయ్యాక ప్రభుత్వ ఆమోదం తీసుకొని వర్సిటీల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయనుంది. అయితే ఇది పూర్తయ్యేందుకు దాదాపు 2 నెలలు పట్టే అవకాశం ఉంది.

ఇవీ ప్రధాన నిబంధనలు..

- పోస్టుల భర్తీకి యూనివర్సిటీల వారీగా వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేస్తారు. ఇవి జాతీయ స్థాయి నోటిఫికేషన్లుగానే ఉంటాయి.
- భర్తీ ప్రక్రియలో స్క్రీనింగ్ టెస్టు ఉండదు. అన్ని వర్సిటీలకు ఒకే రకమైన పరీక్ష విధానం ఉంటుంది.
- సబ్జెక్టును బట్టి పరీక్ష అంశాల్లో మార్పు ఉంటుంది. విధానంలో ఏ మార్పు ఉండదు. అలాగే వేర్వేరు తేదీల్లో ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు.

భర్తీ చేయనున్న పోస్టులు..

యూనివర్సిటీ	ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	అసిస్టెంట్ ప్రొఫెసర్	మొత్తం
మహాత్మాగాంధీ	10	15	9	34
పాలమూరు	12	10	41	63
శాతవాహన	9	16	15	40
తెలంగాణ	11	25	23	59
ఆర్‌జీయూకేటీ	25	11	60	96
అంబేడ్కర్ ఓపెన్	-	3	7	10
తెలుగు	-	1	6	7
కాకతీయ	-	11	125	136
జేఎన్‌ఏఎఫ్‌ఏయూ	-	5	10	15
జేఎన్‌టీయూ	32	52	102	186
ఉస్మానియా	-	121	294	415
మొత్తం	99	270	692	1061

'అరుణాచల్' కథ కంచికి!


నిబంధనలు పాటించకున్నా ప్రైవేటు బస్సులకు పచ్చజెండా

- మొన్నటి వరకు జప్తు చేసి.. ఇప్పుడు అనుమతినిచ్చిన ప్రభుత్వం
- వాటి నిషేధం సమయంలో కళకళలాడిన ఆర్టీసీ సర్వీసులు

సాక్షి, హైదరాబాద్: నిబంధనలు మారలేదు.. బస్సుల యజమానులూ పద్ధతి మార్చుకోలేదు. కొన్ని నెలల క్రితం ప్రభుత్వానికి అక్రమంగా కనిపించిన తీరు ఇప్పు డు ఉన్నట్టుండి సక్రమమైంది. గత జూన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న బస్సులపై ఆ రాష్ట్రం కన్నెర్ర చేసిన నేపథ్యంలో ఇక్కడ తెలంగాణ కూడా అలాంటి బస్సులపై కొరడా ఝుళిపించింది. కానీ ఆరు నెలలు తిరక్కుండానే రవాణా శాఖ ఆ హెచ్చరికలను 'తాటాకు చప్పుళ్లు' చేసి ఆ బస్సులకు లైన్ క్లియర్ చేసింది. వెరసి ఆర్టీసీ దివాలా దశకు చేరటానికి కారణంగా మారిన ప్రైవేటు బస్సులను నియంత్రించటం అసాధ్యమని మరోసారి నిరూపించింది. నిబంధనలతోపాటు భద్రత ప్రమాణాలను కూడా ప్రైవేటు బస్సులు పాటించటం లేదని ఆరోపించే రవాణా శాఖ.. ఇప్పుడు వాటికి అనుకూలంగా వ్యవహరించటం చర్చనీయాంశంగా మారింది.

జరిగింది ఇదీ!

గత జూన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు బస్సులపై విరుచుకుపడింది. అక్కడి చిరునామాలతో అక్కడే బస్సులను రిజిస్టర్ చేసి, అక్కడే పర్మిట్లు పొంది వేరే ప్రాంతాల్లో తిరగటం అక్రమమని గుర్తించి వాటి అనుమతులు రద్దు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో అలాం టి బస్సులు దాదాపు వెయ్యి వరకు ఉండటంతో ఇక్కడా వాటిని నియంత్రించారు. తెలంగాణ ప్రభుత్వం ఆ బస్సులను గుర్తించి వాటి నుంచి త్రైమాసిక పన్ను వసూలును నిలిపివేసింది. వాటికి అనుమతి లేనందున రోడ్డెక్కితే జప్తు చేయాలని ఆదేశించింది. దీంతో రవాణా శాఖ అధికారులు ఆ బస్సులు ఎక్కడ కనిపిస్తే అక్కడ జప్తు ప్రారంభించారు. దీంతో ఆర్టీసీ బస్సులు కళకళలాడాయి. రద్దీ ఉన్న చోట్ల అదనపు బస్సులు తిప్పడాన్ని ఆర్టీసీ మొదలుపెట్టింది. ఇంతలో కొందరు దళా రులు ఆ బస్సులపై నిషేధం ఎత్తేయాలని రవాణా శాఖపై ఒత్తిడి ప్రారంభించారు. ఆ ఒత్తిడే పని చేసిందో, త్రైమాసిక పన్ను రూపంలో ఆదాయం కోల్పోవటం ఎందుకని అనుకున్నారో తెలియదు గాని సంక్రాంతి సమయంలో వాటికి పచ్చజెండా ఊపేశారు.



నగరంలో తిరుగుతున్న అరుణాచల్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ బస్సు

రూ.5.5 లక్షల ఆదాయం

ప్రతి ప్రైవేటు బస్సు మూడు నెలలకోసారి సీటుకు రూ.3,500 చొప్పున ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. వెరసి ఒక్కో బస్సు నుంచి ఏడాదికి రూ.ఐదున్నర లక్షల వరకు పన్ను వసూలవుతుంది.

ఏపీ చర్యలతో గండి..?

నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఈ బస్సులు ఏపీ కేంద్రంగానే ఎక్కువగా ఉన్నాయి. అరుణాచల్‌ప్రదేశ్ ఉదంతం సమయంలో వాటిని నియంత్రించారు. కానీ రెండుమూడు నెలలకే అనుమతించేశారు. దీంతో ఏపీ నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ బస్సులు తిరగటం మొదలుపెట్టాయి. ఇక్కడ నిషేధం ఉండటంతో అధికారులు వాటిని జప్తు చేయటం గందరగోళంగా మారింది. ఎలాగూ ఏపీ గేట్లు ఎత్తేసింది కాబట్టి ఇక్కడా నిషేధం తొలగించి పన్ను వసూలు చేసుకోవటం మంచిదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కొందరు అధికారులు చెబుతున్నారు.

సీన్ రివర్స్!

బెంగళూరు సహా విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుండటంతో హైదరాబాద్ నగరంలోని బీహెచ్‌ఈఎల్, మియాపూర్, కూకట్‌పల్లి.. తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ఏసీ బస్సులు నడుపుతోంది. బీహెచ్‌ఈఎల్, మియాపూర్, హైదరాబాద్–3 డిపోలకు సంబంధించి 20 గరుడ ప్లస్, 20 రాజధాని ఏసీ బస్సులు నడుస్తున్నాయి. ప్రైవేటు బస్సులపై నిషేధం ఉన్న సమయంలో ఈ బస్సుల్లో సీట్లు సరిపోక అదనపు బస్సులు నడపాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్టీసీ గల్లా పెట్టె కళకళలాడింది. ప్రైవేటు బస్సులపై నిషేధం తొలగ్గానే ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో సగటున 45 శాతానికి పడిపోయింది. పగటి పూట నడిచే రాజధాని బస్సుల్లో ఇది 70 శాతం వరకు ఉండగా, గరుడ బస్సుల్లో పరిస్థితి దారుణంగా పడిపోయింది. రాత్రి వేళ ప్రైవేటు బస్సులు స్లీపర్ సర్వీసులు నడుపుతుండటంతో జనం అటువైపు మొగ్గు చూపుతున్నారు. విషయాన్ని డిపో మేనేజర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ప్రైవేటు బస్సుల నియంత్రణ తమ చేతుల్లో లేకపోవటంతో వారు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు.

- కేంద్ర మోటారు వాహనాల చట్టం 1989 నిబంధన 128(10) ప్రకారం జాతీయ పర్మిట్ ఉన్న రవాణా వాహనాల్లో బెర్తులు ఏర్పాటు చేయొద్దు. కానీ రాష్ట్రంలో తిరుగుతున్న ప్రైవేటు బస్సుల్లో ఉంటున్నాయి.

నిబంధనల ఉల్లంఘన ఇలా..

- నిబంధన 125(4) సి, ప్రకారం ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థలు, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పర్మిట్లు పొందిన ప్రైవేటు బస్సులు మాత్రమే బెర్తులు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ వేర్వేరు రాష్ట్రాల పర్మిట్ పొంది రాష్ట్రాల మధ్య తిరుగుతున్నాయి.
- తెలంగాణ మోటారు వాహనాల చట్టం నిబంధన 297(ఎ) ప్రకారం ఆర్టీసీ మినహా మరే బస్సులు స్టేజీ క్యారియర్లుగా తిరగొద్దు. ప్రైవేటు సంస్థలు బోర్డులు పెట్టి మరీ టికెట్లు అమ్ముకుంటున్నాయి.

స్కూల్ యాజమాన్యాలతో సీఎం భేటీకి హామీ


ఎంపీ వినోద్‌కుమార్‌కు ప్రైవేటు యాజమాన్యాల విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు, ఆయనతో భేటీకి కృషి చేస్తానని ఎంపీ వినోద్ కుమార్ హామీ ఇచ్చారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ట్రస్మా) అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం ఎంపీ వినోద్‌కుమార్‌ను కలిసింది. యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను, విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. నిరుపేద విద్యార్థులు చదువుకునే బడ్జెట్ పాఠశాలల విషయంలో విద్యాశాఖ వైఖరి ఆక్షేపణీయంగా ఉందని వారు పేర్కొన్నారు. బడ్జెట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని, ఆయనతో యాజమాన్యాలు భేటీ అయ్యేందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన ట్రస్మా కోర్ కమిటీ సమావేశంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇవ్వకుండా, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.

ఆ 340 'డబుల్' ఫ్లాట్ల మాటేంటి?

హైదరాబాద్ అంబేడ్కర్ నగర్ కాలనీ స్థలాల కేసులో హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని అంబేడ్కర్ నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం తీసుకున్న పేదల స్థలాల్లో వ్యాపార అవసరాలకు నిర్దేశించినవి ఉన్నాయో లేవో చెప్పాలని తెలంగాణ సర్కార్‌ను ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నిర్మించే 620 ఫ్లాట్లలో 280 ఫ్లాట్లను ఎంపిక చేసిన వారికి ఉచితంగా కేటాయిస్తే మిగిలిన 340 ఫ్లాట్ల మాటేంటో చెప్పాలంది. పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్‌ను సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావుల ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. తమ భూమిలో డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లు ప్రభుత్వం నిర్మిస్తోందంటూ జగన్నాథ్ సింగ్, మరో 8 మంది రిట్ దాఖలు చేశారు. దీనిపై యథాతథస్థితి ఉత్తర్వుల్ని సింగిల్ జడ్జి ఎత్తేయడంతో నిర్మాణానికి ఇబ్బందులు తొలిగాయి. ఈ ఉత్తర్వులపై పిటిషనర్ అప్పీల్ దాఖలు చేయగా కోర్టు విచారించింది. డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం 280 మంది ఇష్టపూర్వకంగా స్థలాలిచ్చారని, అక్కడి 340 ఫ్లాట్లు విక్రయించి ప్రభుత్వం వ్యాపారం చేయబోతోం దని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలున్న ప్రాంతంలో 2 పడకల ఫ్లాట్ల నిర్మాణానికి స్థలమివ్వడానికి ఇష్టపడే వారు ముందుకొచ్చారని ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి చెప్పారు.

'రోటావ్యాక్'కు డబ్ల్యూహెచ్‌వో గుర్తింపు

సాక్షి, న్యూఢిల్లీ: భారత్ బయోటెక్ సంస్థ రూపొందించిన రోటావైరస్ వ్యాక్సిన్ రోటావ్యాక్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రీ క్వాలిఫికేషన్ గుర్తింపు ఇచ్చింది. అతిసార వ్యాధి నిర్మూలనకోసం అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్ ఇక నుంచి విదేశాలకు కూడా అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న భారత్ బయోటెక్ సంస్థ రూపొందించిన ఈ వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో ప్రీ క్వాలిఫికేషన్ గుర్తింపు దక్కడంపై సంస్థ ఎండీ, చైర్మన్ కృష్ణా ఎల్లా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన డాక్టర్ ఎం.కె.భాన్, డాక్టర్ టీఎస్.రావు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై బుధవారం వారు ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ 2015లో ప్రారంభించిన ఈ వ్యాక్సిన్‌ను కేంద్రం సహకారంతో ఏపీ, తమిళనాడు, ఒడిశాతోపాటు 9 రాష్ట్రాల్లో ప్రవేశపెట్టినట్టు కృష్ణా ఎల్లా చెప్పారు. శిశువులకు 6, 10, 14 వారాల్లో మూడుసార్లు ఈ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల వ్యాధి ముప్పు తప్పుతుందని డాక్టర్ టీఎస్.రావు చెప్పారు. వ్యాక్సిన్ అభివృద్ధికి కేంద్రం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, గేట్స్ ఫౌండేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ వాషింగ్టన్ సంస్థలు సహకరించినట్టు తెలిపారు.

హజ్ కమిటీ విభాగాల్లో సభ్యుల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ వివిధ విభాగాల్లో నూతనంగా 16 మంది సభ్యులను నియమించింది. ఈ నెల 20న నియమించిన నూతన సభ్యుల కమిటీలో షియా వర్గానికి ప్రాతినిధ్యం లేదని పలు ధార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో షియా సముదాయం నుంచి సభ్యుడిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులను విడుదల చేసింది. సవరించి నియమించిన సభ్యుల ద్వారా గురువారం(25న) రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ప్రత్యేక అధికారి ఎస్.ఎ. షకూర్ ఆధ్వర్యంలో నియమించిన సభ్యుల సమక్షంలో ఈ ఎన్నిక జరగనుంది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో మన్నాన్ ఫరూకీ వ్యవహరించనున్నారు.

వైద్య శాఖలో నగదు బదిలీ

ఆధార్ ఆధారంగా అమలు...అన్ని పథకాలకు వర్తింపు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ అమలు చేసే అన్ని రకాల సంక్షేమ పథకాలలో నగదు బదిలీ(డీబీటీ)ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ వివరాల ఆధారంగా సంక్షేమ కార్యక్రమాలకు నగదు బదిలీ వర్తింపజేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ తాజాగా అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. నగదు బదిలీకి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించింది. అనారోగ్యంతో పడకపైనే ఉండేవారు, వికలాంగులు, వృద్ధుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని పేర్కొంది. ఆధార్‌తోపాటు బ్యాంక్ అకౌంట్ల వివరాలను సేకరించాలని, ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయిలో నగదు బదిలీ జరిగేలా చూడాలని ఆదేశించింది. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద కేంద్రం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇవన్నీ ఇక నగదు బదిలీ రూపంలోనే జరగనున్నాయి. ఆశ కార్యకర్తల పారితోషికాన్ని కూడా ఇదే రూపంలో అందిస్తారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్

ప్రమాదకర రసాయనాలతో జాగ్రత్త

'ఔషధ తయారీ' సదస్సులో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: ఔషధాల తయారీలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్ గోయల్ సూచించారు. ప్రమాదకర రసాయనాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. 'భారీ స్థాయి ఔషధాల ఉత్పత్తి, అత్యవసర పరిస్థితుల్లో తీవ్రత తగ్గింపు–ప్రపంచస్థాయి ఉత్పత్తికి ప్రణాళిక'పై రెండు రోజుల సదస్సు బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ, జాతీయ భద్రతా మండలి (ఎన్‌ఎస్‌సీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు రాష్ట్రంలోని ఔషధ తయారీ పరిశ్రమల నుంచి 207 మంది ప్రతినిధులు తొలి రోజు హాజరయ్యారు. గోయల్ మాట్లాడుతూ.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమల శాఖకు ప్రశంసలు అందుతున్నాయని, అభివృద్ధి ఊపందుకుందన్నారు. హెల్పర్లు, కాంట్రాక్టు కార్మికుల్లో భద్రతపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సువెన్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ సీఈవో వెంకట్ జాస్తి సూచించారు. ప్రమాదాల నివారణకు పరిశ్రమల యాజమాన్యం, కార్మికులతో ఎప్పటికప్పు డు సమావేశమవుతున్నామని పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రమోహన్ చెప్పారు.

2,921 మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 2,921 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను (ఎన్‌ఎంఎంఎస్) కేంద్రం మంజూరు చేసింది. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన 8వ తరగతి విద్యార్థుల పేర్లను ఖరారు చేసేందుకు మెరిట్ జాబితాను విద్యాశాఖ డీఈవోలకు పంపించింది. జాబితాలో 1,131 మంది మోడల్ స్కూల్ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వారికి ఏటా రూ. 6 వేల చొప్పున 9 నుంచి 12వ తరగతి వరకు కేంద్రం అందజేయనుంది.

ముందుగా రాష్ట్రంలో గవర్నర్ జెండావిష్కరణ



సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తొలుత తెలంగాణలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం ఆయన ఏపీలో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు విజయవాడకు బయలుదేరనున్నారు. ముందు సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొని ఉదయం 9.15 గంటలకు జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో విజయవాడకు బయలుదేరుతారని అధికార వర్గాలు తెలిపాయి.

‘మైనర్ ఇరిగేషన్’పై రంగంలోకి ఎన్‌ఆర్‌ఎస్‌సీ

30న కృష్ణా బోర్డు సభ్యులతో తొలి భేటీ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్ పరిధిలో మైనర్ ఇరిగేషన్ కింద తెలుగు రాష్ట్రాలు వాడుకుంటున్న నీటి వినియోగంపై లెక్కలు తేల్చేందుకు ఇస్రో పరిధిలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) రంగంలోకి దిగనుంది. ఈ నెల 30న కృష్ణా బోర్డుతో పాటు తెలంగాణ, ఏపీ అధికారులతో మొదటి సమావేశం నిర్వహించనుంది. మైనర్ ఇరిగేషన్ కింద జరుగుతున్న నీటి వినియోగాన్ని ఏ ప్రాతిపదికన లెక్కించాలన్న దానిపై సూచనలు తీసుకోనుంది. ఈ మేరకు ఎన్‌ఆర్‌ఎస్‌సీతో సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని ఇరు రాష్ట్రాలకు బోర్డు బుధవారం అందించింది. గోదావరి ప్రాజెక్టుల పరిధిలో టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుపై నియమించిన కమిటీ ఈ నెల 29న సమావేశం కానుంది.

నయీమ్ డైరీని బయట పెట్టాలి

సీపీఐ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

సాక్షి, హైదరాబాద్: గ్యాంగ్‌స్టర్ నయీమ్ డైరీ వివరాలను బయటపెట్టాలని సీపీఐ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. నయీమ్ కేసును సీబీఐతో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మఖ్దూం భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 12న హైదరాబాద్‌లో నయీమ్ బాధితులతో ముఖాముఖి సదస్సును నిర్వహించాలని తీర్మానించారు. నయీమ్ ఆస్తులతో పాటు అతనితో సంబంధమున్న రాజకీయ నేతలు, పోలీసుల ఆస్తులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నయీమ్ కేసులో తీసుకున్న చర్యలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. భువనగిరి, వరంగల్, హైదరాబాద్‌లలో నయీమ్ బాధితులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఒక బుక్‌లెట్ విడుదల చేయనున్నట్లు సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్, సీపీఎం నేత నర్సింగరావు, పౌరహక్కుల సంఘ నేత నారాయణరావు, న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, గాదె ఇన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారంలో విఫలం

మాజీ ఎంపీ రవీంద్రనాయక్



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీలు, లంబాడీల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ విమర్శించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివాసీలను లంబాడీలపైకి కొన్ని శక్తులు ఉసిగొల్పుతున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగానే లంబాడీలను ఎస్టీల్లో చేర్చారన్నారు. దీనిపై త్వరలోనే రాష్ట్రపతికి మెమోరాండం అందజేయనున్నట్లు రవీంద్ర నాయక్ చెప్పారు.

కేసీఆర్ అవినీతి పవన్‌కు కనిపించ లేదా?

కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు



సాక్షి, హైదరాబాద్: అవినీతి అక్రమాలపై పోరాటం చేస్తానని ప్రకటించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్.. వాటి మీద అసలు మాట్లాడటమే లేదని కాంగ్రెస్ నేత వి.హన్మంతరావు విమర్శించారు. ప్రాణహిత ప్రాజెక్టు పేరును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చి సీఎం కేసీఆర్ రూ.38 వేల కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో బుధవారం వీహెచ్ విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాసిచ్చిన స్పీచ్‌నే పవన్ చదివారని ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకుని కేసీఆర్‌కు భజన చేయడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ కోసం పోరాడిన కోదండరాం, మంద కృష్ణల అక్రమ అరెస్టులు పవన్‌కు కనపడలేదా అని ప్రశ్నించారు.

సృజన కుటుంబానికి రూ.10 లక్షలు

సాక్షి, హైదరాబాద్: గతేడాది హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించిన మహా బతుకమ్మ కార్యక్రమంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన గుండ్లపల్లి సృజన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించారు. ఈ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, తెలంగాణ జాగృతి మరో రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. ఎక్స్‌గ్రేషియాను సృజన కుమార్తె, కుమారుడి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తామని సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జాగృతి ఉపాధ్యక్షుడు రాజీవ్ సాగర్ బుధవారం తెలిపారు. తమకు ఆర్థిక సాయం చేసిన ప్రభుత్వానికి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సృజన తండ్రి సూర్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

వేగంగా ‘కాళేశ్వరం’ విద్యుత్ లైన్లు

ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా లైన్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమయిందని, ప్రాజెక్టుకు అవసరమైన 400 కేవీ, 220 కేవీ లైన్ల పనులు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2018 జూన్ నాటికి ఎనిమిది పంపులు సిద్ధమవుతున్నాయని, వీటికి విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్ కో అధికార యంత్రాంగం సకల ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. వచ్చే వానాకాలం నాటికి కాళేశ్వరం పంపింగ్ స్టేషన్లు పని చేయనున్నందున విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఇప్పటికే ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు ఆదేశించారని, డెడ్‌లైన్‌లోపే విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం, పంపిణీ లైన్ల ఏర్పాట్లు పూర్తి చేస్తామని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు తెలిపినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్యాకేజీ–6కు సంబంధించిన 3 పంపులు, ప్యాకేజి –8కి చెందిన 5 పంపులు జూన్ నాటికి సిద్ధమవుతాయని పెంటారెడ్డి తెలియజేశారు. మంత్రి హరీశ్‌రావు సూచనలతో ఇరిగేషన్, విద్యుత్ సంస్థలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన: చాడ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మఖ్దూమ్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో కూటమిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా కూటమి పనిచేస్తుందని వివరించారు. ముందస్తు ఎన్నికలు, 2018 మహాసభల నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టం తదితర అంశాలపై తమ కార్యవర్గ సమావేశం చర్చించిందని తెలిపారు. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌కు తన మాటలపై తనకే స్పష్టత లేదని చాడ విమర్శించారు.

వారంలోనే రెట్టింపు నాట్లు!

వ్యవసాయ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రబీలో పంటల సాగు విస్తీర్ణం 25.10 లక్షల ఎకరాలకు చేరిందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రబీలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 31.92 లక్షల ఎకరాలు కాగా, 79 శాతం విస్తీర్ణంలో సాగు చేశారని తెలిపింది. ఇదిలావుండగా వరి సాధారణ సాగు విస్తీర్ణం 15.37 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 13.30 లక్షల (87%) ఎకరాల్లో నాట్లు పడ్డాయని తెలిపింది. గత వారం నివేదికలో కేవలం 6.15 లక్షల (40%) ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయని వెల్లడించిన ఆ శాఖ ఇంతలోనే రెట్టింపు సాగు చూపించడం గమనార్హం. వారంలోనే ఈ స్థాయిలో నాట్లు పడ్డాయా అన్న చర్చ జరుగుతోంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.25 లక్షల ఎకరాలకు గాను 3 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 3.22 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 3.10 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాగు విస్తీర్ణం 3.77 లక్షల ఎకరాలకు గాను 3.57 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది.

విశ్వనగరానికి ఓ విజన్..!

‘గ్రేటర్’ గ్లోబల్‌సిటీగా మారాలంటే విజన్ అవసరం

- ట్రాఫిక్ కష్టాలు.. కాలుష్య ఆనవాళ్లు లేని సిటీ కావాలి
- మూసీ, సాగర్ సహా జలాశయాలను కాపాడాలి

ఫ్యూచరిస్టిక్ సిటీస్ రౌండ్ టేబుల్ సదస్సులో నిపుణులు

సాక్షి, హైదరాబాద్:

హైదరాబాద్ మహానగరం గ్లోబల్ సిటీగా మారాలంటే సరికొత్త విజన్ అవసరం అంటున్నారు వివిధ రంగాలకు చెందిన నిపుణులు. ట్రాఫిక్ కష్టాలు.. గుంతలమయమైన రహదారులు.. శ్వాసకోశ వ్యవస్థలను దెబ్బతీస్తోన్న వాయు కాలుష్యాన్ని సమూలంగా పారదోలాలని, చారిత్రక మూసీనది.. హుస్సేన్‌సాగర్.. దుర్గం చెరువు సహా వివిధ జలాశయాలను పది కాలాలపాటు పరిరక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామంటున్న పాలకులు ఆర్థికాభివృద్ధితోపాటు పర్యావరణ అంశాలు, నగర చరిత్ర, వారసత్వ కట్టడాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు కంకణబద్ధులు కావాలని సరికొత్త విజన్‌ను ఆవిష్కరించారు. రాజకీయ పక్షాలు, ప్రభుత్వం, ఆయా విభాగాలు పూర్తిస్థాయిలో భాగస్వాములైతేనే ఈ విజన్ సాకారమౌతుందని స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు ‘ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్’ సంస్థ ఆధ్వర్యంలో ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైలాగ్ స్టేట్ ఆఫ్ హైదరాబాద్ సిటీ అన్న అంశంపై ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న పలువురు నిపుణులు పలు అంశాలపై గ్రేటర్‌ను విశ్వనగరంగా మార్చాలంటే ప్రభుత్వ విజన్ ఎలా ఉండాలో నిర్దేశించారు. ఈ సదస్సులో జీహెచ్‌ఎంసీ కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డి, కరుణా గోపాల్, జి.రామేశ్వర్‌రావు, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, వేదకుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, నరసింహారెడ్డి, కేశవ్, తిలోత్తమ్, సక్సేనా, శ్రావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో విశ్వనగర విజన్ ఇలా ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు.



సదస్సులో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి, లక్ష్మణ్, జనార్దన్‌రెడ్డి, కరుణా గోపాల్ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి



గ్రేటర్‌లో మూసీ, సాగర్ ప్రక్షాళనతోపాటు పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. ఈ దిశగా ప్రభుత్వం నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, పర్యావరణవేత్త

మహిళల భద్రతకు పెద్దపీట వేయాలి



గ్రేటర్‌లో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. వారు స్వేచ్ఛగా వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు చేసుకునే వాతావరణం కల్పించాలి. ఆయా సమస్యల పరిష్కారానికి పౌరసమాజం నుంచి ప్రభుత్వం అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరించాలి.

– శ్రావ్యారెడ్డి, విఅండ్‌షి ఫౌండేషన్ అధ్యక్షురాలు

పర్యావరణం..



ప్రస్తుత పరిస్థితి: గ్రేటర్ పరిధిలో ఫార్మా పరిశ్రమలు.. వాహన విస్ఫోటనంతో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. త్వరలో మన సిటీ ఢిల్లీని అధిగమించనుంది. గాలిలో చేరుతోన్న అతి సూక్ష్మధూళి కణాలు నేరుగా ఊపిరితిత్తులు, రక్తనాళాల్లో చేరి గుండె పోటుకు కారణమవుతున్నాయి.

విజన్ ఇదీ: రోజువారీగా పరిశ్రమలు, వాహనాలు, ఇతరత్రా ఎన్ని టన్నుల కాలుష్యం గాలిలో కలుస్తుందో శాస్త్రీయంగా లెక్కించాలి. కాలుష్యానికి కారణమవుతున్న వారిని గుర్తించి కట్టడి చేయాలి. గ్రేటర్‌వ్యాప్తంగా ఏ ప్రాంతంలో ఎంత కాలుష్యం నమోదవుతుందో మొబైల్‌యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ప్రతి సిటిజన్‌కు ఉండాలి.

మూసీ, సాగర్, చెరువుల పరిరక్షణ



ప్రస్తుత పరిస్థితి: చారిత్రక మూసీ నది డంపింగ్‌యార్డుగా మారింది. అడుగడుగునా ఆక్రమణలతో మూసీ చిన్నబోయింది. పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా నదిలో కలుస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని సుమారు 185 చెరువులు కాలుష్యకాసారంగా మారాయి.

విజన్ ఇదీ: మూసీ, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు తక్షణం నడుంబిగించాలి. పారిశ్రామిక వాడల్లోనే ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నెలకొల్పి శుద్ధిచేసిన అనంతరమే మూసీలోకి వదలాలి. జలాశయాలు, మూసీపై ఆక్రమణలు తొలగించాలి.


తీరైన రహదారులు



ప్రస్తుత పరిస్థితి: గ్రేటర్‌లో రహదారులు అడుగుకో అగాథంలా మారాయి. ట్రాఫిక్, గుంతల రోడ్లపై ప్రయాణంతో జనం నడుమునొప్పితో కుదేలవుతున్నారు.

విజన్: రహదారులను విస్తరించాలి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిబంధనల ప్రకారం ఆక్రమణలను నిరోధించి తీరైన ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలి. మల్టీలెవల్ ఫ్లైఓవర్ల కన్నా రోడ్ల విస్తరణ, గుంతలను తక్షణం పూడ్చి సిటిజన్లకు ఉపశమనం కల్పించాలి.

ప్రజారవాణా..



ప్రస్తుతం: గ్రేటర్‌లో వాహన విస్ఫోటనం జరుగుతోంది. నిత్యం 50 లక్షల వాహనాలు రోడ్డెక్కుతుండటంతో ట్రాఫికర్ సిటిజన్లను బెంబేలెత్తిస్తోంది.

విజన్: మెట్రో రైళ్లతోపాటు బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం(బీఆర్‌టీఎస్) వంటి ప్రజారవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ఉంటేనే వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి ప్రజారవాణా వినియోగం పెరుగుతుంది.

నిరంతర నీటిసరఫరా..



ప్రస్తుతం: వందల కిలోమీటర్ల దూరం నుంచి సిటీకి తరలిస్తున్న కృష్ణా, గోదావరి జలాల్లో 40 శాతం సరఫరా నష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

విజన్: గ్రేటర్‌లో ప్రతి వ్యక్తికీ నిత్యం 150 లీటర్ల తాగునీటిని నిరంతరాయంగా(24 గంటలపాటు) సరఫరా చేసేలా సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. సరఫరా నష్టాలను గణనీయంగా తగ్గించాలి.

మురుగు నీటిపారుదల వ్యవస్థ



ప్రస్తుతం: గ్రేటర్ శివార్లలో పదకొండు మున్సిపల్ సర్కిళ్ల పరిధిలో డ్రైనేజి వ్యవస్థ లేక 40 లక్షల మంది సతమతమవుతున్నారు.

విజన్: గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సమగ్ర మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు రూ.3,100 కోట్లతో డ్రైనేజి మాస్టర్‌ప్లాన్‌ను పక్కాగా అమలుచేయాలి.

రైతు ‘పెట్టుబడి’కి 9,700 కోట్లు

- బడ్జెట్‌లో నిధులకోసం వ్యవసాయ శాఖ ప్రతిపాదన
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు ఇవ్వాలని వినతి



సాక్షి, హైదరాబాద్: రానున్న బడ్జెట్‌లో రైతు పెట్టుబడి పథకానికి రూ.9,700 కోట్లు కేటాయించాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు ఆర్థిక శాఖకు విజ్ఞప్తి చేసింది. వచ్చే ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి ఈ మొత్తం అవసరమని తెలిపింది. ఈసారి వ్యవసాయశాఖకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు వ్యవసాయ శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. పెట్టుబడి పథకం నిధులతో కలిపి ప్రగతి పద్దు కింద మొత్తం రూ. 12,800 కోట్లు వ్యవసాయ బడ్జెట్‌గా ఉండే అవకాశముందని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సారి వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. 2017–18 బడ్జెట్లో యాంత్రీకరణకు రూ.336 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ సారి అదనంగా రూ.164 కోట్ల మేరకు కోరుతున్నారు. ఇక వడ్డీలేని రుణాలకు ప్రస్తుత బడ్జెట్లో రూ.340 కోట్లు కేటాయిస్తే, వచ్చే బడ్జెట్లో రూ. 500 కోట్లు ప్రతిపాదించారు. విత్తన సబ్సిడీకి గత బడ్జెట్లో రూ.138 కోట్లు కేటాయిస్తే, రానున్న బడ్జెట్లో రూ.400 కోట్లు ప్రతిపాదించారు.

ఖరీఫ్ పెట్టుబడి సాయం 6,480 కోట్లు

రాష్ట్రంలో దాదాపు 1.62 కోట్ల ఎకరాల సాగు భూమి ఉన్నట్టు ప్రభుత్వం నిర్ధారణకు వచ్చిందని.. దాని ప్రకారం 1.62 కోట్ల ఎకరాలకు లెక్కవేసి వచ్చే ఖరీఫ్‌కు రూ.6,480 కోట్లు, మరో రూ.3,220 కోట్లు రబీ సీజన్‌కు ఇవ్వాలని కోరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆ భూములకు ‘పెట్టుబడి’ అందదు!

పెట్టుబడి పథకంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సాగుకు యోగ్యంకాని భూములుంటే వాటిని పెట్టుబడి పథకం నుంచి మినహాయించాలని సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. సాగుకు యోగ్యం కాని భూమి మొత్తంగా రెండు శాతం ఉండొచ్చని, ప్రస్తుతం ఆ భూమిని గుర్తించాల్సి ఉందని చెబుతున్నారు.

కేంద్ర సహకారం లేదనడం అవాస్తవం

కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ



సాక్షి, న్యూఢిల్లీ: పలు పథకాలకు నిధులు, సంస్థల మంజూరులో కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందని మంత్రి కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. కేంద్రం తెలంగాణకు అన్ని రకాలుగా సహకారం అందిస్తోందని, విద్యాసంస్థలు, కేంద్ర పథకాలకు నిధుల మంజూరులో పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యాసంస్థల ఏర్పాటు విషయమై కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. సంగారెడ్డి జిల్లాలో ఐఐటీ పనులను, గిరిజన వర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇఫ్లూ వర్సిటీలో ఉద్యోగులకు కేంద్రమే 100% ప్రయోజనాలు కల్పించాలని, సెంట్రల్ వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు విడుదల చేయాలని కోరారు. సర్వశిక్షా అభియాన్, రూసా కింద తెలంగాణకు రూ.149 కోట్లు విడుదల చేసేందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ప్రత్యామ్నాయ వేదికగా బీఎల్‌ఎఫ్

- లాల్–నీల్ నినాదంతో ‘బహుజన లెఫ్ట్ ఫ్రంట్’
- వామపక్షాలు, కుల, సామాజిక సంఘాలతో వేదిక ఏర్పాటు
- నేటి ఆవిర్భావ సభకు సీతారాం ఏచూరి, ప్రకాశ్ అంబేడ్కర్ రాక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు సీపీఎం ఆధ్వర్యంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) ఊపిరి పోసుకుంది. లాల్–నీల్ నినాదంతో 21 రాజకీయ పార్టీలు, సంఘాలతో కలసి బీఎల్‌ఎఫ్ ఏర్పాటు కాగా, ఆవిర్భావ సదస్సును గురువారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. బీఎల్‌ఎఫ్ చైర్మన్‌గా నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్‌గా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని ఇప్పటికే ఎంపిక చేశారు. మరోవైపు కుల, సామాజిక సమస్యలపై పోరాడటానికి సీపీఎం ఇదివరకే తెలంగాణ సామాజిక సంఘాల ఐక్యవేదిక (టీమాస్)ను ఏర్పాటు చేసింది. టీమాస్ కేవలం సామాజిక సమస్యలపై పోరాటాలకే పరిమితం కానుండగా, ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆకాంక్షలున్న పార్టీలను ఒక వేదిక మీదకు తీసుకువచ్చేందుకు బీఎల్‌ఎఫ్‌కు రూపకల్పన చేశారు. టీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు మినహా కలసి వచ్చే అన్ని పార్టీలతో ఈ వేదికను ఏర్పాటు చేయాలని భావించి 4 నెలలుగా కసరత్తు చేశారు. ప్రధాన వామపక్ష పార్టీలయిన సీపీఐ, న్యూడెమొక్రసీ తదితర పార్టీలు బీఎల్‌ఎఫ్‌కు దూరంగా ఉండగా, బీఎస్పీ, లోక్‌సత్తా వంటి పార్టీలు, ఇతర వామపక్ష పార్టీలు సహా మొత్తం 21 పార్టీలు ఫ్రంట్‌లో చేరాయి. మరో 15 పార్టీలు వేదికలో చేరనున్నాయని సీపీఎం వర్గాలు చెబుతున్నాయి.

సార్వత్రిక ఎన్నికలే లక్ష్యం

అధికార టీఆర్‌ఎస్‌తోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న బీఎల్‌ఎఫ్.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఎల్‌ఎఫ్ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లేందుకు బీఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నారు. సీపీఎం కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆర్‌పీఐ నేత ప్రకాశ్ అంబేడ్కర్ ఆవిర్భావ సభలో పాల్గొంటారని సీపీఎం వర్గాలు తెలిపాయి.

భౌతిక దాడులకు భయపడను

కార్యకర్తల సమావేశంలో పవన్

- కాంగ్రెస్ నేతల విమర్శలు ఆశ్చర్యకరం
- పార్టీ విధానాలు ప్రచారం చేసుకుంటే వారికేంటి?
- తెలంగాణ బాగు కోరితే తప్పేంటి?
- వీహెచ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే మద్దతిస్తాం
- ప్రజల మద్దతు కూడగట్టేందుకే ప్రజాయాత్ర
- ఫ్లోరోసిస్ సమస్య తీర్చేందుకు కృషి చేస్తానని వెల్లడి


బుధవారం ఖమ్మంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ఖమ్మం క్రైం: ప్రజాక్షేత్రంలోకి వచ్చాక భౌతిక దాడులు, రాజకీయ విమర్శలకు భయపడే ప్రసక్తే లేదని సినీనటుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ జనసేన ప్రత్యక్షమవుతుందని, తాను తెలంగాణ బాగు కోరితే తప్పేంటని నిలదీశారు. సినిమాల్లో ఉంటే అందరూ పొగుడుతున్నారని, రాజకీయాల్లో మాత్రం తన ఎదుగుదలను ఎందుకు ఓర్చుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్స్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లా కార్యకర్తల సమావేశంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయంగా ఎదిగి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటే అన్ని కులాలు, మతాల మద్దతు అవసరమని.. ఆ మద్దతు కూడగట్టేందుకే ప్రజాయాత్రకు శ్రీకారం చుట్టానని తెలిపారు. మన యాస, భాషతోపాటు సంస్కృతీసంప్రదాయాలను గౌరవించినపుడే జై తెలంగాణ నినాదానికి అర్థం ఉంటుందన్నారు. జై తెలంగాణ అంటూ సామాజిక మార్పు కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.

మార్పు కోసమే..

దేశ రాజకీయాల్లో పెను మార్పులు సృష్టించేందుకే జనసేన పార్టీ ఆవిర్భవించిందని, ప్రతి కార్యకర్త దీన్ని గుర్తించాలని పవన్ చెప్పారు. సమస్య ఎక్కడుంటే అక్కడ జనసేన కార్యకర్త ప్రత్యక్షమవ్వాలని, వాటిని పరిష్కరించేందుకు ముందుండాలని పిలుపునిచ్చారు. 2019లో అధికారంలోకి వస్తామని చెప్పడం లేదని.. కానీ కనీస మార్పుకు ఆ ఎన్నికలు నాంది కావాలన్నారు. శ్రీకాకుళంలో ఉన్నట్లే తెలంగాణలోని నల్లగొండలో ఫ్లోరోసిస్ సమస్య ఉందని, దాన్ని అంతమొందించే వరకు కృషి చేస్తామని ప్రతినబూనారు.

వారికేం ఇబ్బందో..

రాజకీయాల్లో విమర్శలు సహజమని, సహేతుక విమర్శలు స్వీకరించేందుకు తాను సిద్ధమని పవన్ స్పష్టం చేశారు. కానీ అవగాహన ఉన్న కాంగ్రెస్ నేతలూ తనపై విరుచుకుపడటం ఆశ్చర్యంగా ఉందని.. తన రాజకీయ విధానాలు ప్రచారం చేసుకుంటే ఇతర పార్టీలకు ఏం ఇబ్బందో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న మాజీ ఎంపీ హనుమంతరావును ఆ పార్టీ తరపున తెలంగాణ సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే జనసేన మద్దతిస్తుందని వెల్లడించారు. వీహెచ్ వంటి నేత తనతో కలిసొస్తే ఇంటింటికీ తిరిగి సమస్యలేంటో తెలుసుకుందామన్నారు.

చెప్పు విసిరిన అగంతకుడు

పవన్ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై ఓ అగంతకుడు చెప్పు విసిరాడు. కొత్తగూడెం నుంచి ఖమ్మంకు ఓపెన్‌టాప్ కారులో వస్తుండగా.. తల్లాడ ప్రధాన రహదారిపై ఈ ఘటన జరిగింది. వెంటనే అప్రమత్తమైన పవన్ వ్యక్తిగత సిబ్బంది ఆయనకు రక్షణ వలయంగా నిలిచారు. చెప్పు ఎవరు విసిరింది తెలియలేదు. కాగా, కొత్తగూడెం నుంచి ఖమ్మం వస్తున్న సమయంలో వాహన శ్రేణిలోని ఓ వాహనం ఢీకొని ఓ వ్యక్తి కాలు విరిగింది. అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మరోవైపు పవన్ కాన్వాయ్‌లోని ఓ కారు.. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఖమ్మం రూరల్ ఎస్‌ఐ చిరంజీవి కాలిపైకి ఎక్కడంతో గాయమైంది. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు.

Dwaraka

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 25-1-2018



పద్మావత్

విఘ్నేశ్వరా.. నీదే భారం!



సిద్ధి వినాయక ఆలయంలో దీపికా పదుకోన్

ఎట్టకేలకు ‘పద్మావత్’ ఇవాళ రిలీజ్ అవుతోంది! అవనిస్తారా అని డౌట్. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఇప్పటికీ నిరసనకారుల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. పిక్చర్ రిలీజ్ కావడానికి వీల్లేదని వాళ్లంతా హఠం పట్టారు. సెన్సార్ ఓకే చెప్పింది. సెన్సార్ చెప్పిన మార్పులకు నిర్మాతలు ఓకే చెప్పారు. మార్పుల తర్వాత ప్రివ్యూలు చూసినవాళ్లు ఒకే చెప్పారు. చివరికి సుప్రీంకోర్టు కూడా ఓకే చెప్పింది. అయినప్పటికీ సెంటిమెంట్స్ బలంగా పని చేస్తున్నాయి. ‘‘మా రాణిగారి ఆత్మాభిమానాన్ని కించపరిచేలా ఉన్న పద్మావత్ విడుదల అవుతుంటే.. చూస్తూ కూర్చోడానికి మేమేమీ చేవ చచ్చిన వాళ్లం కాదు’ అని రాజ్‌పుత్‌లు అంటున్నారు. మంగళవారం నాడు మీడియా ప్రతినిధులు ‘పద్మావత్’ను చూసి వచ్చి, రివ్యూ రాశారు. ఈ కాల్పనిక చరిత్ర ‘చూడ్డానికి బాగుంది’ అని సమీక్షించారు. అయితే అసలు చూడ్డానికే ఆ సినిమాను వ్యతిరేకిస్తున్నవారు ఇష్టపడడం లేదు. వాళ్ల వాదనను సమర్థిస్తున్న ఇతర రాష్ట్రాలవారు కూడా ‘మేము చూడం, చూడనివ్వం’ అని థియేటర్‌ల దగ్గర కాపుకాశారు. ఇంకోవైపు ‘పద్మావత్’ స్టార్ దీపికా పదుకోన్, దర్శకుడు భన్సాలీ గట్టి భద్రత నడుమ మాత్రమే బయటికి రాగలుగుతున్నారు. ప్రివ్యూలు వేసిన రోజు దీపికా పదుకోన్ ముంబైలోని సిద్ధి వినాయక ఆలయానికి వెళ్లి విఘ్నేశ్వరుడి ఆశీర్వాదాలు తీసుకుని వచ్చారు. ఆలయానికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఆమె ఏమీ మాట్లాడలేదు. పద్మావతిగా నటించినప్పటి నుంచి ఎక్కడా మాట్లాడే అవకాశమే ఆమెకు రావడం లేదు! ఇక ఆమె తరఫున సినిమానే మాట్లాడాలి.

సెటైరమ్మా.. సెటైరూ..!

రాజా రాస్తున్నాడు!

ఆదిముత్తు రాజా ఆత్మకథ రాస్తున్నాడన్న వార్తొకటి ప్రస్తుతం మీడియాలో.. డూయింగ్ రౌండ్స్. పుస్తకం పేరు ‘2జి సాగా అన్‌ఫోల్డ్స్’ అట! పుస్తకం పేరు ఓకే, బట్, ఎవరీ ముత్తు? ముత్తు కాదు. ఆదిముత్తు. ఎ.రాజా ఇంటిపేరు అది. విషయం ఏంటంటే? పుస్తకంలోని విషయమా? కాదు.. కాదు.. పుస్తకం రిలీజ్ అయ్యాక విషయం ఏంటంటే.. ముందొచ్చినవాళ్లకే మందు దొరుకుతుందట! ఏంటంత డిమాండ్? బుక్కు బుక్కంతా మూవీ స్క్రిప్టులా ఉంటుందట. అందులో ఒక విలన్, ఒక హీరో, కుప్పల కొద్దీ కమెడియన్‌లు! కేవలం రు.250లతో తరతరాలకు ఎంటర్‌టైన్‌మెంట్ అని పబ్లిషర్లు ఊరిస్తున్నారు. అందులోని హీరో ఎ.రాజా.. టూజీ స్పెక్ట్రమ్ స్కామ్ కేసులో కొన్నాళ్లు తీహార్ జైల్లో ఉండి వచ్చారు. జైల్లో ఉండొస్తే హీరో ఎలా అవుతాడు? కోర్టు నిర్దోషి అని తీర్పిచ్చింది కదా! అందుకే హీరో అయ్యాడు. మరి విలన్. డౌటెందుకు? కాగే (సి.ఎ.జి). కాగ్ వల్లనే కదా ఎ.రాజా కోర్టుల చుట్టూ, జైళ్ల చుట్టూ తిరిగాడు. పుస్తకంలో ఇక మిగతా పాత్రలు.. ముఖ్యంగా మన్మోహన్‌సింగ్ పాత్ర ఏమిటన్నది ఇప్పుడే బయటపెట్టరట. పేజీలు తిప్పి తెలుసుకోవాల్సిందే అంటున్నారు. ఇదిలా ఉంటే, ఓ బాలీవుడ్ ప్రొడక్షన్ కంపెనీ ఇప్పటికే ఎ.రాజా బుక్ హక్కుల్ని కొనుక్కుని దానిని సినిమాగా తీయడానికి ‘ఎ బిలియన్ ఇడియట్స్’ అని టైటిల్‌ని రిజిస్టర్ కూడా చేసుకుందట.



కేన్సర్‌ను సిరిధాన్యాలతో జయిద్దాం!

1970-80 దశకానికి ముందు కాలంలో కేన్సర్ రోగులు చాలా అరుదుగా కనిపించేవారు. బహుశా లక్ష జనాభాలో ఏ ఒక్కరికో వచ్చేది. ఇప్పుడు ఎటు చూసినా కేన్సర్ రోగులు కనిపిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని ఏళ్ల క్రితం వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారం ప్రకారం.. 2030 నాటికి కోటి 40 లక్షల నుంచి రెండు కోట్ల 10 లక్షల మంది వరకు కేన్సర్ బారిన పడే పరిస్థితి నెలకొంది.

దీనికి ప్రధాన కారణం.. ప్రతి రోజూ మనం తింటున్న విషతుల్యమైన ఆహారమే! ఇప్పుడు తింటున్న ఆహారం మరింత విషపూరితంగా మారిపోతోంది.

పురుగు మందులు

జనాభా పెరుగుతున్న కొద్దీ అధికంగా ఆహారం ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కారణంగా అధిక దిగుబడి కోసం రసాయనిక ఎరువులు, చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవడానికి పురుగుమందులు, తెగుళ్ల మందుల వాడకం ప్రారంభమైంది. గతంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు ఎమల్షన్ రూపంలో నీటిలో కరగని రీతిలో ఉండేవి. తదనంతరం, నీటిలో కలిసిపోయే రకం పురుగుమందులను శాస్త్రవేత్తలు తయారు చేశారు. అమెరికాలో జన్యుమార్పిడి సోయాబీన్స్‌ను ఉత్పత్తి చేసే క్రమంలో జరిపిన ప్రయోగ ఫలితాలను బట్టి శాస్త్రవేత్తలకు ఈ ఆలోచన వచ్చింది.

కలుపు మందులు

సోయాబీన్స్ పొలంలో మొలిచే కలుపు మొక్కలను నిర్మూలించేందుకు శాస్త్రవేత్తలు కలుపు నివారణ మందులను తయారు చేశారు. అయితే, ఈ కలుపు మందులు వాడినప్పుడు ప్రధాన పంట కూడా దెబ్బతిన్నది! ఈ కలుపుమందుకు 2–4–డి. దీనికి ‘ఏజెంట్ ఆరెంజ్’ అనే మరో పేరు కూడా ఉంది. మొక్కలు చూస్తుండగానే



మాడిపోయేలా చేయడానికి దీన్ని వియత్నాం యుద్ధంలో వాడారు. సోయాబీన్ పంటను కలుపు మందు నుంచి కాపాడుకోవడానికి.. కలుపు మందును తట్టుకొని నిలిచేలా సోయాబీన్స్‌కు జన్యుమార్పిడి చేశారు! ఆ విధంగా రసాయనం సోయాబీన్ పంటలోకి చేరింది. ఈ రసాయనం క్రమంగా ఫెనోలిక్ కాంపౌండ్‌గా రూపుదాల్చి, కొంత మేరకు నీటిలో కరిగే స్వభావాన్ని సంతరించుకుంది. దీన్ని గ్రహించిన శాస్త్రవేత్తలు ఆ తర్వాత నీటిలో కరిగే స్వభావం కలిగిన ‘గ్లైఫొసేట్’ వంటి కలుపు మందులను కనుగొన్నారు.

సరిగ్గా ఈ దశలోనే ‘కేన్సర్’ పుట్టిందని ఆహార శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలీ అంటున్నారు! ఈ క్రమంలోనే నీటిలో కరిగే కలుపు మందుల ఉత్పత్తి, వాడకం పాశ్చాత్య దేశాల్లో పెద్దఎత్తున ప్రారంభమైంది. పర్యావరణ వ్యవస్థలోకి రసాయనాలు చేరిపోవటం అలా మొదలైంది. దక్షిణ ధృవంలో నివసించే పెంగ్విన్ల దేహాల్లోకి కూడా ఈ విషాలు చేరిపోయాయంటే వ్యవసాయ రసాయనాలు యావత్ భూగోళాన్నే ఎంతగా విషతుల్యంగా మార్చాయో అర్థం చేసుకోవచ్చు. మన దగ్గర కూడా ఈ రసాయనాలను చాలా విస్తారంగా వినియోగిస్తుండడంతో మన పర్యావరణ వ్యవస్థలోకి కూడా విషతుల్య పదార్థాలు పెద్దఎత్తున చేరిపోయాయి.

జన్యుమార్పిడి పంటలు

కేన్సర్ వ్యాధి విపరీతంగా విస్తరించడానికి జన్యుమార్పిడి మొక్కజొన్న సాగు కూడా మరో ముఖ్య కారణం. జన్యుమార్పిడి సోయాబీన్స్‌ను తయారు చేసిన రసాయనిక / ఔషధ కంపెనీలే జన్యుమార్పిడి మొక్కజొన్నను కూడా రూపొందించాయి. ఈ మొక్కజొన్నలో కొవ్వు చాలా ఎక్కువ మోతాదులో ఉంటుంది (మొక్కజొన్నలో సాధారణంగా 100 గ్రాములకు 1 మిల్లీ గ్రాము కొవ్వు ఉంటుంది). ఈ జన్యుమార్పిడి మొక్కజొన్నను పశువులకు, కోళ్లకు మేపుతున్నారు. పాల ఉత్పత్తులు, మాంసం, పంది మాంసం, కోడి మాంసం, కోడిగుడ్లు తదితర ఆహారోత్పత్తుల ద్వారా నీటిలో కరిగే విషతుల్యమైన రసాయనాలు మనుషుల దేహాల్లోకి చేరిపోతున్నాయి. కూరగాయలు కూడా విషరసాయనాల బారిన పడ్డాయి. బేకింగ్ పరిశ్రమ బిస్కెట్లు, కేకులు వంటి ఉత్పత్తుల్లో పశువుల కొవ్వు పదార్థాలను వాడుతున్నాయి.

కల్తీ వంట నూనెలు

కేన్సర్ వ్యాధి విజృంభించడానికి మరో ముఖ్య కారణం వంట నూనెల రంగం. ముడి చమురును శుద్ధి చేసే క్రమంలో అనేక మూలకాలు వెలువడతాయి. సి–8 యూనిట్ల కన్నా ఎక్కువ ఫ్రాక్షన్లు ఉన్న మూలకాలను ఇంధనంగా వాడుతున్నారు. అంతకన్నా తక్కువ ఉన్న మూలకాలతో మినరల్ ఆయిల్ అందుబాటులోకి వస్తుంది. ఇందులో కృత్రిమ రసాయనాలను కలపడం ద్వారా పొద్దుతిరుగుడు నూనె, కొబ్బరి నూనె మాదిరిగానే ఉండే కృత్రిమ వంట నూనె తయారవుతున్నది. ప్రకృతి సిద్ధమైన వంట నూనెలో ఈ కృత్రిమ నూనెను కలిపి ప్యాకెట్లు చేసి మార్కెట్‌లో అమ్ముతున్నారు. ఆ విధంగా విషపూరితమైన రసాయనాలు వంట నూనెల రూపంలో మనుషుల దేహంలోకి ప్రవేశిస్తున్నాయి. అందుకే ఆహారోత్పత్తి పద్ధతులను, ఆహార శుద్ధి ప్రక్రియలను రసాయన రహితంగా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. పంటల సాగులోను, వ్యవసాయోత్పత్తుల శుద్ధి కర్మాగారాల్లోనూ విష రసాయనాల వాడకాన్ని పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉంది! విష రసాయనాల వాడకాన్ని నిషేధించక పోతే.. వివిధ రూపాల్లో విజృంభిస్తున్న కేన్సర్ మహమ్మారిని నియంత్రించటం, నిరోధించడం అనే పెను సవాలును విజయవంతంగా ఎదుర్కోవడం కనాకష్టమే.

తినకూడనివి

‘‘కేన్సర్‌ను విజయవంతంగా జయించిన వారు గానీ లేదా కేన్సర్‌కు చికిత్స పొందుతున్న వారు గానీ లేదా కేన్సర్ జబ్బు బారిన పడకూడదనుకున్న వారు గానీ.. వరి బియ్యం, గోధుమలు, పంచదార, మాంసాహారం తినకూడదు. పాలు తాగకూడదు’’ అని డాక్టర్ ఖాదర్‌వలీ అంటున్నారు. ‘‘ఇవి మన దేహంలో రసాయనాలను విడుదల చేస్తాయి. ఆ రసాయనాలు మన దేహంలోని అణువణువులో క్రమంగా పోగుపడి (బయో కాన్సంట్రేషన్) జబ్బును కలిగిస్తాయి. అందువల్లనే కేన్సర్‌ను విజయవంతంగా ఎదుర్కోవాలనుకుంటే వీటిని మన ఆహారం లోనుంచి తొలగించాల్సిందే’’నని ఆయన చెబుతున్నారు.

‘‘ఇంత కఠినమైన ఆహార నియమాలు పాటించడం సాధ్యమయ్యే పనేనా అంటూ ప్రజలు అపనమ్మకంతో, ఆశ్చర్యంతో నా వంక చూస్తుంటారు. అటువంటప్పుడు నేను ఏ సందిగ్ధమూ లేకుండా బలంగా చెప్పే మాట ఒక్కటే.. ముమ్మాటికీ సాధ్యమే! ఇటువంటి నియమబద్ధమైన జీవన శైలిని అనుసరించడం సాధ్యమే. తు.చ. తప్పకుండా అనుసరిస్తున్న రోగులెందరో నాకు తెలుసు.

మనం తీసుకునే ఆహారం, తాగే నీరు, మన వృత్తి, క్రమంతప్పని శారీరక వ్యాయామం, నడక, యోగా, మంచి అలవాట్లు, ధ్యానం, మన ఆసక్తులు.. ఇవన్నీ మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయి. అయితే నిరంతర వత్తిడితో కూడిన పాశ్చాత్య జీవన శైలిని గుడ్డిగా అనుకరిస్తూ మనవైన ఆహారపు అలవాట్లను మనం మరచిపోయాం. వేళా పాళా లేకుండా తినటం, అనారోగ్యకరమైన పోషకాల్లేని ఆహార పదార్థాలను తినటం అలవాటు చేసుకున్నాం.

పాల దిగుబడి పెంచేందుకు పాడి పశువులకు ఆక్సీటోసిన్/ఈస్ట్రోజన్ హార్మోన్లు ఇస్తున్నారు. ఇటువంటి పాలు తాగటం వల్లనే తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నాం.

గోధుమ పిండిని మైదా పిండిగా మార్చడానికి అలొక్సాన్ అనే బ్లీచింగ్ రసాయనాన్ని వాడుతున్నారు. ఆ మైదా పిండితో బిస్కట్లు, తదితర బేకరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ఇవి తిన్న వారి దేహాల్లో క్లోమ గ్రంధికి బీటా సెల్స్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం నశిస్తోంది. ఇన్సులిన్‌ను నిల్వ చేసి, అవసరం మేరకు విడుదల చేయటంలో ఈ బీటా సెల్స్ కీలకపాత్ర పోషిస్తాయి. మైదా తినటం వల్ల మధుమేహ రోగులుగా మారడానికి ఇదే కారణం.

లోపల....

సిరిధాన్యాలతో క్యాన్సర్ నివారణ : డాక్టర్ ఖాదర్‌వలీ ఇంటర్వ్యూ.

ఆఫీస్

బ్లాక్ షీప్‌ల కోసం షీ-బాక్స్

గత ఏడాది జూలైలో ప్రారంభమైన ‘షీ-బాక్స్’, నవంబర్ నాటికి ప్రైవేటు ఉద్యోగినులను కూడా తన రక్షణ పరిధిలోకి తీసుకుంది. త్వరలోనే మరింతగా ఈ సదుపాయాన్ని కేంద్ర స్త్రీ,శిశు సంరక్షణ శాఖ విస్తృతం చేయబోతోంది.

అన్ని రంగాలలోను మహిళలు చురుకుగా ఉద్యోగాలు చేస్తున్నారు. స్వతంత్రంగా జీవిస్తున్నారు. అలాగని లైంగిక వేధింపుల నుంచి మాత్రం వారికి విముక్తి లభించడం లేదు. పని చేసే చోట నిత్యం ఎదురయ్యే లైంగిక వేధింపులు ఎంత నరకప్రాయమో.. ఆ బాధలు పడేవారికే తెలుస్తుంది. ఫిర్యాదు చేసినా ఫలితం లేని పరిస్థితి కూడా అనేక సంస్థల్లో ఉంది. అందుకే, ఉద్యోగం చేస్తున్న మహిళల సంక్షేమం కోసం భారతప్రభుత్వం కొత్తగా ఒక విధానం ప్రవేశపెట్టింది. అదే షీ – బాక్స్. సెక్యువల్ హెరాస్‌మెంట్ ఎలక్ట్రానిక్ బాక్స్ (ఎస్‌ఎచ్‌ఈ) పేరిట మహిళలకు ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. మహిళలు నిశ్చింతగా ఉద్యోగం చేసుకుంటూ, వేధింపులకు గురికాకుండా ఉండటం కోసం ప్రభుత్వం ఈ ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పించింది. ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలు.. ఎందులో పనిచేసే మహిళా ఉద్యోగులైనా ఫిర్యాదు చేయొచ్చు. తాము ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి వివరంగా తెలియజేయవచ్చు. ఒక్క లైంగిక వేధిపులే కాదు.. మహిళలను భయపెట్టడం, జుగుప్సాకరమైన ఉద్యోగ వాతావరణం సృష్టించడం, స్త్రీలను తక్కువ చేసి మాట్లాడటం.. ఎటువంటి ఇబ్బందినైనా నిర్భయంగా చెప్పుకోవచ్చు. వారి



ఆరోగ్యానికి, భద్రతకు ముప్పు కలిగించే అన్ని విషయాలనూ ఇందులో నమోదు చేయొచ్చు. షీ–బాక్స్ ఒక సింగిల్ విండోలా పనిచేస్తుంది. ఉద్యోగం చేస్తున్న చోట వేధింపులకు గురవుతున్నవారు చేసే ఈ ఫిర్యాదు నేరుగా సంబంధిత అధికారులకు చేరుతుంది. వెంటనే వారు.. బాధితురాలు పనిచేస్తున్న సంస్థ యాజమాన్యాలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటారు. షీ–బాక్స్‌లో ఫిర్యాదు చేయడానికి ఈ మెయిల్ ఐడీ తప్పనిసరి. ఇందులో రిజిస్టర్ చేసుకోవడం చాలా సులువు. స్క్రీన్ మీద కనిపించే Register Your Complaint మీద క్లిక్ చేయాలి. వెంటనే మీ ఆఫీసులో ఏ సందర్భంలో మీరు వేధింపులకు గురి అయ్యారు, అవుతున్నారు అనే వివరాలను పొందుపరచడానికి మెజేస్ స్పేస్ వస్తుంది. తర్వాత ఫిర్యాదు నమోదు పత్రం వస్తుంది. అందులో సమాచారం నింపాక, submit బటన్ నొక్కాలి. ఒకసారి ఫిర్యాదు ఇచ్చారంటే, మీ ఈ మెయిల్‌కి కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. అందులో ఒక లింక్ కూడా వస్తుంది. అక్కడ మీ ఈ మెయిల్ ఐడీని యూజర్ ఐడీ గా వాడుకుని, కొత్త పాస్‌వర్డ్‌ని జనరేట్ చేసుకుని, మీ ఫిర్యాదు విచారణ ఎంతవరకు వచ్చిందో తెలుసుకోవచ్చు.

చెట్టు నీడ

అమ్మ

మీ అబ్బాయికి బుద్ధిమాంద్యం ఉంది. ఇలాంటి వాడిని మా స్కూల్లో ఉంచుకోలేం. రికార్డుల నుంచి అతడి పేరును తొలగించాం.

ఓరోజు థామస్ ఎడిసన్ స్కూల్ నుంచి ఇంటికి రాగానే, ‘‘అమ్మా ఈ కాగితాన్ని మా టీచర్ నీకు ఇమ్మంది’ అని చెప్పాడు.

ఆ కాగితాన్ని ఆమె విప్పి చూస్తుంటే అక్కడే నిలబడ్డాడు.

ఆ తల్లి కళ్లల్లో నీళ్లు!

‘‘ఏం రాసి ఉందమ్మా?’’ అని అడిగాడు ఎడిసన్.

పైకి చదివి వినిపించింది తల్లి.

‘మీ అబ్బాయి మహా మేధావి. ఆ స్థాయి టీచర్లు మా దగ్గర లేరు. కనుక దయచేసి మీరే అతడిని ఇంట్లో ఉంచుకుని చదువు చెప్పగలరు.’

ఏళ్లు గడిచాయి. ఎడిసన్ తల్లి చనిపోయింది. ఎడిసన్ గొప్ప శాస్త్రవేత్తగా ప్రఖ్యాతుడయ్యాడు. ఓరోజు పాత సొరుగులు తీసి చూస్తుంటే, చిన్నప్పుడు టీచర్ తన తల్లికి రాసిన ఆ కాగితం బయటపడింది.

ఎడిసన్ దానిని చేతిలోకి తీసుకుని చదివాడు.

‘మీ అబ్బాయికి బుద్ధిమాంద్యం ఉంది. ఇలాంటి వాడిని మా స్కూల్లో ఉంచుకోలేం. రికార్డుల నుంచి అతడి పేరును తొలగించాం’ అని ఉంది!


ఎడిసన్ కళ్ల నిండా నీళ్లు.

ఆ తర్వాత ఎడిసన్ తన డైరీలో ఇలా రాసుకున్నాడు : థామస్ ఆల్వా ఎడిసన్ బుద్ధిమాంద్యం గలవాడు. అయితే అతడి తల్లి అతడిని ఒక మేధావిగా మలిచింది!

ఆ దేవుడే మార్చాలనీ, ఆ దేవుడే నయం చేయాలని.. టీచర్లు, వైద్యులు వదిలేసిన పిల్లల్ని ప్రేమతో, ఓర్పుతో తీర్చిదిద్దిన, తీర్చిదిద్దుతున్న తల్లులెందరో సమాజంలో ఉన్నాయి. వీళ్లంతా సొంత బిడ్డలకు మాత్రమే తల్లులు కాదు. విశ్వమాతలు. ఈ ప్రేమమూర్తులలో ఒక మానవతా మూర్తి మదర్ థెరిస్సా. ఆమె ‘భారతరత్న’ అయిన రోజు ఇది.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
గురువారం
25-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

అన్నా నమస్కారం. నా ప్రేమకు 15 సంవత్సరాల వయసు. నేను ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. తను నన్ను ప్రేమిస్తుంది కానీ తనకి పెళ్లి అయిపోయింది. ఇప్పటికీ మాట్లాడుకుంటున్నాం. నేను ఆమెకు దూరం అవ్వాలనుకుంటే, తను తట్టుకోలేదు. ఆమె అలా బాధ పడుతుంటే నేను తట్టుకోలేను. ఐ థింక్ తనని నాతోపాటు తీసుకొద్దామనుకుంటున్నా. తనని నేను ఎప్పటికీ హ్యాపీగా చూడాలనుకుంటున్నాను. బట్ ఎలానో అర్థం కావట్లేదు బ్రదర్. ప్లీజ్ నాకు మంచి సలహా ఇవ్వండి డియర్.

- చందు

చందూ... నీకు దణ్ణం పెడతా. 15 ఇయర్స్ ఆగావు. ఇంకా 15 ఏళ్లు ఆగావంటే...

'సార్, ఏంటి సార్! పాపం అంత బాధపడుతుంటే చందు... మీ ఎటకారం ఏంటి సార్..?'

ఏం చేస్తాం...
చందు మంచివాడు.
అలాగే ఉండాలి.
పెళ్లయిన ప్రేయసి..
పరుల ఆస్తి..!
దాన్ని కాంక్షించడం ఎలా కరెక్ట్?
బాధ కలగడం లేదని కాదు.
బాధని మరిపించి... అమ్మాయి జీవితాన్ని చక్కబెడితే...
వాడు నా హీరో చందు...
లేకపోతే తనని తాను ఎప్పుడూ క్షమించుకోలేడు.
ఆ పాపం కంటే..
అమ్మాయికి దూరంగా ఉండడం..
నా మంచి చందు రెస్పాన్సిబులిటీ!
అమ్మాయి సంతోషం కోరుకునే బదులు
అమ్మాయి గౌరవం..
తన ప్రేమ గొప్పదనం నిలబెట్టుకోవాలి.

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

పరి పరిశోధన

బ్యాక్టీరియాను ఇట్టే గుర్తిస్తుంది...



నీళ్లు, ఆహారంలోని బ్యాక్టీరియాను అతి సులువుగా గుర్తించేందుకు యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్ శాస్త్రవేత్తలు ఓ కొత్త రెండు దశల పద్ధతిని ఆవిష్కరించారు. తొలిదశలో అన్ని రకాల బ్యాక్టీరియాకు అతుక్కునే కీలక రసాయనాన్ని గుర్తించేందుకు ఓ మైక్రోచిప్‌ను ఉపయోగిస్తారు. ఇక రెండోదశలో స్మార్ట్ ఫోన్ కెమెరాకు అనుసంధానించుకోగల మైక్రోస్కోప్ అడాప్టర్‌ను వాడటం ద్వారా బ్యాక్టీరియా ఎంత ఉందో గుర్తిస్తారు. సంప్రదాయ పద్ధతుల్లో బ్యాక్టీరియాను గుర్తించేందుకు దాదాపు రెండు రోజుల సమయం పడుతూండగా... ఈ కొత్త పద్ధతి ద్వారా రెండు గంటల్లోనే గుర్తించవచ్చునని.. పైగా అందరికీ అందుబాటులో ఉండే స్మార్ట్ ఫోన్‌ను, చవకైన అడాప్టర్‌ను వాడటం వల్ల ఖర్చు కూడా చాలా తక్కువగా ఉంటుందని అంచనా. బ్యాక్టీరియా గుర్తింపులో మైక్రోచిప్ సమర్థంగా పనిచేస్తున్నట్లు తాము ఇప్పటికే నిర్వహించిన పరీక్షల ద్వారా స్పష్టమైందని.. ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త లిలి హీ తెలిపారు. కొవ్వులు, ప్రొటీన్లు, ఇతర వ్యర్థాలన్నింటినీ వదిలి కేవలం బ్యాక్టీరియాకు అతుక్కునే 3-మెర్కాప్టోఫీనైల్‌బోరోనిక్ యాసిడ్‌ను మాత్రమే ఇది గుర్తిస్తుందని ఆమె చెప్పారు. ప్రకృతి విపత్తుల సమయంలో నీటిలో బ్యాక్టీరియా కాలుష్యాన్ని వేగంగా గుర్తించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు.

ఆమె అంత పొడగరి తెలుగు సినిమాల్లో లేదు.
ఆమె అంత గ్లామర్ కూడా ఎవరూ కొనసాగించలేకపోయారు.
హిందీలో ఆమెను 'ముంతాజ్'తో పోల్చవచ్చు.
కాంట్రవర్సీ లేకుండా అందరు హీరోలతో ఆమె పాతికేళ్ల పాటు చలన చిత్ర సీమలో తన ప్రభావం చూపారు. ఆమె సౌందర్యం మరపురానిది.

కృష్ణ సౌందర్యం


● నివాళి
● కృష్ణకుమారి

ఊహలు గుసగుసలాడె.. అంటూ ఓ తరాన్ని ఉర్రూతలూగించారు కృష్ణకుమారి. 1933 మార్చి 6న పశ్చిమ బెంగాల్‌లోని నౌహాతిలో జన్మించారు కృష్ణకుమారి. వీరిది రాజమండ్రి. తండ్రి వెంకోజీ ఉద్యోగరీత్యా కలకత్తా, అస్సామ్‌లలో పని చేస్తుండగా కృష్ణకుమారి అక్కడే పుట్టి, పెరిగారు. అస్సామ్‌లో టెన్త్ పూర్తయ్యాక ఈ కుటుంబం మదరాసులో స్థిరపడింది. సినిమాల్లో డ్యాన్సర్ అవ్వాలన్నది కృష్ణకుమారి కల. అయితే విధి వేరొకటి తలచింది. నటిని చేసింది.

అప్పటి ప్రముఖ దర్శక-నిర్మాత ఎస్. సౌందర రాజన్ కుమార్తె భూమాదేవి మదరాసులోని రాజకుమారి సినిమా థియేటర్‌లో కృష్ణకుమారిని చూశారు. సౌందర రాజన్ ఆ సమయంలో 'నవ్వితే నవరత్నాలు' అనే సినిమా ప్లాన్ చేస్తున్నారు. అందులో కథానాయిక అమాయకురాలు. భూమాదేవికి కృష్ణకుమారిలో ఆ అమాయకురాలు కనిపించింది. ఆమెను హీరోయిన్‌గా చేస్తావా? అని అడిగారు. వెంటనే కృష్ణకుమారి వేరే రాష్ట్రంలో ఉన్న తండ్రికి ఉత్తరం ద్వారా విషయం చేరవేశారు. 'నీ మీద నమ్మకం ఉంది. సినిమాల్లో నటించాలనుకుంటే ఓకే' అని జాగ్రత్తలు చెబుతూ ఉత్తరం రాశారాయన.

మదరాసులోని న్యూటోన్ స్టూడియోలో 'మేకప్ టెస్ట్' చేశారు కృష్ణకుమారికి. 'నవరసాలు చేసి చూపించు' అన్నారు సౌందరరాజన్. నిజానికి కృష్ణకుమారికి నటన గురించి ఏమీ తెలియదు. వేదాంతం జగన్నాథశర్మ దగ్గర కూచిపూడి నృత్యం నేర్చుకుంది. అంతే. అయినా తడబడలేదు. తనకు వచ్చినట్లుగా నటించి, చూపించింది. సౌందర రాజన్‌కి నచ్చడంతో 'నవ్వితే నవరత్నాలు'కి నాయికగా తీసుకున్నారు.

ఆ సినిమా పనులు జరుగుతుండగానే కమెడియన్ కస్తూరి శివరావ్.. కృష్ణకుమారి మేకప్ స్టిల్స్‌ని కొంతమంది నిర్మాతలకు చూపించారు. అలా 'మంత్రదండం' సినిమాలో ఓ పాత్ర చేసే అవకాశం కృష్ణకుమారికి వచ్చింది. 'మంత్రదండం' ముందు విడుదల అవ్వడంతో ఆమె తొలి చిత్రం అదే అయింది. అయితే 'నవ్వితే నవరత్నాలు' ఆశించినంతగా ఆడలేదు. అయినప్పటికీ మొదటి వారంలో బెజవాడలో హౌస్‌ఫుల్. 'బాగాలేని సినిమా హౌస్‌ఫుల్‌తో ఆడటమా?' అని అప్పటి ఓ ప్రముఖ జర్నలిస్ట్ సౌందరరాజన్‌తో అంటే 'సినిమా గురించి ఎవరు పట్టించుకున్నారు? కృష్ణకుమారిని చూడటం కోసం థియేటర్‌కు వెళ్తున్నారు' అన్నారట. అమాయకత్వం నిండిన ఆ పాత్రను అద్భుతంగా చేయడంతో పాటు చూడచక్కగా ఉండటం వల్ల ఒక్క సినిమాతో ప్రేక్షకులకు దగ్గర కాగలిగారు.

1951లో నటిగా ప్రయాణం మొదలుపెట్టి రెండు దశాబ్దాల పాటు వెండితెరను ఏలారు కృష్ణకుమారి. పిచ్చి పుల్లయ్య, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మాయిలు, నిత్యకల్యాణం పచ్చతోరణం, ఉమ్మడి కుటుంబం, తిక్క శంకరయ్య, చిలకా గోరింక, మానవుడు దానవుడు, శ్రీకృష్ణావతారం, పునర్జన్మ, సతీ సావిత్రి వంటి పలు చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏయన్నార్, కాంతారావు, జగ్గయ్య.. వంటి మహానటుల సరసన అవకాశాలు దక్కించుకున్నారు. ఎన్టీఆర్ సరసన 25 సినిమాలు, ఏయన్నార్‌తో 18 సినిమాలు చేశారు. తెలుగులో 110 సినిమాలు, కన్నడ, తమిళ భాషలతో కలిపి దాదాపు 150 సినిమాల్లో నటించారు. 1963లో ఎక్కువ సినిమాలు చేసిన ఘనత కృష్ణకుమారిది. తమిళ నటులు శివాజీగణేశన్, కన్నడ డా. రాజ్‌కుమార్ వంటి ప్రముఖ నటులతోనూ జతకట్టారామె.

నటిగా బిజీగా ఉన్నప్పుడే కృష్ణకుమారి వివాహం చేసుకున్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మాజీ ఎడిటర్, స్క్రీన్ మ్యాగజీన్ ఫౌండర్, బిజినెస్‌మేన్ అజయ్ మోహన్ ఖైతాన్‌తో ఆమె వివాహం జరిగింది. రాజస్తానీ కుటుంబానికి చెందిన అజయ్ వ్యాపార రీత్యా కలకత్తాలో స్థిరపడ్డారు. ఆయనతో కృష్ణకుమారికి స్నేహితుల ద్వారా పరిచయమైంది. సినిమాల్లో చూసి, కృష్ణకుమారిని ఇష్టపడ్డారు అజయ్. పరిచయం తర్వాత ఆమెకూ ఆయనంటే ఇష్టం ఏర్పడింది. పెద్దల అంగీకారంతో పెళ్లయింది (1969). పెళ్లి తర్వాత భర్తతో కలిసి బెంగళూరు వెళ్లడంతో పాటు సినిమాలకు కూడా దూరమయ్యారు కృష్ణకుమారి. ఇది తనంతట తానుగా తీసుకున్న నిర్ణయం. కానీ అప్పటివరకూ బిజీగా ఉన్న ఆమెకు ఏదో వెలితిగా ఉండేది. ఆ సమయంలోనే గార్డెనింగ్ అలవాటు చేసుకున్నారు. అయినప్పటికీ నిర్మాతలు వదలకుండా సినిమాలు చేయమని అడుగుతుండేవారు. ముఖ్యంగా దర్శకుడు ఏవీ సుబ్బారావు అయితే అక్కినేని నాగేశ్వరరావుతో తాను ప్లాన్ చేసిన సినిమాలో కృష్ణకుమారిని కథానాయికగా నటింపజేయాలనుకున్నారు. అయితే ఆమె ఇష్టపడకపోయినా అత్తగారు, భర్త ప్రోత్సాహంతో మళ్లీ నటించారు. పెళ్లయ్యాక ఆమె చేసిన సినిమా 'భార్యాభర్తలు'.

2003లో 'ఫూల్స్'లో అతిథి పాత్రలో కనిపించారు కృష్ణకుమారి. అంతకుముందు 'బంగారు భూమి' (1982) చేశారు. 1982 నుంచి 2003 వరకూ గ్యాప్ తీసుకున్నారు. చిత్రపరిశ్రమలో ఎంతో మార్పు వచ్చేసింది. అందుకే 'ఇక చాలు' అనుకుని, సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు. ప్రశాంతమైన జీవితం గడపాలనే ఆలోచనతో బెంగళూరులోని తమ ఐదెకరాల ఎస్టేట్‌లో ప్రశాంత జీవనం మొదలుపెట్టారు. అనుకున్నట్లుగానే జీవించారు. ఐదేళ్ల క్రితం ఆమె భర్త తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. కూతురు దీపికకు పెళ్లయ్యింది. ఆమెకు ఓ కొడుకు. మనవడితో ఎక్కువగా కాలక్షేపం చేసేవారు కృష్ణకుమారి.

కృష్ణకుమారిలో ఓ గంధర్వ కన్య ('పాతాళ భైరవి'), అల్లరి పిల్ల (పిచ్చి పుల్లయ్య), శ్రీకృష్ణుడి సతీమణి రుక్మిణి (వినాయక చవితి), గృహిణి (భార్యాభర్తలు), మధ్యతరగతి అమ్మాయి (చదువుకున్న అమ్మాయిలు), డాక్టర్ (డాక్టర్ చక్రవర్తి), శ్రీకృష్ణుడి తల్లి దేవకి (యశోద కృష్ణ)... ఇలా ఎన్నో పార్శ్వాలు. కృష్ణకుమారి ఏ పాత్ర చేసినా ఆ పాత్రకోసమే పుట్టినట్లుగా అనిపిస్తారు. చలన చిత్ర చరిత్రలో కృష్ణకుమారిది చెరగని పేజీ. భౌతికంగా ఆమె లేకపోవచ్చు కానీ వెండితెరపై ఆమె నటన మళ్లీ మళ్లీ ఆమెను తలచుకునేలా చేస్తుంది.

- డి.జి.భవాని

కృష్ణకుమారిని కాపాడిన ఎన్టీఆర్

'లక్షాధికారి' షూటింగ్ అప్పుడు కృష్ణకుమారికి పెద్ద ప్రాణాపాయం తప్పింది. ఎన్టీఆర్, కృష్ణకుమారిపై 'దాచాలంటే దాగదులే..' పాటను చిత్రీకరిస్తున్నారు. పాటలో భాగంగా ఒడ్డు నుంచి సముద్రం లోపలికి నడుచుకుంటూ వెళుతుందీ జంట. అప్పుడో పెద్ద అల వచ్చి, ఇద్దర్నీ లోపలికి లాగేసింది. భయంతో కృష్ణకుమారి నీళ్లు తాగేశారు. ఎన్టీఆర్ ఆమె చేయి వదిలి ఉంటే.. జరగరానిది జరిగేదేమో. కానీ ఆమె చెయ్యి పట్టుకుని ఒడ్డుకు చేర్చారు. ఆ సంఘటన తలచుకున్నప్పుడల్లా చాలా భయం వేసేదని ఓ సందర్భంలో కృష్ణకుమారి తెలిపారు.

గుర్రపు స్వారీ... పెద్ద రిస్క్

'బందిపోటు'లో ఎన్టీఆర్, కృష్ణకుమారిపై దర్శకుడు విఠలాచార్య 'వగలరాణివి నీవే..' పాట తీస్తున్నారు. చెట్టు మీద కూర్చుని పాడుతున్న ఎన్టీఆర్‌ని గుర్రం మీద వెళ్లి కృష్ణకుమారి పట్టుకోవాలి. అయితే ఆమెకు గుర్రపు స్వారీ తెలియదు. 'ఏం ఫర్వాలేదు. అది మంచి గుర్రం' అని విఠలాచార్య అనడంతో ధైర్యం చేసి ఎక్కారు. తీరా సీన్ తీస్తున్న సమయంలో గుర్రం వేగంగా పరిగెత్తడంతో కృష్ణకుమారికి ఏం పాలుపోలేదు. దాన్నే గట్టిగా పట్టుకుని కూర్చున్నారు. విఠలాచార్య వంటి పెద్ద దర్శకుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా తీయరు కదా. లొకేషన్‌కి కొద్ది దూరంలో నాలుగు మగ గుర్రాల్ని నిలబెట్టారట. వాటిని చూసి, కృష్ణకుమారి ఎక్కిన ఆడగుర్రం ఆగిందట. అలా పెద్ద ప్రమాదం తప్పిందని ఓ ఇంటర్వ్యూలో కృష్ణకుమారి తెలిపారు.


● కాంతారావుతో...

అమ్మ తీరని కోరిక అదే!

"అమ్మ మరణం మాకు తీరని లోటు. కానీ ఆమె సంపూర్ణమైన జీవితం గడిపినందుకు ఆనందంగా ఉంది" అన్నారు కృష్ణకుమారి ఏకైక కుమార్తె దీపిక. బెంగళూరులో భర్త విక్రమ్, తనయుడు పవన్‌తో ఉంటున్నారామె. తల్లి గురించి కొన్ని విశేషాలను దీపిక 'సాక్షి'తో పంచుకున్నారు.

● **మీ అమ్మగారి గురించి రెండు మాటలు..**
ఆవిడకి నేను ఒక్కగానొక్క కూతుర్ని. కానీ మా బంధువుల పిల్లలందరికీ అమ్మలానే వ్యవహరించేది. మనుషులను ప్రేమించే గుణం అమ్మకి ఎక్కువ.

● **మనవడితో ఆమె ఎలా ఉండేవారు?**
పవన్‌తో అమ్మ చాలా ఎటాచ్డ్‌గా ఉండేది. అమ్మ ఉంటున్న ఎస్టేట్‌కి మా ఇల్లు కొంచెం దూరం. వీలు చిక్కినప్పుడల్లా మేం వెళుతుంటాం.

● **మీ అమ్మగారు చేసిన సినిమాల్లో మీకు నచ్చినవి?**
'గురువుని మించిన శిష్యులు', 'గుడి గంటలు', 'భార్యాభర్తలు' అంటే చాలా ఇష్టం. అన్ని సినిమాల్లోనూ అమ్మ యాక్టింగ్ బాగుంటుంది. ఈ మూడు సినిమాలు నాకు స్పెషల్‌గా అనిపిస్తాయి.

● **మీ అమ్మగారి నుంచి మీకు వచ్చిన లక్షణం ఏదైనా?**
అమ్మ చాలా మొండిది. ఏదైనా చేయాలనుకుంటే అది చేయాల్సిందే. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కి తీసుకునేది కాదు. అయితే అమ్మ తీసుకున్న నిర్ణయాలు దాదాపు తప్పయ్యేవి కాదు. అమ్మ మొండితనం నాకు వచ్చింది.

● **మిమ్మల్ని హీరోయిన్‌గా చేయమని చెప్పలేదా?**
చేస్తే బాగుంటుంది అన్నది కానీ ఒత్తిడి చేయలేదు. చదువయ్యాక చూద్దామని నాన్న అనేవారు. బేసిక్‌గా నాకే ఇంట్రస్ట్ లేదు. అందుకే సినిమాల్లోకి రాలేదు.

● **కృష్ణకుమారిగారికి ఏ వంటలు ఇష్టం?**
బంగాళదుంప వేపుడంటే చాలా ఇష్టం. ఇంకా కారప్పొడులు ఇష్టంగా తినేది.

● **అమ్మ వంటలో మీకు నచ్చినది?**
బర్మీ బేల్ తయారు చేసేది. బేల్‌పురిలా అన్న మాట. బర్మా వాళ్లు చేస్తారు. టేస్టీగా చేసేది. చివరి సారిగా ఆమె బర్మీ బేల్ చేసింది రెండేళ్ల క్రితం.

● **సినిమాల్లో పట్టుచీరలు, నగల్లో కనిపించిన పాత్రలు చాలా.. విడిగా ఆమె అలా డ్రెస్ చేసుకునేవారా?**
చాలా ఇష్టం. చక్కగా చీర కట్టుకుని, నగలు పెట్టుకునేది. ఆరోగ్యం దెబ్బ తిన్నాక మానేసింది.

● **కృష్ణకుమారిగారికి తీరని కోరిక ఏదైనా?**
ఒకే ఒక్క కోరిక తీరకుండా వెళ్లిపోయింది. హిందీ సినిమా 'పద్మావత్' చూడాలనే కోరిక బాగా ఉండేది. ఆమెకు సినిమాలంటే ఇష్టం. తెలుగుతో పాటు హిందీ సినిమాలూ చూసేది. 'పద్మావత్' గురించి చాలాసార్లు చెప్పింది. అది మినహా అమ్మకు ఎలాంటి అసంతృప్తి లేదు.


● కుమార్తె దీపికతో...

ఆ రోజు ఆమె చిరాకుపడ్డారు

కృష్ణంరాజు తొలి కథానాయిక కృష్ణకుమారి. ఆమెతో కలిసి ఆయన నటించిన చిత్రం 'చిలకా గోరింక'. ఆ తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటించలేదు. తొలి హీరోయిన్ గురించి 'సాక్షి'తో కృష్ణంరాజు చెప్పిన విశేషాలు.

● **కృష్ణకుమారి కంటే మీరు దాదాపు పదేళ్లు చిన్న. ఆవిడ మీ ఫస్ట్ హీరోయిన్ అన్నప్పుడు ఎలా అనిపించింది?**
వయసులోనే కాదు.. హోదాలోనూ ఆమె ఎక్కువే. నేను 'చిలకా గోరింక' ఒప్పుకున్న సమయానికి ఆమె స్టార్ హీరోయిన్. నాకది ఫస్ట్ సినిమా. దర్శకుడు ప్రత్యగాత్మగారు కృష్ణకుమారిగారితో యాక్ట్ చేయాలన్నప్పుడు నాకేమీ అనిపించలేదు. పైగా ఆవిడ తానో పెద్ద స్టార్ అనే ఫీలింగ్‌ని ఎక్కడా బయటపెట్టలేదు. చాలా ఫ్రెండ్లీగా ఉండేవారు. కో-ఆపరేట్ చేసేవారు.

● **అంత పెద్ద స్టార్‌తో డ్యూయెట్స్ పాడటానికి ఏమైనా ఇబ్బందిపడ్డారా?**
కెమెరా ముందుకెళ్లాక నాకు పర్సనల్ లైఫ్ గుర్తుకు రాదు. ఆమెను ఓ కో-స్టార్‌లానే చూశాను. కృష్ణకుమారిగారు చాలా కూల్ నేచర్. అందుకేనేమో ఎప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదు.

● **అంటే.. ఆమె చిరాకుపడిన సందర్భం ఒక్కటి కూడా లేదా?**
ఒకే ఒక్కసారి చూశాను. మేమిద్దరం క్లోజ్‌గా ఉండే సీన్స్ తీసేటప్పుడు హైట్ మ్యాచ్ చేయడానికి ఆమెను పీట మీద నిలబడమన్నారు. ప్రత్యగాత్మగారు పీట తెప్పించాక 'కొంతమంది హీరోలు నా పక్కన పీట మీద నిలబడేవారు. ఇప్పుడు నేను నిలబడాలా?' అని చిరాకు పడ్డారు. యాక్చువల్‌గా కృష్ణకుమారిగారు మంచి ఎత్తే. కానీ నా హైట్‌కి మ్యాచ్ అవ్వడానికి పీట వేయాల్సి వచ్చింది.

● **ఫ్యామిలీ ఫంక్షన్స్‌కి పిలిచేవారా?**
అవును. నా ఫస్ట్ మూవీ 'చిలకా గోరింక' 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫంక్షన్ చేయాలనుకుంటున్నాను. ఆ ఫంక్షన్‌కి రావాలని ఆమెతో అన్నాను. 'రాకుండానా? తప్పకుండా వస్తాను' అన్నారు. కానీ సడన్‌గా ఇలా అయిపోయింది. మంచి నటి, మంచి వ్యక్తిని కోల్పోయాం.


● కృష్ణంరాజుతో ఓ వేడుకలో

కృష్ణకుమారి హిట్స్

వలదన్న వినదీ మనసు కలనైన నిన్నే తలచు

'ఏమో ఏమో ఇది నాకేమో ఏమో అయినది'.... 'అగ్గిపిడుగు'లో ఎన్టీఆర్ పక్కన కృష్ణకుమారి పాడుతూ ఉంటే ఆ జంట బాగుందనిపిస్తుంది. కురులు విరబోసుకుని, ముడి దగ్గర నక్షత్రం లాంటి ఆభరణం పెట్టుకుని ఆమె పాడుతుంటే ఏ మగాడికైనా 'కురులలో- నీ కురులలో- నా కోరికలూగినవి' అనే అనాలపిస్తుంది. ఈ పాట ఎంత హిట్టంటే చాలా ఆర్కెస్ట్రాలు నేటికీ ఆ పాట పాడుతూనే ఉంటాయి.

ఎన్టీఆర్‌కు కృష్ణకుమారి అంటే ఆకర్షణ. అందుకే గుర్రం ఎక్కి వెతుక్కుంటూ **'వగలరాణివి నీవే'** అని 'బందిపోటు'లో పాడుకున్నాడు. ఆమెకు దూరంగా ఉండటం వల్ల **'ఊహలు గుసగుసలాడే నా హృదయము ఊగిసలాడే'** అని విరహం అనుభవించాడు. కృష్ణకుమారి మాత్రం తక్కువా? ఆమెకు కూడా ఎన్టీఆర్ అంటే చాలా అభిమానం. అందుకే **'కోవెల ఎరుగని దేవుడు కలడని'** అంటూ 'తిక్క శంకరయ్య'లో అతడిని దేవుడిలా ఆరాధించింది. అతను పక్కన ఉన్నప్పుడు **'మనసు పాడింది సన్నాయి పాట'** అంటూ 'పుణ్యవతి'లో మురిసి పోయింది. **'మబ్బులో ఏముంది నా మనసులో ఏముంది'** తెలుసుకోమంటూ 'లక్షాధికారి'లో తొందర పెట్టింది.


● ఎన్టీఆర్‌తో...


● ఏయన్నార్‌తో...

ఎన్టీఆర్‌తో 'పల్లెటూరి పిల్ల'తో మొదలైన కృష్ణకుమారి తెర అనుబంధం దాదాపు 25 సినిమాల వరకూ సాగింది.

ఇక అక్కినేని, కృష్ణకుమారిది రొమాంటిక్ పెయిర్. ఆమెను చూసి అతడు **'ఈ మౌనం ఈ బిడియం ఇదేనా ఇదేనా చెలియ కానుక'** అని 'డాక్టర్ చక్రవర్తి'లో సాగుతున్న ట్రైన్‌లో కిటికీ పక్కన చేరి పాడుకోవడం మనమెలా మర్చిపోగలం? **'నువ్వంటే నాకెందుకో అంత ఇది'** అని ఏయన్నార్ 'అంతస్తులు' సినిమాలో ఆమె కోసం పడి చచ్చినట్టుగా మరెవరి కోసమూ పడి చావలేదు. **'చెలికాడు నిన్నే రమ్మని పిలువ చేర రావేలా'** అని 'కులగోత్రాలు'లో ప్రాధేయ పడినట్టుగా ఎవ్వరినీ ప్రాధేయపడలేదు. ఏయన్నార్ కోమల మనస్కుడు. సున్నిత హృదయుడు. అతడిని నిరాకరించడం తగదు. అందుకే ఆమె కూడా అతడి ప్రేమను అర్థం చేసుకుంది. **'నా కంటి పాపలో నిలిచిపోరా'** అని 'వాగ్దానం'లో అతడిని కోరింది. **'నీతోటే ఉంటాను శేషగిరి బావా నీ మాటే వింటాను మాటకారి బావా'** అంటూ 'జమిందార్'లో మాట ఇచ్చింది. **'పులకించని మది పులకించెను'** అంటూ 'పెళ్లికానుక'లో ఫైనల్‌గా అతడి ప్రేమను యాక్సెప్ట్ చేసింది.

తెలుగు సూపర్ స్టార్స్ ఎన్టీఆర్, ఏయన్నార్ ఇద్దరూ కృష్ణకుమారితో హిట్ సినిమాలు చేశారు. ఆమె ప్రమేయం పెర్ఫార్మెన్స్ కోసం కంటే గ్లామర్ కోసమే ఎక్కువ అవసరమని ఇండస్ట్రీ భావించింది. పాటలలో ఆ రోజులలో కృష్ణకుమారి చాలా హుషారుగా కనిపించేది. తెల్లచీర కట్టుకుని ఆమె చేసిన పాటలు జనాన్ని ఉడుకులాడించాయి. **'తెల్లచీర కట్టుకున్నది ఎవరి కోసము'** పాటలో ఏయన్నార్‌తో, **'దేవతయే దిగి వచ్చి మనషులలో కలిసిన కథ'** పాటలో ఎన్టీఆర్‌తో ఆమె తెల్ల చీరలో కనిపిస్తుంది. కృష్ణకుమారి డ్యాన్సింగ్ టాలెంట్ చూడాలంటే 'పునర్జన్మ'లోని **'దీపాలు వెలిగె పరదాలు తొలిగె'** పాటలో చూడాలి. అంత పొడగరి వెన్నును విల్లులా వంచి నర్తిస్తుంటే కళ్లార్పబుద్ధి కాదు. కృష్ణకుమారి పాటలలో కూడా కొన్ని తమాషాలు జరిగాయి. ఒకసారి ఒక పాట షూటింగ్ ఉందనగా కృష్ణకుమారి జ్ఞానదంతం వాచి దవడ పొంగిపోయింది. షూటింగ్ తప్పించుకోవడానికి వీల్లేదు. అవతల రిలీజ్ డేట్ పెట్టుకున్నారు. ఇక ఆమె ఆలోచన చేసి చెంపల మీదకు వచ్చేలా స్కార్ఫ్ కట్టుకుని పాట పాడింది. జనం అది కొత్త ఫ్యాషన్ అనుకున్నారు. మెచ్చుకున్నారు. ఆ పాట 'చదువుకున్న అమ్మాయిలు'లోని- **'కిలకిల నవ్వులు చిలికిన'**... ఆ తర్వాత ఆమె కాంతారావుతో కూడా చాలా డ్యూయెట్స్ పాడింది. 'ఇద్దరు మొనగాళ్లు', 'గురువును మించిన శిష్యుడు', 'పేదరాశి పెద్దమ్మ' లాంటి చాలా సినిమాల్లో వాళ్లిద్దరి పాటలు ఉన్నాయి. అయితే కృష్ణకుమారి పొడగరి. 'చిలకా గోరింక'తో కృష్ణంరాజు వచ్చేంతవరకూ ఆమెకు ఈడూ జోడూలాంటి హీరో దొరకలేదనే చెప్పాలి. తన కాలంలో సావిత్రి, జమున సూపర్ స్టార్స్‌గా చెలామణి అవుతున్నా తన మర్యాదకరమైన వాటా తాను తీసుకోగలిగింది కృష్ణకుమారి. అన్నట్టు సావిత్రిని టీజ్ చేస్తూ అక్కినేనితో కలిసి 'అభిమానం'లో ఆమె పాడిన **'ఓహో బస్తీ దొరసాని ఆహా ముస్తాబయ్యింది'**... కూడా చాలా పెద్ద హిట్టే. సావిత్రితో కలిసి కృష్ణకుమారి 'వరకట్నం'లోనూ నటించింది. ఈ సీజనల్ హిట్స్ మధ్యలోనే కృష్ణకుమారిని తలుచుకోవడానికి ఇంకో మంచి పాట కూడా ఉంది. చాలా ఆహ్లాదకరమైన పాట. ఏమిటో గుర్తుందా? 'కానిస్టేబుల్ కూతురు'లోని **'చిగురాకుల ఊయలలో ఇల మరచిన ఓ చిలుకా'**... పట్టీల పాదాలతో పరిగెడుతూ కృష్ణకుమారి ఆ అరటి పాదుల పెరడులో పాడుతుంటే చూడముచ్చటగా ఉంటుంది. ఆ తోటలో పాదులు తీస్తూ అన్నగా నటిస్తున్న జగ్గయ్య పీబీ శ్రీనివాస్ గొంతులో 'మా చెల్లెలు బాల సుమా ఏమెరుగని బేల సుమా' అనడం ఎంతో ముచ్చటగా అనిపిస్తుంది.

కాలానిది అనంతమైన పల్లవి. అంతులేని చరణం. నడుమ దొరికిన, ఇవ్వబడిన సమయంలో కృష్ణకుమారి తన పాట తాను అందంగా పాడి ముగించింది.

ఆ తెర వెలుగుకు సెలవు.

- కె

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం, 25-1-2018

క్యాన్సర్‌పై చిరు పిడికిలి

సిరిధాన్యాలను ముఖ్య ఆహారంగా తీసుకుంటూ... కషాయాలు తాగితే కేన్సర్‌ను జయించవచ్చు

ఆహారం, జీవనశైలిలో పాశ్చాత్య అంధానుకరణ మారితే 6 నెలల నుంచి రెండేళ్లలో పూర్తి ఆరోగ్యవంతులు కావచ్చు

మైసూరుకు చెందిన స్వతంత్ర ఆహార, అటవీ కృషి శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి అనుభవాల సారమిది...





ఎవరీ డా.ఖాదర్‌వలి?

కడప జిల్లా ప్రొద్దుటూరులో జన్మించిన డాక్టర్ ఖాదర్ వలి (60) సిరిధాన్యాల పునరుద్ధరణకు 20 ఏళ్లుగా శ్రమిస్తున్నారు. మైసూరులో ఎమ్మెస్సీ (ఎడ్యుకేషన్) చదివిన తర్వాత బెంగళూరులో స్టెరాయిడ్స్‌పై పీహెచ్‌డీ చేశారు. సహ విద్యార్థిని ఉషను ప్రేమించి పెళ్లాడారు. అమెరికా వెళ్లి బీవెర్టాన్ ఒరెగాన్‌లో పర్యావరణ శాస్త్రంపై పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా ఉన్నారు. ఏజెంట్ ఆరెంజ్, డయాక్సిన్లు వంటి అత్యంత విషతుల్య రసాయనాలను నిర్వీర్యం చేయటంపై పరిశోధన చేశారు. ఆహారం వాణిజ్యకరించబడుతున్న నేపథ్యంలో తాను పరాయి దేశంలో ఉద్యోగం చేయటం కన్నా స్వదేశంలో ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయటమే జీవితానికి అర్థవంతంగా ఉంటుందని భావించి 1997లో భారత్‌కు తిరిగి వచ్చి మైసూరులో స్థిరపడ్డారు. అంతరించిపోతున్న 5 రకాల చిరుధాన్యాల పునరుద్ధరణకు కృషి చేశారు. వీటిని వాడే క్రమంలో ప్రతి ఒక్క చిరుధాన్యానికి ఉన్న ఔషధ గుణాల వల్ల భయంకరమైన జబ్బులు సైతం తగ్గుతున్నాయని కనుగొన్నారు. అందుకే వీటికి సిరిధాన్యాలని పేరు పెట్టారు. వీటిని సహజ పద్ధతుల్లో సాగు చేయడానికి 'కాడు కృషి' అనే విధానాన్ని ఆవిష్కరించారు. తన వద్దకు వచ్చే రోగులకు సిరిధాన్యాలు, కషాయాలతోను.. మరీ అవసరమైనప్పుడు హోమియో మందులనూ అందిస్తున్నారు. వరి బియ్యం, గోధుమలు, పాలు, మాంసాహారం, వేళా పాళాలేని ఆహార విహారాలు, జన్యుమార్పిడి పంటలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపుమందులు పర్యావరణాన్ని, ఆహారాన్నీ విషతుల్యంగా మార్చి ప్రాణాంతక వ్యాధులు అత్యంత వేగంగా ప్రబలడానికి కారణభూతమవుతున్నాయని ఆయన భావిస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, మలబద్ధకం, పైల్స్, గ్రాంగ్రీను, ట్రైగ్లిజరైడ్స్, పీసీఓడీ, అతి తక్కువ వీర్యకణాలు, చర్మవ్యాధులు, మూత్రపిండాలు, థైరాయిడ్ సంబంధిత అనారోగ్యాలతోపాటు మెదడు సంబంధమైన, రక్త సంబంధమైన వంటి జబ్బులేవీ లేకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని సిరిధాన్యాలు అందిస్తాయని రుజువైందని తెలియజెబుతున్నారు.



కషాయం.. ఓ ఆరోగ్య పానీయం!

కషాయాలను మొక్కల ఆకులు, రెమ్మలు, వేళ్లతో తయారు చేసుకుంటుంటాం. నాలుగైదు ఆకులను లేదా అవసరమైనన్ని రెమ్మలు లేదా వేరు ముక్కలను తీసుకోవాలి. వాటిని 150–200 ఎం.ఎల్. నీటిలో వేసి 3–4 నిమిషాలపాటు మరగబెట్టాలి. ఆ కషాయాన్ని వడకట్టి తాగాలి. వేడిగా తాగొచ్చు లేదా చల్లారనిచ్చి తాగొచ్చు. అయితే, విధిగా పరగడుపునే తాగాలి! అంతేకాదు.. రాగి పాత్రలోని నీటితో మాత్రమే కషాయం కాయడానికి వాడాలి!

కేన్సర్ రోగులకు రోజూ రెండు రకాల కషాయాలు..

సాధారణంగా ఏ రకమైన కేన్సర్‌తో బాధపడే వారైనా సరే.. ప్రతి రోజూ రెండు రకాల కషాయాలు తాగాలి. ఉదయం, రాత్రి ఆహారానికి ముందు ఒక కషాయం తాగాలి. మధ్యాహ్న భోజనానికి ముందు మరో రకం కషాయం తాగాలి. ఈ కషాయాలను 3–4 నెలల పాటు క్రమం తప్పకుండా, విధిగా తాగాలి. ఆ తర్వాత కూడా కొనసాగించవచ్చు. అయితే, ఇదే వరుస పాటించాలన్న నియమం అవసరం లేదు. ఉదయం, రాత్రి తాగే కషాయాలు 3 రకాలు. మధ్యాహ్నం తాగే కషాయాలు 2 రకాలు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఆహారం తీసుకోవడానికి ముందు, వారానికి ఒక రకం కషాయం చొప్పున 3 రకాల కషాయాలను తాగాలి. ఒక వారం పారిజాతం ఆకుల కషాయం, రెండో వారం రావి ఆకుల కషాయం, మూడో వారం జామ ఆకుల కషాయాలను ఒకదాని తర్వాత మరొకటి తాగాలి. ఈ 3 రకాల కషాయాలతోపాటు.. కేన్సర్ రకాన్ని బట్టి ఈ కింద పేర్కొన్న విధంగా.. రోజూ మధ్యాహ్నం ఆహారం తీసుకోవడానికి ముందు, మరో రెండు రకాల కషాయాలను, వారానికి ఒకటి చొప్పున తాగాలి. సిరిధాన్యాలను తినటం ద్వారా ఆధునిక కాలపు వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చు. సిరిధాన్యాల్లో పుష్కలంగా ఉన్న పీచుపదార్థమే మన ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. దీనికితోడు ఆరోగ్యదాయకమైన జీవనశైలిని అలవరుచుకోవాలి. పొగతాగడం, మద్యం తాగడం తక్షణం ఆపేయాలి.

'మన ఆహారమే మన ఔషధం కావాలి'

ఈ మాట హిప్పొక్రేట్స్ అనే మహానుభావుడు క్రీస్తు పూర్వమే చెప్పారు. సాంకేతికంగా సమాజం ఎంత 'అభివృద్ధి' సాధించినా ఇప్పటికీ ఈ భావనే మానవాళి అంతటికీ తలమానికం కావాల్సి ఉంది. ఆహారంలో పెచ్చుమీరిన రసాయనాల అవశేషాలు, పర్యావరణ కాలుష్యం, పాశ్చాత్య జీవనశైలి అంధానుకరణ... తదితర కారణాల నేపథ్యంలో ఇటీవల సంవత్సరాల్లో కేన్సర్, మధుమేహం ఆందోళనకరంగా వ్యాపిస్తున్నాయి. అత్యాధునిక అల్లోపతి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ.. రోగుల దైనందిన జీవితాలు వ్యధాభరితంగా మారుతున్నాయి. కేన్సర్ బారిన పడే వారి సంఖ్యతోపాటు దీని వల్ల ప్రాణాలు కోల్పోతున్న రోగుల సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతూనే ఉంది.

ఈ దుస్థితి నుంచి బయటపడడానికి ఇంకేదైనా మెరుగైన దారి ఉందా??

నిస్సందేహంగా కేన్సర్‌ను జయించే మార్గం ఉందంటున్నారు స్వతంత్ర ఆహార, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి! సిరిధాన్యాలను ఆహారంగా తీసుకోవటం, కొన్ని రకాల కషాయాలను తాగటం, జీవనశైలిలో కచ్చితమైన మార్పులు చేసుకోవటం ద్వారా కేన్సర్‌ను విజయవంతంగా ఎదుర్కోవచ్చని డాక్టర్ ఖాదర్ చెబుతున్నారు. సిరిధాన్యాలు, కషాయాలు, హోమియో/ఆయుర్వేద మందుల ద్వారా రోగులు సాంత్వన పొందవచ్చని అనుభవపూర్వకంగా సూచిస్తున్నారు. తన వద్ద చికిత్స పొందిన, పొందుతున్న కేన్సర్ రోగుల జీవితాల్లో చీకట్లు తొలగి కొత్త ఆశలు చిగురిస్తున్నాయంటున్నారు. డా.ఖాదర్‌వలి అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...



నాలుగు నెలల క్రితం ఒక యువకుడు తన తల్లితో కలిసి నా దగ్గరకు వచ్చాడు. అతను బయోటెక్నాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదువుకున్నాడు. అతని తల్లి గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతోంది. ఆమెకు రేడియేషన్, కీమోథెరపీ ఇచ్చారు. ఆ చికిత్స తర్వాత ఆమె బక్కచిక్కి, బలహీనపడ్డారు. వైద్యులు ఇక చికిత్స చేయలేమని చేతులెత్తేశారు. ఆశలన్నీ ఆవిరైపోయిన తర్వాత చివరి ప్రయత్నంగా కుమారుడిని వెంటబెట్టుకొని ఆమె నా దగ్గరకు వచ్చారు. నేను వెంటనే ఆమె అనారోగ్యం పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నాను. ఆమెతో సుదీర్ఘంగా మాట్లాడిన తర్వాత.. పర్వాలేదు, మీరు క్రమంగా కోలుకుంటారని నేను ఆశాభావంతో చెప్పాను. ఇంతకుముందు వైద్యులు ఇచ్చిన మందులను కొనసాగిస్తూనే.. అరికె బియ్యం(Kodo Millet), సామ బియ్యం(Little Millet) వంటి సిరిధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని.. రావి ఆకులు, జామ ఆకులతో తయారు చేసిన కషాయాన్ని 3–4 నెలల పాటు తాగాలని సూచించాను. నేను చెప్పిన మాటలపై ఆమె కుమారుడికీ నమ్మకం కుదిరినట్లు అనిపించింది. తల్లి, కొడుకు ఇద్దరూ ఆశాభావంతోనే ఇంటికి తిరిగి వెళ్లారు.

అటువంటి రోగులు చాలా మంది నన్ను కలుసుకుంటూ ఉండటం మామూలే కాబట్టి ఆ తల్లి, కుమారుడి గురించి నేను అప్పట్లోనే మర్చిపోయాను. అయితే, రెండు రోజుల క్రితం వాళ్లిద్దరూ మళ్లీ నన్ను కలవడానికి వచ్చారు. నన్ను చూసీ చూడగానే కుమారుడు నాకు పాదాభివందనం చేశాడు. తల్లి ఆరోగ్యం కుదుటపడుతున్నట్లు అనిపించింది. నేను ఆహారంలో చెప్పిన మార్పులను ఆమె తు.చ. తప్పకుండా పాటించారు. నిజానికి వాళ్లు తమకు అంతకుముందు వైద్యం చేస్తున్న డాక్టర్ దగ్గరకు వెళ్లి నేను సూచించిన వైద్యాన్ని గురించి తెలియజేశారు. ఆయన వాళ్ల వైపు చూసి పిచ్చా.. వెర్రా.. అన్నట్లు హేళనగా నవ్వారట.

కేన్సర్ వంటి తీవ్ర వ్యాధులతో బాధపడే రోగులు నా దగ్గరకు చాలా మందే వస్తూ ఉంటారు లేదా ఫోన్ ద్వారా కూడా సంప్రదిస్తూ ఉంటారు. కానీ, నేనెప్పుడూ వారి కథలను రాసిపెట్టలేదు. ఇటువంటి వాళ్లందరికీ నేను సిరిధాన్యాలు + కషాయాలతో సులభమైన చికిత్సనే చేస్తున్నాను. ఈ చికిత్స చాలా మామూలు సంగతిగా అనిపిస్తున్నప్పటికీ ప్రభావశీలంగా పనిచేస్తున్నది. అందువల్ల, సిరిధాన్యాలు + కషాయాలతో కూడిన చికిత్స పద్ధతి ఆవశ్యకతను గురించి వివరంగా చెప్పుకోవటం అవసరం అనిపిస్తోంది.

కషాయాలను వాడటం అనేది మన ఇళ్లలో పూర్వం నుంచీ ఉన్నదే. ఎవరికి ఏ అనారోగ్యం కలిగినా బామ్మలు ఆయా లక్షణాలను బట్టి తగిన కషాయాలను సూచిస్తూ ఉంటారు. బామ్మలు సూచించే అటువంటి ఔషధాల గురించి నేను చాలా లోతుగా శాస్త్రీయ అధ్యయనాలు చేసి, నిర్ధారణకు వచ్చిన తర్వాత రోగులకు సూచిస్తున్నాను.

ఔషధ గుణాలున్న సిరిధాన్యాలు ఐదు రకాలు. కొర్ర (Foxtail Millet) బియ్యం, ఊద(Barnyard Millet) బియ్యం, అరిక(kodo Millet) బియ్యం, సామ(Littile Millet) బియ్యం, అండు కొర్ర(Browntop Millet) బియ్యం.

వ్యాధిని బట్టి, కేన్సర్ రకాన్ని బట్టి ఈ ఐదింటిలో ఎంపిక చేసిన రెండు రకాల చిరుధాన్యాలను తినాలి. వీటితో పాటు ఈ ఐదింటిలో ఇతర సిరిధాన్యాల బియ్యాన్ని కూడా తినవచ్చు.

కేన్సర్‌ను ఎదుర్కొనే క్రమంలో ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి నువ్వు లడ్డు తినాలి. లడ్డు తినటం వీలుకాకపోతే.. దోరగా ఇనుప పాత్రలో వేయించిన నువ్వులు అర చెంచాడు లేదా చెంచాడు, వారానికోసారి, తినాలి.

ఏయే కేన్సర్‌కు ఏయే చికిత్స?

శ్వాసకోశ కేన్సర్: సిరిధాన్యాలు: కొర్ర (Foxtail Millet) బియ్యంతో ఒక రోజు, సామ (littile Millet) బియ్యంతో మరో రోజు అన్నం వండుకొని తినాలి. ఆ రోజు 3 పూటలూ అదే రకం బియ్యం వండుకొని తినాలి. **కషాయాలు:** పారిజాతం (Nyctanthes arbor-tristis), రావి(Peeple), జామ(Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు ఒక వారం అల్లం (Ginger) కషాయం, మరో వారం పసుపు(Termeric) కషాయం తాగాలి.

ఎముకల కేన్సర్: సిరిధాన్యాలు: ఎముకల కేన్సర్ రోగులు అండు కొర్ర (Browntop Millet) బియ్యం ఒక రోజు, సామ (littile Millet) బియ్యం మరొక రోజు, అరిక (kodo millet) బియ్యం ఇంకో రోజు తినాలి. వీటిని అన్నంగా వండుకొని తినొచ్చు. లేదా గంజి చేసుకొని కూడా తాగొచ్చు. **కషాయాలు:** పారిజాతం (Nyctanthes arbor-tristis), రావి (Peeple), జామ (Guava) ఆకుల కషాయాలను (వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు మెంతి (Methi/ Fenugreek) ఆకులతో ఒక వారం, పుదీన(MINT) ఆకులతో ఒక వారం కషాయం చేసుకొని తాగాలి.

మెదడు కేన్సర్: సిరిధాన్యాలు: అరిక (Kodo millet) బియ్యం ఒక రోజు, సామ (Little millet) బియ్యం మరో రోజు, అండు కొర్ర (Browntop Millet) బియ్యం ఇంకో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం (Nyctanthes arbor-tristis), రావి (Peeple), జామ (Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు.. సదాప/ సదాపాకు (Ruta graveolens) (కన్నడలో నాగదాలి) ఆకులతో ఒక వారం, మరో వారం దాల్చిన చక్క(Cinnamon) కషాయం తాగాలి.

రక్త కేన్సర్: సిరిధాన్యాలు: అరిక (Kodo millet) బియ్యం ఒక రోజు, కొర్ర (Foxtail millet) బియ్యం మరో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం (Nyctanthes arbor-tristis), రావి (Peeple), జామ(Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు కరివేపాకుల(Curry leaves) కషాయం ఒక వారం, తమలపాకుల (Beetle leaves) కషాయం మరో వారం తాగాలి.

మూత్రాశయం/ప్రొస్టేట్ కేన్సర్: సిరిధాన్యాలు: ఊద(barnyard)బియ్యం ఒక రోజు, అరిక(Kodo Millet) బియ్యం మరో రోజు, అండు కొర్ర(Browntop Millet) బియ్యం మరో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం (Nyctanthes arbortristis), రావి(Peeple), జామ (Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు కొత్తిమీర (coriander) కషాయం ఒక వారం, అటిక మామిడి(పునర్నవ/Boerhavia Diffusa) ఆకుల కషాయం మరో వారం తాగాలి.

రొమ్ము కేన్సర్: సిరిధాన్యాలు: అండు కొర్ర (Browntop Millet) బియ్యం ఒక రోజు, అరిక (Kodo Millet) బియ్యం మరో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం (Nyctanthes arbor-tristis), రావి(Peeple), జామ(Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు కానుగ (NeemPongamia pinnata) ఆకుల కషాయం ఒక వారం, వేప (Neem) ఆకుల కషాయం మరో వారం వాడాలి.


నోటి కేన్సర్‌కు చికిత్స: సిరిధాన్యాలు: కొర్ర (Foxtail Millet) బియ్యం, సామ (little Millet) బియ్యం వండుకొని తినాలి. **కషాయాలు:** పారిజాతం(Nyctanthes arbor-tristis), రావి(Peeple), జామ (Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు ఒక వారం పుదీన(Mint) ఆకుల కషాయం, మరో వారం అల్లం(Ginger) కషాయం తాగాలి. నోటి కేన్సర్ రావడానికి ముఖ్య కారణం సిగరెట్, బీడీ, చుట్ట తాగడం లేదా ఏదో ఒక రూపంలో పొగాకు నమలడం. పొగాకును ఏ రూపంలోనూ వాడకూడదు. అంతేకాదు, మద్యం తాగకూడదు.

థైరాయిడ్/పాంక్రియాస్ కేన్సర్‌కు చికిత్స: సిరిధాన్యాలు: అరిక (Kodo Millet) బియ్యం ఒకరోజు, సామ (little Millet) బియ్యం మరో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం(Nyctanthes arbor-tristis), రావి(Peeple), జామ(Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు బంతిపూల(Marigold) కషాయం ఒక వారం, చింత చిగురు (tender leaves of Tamarind) కషాయం మరో వారం తాగాలి. చింత చిగురు ఏడాది పొడవునా దొరకదు. అటువంటప్పుడు మునగ చెట్టు పూల(Drumstick flowers)తో చేసిన కషాయం తాగాలి.

పొట్ట కేన్సర్‌కు చికిత్స: సిరిధాన్యాలు: అండు కొర్ర(Browntop Millet) బియ్యం ఒక రోజు, కొర్ర(Foxtail Millet) బియ్యం మరో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం(Nyctanthes arbor-tristis), రావి(Peeple), జామ(Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు మెంతి(Fenugreek) ఆకులతో చేసిన కషాయం ఒక వారం, అరటి బోదె(Banana stem) ముక్కలతో చేసిన కషాయం మరో వారం వాడాలి.

చర్మ కేన్సర్‌కు చికిత్స: అతి ప్రమాదకరమైన కేన్సర్లలో చర్మ కేన్సర్ ఒకటి. **సిరిధాన్యాలు:** అండు కొర్ర(Browntop Millet) బియ్యం ఒక రోజు, కొర్ర(Foxtail Millet) బియ్యం మరో రోజు తినాలి. **కషాయాలు:** పారిజాతం(Nyctanthes arbor-tristis), రావి(Peeple), జామ(Guava) ఆకుల కషాయాలను(వారానికి ఒకటి చొప్పున) ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగాలి. వాటితోపాటు.. మధ్యాహ్న భోజనానికి ముందు ఉల్లికాడల(Spring Onions) కషాయం ఒక వారం, కలబంద(Aloevera) కషాయం మరో వారం తాగాలి.





మన దేశంలో కేన్సర్ నిర్ధారణ రోజుకు **2,000** మంది

కేన్సర్ మరణాలు.. రోజుకు **1,500** మంది

కేన్సర్‌తో ఏటా చనిపోతున్న భారతీయులు: **5,56,400** మంది

2020 నాటికి పెరగనున్న కేన్సర్ రోగుల సంఖ్య **17.3** లక్షలు

రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయాలి. ఏదన్నా చేయండి చెమట పట్టేలా చేయాలి! వంటికి చెమట పట్టడం చాలా మందికి ఇష్టం లేక ఇటువంటి పనులు చేయటం లేదు. ఇది అసలు సరైనది కాదు. చెమట పట్టడం వల్ల దేహంలో నుంచి వ్యర్థాలను, కల్మషాలను బయటకు పంపటంతోపాటు.. మనం శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నామనడానికి నిదర్శనం కూడా.

గమనిక: ఈ వ్యాసంలో వ్యక్తపరచిన అభిప్రాయాలన్నీ స్వతంత్ర ఆహార, అటవీ వ్యవసాయ (కాడు కృషి) శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి (మైసూరు) వ్యక్తపరచినవి.



ఇంటర్వ్యూ

● కొర్రలు, అరికలు వంటి సిరిధాన్యాలు, కషాయాలతోనే మధుమేహం, కేన్సర్ వంటి జబ్బులను చాలా మందికి నయం చేస్తున్నారని విన్నాం.

మీరు విన్నది నిజమే. గత 20 ఏళ్ల నేను నమ్ముతున్న మార్గం ద్వారా మంచి ఫలితాలను సాధిస్తున్నాను.

అసలు మంచి ఆహారం తీసుకోవడమే సగం ఆరోగ్యాన్ని పొందడం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండండి అని దేవుడు వైవిధ్యమైన ఆహారాన్ని ప్రతి చోటా సృష్టించాడు. కానీ మనం బియ్యం, గోధుమలతోనే సరిపెట్టుకుంటూ సంక్షోభంలో పడిపోయాం. దీంట్లో నుంచి బయటపడాలంటే, ప్రకృతి వైపు నడవాలి. తినే ఆహారంలో మార్పు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్య స్థితిని పొందవచ్చు. సిరిధాన్యాల్లో మనుషులకు అసలైన ఔషధ గుణాలున్న ఆహారం. ఆ చైతన్యం నింపడానికే మైసూరులో 'కాడు కృషి'ని నెలకొల్పాం. గత 20 ఏళ్లుగా రైతులు, రోగులతో కలిసి పనిచేస్తున్నాం.

● కేన్సర్, మధుమేహం అనువంశికం అనే ప్రచారం ఉంది.

కేన్సర్, మధుమేహం.. వారసత్వంగా సంక్రమించేవి కాదు. తీసుకునే ఆహారం, జీవనశైలి సమస్యల వల్లనే అవి వస్తున్నాయి. ఎగ్జిమా, కొన్నిరకాల బుద్ధిమాంద్యాలు మాత్రమే అనువంశిక జబ్బులు. పూర్వం కేన్సర్, మధుమేహం ఎక్కడో ఒకరికి వచ్చేవి. ఇప్పుడు ఎటు చూసినా ఈ రోగులు కనిపిస్తున్నారు. ఆహారం మారిపోవటం వలనే.. వాణిజ్యకరణ చెందిన ఆహారం మనుషులను రోగగ్రస్తులుగా మార్చుతున్నది.

● అంటే విదేశీ ఆహారోత్పత్తుల్లే సమస్యా?

మనం విదేశీ ఆహారాన్ని తప్పుపట్టడం లేదు. వాళ్ల దేశంలో ఆ ఆహార పదార్థాలు మంచివే. అందు కొర్రలను అమెరికన్ మిల్లెట్ అంటారు. వాళ్లు పూర్వం తింటుండేవాళ్లు. గుమ్మడికాయలు కూడా తినేవాళ్లు. అవి తిన్నన్నాళ్లు వాళ్లకు గుండె జబ్బుల్లేవు. అటువంటి సహజమైన ఆ ఆహారాలను వదిలేసి, జన్యుమార్పిడి ఆహారాలు తింటున్న తర్వాత అక్కడా జబ్బులు పెరిగాయి. మనకు తెలిసినన్ని ధాన్యాలు వాళ్లకు తెలియవు. కొర్రలు మన దగ్గర 108 రకాలుండేవి. ఈ వైవిధ్యతను కాపాడుకునే జ్ఞానం వాళ్లకు లేదు. కొర్రలను ఇటాలియన్ మిల్లెట్ అంటారు. పూర్వం వాళ్లు తినేవాళ్లు. ఇప్పుడు విత్తనాలు కూడా లేకుండా నాశనం చేశారు. నేను 20 ఏళ్ల క్రితం అమెరికా నుంచి తిరిగి ఇక్కడకు వచ్చి సిరిధాన్యాల విత్తనాలు సేకరించి, రైతులతో సాగు చేయించకపోతే ఇవి కూడా అంతరించిపోయేవి.

● కేన్సర్, మధుమేహం వంటి జబ్బులను సిరిధాన్యాలు, కషాయాలు ఎలా తగ్గించగలుగుతున్నాయి.. ఇందులో శాస్త్రీయత ఏమిటి?



ప్రకృతి వైపు మరలండి..

పూజించండి.. ఆరాధించండి...

సిరిధాన్యాలు (కొర్రలు(Foxtail Millet), అండుకొర్రలు (Browntop Millet), సామలు(Little Millet), ఊదలు (Barnyard Millet), అరికలు(Kodo Millet)) ఔషధ గుణాలు కలిగిన, ప్రకృతి ప్రసాదించిన సహజమైన ఆహార ధాన్యాలు. కషాయాలు మన సంప్రదాయ జీవనంలో అంతర్భాగంగా పూర్వం నుంచీ ఉన్నవే. వీటి ద్వారా ఎవరైనా వారి వారి రోగ స్థితిగతులను బట్టి.. 6 నెలల నుంచి 2 ఏళ్లలో ఆరోగ్యవంతంగా మారవచ్చు. చాలా ఏళ్లుగా రకరకాల రోగాలతో బాధపడుతున్న వేలాది మంది అనుభవాల ద్వారా ఇది రూఢీ అయిన విషయం.

● చిరుధాన్యాలలో 5 రకాలను 'సిరిధాన్యాలు'గా మీరు పిలుస్తున్నారు. వీటికి ఆ ఔషధ గుణాలు ఎలా వచ్చాయి?

ఏదైనా ఒక ఆహారపదార్థం ఎంత ఆరోగ్యకరమైనది, ఎంత ఔషధగుణం కలిగినది అనేది చూడాలంటే.. అందులో పీచుపదార్థం (ఫైబర్) ఎంత ఉంది? పిండిపదార్థం (కార్బోహైడ్రేట్లు) ఎంత ఉంది? అనే విషయాలు చూడాలి. వరి బియ్యంలో పీచు 0.2 శాతం. పిండిపదార్థం 79 శాతం. అంటే వీటి నిష్పత్తి 385. ముడిబియ్యం తిన్నా ఈ నిష్పత్తిలో పెద్దగా తేడా ఉండదు. 5 రకాల సిరిధాన్యాల్లో పీచు 8 నుంచి 12.5 శాతం వరకు.. పిండి పదార్థం 60 – 69 శాతం వరకు ఉంది. వీటి నిష్పత్తి 5.5 నుంచి 8.8 మధ్యలో ఉంటుంది. ఇది 10 కన్నా తక్కువగా ఉంటే రోగాలను సైతం తగ్గించే ఔషధ శక్తిగల ఆహారంగా భావించాలి. వీటిని తిన్న తర్వాత గ్లూకోజ్‌ను 6–8 గంటల్లో నెమ్మదిగా సమతుల్యంగా రక్తంలోకి విడుదల చేస్తాయి. అవసరానికి మించి గ్లూకోజ్ రక్తంలోకి విడుదల చేయకపోవడం, అనేక సూక్ష్మపోషకాలు, ప్రొటీన్లు కలిగి ఉండటం వీటి విశిష్టత. సిరిధాన్యాలను తిన్న వారికి వ్యాధి తీవ్రతను బట్టి.. మధుమేహం, కేన్సర్, ఊబకాయం వంటి మొండి జబ్బులు కూడా 6 నెలల నుంచి 2 ఏళ్లలోగా వాటంతట అవే తగ్గిపోతాయి. సిరిధాన్యాలు పోషకాలను పుష్కలంగా అందించడమే కాకుండా దేహంలో నుంచి రోగకారకాలను తొలగించి శుద్ధి చేస్తాయి. సిరిధాన్యాల్లో పీచు ఎక్కువ కాబట్టి కనీసం 2 గంటలు నానబెట్టి వండుకొని తినాలి. జొన్నలు, రాగులు, సజ్జలకు తటస్థ ధాన్యాలని పేరు. వీటిల్లో పీచు శాతం 4–6 శాతం. తిన్న 2 గంటల్లోనే గ్లూకోజ్ రక్తంలో కలిసిపోతుంది. అందువల్ల ఆరోగ్యసిరినిచ్చే సిరిధాన్యాలే నిజమైన, సహజమైన ఆహారం.

● డాక్టర్లు ఇచ్చిన మందులు మామూలుగానే వాడుకోవచ్చా..?

వాడుకోవచ్చు. అయితే, ఇక్కడ ఒక మినహాయింపు ఉంది. అల్లోపతి వైద్యవిధానాన్ని నేను ప్రోత్సహించను. ఆయుర్వేదం, యునాని, హోమియో పద్ధతుల్లో ఏ రోగానికి చికిత్స పొందుతున్న వారైనా ఆయా మందులు వాడుకుంటూనే ఆహారంలోను, జీవనశైలిలోను మార్పు చేసుకుంటే ఆరోగ్యవంతులు కావచ్చు.




ప్రశ్నలు-జవాబులు

డాక్టర్ ఖాదర్‌వలి ఈ కథనంలో వ్యక్తపరచిన అభిప్రాయాలపై ప్రశ్నలను పాఠకులు 'ఎడిటర్ (సిరిధాన్యాలతో చికిత్స), సాక్షి దినపత్రిక, సాక్షి టవర్స్, రోడ్డు నంబర్ -1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034' చిరునామాకు పంపవచ్చు. ఆ ప్రశ్నలకు డా. ఖాదర్ ఇచ్చే జవాబులను 'సాక్షి'లో ప్రచురిస్తాం.

- ఎడిటర్

సినిమా
సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం
25-1-2018

మోత మోగిపోద్ది


రామ్‌చరణ్

అందరికీ సౌండ్ వినపడుతుంది. కానీ నాకు మాత్రం కనపడుతుందండి అంటున్నాడు చిట్టిబాబు. అదేనండీ.. తనకు వినికిడి లోపం ఉన్న విషయాన్ని స్టైలిష్‌గా చెబుతున్నాడు. అంతేకాదండోయ్.. ఆ ఊరికి చిట్టిబాబే ఇంజనీర్. అందుకే అందరూ చిట్టిబాబును సౌండ్ ఇంజనీర్ అని ఆప్యాయంగా పిలుస్తారు. ఇదంతా ఓకే కానీ.. చిట్టిబాబుకు సౌండ్ వినిపించకపోయినా లిప్ మూమెంట్‌లో తేడా కనిపించిందో అంతే.. రీసౌండ్ మోత మోగిపోతుంది. అది ఏ రేంజ్‌లో అనేది తెరపై చూడండి అంటున్నారు 'రంగస్థలం' చిత్రబృందం. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మిస్తున్న చిత్రం 'రంగస్థలం'. సమంత కథానాయిక. మార్చి 30న ప్రేక్షకుల ముందుకు రానున్న 'రంగస్థలం' టీజర్‌ను బుధవారం సాయంత్రం రిలీజ్ చేశారు. ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాశ్‌రాజ్, అనసూయ కీలకపాత్రలు చేస్తున్నారు. ''యూనిక్ క్యారెక్టరైజేషన్‌ను తెరకెక్కిస్తున్న దర్శకుడు సుకుమార్‌కి థ్యాంక్స్. షూటింగ్‌లో ప్రతి సీన్‌ను ఎంజాయ్ చేస్తున్నాం'' అని హీరో రామ్‌చరణ్ టీజర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. టీజర్‌లో రామ్‌చరణ్ యాక్టింగ్ అద్భుతంగా ఉందని కొందరు సినీ ప్రముఖులు పేర్కొన్నారు. గోదావరి యాసలో రామ్‌చరణ్ చెప్పిన డైలాగ్స్ సూపర్‌గా ఉన్నాయని ప్రేక్షకులు అంటున్నారు. టీజర్ రిలీజైన ఆరు గంటల్లోపు 40 లక్షలు డిజిటల్ వ్యూస్ వచ్చాయని చిత్రబృందం పేర్కొంది. ప్రస్తుతం రాజమండ్రిలో ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది.

టచ్ చేస్తే...


రాశీ ఖన్నా, రవితేజ

'రాజా ది గ్రేట్' సినిమా హిట్‌తో మాంచి ఊపు మీదున్నారు రవితేజ. అదే స్పీడ్‌తో విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో 'టచ్ చేసి చూడు' సినిమాని పూర్తి చేశారాయన. ఇందులో రాశీఖన్నా, సీరత్ కపూర్ కథానాయికలు. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. ఫిబ్రవరి 2న సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు బుజ్జి, వంశీ మాట్లాడుతూ– ''మా చిరకాల మిత్రుడు రవితేజతో 'టచ్ చేసి చూడు' సినిమా నిర్మించినందుకు చాలా ఆనందంగా ఉంది. రవి ఇమేజ్‌కి తగ్గట్టుగా ప్రముఖ రచయిత వక్కంతం వంశీ అద్భుతమైన కథ అందించారు. ఇటీవల సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన పాటలకు, టీజర్‌కు అనూహ్య స్పందన వస్తోంది. మా చిత్రంలో రవితేజ చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారని అందరూ ప్రశంసిస్తున్నారు. సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. ఈ వారంలో ప్రీ–రిలీజ్ వేడుక ఘనంగా నిర్వహిస్తాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా తప్పకుండా నచ్చుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జామ్ 8, కెమెరా: ఛోటా కె.నాయుడు.

నాన్నగారి కోరిక నెరవేరింది

- వినాయక్


లావణ్యా త్రిపాఠి, సాయిధరమ్ తేజ్, వీవీ వినాయక్, సి. కల్యాణ్

''మా నాన్నగారు ఎప్పుడూ చెప్పేవారు. సి.కల్యాణ్‌గారి సంస్థలో ఓ సినిమా చేయమని. 'ఇంటిలిజెంట్' చిత్రంతో మా నాన్నగారి కోరిక నెరవేరింది. కల్యాణ్‌గారు నిర్మాతలా కాకుండా మా అన్నయ్యలాగా అనిపించారు. సెట్లో ఇద్దరు అన్నదమ్ములం ఉన్నట్టు అనిపించింది'' అని దర్శకుడు వీవీ వినాయక్ అన్నారు. సాయిధరమ్ తేజ్, లావణ్యా త్రిపాఠి జంటగా వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' ఫిబ్రవరి 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినాయక్ మాట్లాడుతూ– ''కృష్ణ' సినిమాలాగా ఈ చిత్రంలోనూ అన్ని అంశాలుంటాయి. తేజ్ బాగా చేశాడు. తను ఎంత ఎదిగినా అన్నయ్యలాగా (చిరంజీవి) ఇలాగే ఉండాలి. 'కొండవీటి దొంగ' సినిమాలోని 'చమక్కు చమక్కు' పాటను రీమిక్స్ చేశాం'' అన్నారు. ''మా సినిమా ఏ చిత్రానికీ పోటీ కాదు. మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'ఇంటిలిజెంట్' కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. సినిమా చూశా. చాలా బాగా నచ్చింది'' అన్నారు సి.కల్యాణ్. ''మావయ్యతో 'ఖైదీ నంబర్ 150' సినిమా తర్వాత వినాయక్‌గారు నాతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. అనుకున్న టైమ్‌కి పూర్తి చేశాం. డబ్బింగ్‌లో కొన్ని సీన్లు చూసి ఇవి చేసింది నేనేనా? అని షాక్ అయ్యాను. మా సినిమాతో పాటు వస్తున్న వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ' సినిమా కూడా హిట్ కావాలి'' అన్నారు సాయిధరమ్ తేజ్. లావణ్యా త్రిపాఠి, నటుడు సప్తగిరి, కథ, మాటల రచయిత శివ ఆకుల తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం: తమన్, సహనిర్మాతలు: సి.వి.రావు, నాగరాజ పత్సా.

ఆమె లేకపోతే భాగమతి లేదు


సమంత

"భాగమతి' కథను 2012లో యూవీ క్రియేషన్స్ వారికి చెప్పాను. తర్వాత ప్రభాస్‌కి వినిపించాను. ఆ తర్వాత అనుష్కకి చెప్పా. అందరికీ కథ నచ్చడంతో చేద్దామని డిసైడ్ అయ్యాం. అలా ఈ ప్రాజెక్ట్ కుదిరింది" అని దర్శకుడు జి.అశోక్ అన్నారు. అనుష్క ప్రధాన పాత్రలో అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన 'భాగమతి' రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశోక్ మీడియాతో పలు విశేషాలు పంచుకున్నారు.


■ ఇదొక యూనివర్శల్ సబ్జెక్ట్. ఏ నేపథ్యానికైనా సరిపోతుంది. కోలీవుడ్.. మాలీవుడ్.. బాలీవుడ్... ఇలా ఏ ఇండస్ట్రీలో చేసినా హిట్టవుతుంది. ఇందులో కథ ప్రతి చోటా జరిగేదే.. అందరికీ పరిచయమైనదే.

■ 'బాహుబలి' మొదటి పార్ట్ షూటింగ్‌కు వెళ్లకముందే అనుష్క 'భాగమతి' సినిమా చేసేందుకు ఒప్పుకున్నారు. అయితే.. 'బాహుబలి' కమిట్మెంట్ వల్ల చాలా రోజులు ఆగాల్సి వచ్చింది. మధ్యలో రెండుసార్లు 'భాగమతి' మొదలుపెడదామని ప్రయత్నించినా కుదరలేదు.

■ 'భాగమతి' పాత్రన్ క్యారీ చేయాలంటే ఒక స్టేచర్ ఉండాలి. ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉండాలి. అవి రెండూ అనుష్కలో కనిపించాయి. అందుకే.. ఆమె తప్ప ఈ కథకి ఎవరూ న్యాయం చేయలేరనే ఇన్నేళ్లు ఆగాను. ఆమె లేకపోతే ఈ ప్రాజెక్ట్ లేదు. ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు అనుష్క. ఎడమ చేతి భుజానికైన గాయం బాధపెడుతున్నా, డస్ట్ ఎలర్జీ ఉన్నా లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు.

■ ఇది లేడీ ఓరియంటెడ్ సినిమా కాదు. స్క్రీన్ ప్లే బేస్డ్ మూవీ. ఈ సినిమాకు అదే బలం. ఈ చిత్రంలోని బంగ్లా సెట్ కూడా కథలో ఒక క్యారెక్టర్. కథ దాని చుట్టూ తిరుగుతుంది. తొలుత నార్మల్‌గా వేద్దామనుకున్నాం. అది సరిపోదని భారీగా వేశాం. 75 శాతం సినిమా కోట సెట్‌లోనే జరుగుతుంది.

■ ప్రస్తుతానికి నా దృష్టంతా 'భాగమతి' పైనే ఉంది. అందుకే ఇంకా కొత్త ప్రాజెక్టులేవీ అనుకోలేదు. 'భాగమతి' విడుదల తర్వాత ప్రమోషన్స్‌లో పాల్గొనాలి. అన్నీ పూర్తయ్యాక తర్వాతి సినిమా గురించి ఆలోచిస్తా.


అశోక్

యూ టర్న్‌కు రెడీ

అదో ప్లే ఓవర్. అక్కడ ఎవరైతే డివైడర్స్‌ని తొలగించి మరీ యూ టర్న్ తీసుకుంటారో వాళ్లు అవుట్. గేమ్‌లో నుంచి కాదు లైఫ్‌లో నుంచి. కాపాడాలని చూసినా, తప్పించుకోవాలని ట్రై చేసినా ఆ ట్రయల్స్ అన్నీ వేస్ట్. డెత్ బెల్ మోగడం ఖాయం. ఎందుకలా? ఈ మిస్టరీ ఏంటీ? అన్న ప్రశ్నలకు.. రెండేళ్ల క్రితం కన్నడంలో వచ్చిన 'యూ టర్న్' చిత్రాన్ని చూసినవారికి సమాధానాలు తెలిసే ఉంటాయి. శ్రద్ధా శ్రీనాథ్, రాధిక చేతన్, దిలీప్ రాజ్ ముఖ్య తారలుగా పవన్ కుమార్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ఇది. ఈ సినిమాను ఇప్పుడు తెలుగు, తమిళ భాషల్లో రీమేక్ చేయనున్నారు. సమంత లీడ్ రోల్‌లో నటిస్తారు. ''పవన్‌కుమార్ దర్శకత్వంలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ తమిళ, తెలుగు భాషల్లో 'యూ టర్న్' సినిమాను నిర్మించనుంది. వచ్చే నెలలో షూటింగ్ స్టార్ట్ చేస్తాం'' అని పేర్కొన్నారు సమంత. ఆమె తెలుగులో నటిస్తున్న 'రంగస్థలం, మహానటి' చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే.

రెండేళ్లలో తెలుగు డబ్బింగ్ చెబుతా

"నా పాత్ర పేరు నిత్య. యోగా టీచర్‌ని. మంజుల గారు నన్ను ఆడిషన్ ద్వారా ఎంపిక చేశారు. పైగా నిత్య పాత్ర నా వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటుంది. అందుకే నటించేందుకు ఒప్పుకున్నా" అని కథానాయిక అమైరా దస్తూర్ అన్నారు. సందీప్‌కిషన్, అమైరా దస్తూర్ జంటగా మంజుల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మనసుకు నచ్చింది'. పి.కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా అమైరా పలు విశేషాలు పంచుకున్నారు.

● బీకామ్ చదివిన నేను మోడల్‌గా చేశా. 'ఇస్సక్' అనే హిందీ చిత్రం ద్వారా తొలిసారి కెమెరా ముందుకొచ్చా. జాకీచాన్ 'కుంగ్ ఫు యోగా', ఇమ్రాన్ హష్మి 'మిస్టర్ ఎక్స్', ధనుష్ 'అనేగన్'(తెలుగులో అనేకుడు) తదితర సినిమాల్లో నటించా. తెలుగులో 'మనసుకు నచ్చింది' నా తొలి సినిమా.

● అందం, అభినయానికి ప్రాధాన్యం ఇస్తా. ఈ సినిమాలో అలాంటి పాత్రే దక్కినందుకు హ్యాపీ. పాటలకు వచ్చి వెళ్లిపోయే పాత్ర కాదు నాది. కథతో పాటు సాగుతుంది. కొద్దిసేపట్లో పెళ్లిచేసుకోబోయే సూరజ్ (సందీప్), నిత్య ఎందుకు పారిపోయారు? ఆ తర్వాత ఎటువంటి పరిణామాలు చోటు చేసుకున్నాయన్నదే ఆసక్తికరం.

● మంజులగారు ఈ సినిమాని బాగా తెరకెక్కించారు. సందీప్ కిషన్ మంచి సహనటుడు. సెట్‌లో ఎంతో హెల్ప్ చేశాడు. తెలుగు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డా. ఇప్పుడు నేర్చుకుంటున్నా. రెండేళ్లలో నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పుకుంటాను.

● రాజ్‌తరుణ్‌తో 'రాజుగాడు' చిత్రంలోనూ నటిస్తున్నా. బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలోని అన్ని భాషా చిత్రాల్లో నటించాలని ఉంది.


అమైరా దస్తూర్

మార్చి తర్వాత అక్టోబర్


వరుణ్ ధావన్

... అదేంటి మార్చి తర్వాత ఏప్రిల్ రావాలి కదా. మరి మార్చి తర్వాత అక్టోబర్ రావడమేంటి అనుకుంటున్నారా? ప్రస్తుతం మా క్యాలెండర్ ఇలానే ఉంది అంటున్నారు బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్. 'విక్కీ డోనార్, పీకు' ఫేమ్ సూజిత్ సర్కార్ దర్శకత్వంలో వరుణ్ ధావన్, బనితా సంధూ జంటగా రూపొందిన చిత్రం 'అక్టోబర్'. ఈ సినిమాకు సంబంధించిన చిన్న మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు వరుణ్ ధావన్. ఈ వీడియోలో జనవరి, ఫిబ్రవరి, మార్చి ఆ తర్వాత ఏప్రిల్ బదులుగా అక్టోబర్‌ను చూపిస్తుంది క్యాలెండర్. ఏప్రిల్ 13న 'అక్టోబర్' చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. అందుకే మార్చి తర్వాత అక్టోబర్ అని వినూత్న రీతిలో విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. ''అక్టోబర్ సినిమా నాకు చాలా స్పెషల్. నటుడిగానే కాదు హ్యూమన్ బియింగ్‌గా కూడా ఈ సినిమా నా మీద చాలా ఇంపాక్ట్ చూపించింది. నేచర్‌తో లవ్‌లో పడిపోయా'' అని పేర్కొన్నారు వరుణ్ ధావన్. ఈ సినిమా కేవలం 38 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకోవడం విశేషం. రైజింగ్ సన్ బ్యానర్ పై రోన్నీ లహరీ నిర్మించిన ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చారు.

బ్యాట్ పట్టేదెవరు?


సోనాక్షి సిన్హా
తాప్సీ

యస్.. బ్యాట్ పట్టి క్రీజ్‌లో బాదేదెవరు? గ్రౌండ్‌లో ఆపోజిట్ టీమ్‌ని పరిగెత్తించేదెవరు? తాప్సీనా లేక సోనాక్షి సిన్హానా? వీరిద్దరిలో ఎవరు?... ఇదిగో ఇలాంటి చర్చే ప్రస్తుతం బాలీవుడ్‌లో జరుగుతోంది. ఇంతకీ అసలు కహానీ ఏంటంటే.. ప్రస్తుతం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద బయోపిక్స్ మంత్రం ఎలా వర్క్ అవుతుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. లేటెస్ట్‌గా ఇండియన్ ఉమెన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ మిథాలీరాజ్ బయోపిక్ నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ముంబైలోని ఓ ప్రముఖ నిర్మాణసంస్థ ఆల్రెడీ రైట్స్‌ను దక్కించుకున్నారట. అయితే మిథాలీ పాత్రకు సోనాక్షి సిన్హా, తాప్సీలను ఆ నిర్మాణ సంస్థ సంప్రదించారని బాలీవుడ్ టాక్. ఆల్రెడీ సందీప్‌సింగ్ బయోపిక్‌లో తాప్సీ హాకీ ప్లేయర్‌గా నటించారు. సో... తాప్సీనే ఫైనల్‌గా ఫిక్స్ అవుతారని కొందరు అంటుంటే.. లేదు..లేదు.. సోనాక్షి సిన్హానే సెలక్ట్ అవుతారని మరికొందరు అంటున్నారు. తాప్సీ బ్యాట్ పట్టుకుంటారా లేక తొలి బయోపిక్ కోసం సోనాక్షి బ్యాట్ పట్టుకుంటారా? తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగక తప్పదు.

అంజలి ప్రేమలేఖ


కార్తికేయ, హిమాన్సి, శుభాంగి పంత్, నవీన్

కార్తికేయ, హిమాన్సి, శుభాంగి పంత్, అనంత్, సైదులు వెంకీ, అవినాష్ ముఖ్యతారలుగా నవీన్ మన్నేల స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'ఇట్లు..అంజలి'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ– ''హీరోకి నటనలో పట్టు ఉంది. నాయిక కూడా జాతీయ స్థాయిలో భరతనాట్యంలో పేరు తెచ్చుకున్న అమ్మాయి. నవీన్ బాగా తెలుసు. ఈ సినిమా అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టాలి'' అన్నారు. ప్రేమలేఖ ఆధారంగా తెరకెక్కించిన థ్రిల్లర్ సబ్జెక్ట్ ఇది. అంజలి అనే అమ్మాయి రాసిన ప్రేమలేఖ, అదే పేరు గల మరో అమ్మాయి జీవితాన్ని ఎలా మార్చేసింది? అనేది ఈ సినిమాలో ఆసక్తికరం'' అన్నారు నవీన్ మన్నేల. ఈ సినిమాకు కెమెరా: వీకే రామరాజు, సంగీతం: కార్తీక్ కొడగండ్ల, ఎడిటింగ్: మార్తాండ్ కె. వెంకటేశ్. ఆర్ట్: ఎస్వీ మురళి.




దావోస్‌లో సదస్సులో మాట్లాడుతున్న సత్య నాదెళ్ల

140 ఏళ్లు బతికేస్తాం..!

మరికొన్ని దశాబ్దాల్లో సాకారం ● దావోస్‌లో నిపుణుల ధీమా

దావోస్: ఆరోగ్యరంగంలో చోటుచేసుకుంటున్న అత్యాధునిక సాంకేతిక మార్పుల కారణంగా మనిషి ఆయుర్దాయం 140 ఏళ్లకు పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడ్డారు. మరి కొన్ని దశాబ్దాల్లోనే ఇది సాకారం కానుందన్నారు. కృత్రిమ మేథ సహకారంతో చికిత్సా విధానాల్లో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు నేపథ్యంలో 'ఆరోగ్యరంగాన్ని మారుస్తున్న నాలుగోతరం పారిశ్రామిక విప్లవం' పేరుతో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో పాల్గొన్న మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మాట్లాడుతూ.. 'ఆరోగ్యరంగంలో కృత్రిమ మేథను వినియోగించడం వల్ల వైద్య నిపుణులు త్వరితగతిన, అత్యుత్తమ ఫలితాలను పొందవచ్చు' అని తెలిపారు. కొత్త టెక్నాలజీ వల్ల ఆస్పత్రి నిర్వహణ రూపురేఖలే మారిపోతాయనీ, సిబ్బంది సంఖ్యతో పాటు ఆస్పత్రి ఖర్చులు భారీగా తగ్గిపోతాయని వెల్లడించారు. మెడిసిన్, సాంకేతికతల కలయికతో ప్రపంచం మరింత ఆరోగ్యకరంగా మారుతుందని పేర్కొన్నారు. 'రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనుషుల సగటు ఆయుఃప్రమాణం 140 ఏళ్లకు చేరుకుంటుంది. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం పౌరుల బాధ్యతగా మారడంతో ఆస్పత్రులు కేవలం నామమాత్రంగా మారుతాయి. ప్రమాదానికి గురయ్యే రోగిని ఆస్పత్రికి తరలించేలోపే అంబులెన్సులోని వైద్య సిబ్బంది రోగి ఆరోగ్యచరిత్రను 5జీ టెక్నాలజీ సాయంతో వేగంగా సేకరించి చికిత్సను ప్రారంభిస్తారు' అని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నిపుణులు తెలిపారు. శరీరంలో కార్టిసాల్, గ్లూకోజ్ స్థాయిల్లో ఏమాత్రం తేడా వచ్చినా హెచ్చరించే పరికరాలను రూపొందిస్తున్నట్లు నోకియా సంస్థ అధ్యక్షుడు రాజీవ్ సూరీ వెల్లడించారు. సాంకేతికత సాయంతో నాణ్యమైన మందుల్ని వేగంగా రోగులకు అందించగలమనీ, వ్యాధుల్ని కూడా చాలాముందుగానే పసిగట్టగలమని పేర్కొన్నారు.

పంజా విసిరిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు ఎస్‌ఐలు సహా ఐదుగురు పోలీసుల మృతి

చింతూరు (రంపచోడవరం): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి పంజా విసిరారు. నారాయణ్‌పూర్, బీజాపూర్ జిల్లాల్లో బుధవారం జరిపిన రెండు వేర్వేరు దాడుల్లో ఇద్దరు ఎస్‌ఐలు సహా ఐదుగురు పోలీసులు మృతి చెందారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని అబూజ్‌మఢ్ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం అందడంతో వంద మంది పోలీసులు కూంబింగ్‌కు వెళ్లారు. దీంతో ఇర్పానార్ అటవీ ప్రాంతంలో ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. నక్సల్స్ కాల్పుల్లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ) గ్రూప్‌కు చెందిన ఎస్‌ఐలు వినోద్ కౌశిక్, మూల్‌చంద్‌లతో పాటు కానిస్టేబుళ్లు దేవ్‌నాథ్ పూజారి, రామ్‌సింగ్‌లు మృతిచెందారు. గాయాలపాలైన మరో తొమ్మిది మందిని చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించారు. మరో ఘటనలో బీజాపూర్ జిల్లా బాసగూడ అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లిన పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఒక కానిస్టేబుల్ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి.

లాల్‌బహదూర్ ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకం కాదు



న్యూఢిల్లీ: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి సైద్ధాంతికపరంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకం కాదని బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీ పేర్కొన్నారు. తరచూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ గురు గొల్వాల్కర్‌ను పిలిపించుకుని సమావేశమయ్యేవారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన 'ఆర్గనైజర్' అనే వారపత్రిక 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చిన ఓ కథనంలో శాస్త్రిని 'అంకితభావం కలిగిన కాంగ్రెస్‌వ్యక్తి' అని కొనియాడారు. 'నెహ్రూ మాదిరిగా కాకుండా జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలపై శాస్త్రికి ఎటువంటి వ్యతిరేకత లేదు. జాతీయ సమస్యలపై గురూజీతో శాస్త్రి తరచూ సమావేశమయ్యేవారు' అని పేర్కొన్నారు. ఈ కథనాన్ని అడ్వాణీ స్వీయచరిత్ర 'మై కంట్రీ మై లైఫ్' నుంచి తీసుకున్నారు. 1960లో ఆర్గనైజర్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా అడ్వాణీ చేరారు. ఆ సమయంలో చాలాసార్లు శాస్త్రిని ఆయన కలిసే వారు. 'ఆయనను కలిసినప్పుడల్లా పెద్ద మనసున్న ప్రధాని అని ఆయనపై మంచి అభిప్రాయం ఏర్పడేది' అని అడ్వాణీ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా ధోతీ–కుర్తా ధరించేవాడినని, అయితే జర్నలిస్టుకు ఆ దుస్తులు కాకుండా ప్యాంటు చొక్కా అయితే బాగుంటుందని సహోద్యోగులు ఇచ్చిన సలహా మేరకు తన వస్త్రధారణ కూడా మార్చుకున్నానని అడ్వాణీ వివరించారు.

సమాచార భద్రతా చట్టం తీసుకురండి

న్యూఢిల్లీ: భారత్ డిజిటల్ కుగ్రామంగా మారుతున్న క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సమాచారానికి భద్రత కల్పించేందుకు సత్వరమే ఓ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరముందని పార్లమెంటరీ స్థాయి సంఘం (ఆర్థిక) తన ముసాయిదా నివేదికలో అభిప్రాయపడింది. నోట్ల రద్దు తరువాత దేశం డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తుండటం, నానాటికీ పెరిగిపోతున్న సైబర్ దాడుల నేపథ్యంలో ఈ సూచన చేసింది. అంతరిక్షం, అణుశక్తి విభాగం తరహాలోనే కొత్త సమన్వయ అథారిటీని ఏర్పాటు చేయాలంది. ఈ అథారిటీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించటంతో పాటు దానిని ప్రధానమంత్రి కార్యాలయానికి అనుసంధానించాలని పేర్కొంది. వివిధ సంస్థలతో పౌరులు పంచుకునే సమాచారంపై వారికి నియంత్రణ ఉండాలని పేర్కొంది.

లిబియాలో వరుస బాంబు పేలుళ్లు


భీతావహంగా బాంబు పేలిన ప్రాంతం

బెంఘాజీ: ఆఫ్రికా దేశమైన లిబియా మంగళవారం వరుస కారు బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. బెంఘాజీ నగరంలోని ఓ మసీదు నుంచి ప్రార్థనల అనంతరం ప్రజలు బయటికొస్తుండగా రెండు శక్తిమంతమైన కారు బాంబు పేలుళ్లు సంభవించడంతో 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పేలుళ్లలో 87 మంది గాయపడ్డారు. మొదటి కారు బాంబు పేలిన తర్వాత సహాయక చర్యల కోసం అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న ప్రజలే లక్ష్యంగా అరగంట వ్యవధిలో మరో కారు బాంబు పేలిందని అధికారులు తెలిపారు. లిబియా అంతర్యుద్ధంలో ప్రభుత్వానికి అండగా నిలిచిన సలాఫీ గ్రూపులకు కేంద్రంగా ఉండటంతోనే ఈ మసీదుపై దాడి జరిగిందన్నారు. ఈ దాడిని తామే చేసినట్లు ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించుకోలేదన్నారు. నాటో బలగాలు 2011లో లిబియా పాలకుడు గడాఫీని హతమార్చినప్పటి నుంచి ఆ దేశం అంతర్యుద్ధంతో అట్టుడుకుతోంది.

కొంతైనా నల్లధనం తెచ్చారా: రాహుల్

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్ వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ..తిరిగి వస్తూ విమానంలో కొంతైనా నల్లధనాన్ని తీసుకువచ్చారా అని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. స్విస్ బ్యాంకుల్లో భారతీయులు అక్రమంగా దాచిన నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తానన్న మోదీ ఎన్నికల హామీపై ఆయన ట్వీటర్‌లో ఈ వ్యంగ్యాస్త్రం సంధించారు. మీరు స్విట్జర్లాండ్ నుంచి నల్లధనం తెస్తారని ఇక్కడి యువత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఎద్దేవాచేశారు. దావోస్ వేదికపై ప్రసంగించిన మోదీ.. దేశంలోని సంపదలో 73 శాతం ఒక్క శాతం ఉన్న ధనికుల వద్దే ఎందుకు పోగుపడిందనే విషయంపైనా ప్రజలకు వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. దీనిపై రిఫరెన్స్ కోసం.. సంబంధిత ఆక్స్‌ఫామ్ సంస్థ నివేదికను కూడా జతపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

హక్కానీ టాప్ కమాండర్ హతం

పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లో అమెరికా డ్రోన్ మిసైల్ దాడి



పెషావర్: ఉగ్రవాదంపై పాకిస్తాన్ అలసత్వాన్ని వీడని పక్షంలో తామే ఆ ఉగ్రస్థావరాలను నిర్వీర్యం చేస్తామని ప్రకటించిన అమెరికా.. ఈ దిశగా కార్యాచరణ ప్రారంభించింది. బుధవారం అఫ్గానిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దుల్లో డ్రోన్ మిసైల్ దాడులతో హక్కానీ నెట్‌వర్క్ కీలక కమాండర్ ఎహసాన్ అలియాస్ ఖవారీని మట్టుబెట్టింది. ఉత్తర వజీరిస్తాన్ (పాకిస్తాన్)లోని గిరిజన ప్రాంతం (అఫ్గాన్ శరణార్థులుండే ప్రాంతం)లోని ఓ ఇంట్లో ఖవారీ ఉన్నాడన్న పక్కా సమాచారంతో.. ఆ ఇంటిపై అమెరికా గూఢచార విమానాలు రెండు డ్రోన్ మిసైల్స్‌ను ప్రయోగించాయి. ఈ దాడిలో ఖవారీ సహా అతని ఇద్దరు అనుచరులు హతమయ్యారు. కాగా, అమెరికా డ్రోన్ దాడులు 'ఏకపక్షం' అని పాకిస్తాన్ మండిపడింది. సంకీర్ణ ధర్మాన్ని మరచి తమ భూభాగంలో తమకు సమాచారం లేకుండా ఇలాంటి దాడులకు దిగటం సరికాదని నిరసన తెలిపింది. 'ఇలాంటి ఏకపక్ష దాడులు ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న అమెరికా, పాకిస్తాన్ దేశాల సహకార స్ఫూర్తికి విఘాతం కలిగిస్తాయి. అఫ్గనిస్తాన్ సరిహద్దుల్లోని ఉగ్రస్థావరాలపై అమెరికా మిలటరీ తరచుగా దాడులు జరుపుతోంది. కానీ ఈసారి మా భూభాగంలో.. మాకు సమాచారం ఇవ్వకుండానే దాడి జరిపారు' అని పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత పాకిస్తాన్ భూభాగంలోని ఉగ్రస్థావరాలపైనా డ్రోన్ దాడులు పెరిగాయి. అయితే.. తన భూభాగంలోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయటంలో పాక్ విఫలమైందంటూ కొంతకాలంగా ట్రంప్ విమర్శిస్తున్నారు. హక్కానీ నెట్‌వర్క్ లక్ష్యంగా అమెరికా డ్రోన్ దాడులు చేయటం ఈ వారం రోజుల్లో ఇది రెండోసారి.

ఉడాన్‌లోకి 325 మార్గాలు

రెండో విడత రూట్లను విడుదల చేసిన ప్రభుత్వం

- కొత్తగా 56 విమానాశ్రయాలు, హెలిప్యాడ్‌లకు విస్తరించిన పథకం
- హైదరాబాద్ నుంచి 5, తిరుపతి నుంచి 2 మార్గాలకు చోటు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో విమానయాన రంగం భారీ విస్తరణకు ప్రభుత్వం మరో సానుకూల చర్య తీసుకుంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కూడా విమానాలు, హెలికాప్టర్ల రాకపోకలను మరింత పెంచేలా కొత్తగా 325 మార్గాలను ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం కిందకు తీసుకొచ్చింది. ఉడాన్ రెండో విడతలో భాగంగా కొత్తగా 56 విమానాశ్రయాలు/హెలిప్యాడ్‌లను ప్రభుత్వం ఈ పథకం కిందకు చేర్చింది. కేంద్ర ప్రభుత్వ ప్రాంతీయ అనుసంధాన పథకమైన ఉడాన్ కింద రెండో రౌండ్ బిడ్డింగ్ ముగిసిన అనంతరం విమానయాన సంస్థలకు కేటాయించిన మార్గాలను పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు బుధవారం వెల్లడించారు. మొత్తం 15 సంస్థలకు ఈ మార్గాలను కేటాయించారు. కొత్త మార్గాల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, తిరుపతి నగరాలకు కూడా వివిధ ప్రాంతాల నుంచి విమానాలు రానున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోని యుద్ధభూమి కార్గిల్‌కూ ఉడాన్ రెండో విడతలో చోటు దక్కింది. అత్యధికంగా ఇండిగో సమర్పించిన 20 ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. స్పైస్‌జెట్ ప్రతిపాదనల్లో 17 ఆమోదం పొందాయి. రోడ్డు, రైలు మార్గాలు సరిగా లేని ఈశాన్య రాష్ట్రాలు, కొండ ప్రాంత నగరాలకు ప్రాధాన్యతనిస్తూ ఉడాన్ పథకం రెండో విడతలో వాటికే ఎక్కువ మార్గాలను కేటాయించారు. విమానయాన సంస్థలు 50 శాతం సీట్లను కచ్చితంగా ఉడాన్ పథకానికి కేటాయించాలి. ఆ సీట్లకు గంట ప్రయాణానికి రూ.2,500 కన్నా ఎక్కువ చార్జీలను వసూలు చేయకూడదు. అదే హెలికాప్టర్లు అయితే 13 సీట్లను కేటాయించి, అర్ధగంట ప్రయాణానికి గరిష్టంగా రూ.2,500 మాత్రమే వసూలు చేయాలి. రాయితీ కింద ప్రభుత్వం సంస్థలకు కొంత మొత్తం చెల్లిస్తుంది. మొత్తంగా రూ.620 కోట్లను ఇందుకోసం ప్రభుత్వం కేటాయించింది. రెండో విడత మార్గాలు ఆరు నెలల్లోపే అందుబాటులోకి వస్తాయని అశోక్ గజపతి రాజు చెప్పారు. గతేడాది మార్చిలో ఉడాన్ పథకం తొలిరౌండ్ బిడ్డింగ్ జరగ్గా మొత్తం 128 మార్గాలను అప్పట్లో ఈ పథకం కింద వివిధ విమానయాన సంస్థలకు కేటాయించడం విదితమే.



తెలుగు రాష్ట్రాల నుంచి నూతన మార్గాలు

మార్గం	విమానయాన సంస్థ
హైదరాబాద్-హుబ్లీ	టర్బో ఏవియేషన్, అలయన్స్ ఎయిర్, స్పైస్‌జెట్
హైదరాబాద్-కొల్హాపూర్	ఇండిగో, అలయన్స్ ఎయిర్
హైదరాబాద్-నాసిక్	అలయన్స్ ఎయిర్, స్పైస్‌జెట్
హైదరాబాద్-షోలాపూర్	అలయన్స్ ఎయిర్
హైదరాబాద్-కొప్పళ్	టర్బో ఏవియేషన్
తిరుపతి-కొల్హాపూర్	ఇండిగో
తిరుపతి-హుబ్లీ	ఘొడావత్ (హెలికాప్టర్లు)

వివిధ కొత్త మార్గాల్లో ముఖ్యమైనవి

- దర్భంగా-బెంగళూరు; దర్భంగా-ఢిల్లీ; దర్భంగా-ముంబై; కార్గిల్-శ్రీనగర్
- హుబ్లీ - అహ్మదాబాద్, చెన్నై, కొచ్చిన్, గోవా, హిండన్, కన్నూర్
- కన్నూర్ - బెంగళూరు, చెన్నై, కొచ్చిన్, గోవా, హిండన్, ముంబై, తిరువనంతపురం
- బికనీర్ - జైపూర్
- జైసల్మేర్ - అహ్మదాబాద్, సూరత్, ఉదయ్‌పూర్
- పాక్యాంగ్(సిక్కిం) - ఢిల్లీ, గువాహటి, కోల్‌కతా
- వెల్లూరు - బెంగళూరు, చెన్నై

హెలికాప్టర్ ద్వారా.. ముఖ్యమార్గాలు

కులు-మనాలి
సిమ్లా-మండి
మండి-ధర్మశాల
మండి-సిమ్లా
హరిద్వార్-హల్ద్వని
జోషిమఠ్ -గౌచర్
మసోరి-డెహ్రాడూన్



మూడో కేసులోనూ లాలూ దోషే

దాణా కుంభకోణం కేసులో తీర్పునిచ్చిన సీబీఐ ప్రత్యేక కోర్టు

- ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 10 లక్షల జరిమానా

రాంచీ: దాణా కుంభకోణానికి సంబంధించిన మూడో కేసులోనూ బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు బుధవారం దోషిగా తేల్చింది. లాలూతోపాటు మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కూడా దోషేనని పేర్కొన్న కోర్టు..వీరిద్దరికీ ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. వీరు ఒక్కోసారి 5 లక్షల రూపాయలను రెండు దఫాల్లో చెల్లించొచ్చు. జరిమానా కట్టని పక్షంలో వారు మరో ఏడాది సాధారణ జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. 1992–93 మధ్య కాలంలో చాయ్‌బాసా ఖజానా నుంచి రూ. 37.62 కోట్లను వీరు అక్రమంగా కాజేసినట్లు గుర్తించిన సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎస్‌ఎస్ ప్రసాద్..ఇదే కేసులో మరో 50 మందిని కూడా దోషులుగా తేల్చారు. బిహార్ మాజీ మంత్రి విద్యాసాగర్ నిషద్, బిహార్ శాసనసభ ప్రజా పద్దుల కమిటీ మాజీ చైర్మన్ జగదీశ్ శర్మ, మాజీ ఎమ్మెల్యేలు ధ్రువ్ భగత్, ఆర్కే రాణా, ముగ్గురు మాజీ ఐఏఎస్ అధికారులు దోషుల జాబితాలో ఉన్నారు. తీర్పు వెలువడిన అనంతరం లాలూ కొడుకు, బిహార్ శాసనసభలో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ 'సీబీఐ కోర్టు తీర్పుకు మేం కట్టుబడి ఉంటాం. అయితే ఈ తీర్పే అంతిమం కాదు. హైకోర్టులో అప్పీల్ చేస్తాం. అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్తాం' అని అన్నారు. బిహార్ ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్, బీజేపీ కలసి కుట్రపన్ని తన తండ్రిని ఈ కేసుల్లో ఇరికించాయని తేజస్వీ ఆరోపించారు.


రాంచీలో సీబీఐ కోర్టు వద్ద లాలూ

అన్ని శిక్షలూ ఏకకాలంలోనే అమలు

దాణా కుంభకోణానికి సంబంధించి మొత్తం ఐదు కేసులుండగా వాటిలో లాలూకు ఇప్పటికే మూడు కేసుల్లో శిక్ష ఖరారైంది. మరో రెండు కేసులు విచారణ దశలో ఉన్నాయి. ప్రస్తుతం బిర్సాముండా జైలులో లాలూ శిక్షననుభవిస్తున్నారు. తొలికేసులో తీర్పు 2013లోనే వెలువడగా అప్పట్లో లాలూకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అయితే ఆయన హైకోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నారు. రెండో కేసులో తీర్పు ఈ ఏడాది జనవరి 6న వచ్చింది. ఈ కేసులో లాలూకు మూడున్నరేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానాను సీబీఐ కోర్టు విధించింది. తొలి కేసులో ఐదేళ్లు, రెండో కేసులో మూడున్నరేళ్లు, మూడో కేసులోనూ ఐదేళ్లు కలిపి మొత్తం లాలూకు పదమూడున్నరేళ్ల జైలు శిక్షను కోర్టు విధించింది. అయితే ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలవుతాయి కాబట్టి ఆయన ఐదేళ్లు మాత్రమే జైలులో ఉంటే చాలు. మరో రెండు కేసుల్లోనూ లాలూ ఇంకా నిందితుడిగా ఉన్నారు. వాటిలోనూ దోషిగా తేలి శిక్ష పడితే..అన్ని కేసుల్లోకెల్లా అత్యధిక శిక్షాకాలం ఏది ఉంటుందో అంతకాలం మాత్రం ఆయన జైలులో ఉండాల్సి ఉంటుంది.

అమెరికా హైస్కూల్లో కాల్పుల మోత

ఇద్దరు విద్యార్థుల మృతి

బెంటన్: అగ్రరాజ్యం అమెరికా కొత్త ఏడాదిలో మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. కెంటకీ రాష్ట్రంలోని మార్షల్ కౌంటీలో ఉన్న హైస్కూల్‌లో ఓ విద్యార్థి(15) హ్యాండ్ గన్‌తో జరిపిన కాల్పుల్లో ఇద్దరు తోటివిద్యార్థులు చనిపోగా, 17 మంది గాయపడ్డారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. కాల్పుల సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం 8.57 గంటలకు హైస్కూల్‌కు చేరుకున్న నిందితుడు పాఠశాల ప్రాంగణంలో ఉన్న వారందరిపై విచక్షణారహితంగా కాల్పులు ప్రారంభించాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బుల్లెట్లు పూర్తిగా అయిపోయేంతవరకూ అతను కాల్పులు జరుపుతూనే ఉన్నాడన్నారు. అయితే సదరు విద్యార్థి ఈ దారుణానికి ఎందుకు పాల్పడ్డాడన్న దానిపై పోలీసులు అధికారులు ఎలాంటి వివరాలు చెప్పలేదు.


ఢిల్లీలో 2017 సంవత్సరానికిగాను జాతీయ సాహస బాలల పురస్కారాల ప్రదానోత్సవం సందర్భంగా సరదాగా ఆరేళ్ల పాప మమతా దలాయ్ చెవి లాగుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో మహిళా, శిశు సంక్షేమ మంత్రి మేనకా గాంధీ ఉన్నారు.

కొత్త జిహాదీ జాన్.. సిద్ధార్థ ధర్

అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించిన అమెరికా

వాషింగ్టన్/లండన్: బ్రిటన్‌కు చెందిన భారత సంతతి ఉగ్రవాది, ఐఎస్ సీనియర్ కమాండర్ సిద్ధార్థ ధర్ అలియాస్ అబూ రుమైసా(33)ను అమెరికా అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించింది. ఐఎస్‌లో బందీల గొంతుల్ని కిరాతకంగా కోసి హతమార్చే 'జిహాదీ జాన్' మొహమ్మద్ ఎజావీ మరణానంతరం అతని స్థానంలో ధర్ పనిచేస్తున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. బ్రిటన్‌లో ఉన్నప్పుడే ఇస్లాం స్వీకరించిన ధర్.. ఓ కేసులో బెయిల్‌పై బయటికొచ్చిన అనంతరం 2014లో భార్యాపిల్లలతో కలిసి సిరియాకు వెళ్లి ఐఎస్‌లో చేరాడు. అమెరికాతో పాటు బ్రిటన్ కోసం గూఢచర్యానికి పాల్పడుతున్నారంటూ 2016లో పలువురిని ముసుగు ధరించి కాల్చిచంపింది ధరేనని నిఘా వర్గాలు తెలిపాయి. ఇతనితో పాటు బెల్జియన్–మొరాకో పౌరుడు అబ్దుల్లతీఫ్ గైనీని కూడా అమెరికా అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించినట్లు వెల్లడించాయి. దేశంలో వీరిద్దరి ఆస్తులుంటే స్తంభింపజేస్తామనీ, పౌరులెవరూ వీరితో ఆర్థిక సంబంధాలు పెట్టుకోవద్దని యూఎస్ విదేశాంగ శాఖ తెలిపింది.

ఎవరీ కొత్త జిహాదీ జాన్?: లండన్‌లోని ఓ బెంగాలీ హిందూ కుటుంబంలో జన్మించిన సిద్ధార్థ ధర్ అక్కడే పెరిగాడు. టీనేజీలోనే ఇస్లాంలోకి మారి సైఫుల్ ఇస్లామ్‌గా పేరు మార్చుకున్నాడు.



గతంలో బ్రిటిష్ తీవ్రవాద సంస్థ అల్–ముహజిరౌన్‌లో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. ఐఎస్‌లో చేరడానికి ముందు లండన్‌లో పలు తీవ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. ఒకచేతిలో ఏకే 47 తుపాకీ, మరో చేతిలో తన నాలుగో సంతానాన్ని పట్టుకున్న ఫొటోను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసి సిరియాలో తన ఉనికిని చాటుకున్నాడు.

'పద్మావత్' నిరసనలు హింసాత్మకం

గుర్గావ్‌లో స్కూలు బస్సుపై రాళ్లదాడి

- దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనకారుల విధ్వంసం
- గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గోవాల్లో చిత్ర ప్రదర్శన నిలిపివేత

జైపూర్/ముంబై/అహ్మదాబాద్: 'పద్మావత్' చిత్రం విడుదలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. హరియాణాలోని గుర్గావ్‌లో ఆందోళనకారులు ఓ స్కూలు బస్సుపై రాళ్లురువ్విన ఘటనలో అందులో ఉన్న విద్యార్థులు, టీచర్లు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలోని ఈ చిత్రం గురువారం దేశవ్యాప్తంగా రిలీజ్ కానుంది. దీన్ని వ్యతిరేకిస్తూ.. దేశవ్యాప్తంగా పలుప్రాంతాల్లో కర్ణిసేన, పలు హిందూ సంస్థల కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. మాల్స్, సినిమా హాళ్లలో విధ్వంసం సృష్టించారు. చాలాచోట్ల హైవేలను దిగ్బంధించారు. గుర్గావ్, రాజస్తాన్ సహా ముంబై, నాసిక్, లక్నో, ఇండోర్ తదితర ప్రాంతాల్లో ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. కాగా, ఈ సినిమాలో ఎలాంటి అభ్యంతరకర దృశ్యాల్లేవని చిత్ర బృందం మరోసారి స్పష్టం చేసింది. రాజ్‌పుత్ గౌరవాన్ని పెంచే దృశ్యాలే ఉంటాయని పునరుద్ఘాటించింది. కాగా, ఆందోళనల నేపథ్యంలో గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గోవాల్లో ఈ చిత్రాన్ని ప్రదర్శించబోవటం లేదని మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది.

ఆస్తుల విధ్వంసం

పద్మావత్ చిత్రం విడుదలను వ్యతిరేకిస్తూ.. రాజస్తాన్, హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, యూపీల్లో ఆందోళనలు మిన్నంటాయి. జైపూర్‌లో నిరసనకారులు రెండు బస్సులను ధ్వంసం చేశారు. రోడ్‌రోకోలతో రోడ్లపై నిరసన చేపట్టారు. ముంబై, నాసిక్‌లలోనూ నిరసనలు జరిగాయి. చిత్రం ప్రదర్శించేందుకు సిద్ధమైన మూడు మల్టీప్లెక్స్‌ల ముందు నిలిపి ఉంచిన 30 బైకులు, స్కూటర్లకు నిరసనకారులు నిప్పంటించారు. ఆందోళన నేపథ్యంలో శ్రీ రాజ్‌పుత్ కర్ణి సేన తీవ్రంగా మండిపడింది. మహారాష్ట్రలో చిత్ర ప్రదర్శనను అడ్డుకునేందుకు శివసేన మద్దతు తెలిపిందని కర్ణిసేన అధ్యక్షుడు లోకేంద్ర సింగ్ కాల్వీ వెల్లడించారు. చిత్రంలో రాణి పద్మావతి, అల్లావుద్దీన్ ఖిల్జీ మధ్య శృంగార భరిత దృశ్యాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు.


గుర్గావ్‌లో ఆందోళనకారులు దగ్ధంచేసిన బస్సు. రాళ్లవర్షం నుంచి చిన్నారిని కాపాడుతున్న ఓ టీచర్

చిన్నారులని చూడకుండా..!

గుర్గావ్.. మధ్యాహ్నం 3 గంటలవుతోంది. స్కూలు ముగించుకున్న విద్యార్థులను తీసుకుని జీడీ గోయెంకా స్కూలు బస్సు బయలుదేరింది. రోడ్డుపై 'పద్మావత్' నిరసనకారులు రాస్తారోకో చేయటంతో వాహనాలన్నీ ఆగిపోయాయి. ఈ క్రమంలోనే ఓ ఆర్టీసీ బస్సుకు నిప్పుపెట్టిన ఆందోళనకారులు.. దాని ముందున్న గోయెంకా స్కూలు బస్సుపై రాళ్లతో దాడిచేశారు. ఆ సమయంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకున్న విద్యార్థులు, కొందరు టీచర్లు కూడా బస్సులో ఉన్నారు. రాళ్లదాడితో విద్యార్థులు భయంతో వణికిపోయారు. తప్పించుకునేందుకు అవకాశం లేకపోవటంతో ఏడుస్తూ సీట్లకింద నక్కారు. రోడ్డు పక్కనున్నవారు తీసిన వీడియోలో ఈ హృదయవిదారక దృశ్యాలు ఆవేదన కలిగించాయి.

ఆర్టీఏ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు
- మూడు రోజుల్లో ఇది రెండోసారి.. ఫైళ్లు దగ్ధం
- సందర్శించిన మంత్రి మహేందర్‌రెడ్డి



ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో అగ్ని ప్రమాదం దృశ్యం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఆర్టీఏ కేంద్ర కార్యాలయం(పాతభవనం)లో బుధవారం మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. రెండురోజుల క్రితం కూడా స్వల్పంగా మంటలు రావడంతో హైదరాబాద్ జేటీసీ చాంబర్‌తోపాటు అన్ని గదులను ఖాళీ చేశారు. తాజాగా భవనం పైఅంతస్తులోని రికార్డు రూంలో ఉదయం 9.30 గంటలకు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పేశారు. ఆరు ఫైరింజన్లతో మంటలార్పేందుకు గంటకుపైగా సమయం పట్టింది. రికార్డురూంలోని ఫైళ్లన్నీ దగ్ధమయ్యాయి. రెండు రోజుల క్రితమే అధికారులు, సిబ్బంది భవనాన్ని ఖాళీ చేయడంతో ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు. రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీల్‌శర్మ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నిజాం కాలం నాటి ఈ భవనంలో ఎలాంటి కార్యకలాపాలు జరగడం లేదని, ఏడాది క్రితమే సిబ్బందిని మరోచోటకు తరలించామని మంత్రి చెప్పారు. రికార్డ్‌రూంలో 40 ఏళ్లకుపైగా భద్రపరిచిన ఫైళ్లు దగ్ధమయ్యాయని, వాటివల్ల ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అన్నిరకాల ఫైళ్లను కంప్యూటర్‌లో భద్రపరిచినట్లు మంత్రి పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, బదిలీలు, ఇతర ఫైళ్లు చాలావరకు కాలిపోయాయన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే...

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రమాదంపై జేటీసీ రమేశ్ నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌తోపాటు మిగతాప్రాంతాల్లో ఆర్టీఏ కార్యాలయాలను పరిశీలించి నివేదిక అందజేస్తుందన్నారు. ఖైరతాబాద్‌లోని ఈ భవనం ఏ మాత్రం సురక్షితం కాదని రోడ్లు, భవనాల శాఖ 10 ఏళ్ల క్రితమే హెచ్చరించింది. భవనంలో కొన్నిచోట్ల పెచ్చులూడాయి. మరికొన్నిచోట్ల గోడలకు పగుళ్లు వచ్చాయి. గత సంవత్సరం పైకప్పు నుంచి పెద్ద సిమెంట్ దిమ్మె విరిగిపడడంతో ఉద్యోగులు ఆ భవనాన్ని ఖాళీ చేశారు. వర్షాల కారణంగా ఏ సమయంలో కూలుతుందో తెలియని స్థితి నెలకొందని అధికారులు గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో నిజాం నవాబు కూతురు నూర్జహాన్ కోసం నాలుగు ఎకరాల్లో ఈ భవనాన్ని కట్టించారు. స్వాతంత్ర్యానంతరం ఈ భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు

సాక్షి, హైదరాబాద్: రబీలో పండే శనగ పంటను మద్దతు ధరకు కొనేందుకు మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.



బుధవారం దావోస్ సదస్సులో నోవార్టిస్ సంస్థ ప్రతినిధి పెట్రా లక్స్‌తో చర్చిస్తున్న మంత్రి కేటీఆర్



మిత్సుబిషీ కంపెనీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయితో..



ఎయిర్ ఏషియా గ్రూప్ కంపెనీ ప్రతినిధులతో కేటీఆర్

‘నోవార్టిస్’ను విస్తరిస్తాం

హైదరాబాద్‌లోని ఔషధ ప్రయోగశాలపై కంపెనీ వెల్లడి

- దావోస్‌లో పలు కంపెనీలతో మంత్రి కేటీఆర్ భేటీ
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: నోవార్టిస్ ఫార్మా కంపెనీ హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ), డేటా సపోర్ట్, అనలిటిక్స్ కార్యకలాపాలు కొనసాగిస్తోందని, హైదరాబాద్‌లో తమ సంస్థ సాధిస్తున్న పురోగతిపై సంతృప్తిగా ఉన్నట్లు ఆ సంస్థ పబ్లిక్ పాలసీ విభాగాధిపతి పెట్రా లక్స్ పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సంస్థ నిర్వహిస్తున్న ఔషధ ప్రయోగశాల సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించారు. పరిశోధన విభాగంలో మరో 150 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు తెలిపారు. నోవార్టిస్ కార్యకలాపాల విస్తరణతో జీనోమ్ వ్యాలీ అభివృద్ధికి దోహదపడనుందని, పూర్తి వివరాలను కంపెనీ త్వరలో వెల్లడిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో నిర్మిస్తున్న ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టాలని నోవార్టిస్‌ను ఆహ్వానించారు. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో కేటీఆర్ రెండో రోజు పలు ప్రముఖ కంపెనీలతో సమావేశమై ప్రభుత్వ పారిశ్రామిక విధానాన్ని వివరించారు.

మిత్సుబిషీతో..

రాష్ట్రంలో జపనీస్ చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కును ఏర్పాటు చేయాలని ఆ దేశ ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మిత్సుబిషీని కేటీఆర్ కోరారు. మిత్సుబిషీ హెవీ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయి బృందంతో ఆయన సమావేశమయ్యారు. భారీ ప్రాజెక్టుల అవకాశాలకు తమ కంపెనీ చూస్తోందని మిత్సుబిషీ ప్రతినిధులుమంత్రికి తెలిపారు. పారిశ్రామికవాడలు, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రాజెక్టులపై మిత్సుబిషీకి ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులకు రాష్ట్రంలో అనేక అవకాశాలున్నాయని, కంపెనీ ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటించాలని మంత్రి ఆహ్వానించారు. జపాన్ పర్యటనలో ఇలాంటి పార్కు ఏర్పాటుకు జైకా వంటి ఆర్థిక సంస్థలు రుణాలందించేందుకు సూత్రప్రాయంగా ఒప్పుకున్నాయని వారికి వివరించారు. సౌర విద్యుదుత్పత్తిలో రాష్ట్రం ఇప్పటికే దేశంలో అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. కువైట్‌కు చెందిన ఫవద్ అల్గానిమ్ కంపెనీ సీఈవో మహ్మద్ అల్గానిమ్‌తో సమావేశమై రాష్ట్రంలో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు అందుతున్న సహకారాన్ని వివరించారు. రాష్ట్రంలో టెక్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ దుబాయ్ సంస్థను కేటీఆర్ కోరారు.

ప్రముఖ హార్డ్‌వేర్ కంపెనీ హ్యూలెట్ ప్యాకర్డ్ (హెచ్‌పీ), టీ–హబ్‌ల మధ్య ఉన్న భాగస్వామ్యాన్ని పరిశీలించాలని కేటీఆర్ కోరారు. హెచ్‌పీ

ఎయిర్ ఏషియాతో..

ఎయిర్ ఏషియా గ్రూప్ సీఈవో ఆంథోనీ ఫెర్నాండేజ్, ఉప కార్యనిర్వహణాధికారి ఎయిరీన్ ఒమర్‌తో కేటీఆర్ సమావేశమై హైదరాబాద్‌లో ఎయిరోస్పేస్ రంగంలో పెట్టుబడులకు ఉన్న సానుకూలతలను వివరించారు. రానున్న రోజుల్లో దేశంలో విమానయాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఎయిర్ ఏషియాను ఆహ్వానించారు.

హెచ్‌పీ కంపెనీతో..

కంపెనీ కార్యకలాపాలను విస్తరించాలని ఆ కంపెనీ ఉపాధ్యక్షుడు అనా పిన్కుజుక్‌కు విజ్ఞప్తి చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో సర్క్యులర్ అవార్డు గెలుచుకున్న టీ–హబ్‌లోని బనయన్ నేషన్ స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు మనీ వాజపేయ్ దావోస్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ వాజ్‌పేయ్ బృందానికి అభినందనలు తెలిపారు.

అత్యవసరమైతేనే పశువులకు యాంటీ బయోటిక్స్: సుల్తానియా

సాక్షి, హైదరాబాద్: పశువుల ఆరోగ్య రక్షణలో యాంటీ బయోటిక్ మందులను అత్యవసర సమయాల్లో మాత్రమే వినియోగించాలని పశు సంవర్థకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. వీలైనంత వరకు హెర్బల్ మందులనే వాడాలని సూచించారు. పశువులపై యాంటీ బయోటిక్ మందుల ప్రభావం అనే అంశంపై పశు వైద్యాధికారులు, పశు వైద్య శాస్త్రవేత్తలు, సంబంధిత ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లోనే యాంటీ బయోటిక్ మందులు వాడటంపై శాస్త్రవేత్తలు కూలంకషంగా చర్చించాలన్నారు. భవిష్యత్తులో సూక్ష్మ క్రిములు యాంటీ బయోటిక్ మందులకు లొంగని పరిస్థితి ఏర్పడకుండా అవసరమైన సూచనలు ప్రతిపాదించాలని కోరారు. వ్యాధుల నివారణలో హెర్బల్ మందుల వినియోగంపై తగు ప్రతిపాదనలు చేయాలని యోచిస్తున్నట్లు ఆ శాఖ సంచాలకుడు డి.వెంకటేశ్వర్లు చెప్పారు.

గ్రామాలకు కాలుష్య కారక ఔషధ పరిశ్రమలా..?

కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: నగర వాసులకు ఇబ్బందిగా మారిన కాలుష్య కారక ఔషధ పరిశ్రమలను గ్రామాలకు తరలించడం ఎలాంటి పర్యావరణ న్యాయమో చెప్పాలని కిసాన్ ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ చైర్మన్ కోదండరెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ నగర శివారు ముచ్చెర్లలో నిర్మించ తలపెట్టిన ఫార్మా సిటీలోకి కాలుష్య కారక పరిశ్రమలు తరలించడం ద్వారా పరిసర గ్రామాలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. ఫార్మా సిటీ నిర్మాణంతో లభించే ఉద్యోగాల సంఖ్యపై ప్రభుత్వం గందరగోళంగా మాట్లాడుతోందని విమర్శించారు. 15.95లక్షలు, 8.79లక్షలు, 4.60లక్షల ఉద్యోగాలు వస్తాయంటూ వేర్వేరు సందర్భాల్లో ప్రకటించిన ప్రభుత్వం తాజాగా 5.56లక్షల ఉద్యోగాలే వస్తాయని చెబుతుందన్నారు. ఫార్మా సిటీలో 140 భారీ పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశముంటే, ఒక్కో పరిశ్రమ ద్వారా కేవలం 1,000 మందికి మించి ఉద్యోగావకాశాలు లభించవన్నారు. ఈ లెక్కన కేవలం 1.40లక్షల ఉద్యోగాలు మాత్రమే వస్తాయన్నారు. మిగిలిన 4.16లక్షల ఉద్యోగాలను అక్కడ ఏర్పాటు చేసే 616 చిన్న తరహా పరిశ్రమల్లో కల్పిస్తారా? అని ప్రశ్నించారు.

29న కాంట్రాక్టు ఉద్యోగుల మహా సభ

ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య




సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని కోరుతూ ఈ నెల 29న హైదరాబాద్‌లో మహా సభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నేత, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ఈ రెండు కేటగిరీలకు చెందిన వారు రాష్ట్రంలో 2.20లక్షల మంది ఉన్నట్లు తెలిపారు. బుధవారం బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని అర్హతల ఆధారంగా క్రమబద్ధీకరించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ వారి పరిస్థితి దారుణమన్నారు.. ప్రభుత్వం నెలవారీగా వేతనాలు ఇసున్నా ఔట్‌సోర్సింగ్ సంస్థలు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.కృష్ణ, అంజి, ఎస్.రామలింగం, భూపేశ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్

70వ రోజు

24-01-2018, బుధవారం
నాయుడుపేట,
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా



మంచి పథకాలకు తూట్లు పొడవడం బాబుగారికి ఉగ్గుపాలతో పెట్టిన విద్య

ఉదయం శిరసనంబేడు దాటి కాస్త ముందుకెళ్లగానే.. నడవలేక నడవలేక నాకేసి వస్తున్న ఓ అవ్వ కనిపించింది. నడుం పూర్తిగా వంగిపోయి, చేతికర్ర సాయంతో ఎంతో కష్టంగా వచ్చిన ఆ అవ్వను చూడగానే కదిలిపోయాను. ఆ అవ్వ నావద్దకు వచ్చి నా చెంపను తడిమింది. ఏం కావాలవ్వా.. అని అడిగాను. ‘నాకేమీ వద్దు నాయనా.. నువ్వు ముఖ్యమంత్రివై మా ఊరికి రావాలి.. అదే చాలు’ అని దీవించింది. ‘నీలో నాన్నను చూసుకుంటున్నానయ్యా’ అంటూ ఎంతో మురిసిపోయింది. 80 ఏళ్లు పైబడిన ఆ అవ్వ చూపించిన ఆప్యాయతకు, ప్రేమకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలను.?

చావలి దాటాక, హైవేపై నడుస్తున్నప్పుడు.. దారి పక్కనే చాలా ఇటుక బట్టీలు కనిపించాయి. చాలామంది కూలీలు, మహిళలు నన్ను చూడాలని పరుగు పరుగున వచ్చారు. వారితోపాటు చిన్నచిన్న పిల్లలు కూడా పరుగులెడుతూ ఆతృతగా వచ్చి నన్ను కలిశారు. ఆ పిల్లలంతా మట్టికొట్టుకుని ఉన్నారు. తలలు మాసిపోయాయి. బట్టలు మాసిన చిరుగుపాతలు. ఆ పిల్లలను దగ్గరకు తీసుకుని వారి చేతులు తడిమాను. ఆ అరచేతులు కాయలు కాసి ఉన్నాయి. ఏమైందమ్మా.. అని వారి తల్లులను అడిగాను. ఆ పిల్లలు కూడా ఇటుక బట్టీలలో పనిచేస్తున్నారట. పలకాబలపం పట్టాల్సిన చిట్టిచేతులు మట్టితట్టలు మోయాల్సి వస్తోందని తెలిసి కలతచెందాను. ఆటపాటలతో, చదువులతో వెల్లివిరియాల్సిన బాల్యం ఇటుక బట్టీలలో వాడిపోతోందని తెలిసి చాలా బాధపడ్డాను. పిల్లలను బడులకు పంపించాలమ్మా.. అని అనగానే.. ‘తినడానికే లేదు. ఇక చదువులెక్కడ సార్.. మాకూ చదివించుకోవాలనే ఉంది. కానీ బడికెట్లా పంపం?’ అన్నారు. ఇలాంటి తల్లుల కోసమే నవరత్నాలలో పొందుపర్చిన అమ్మఒడి పథకం గురించి వివరించాను. పిల్లలను బడికి పంపితే ఆ తల్లులకు సంవత్సరానికి రూ.15,000 ఇస్తానని చెప్పాను. అది విన్నాక తమ పిల్లల్ని ఇబ్బందుల్లేకుండా బాగా చదివించుకునే రోజులు రానున్నాయన్న ఆనందం వారిలో కనిపించింది. ఆ పిల్లలను పెద్ద చదువులు చదివించి, గొప్ప స్థానాల్లో చూడాలన్న నా ఆశయాన్ని తెలియజేసినప్పుడు ఆ తల్లుల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది.


భోజన విరామానికి ముందు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రతినిధులు కలిశారు. చంద్రబాబు వారినెలా మోసం చేశాడో చెప్పారు. నాన్నగారి హయాంలో 13 వేల దేవాలయాలకు ధూప దీప నైవేద్యాల కింద రూ.2,500 ఇచ్చేవారు. బాబుగారు ఆ దేవాలయాల సంఖ్యను మూడు వేలకు కుదించివేశాడు. ఎన్నికలప్పుడు ఓట్లకోసం.. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి రూ.500 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ కార్పొరేషన్‌కు ఇస్తానన్న నిధులు ఇవ్వకపోగా, అన్యాయాన్ని ప్రశ్నించిన సదరు కార్పొరేషన్ చైర్మన్‌ను రాత్రికిరాత్రి అవమానకరంగా తొలగించి, కార్పొరేషన్‌ను చంద్రబాబు నిర్వీర్యం చేశారని వాపోయారు. మంచి పథకాలకు తూట్లు పొడవడం, అబద్ధపు హామీలతో నెట్టుకురావడం బాబుగారికి ఉగ్గుపాలతో పెట్టిన విద్యమరి.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ఎన్నికలకు ముందు ఓట్లకోసం అన్ని కులాలకూ తాయిలాలు ప్రకటించి, బూటకపు హామీలిచ్చి, అవసరం తీరాక వాటిని తీర్చకపోగా.. ప్రశ్నించిన కుల సంఘాలను బెదిరించడాన్ని ఏమనుకోవాలి? అది దేనికి సంకేతం? అదే మీ నైజమా?

వైఎస్. జగన్.

ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నాం

దావోస్ ఆర్థిక వేదిక సదస్సులో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబుఅన్నారు. ఇన్విజిబుల్ గవర్నమెంట్, విజిబుల్ గవర్నెన్స్ తమ విధానమన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మూడో రోజు బుధవారం ‘ఇంటరాక్టివ్ లంచ్‌ఆన్ ప్రోగ్రాం’లో ‘టెక్నాలజీ ఫర్ ఇన్నోవేషన్స్’ అంశంపై ఆయన మాట్లాడారు. మీ ఫోకస్ ఏమిటని ఓ ప్రతినిధి అడగ్గా.. ప్రభుత్వానికి వచ్చే ప్రతి వినతిని పరిష్కరించడమేనని సీఎం చెప్పారు. కాగా, సీఐఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఐఐని కోరారు. కాగా దావోస్‌లో చంద్రబాబు బుధవారమూ పలు సంస్థల అధిపతులతో సమావేశమయ్యారు. వ్యవసాయ యూపీఎల్ సంస్థ గ్లోబల్ సీఈవో జై ష్రాఫ్‌తో భేటీ అయ్యారు. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ వర్సిటీ ప్రెసిడెంట్ సుబ్రా సురేష్‌తో కూడా సమావేశమయ్యారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీకి చెందిన ఎథేరియం వ్యవస్థాపకుడు జో లుబిన్‌తో సమావేశమై.. బ్లాక్ చైన్ టెక్నాలజీ 3 నెలల కోర్సును ప్రారంభించాలని కోరారు. హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్ స్టీఫెన్ నిగ్రోతోనూ, ఎయిర్‌బస్ డిఫెన్స్ సంస్థ సీఈవో డిర్క్ హోక్‌తో సమావేశమయ్యారు. రహేజా గ్రూప్ ప్రతినిధి రవి రహేజాతోనూ సమావేశమయ్యారు.



సీఎం కుర్చీలో బాలయ్య

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి కుర్చీలో ఆయన బావమరిది, ఎమ్మెల్యే బాలకృష్ణ కూర్చుని సమీక్షా సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బాలకృష్ణ బుధవారం లేపాక్షి ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సమావేశాలు నిర్వహించే మందిరంలో ఆయన కూర్చునే కుర్చీలో బాలకృష్ణ కూర్చున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పలువురు ఐఏఎస్‌లు బాలకృష్ణకు ఎదురుగా కూర్చోవడం విశేషం. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనలో ఉండగా ఎమ్మెల్యే హోదాలో ఉన్న ఆయన బావమరిది.. ఆయన కుర్చీలో కూర్చుని సమీక్ష నిర్వహించడంపై అధికారులే విస్తుపోయారు. కానీ సీఎంకు బావమరిది కావడంతో ఏం మాట్లాడలేక మిన్నకుండిపోయారు. అదే సమయంలో మంత్రి హోదాలో ఉన్న దేవినేని బాలయ్య ఎదుట కూర్చుని ఆయనడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం గమనార్హం. దీనిపై మీడియాలో వార్తలు రావడం, ఏ హోదాలో సీఎం కుర్చీలో కూర్చుంటారని విమర్శలు రావడంతో బుధవారం మధ్యాహ్నం జరిగిన సమావేశంలో బాలకృష్ణ సీఎం కుర్చీలో కాకుండా పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని సమీక్ష నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా తులసీ రామకృష్ణారెడ్డి

సాక్షి, హైదరాబాద్: చిత్తూరు జిల్లా పూతలపట్టు శాసనసభ నియోజక వర్గానికి చెందిన పీఆర్ తులసి రామకృష్ణారెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

విదేశీ టూర్లతో ఉద్యోగాలొస్తాయా?

నాలుగేళ్లలో 22 సార్లు వెళ్లావ్.. ఎన్ని ఉద్యోగాలిచ్చావ్ చంద్రబాబూ?

నాయుడుపేట సభలో సీఎంను నిలదీసిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



నెల్లూరు జిల్లా నాయుడుపేటలో జరిగిన బహిరంగ సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

‘విదేశాలు పట్టుకు తిరిగితే ఉద్యోగాలు వస్తాయా? ఉద్యోగాల పేరు చెప్పి నాలుగేళ్లలో 22 సార్లు విదేశాలకు వెళ్లొచ్చి సాధించిందేమిటి? ఓ వైపు రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెబుతూ.. మరోవైపు రూ.200 కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేటు విమానాలలో పర్యటనల కోసం ఖర్చు చేస్తావా?’ అని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 70వ రోజు బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఏ హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. జగన్ ఇంకా ఏమన్నారంటే..

పక్కనే స్వర్ణముఖి.. అయినా తాగునీరు లేదు..

సూళ్లూరుపేట నియోజకవర్గంలో రెండో రోజూ ప్రజలు ఆదరాభిమానాలు, ప్రేమాప్యాయతలు చూపిస్తూనే వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని నా దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా తాగడానికి నీళ్లు లేవన్నా.. అని నేను పర్యటించిన ప్రతి ఊళ్లో చెప్పారు. స్వర్ణముఖి నది పక్కనే ఉన్నా తమకీ దుస్థితి ఏమిటని అడిగారు. చంద్రబాబు నాలుగేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు తాగడానికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. వాస్తవానికి నెల్లూరు జిల్లా వరికి పెట్టింది పేరు. రబీలో ఇక్కడ వేసే వరి పంట తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కూడా వేయరు. కానీ బాధాకరమైన విషయం ఏమిటంటే గత ఖరీఫ్‌లో లక్ష హెక్టార్లలో వరి వేయాల్సి ఉంటే 39 వేల హెక్టార్లలో మాత్రమే సాగయింది. పక్కనే సోమశిల ఉంది. కానీ మన ఖర్మ ఏమిటంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. కాస్తో కూస్తో ఆ దేవుడు కరుణించి వర్షాలు కురవడంతో రబీ పంటయినా బతికింది. లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదో.. ఈ ప్రాంతానికి నీటి ఎద్దడి ఉండకూడదన్న ఉద్దేశంతో ఆనాడు నాన్నగారు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 44 వేల క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యంతో పనులకు పూనుకున్నారు. ఆ హెడ్ రెగ్యులేటర్, ఫ్లడ్ ఫ్లో కెనాల్ పూర్తయితే సోమశిలకు నీటి కొరత ఉండేది కాదు. ఆ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేయలేదు. ఇదే కాదు.. సోమశిల–స్వర్ణముఖి ప్రాజెక్టు గుర్తుందా? ఇప్పటికీ కెనాల్స్ అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఆ ఫ్లడ్ ఫ్లో కెనాల్‌కు నాన్నగారి హయాంలో రూ.400 కోట్లకు గాను రూ.180 కోట్లు ఖర్చు చేసి 60 శాతం పనులు పూర్తి చేయిస్తే ఈ నాలుగేళ్లలో చంద్రబాబు ఆ మిగిలిన 40 శాతం పనుల్ని పూర్తి చేయలేకపోయారు. అదేగనుక పూర్తయి ఉంటే నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని 316 చెరువులకు నీళ్లు వచ్చి ఉండేవి. ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండేది. కానీ ఈ పెద్దమనిషి చంద్రబాబుకు రైతులు పట్టరు.

పులికాట్‌ను గాలికొదిలేశారు

దేశంలోని ఉప్పునీటి సరస్సుల్లో రెండవ పెద్దదైన పులికాట్ ఈ జిల్లాలో ఉంది. 30 వేల మంది మత్స్యకారులు దీనిపై ఆధారపడి బతుకుతారు. కానీ ఈ వేళ ఆ సరస్సుకున్న రెండు ముఖ ద్వారాలు ఇసుక మేటలతో మూసుకుపోయాయి. ఫలితంగా చేపలు సరిగా దొరకని పరిస్థితి. ఇసుక మేటల్ని తొలగిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు ఒక్కసారి అయినా ఈ విషయమై ఆలోచన చేశారా? ఆయనకు పులికాట్ పట్టదు.. రైతులు, మత్స్యకారుల సమస్యలు పట్టవు. వాళ్లు ఎట్లా పోయినా పర్వాలేదు ఆయనకు. కానీ వీళ్లు మళ్లీ ఎప్పుడు గుర్తుకువస్తారో తెలుసా? ఎన్నికలప్పుడు మాత్రమే. ప్రజల్ని ఎలా మోసం చేయాలన్నది మాత్రమే ఆయనకు గుర్తుకు వస్తుంది. జిల్లాలో కృష్ణపట్నం పోర్టు, దుగరాజపట్నం పోర్టులనే చూడండి. టెంకాయలు కొట్టాడు, మరిచి పోయాడు.

రూ.200 కోట్ల ప్రజాధనం బూడిద పాలు

ఉద్యోగాల కోసమంటూ చంద్రబాబు దేశదేశాలు పోతాడు. ఇపుడు దావోస్ వెళ్లాడు. ఈ నాలుగేళ్లలో ఈ పెద్దమనిషి 22 సార్లు విదేశీ పర్యటనలు చేశారు. విదేశాలకు ప్రైవేట్ విమానాల్లో పోతాడు. మన ఉద్యోగాల పేరిట ఆయన గారి ఈ విదేశీ పర్యటనలకు అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాల రూ.200 కోట్లు. మన పేరు చెప్పి ఇంత ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరు మాదిరి చేశారు. కబుర్లు చెప్పే చంద్రబాబు మన రాష్ట్రానికి ఒక్కటైనా శాశ్వత కట్టడాన్ని కట్టలేకపోయారు. ఒక అసెంబ్లీ, ఒక హైకోర్టు, ఒక సచివాలయాని కైనా పర్మినెంట్‌గా ఒక్క ఇటుకనైనా వేయలేదు. ఎంత అధ్వానపు సీఎం అయినా ఈ నాలుగేళ్ల లో కళ్లు మూసుకుని హైకోర్టు, అసెంబ్లీ, సచి వాలయాన్ని కట్టేవారు. బాబు మాత్రం కంప్యూటర్లలో డిజిటల్ ప్రజంటేషన్లు చూపిస్తా డు. అంతా షోనే. ఆ షో కు రాజమౌళి అని సినిమా డైరెక్టర్‌ను పిలుస్తాడు. నాకు అర్థం కాక అడుగుతా.. అసలు సినిమా డైరెక్టర్లేంది, అసెంబ్లీ బిల్డింగ్, సచివాలయం, హైకోర్టు ఏందీ? ఆర్కిటెక్ట్ చేయాల్సిన పని ఆర్కిటెక్ట్ చేయాలి.. సినిమా వాళ్లు సినిమా పని చేయా లి. కానీ బాబు మాత్రం మనకు షో చూపిస్తా డు. (జనం నుంచి అరుపులు, కేకలు) పెద్ద సినిమా చూపిస్తాడు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

సాక్షి భవిత
స్వయం వర్ధతే విద్య
13
గురువారం 25-1-2018

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

టీఎస్‌పీఎస్సీ.. 125 'ల్యాబ్ టెక్నీషియన్' పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)... డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లో 36 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్(2), తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ)లో 86 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఈ రెండు విభాగాలతోపాటు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ)లోను కలిపి 200 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి డిసెంబర్ 2017లో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు తాజా పోస్టులను చేర్చుతూ సవరణ ఇచ్చింది. అలాగే దరఖాస్తు గడువును ఫిబ్రవరి 10, 2018కి పెంచింది. ఇంటర్మీడియెట్‌తోపాటు డీఎంఎల్‌టీ/బీఎస్సీ(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులై ఏపీ/టీఎస్ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకున్న వాళ్లు అర్హులు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: tspsc.gov.in



బయాలజీ (తె.మీ)



ప్రపంచానికి లెక్కలు నేర్పిన ఘనత మనది. ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, శ్రీనివాస రామానుజన్, ఇలా మహా మేధావులెందరో గణితశాస్త్ర అభివృద్ధికి కృషి చేశారు. గణితం అంటే కేవలం ఒక సబ్జెక్టే కాదు,ఇతర విభాగాల్లోనూ దీన్ని పాత్ర కీలకం. నిర్మాణ రంగంలో ఇంజనీర్లకు, ఐటీ రంగంలో కంప్యూటర్ ప్రోగ్రామర్లకు, ఫైనాన్షియల్ రంగంలో, అకౌంట్స్, ఖగోళ శాస్త్ర వేత్తలకు... ఇలా అన్ని విభాగాల్లో మ్యాథ్స్ మిళితమై ఉంటుంది. మ్యాథ్స్‌తో కెరీర్ స్కోప్, కోర్సులు, ఉండాల్సిన స్కిల్స్ గురించి వివరాలు తెలుసుకుందాం..

కెరీర్ @ మ్యాథ్స్

తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మ్యాథ్స్‌పై పట్టు సాధించడం ద్వారా జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్,ఎంసెట్, క్యాట్ తదితర ప్రవేశ పరీక్షల్లో రాణిస్తున్నారు. తెలుగు విద్యార్థులేకాకుండా దేశంలోని చాలా మంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టు ఉండేలా చూసుకుంటారు. చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఐ),ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఐఐఎస్సీ వంటి ప్రముఖ విద్యా సంస్థలు మ్యాథమెటిక్స్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిల్లో డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, పీజీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీ స్థాయి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

బోధన వృత్తి

మ్యాథ్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన వారు సబ్జెక్టుపై పట్టు ద్వారా.. బోధన, పరిశోధన, సాఫ్ట్‌వేర్, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లు.. ఇలా వివిధ మార్గాల్లో ఉపాధి అవకాశాలు పొందొచ్చు. దేశంలో ఐఐటీ జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ లాంటి ప్రవేశ పరీక్షలకు విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ పరీక్షల్లో మ్యాథ్స్‌దే అగ్రభాగం. ఇందులో సాధించే మార్కులే ర్యాంకు సాధించడంలో కీలకం. ఈ పరీక్షకు బోధించాలంటే మ్యాథ్స్‌పై గట్టిపట్టు ఉండాలి. గణిత సమస్యలకు వేగంగా సమాధానాలు గుర్తించడం, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేగలిగితే జేఈఈ, ఎంసెట్ కోచింగ్ సంస్థల్లో అవకాశాలు పొందొచ్చు. ఐఐటీ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షకు కోచింగ్ హడావుడి అంతాఇంతా కాదు. ఇంటర్‌లో రూ.లక్షలు చెల్లించి కార్పొరేట్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. అక్కడ మ్యాథ్స్ టీచర్లే ప్రధానం కాబట్టి వీరికి మంచి డిమాండ్ ఉంది. ఇంజనీరింగ్‌లోనూ మ్యాథ్స్ సబ్జెక్టు తప్పనిసరిగా ఉంటుంది. పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి ఇంజనీరింగ్ కళాశాలలు అవకాశాలు కల్పిస్తున్నాయి.

ఇతర ప్రవేశ పరీక్షలకూ

ఐఐటీ, ఎంసెట్, ఇంజనీరింగ్ విభాగాల్లోనే కాదు.. జీఆర్ఈ, శాట్, క్యాట్, జీమ్యాట్, ఇతర పీజీ ప్రవేశ పరీక్షలు; ఐసెట్, ఎస్ఎస్‌సీ వంటి పోటీ పరీక్షలకు మ్యాథ్స్ నిపుణుల అవసరం ఉంటుంది. ఆయా కోర్సులు ఆఫర్ చేసే ఇన్‌స్టిట్యూట్లల్లో బోధించడం, సొంతంగా కోచింగ్ సెంటర్ ప్రారంభించడం లేదా ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్పడం వంటి ఉపాధి వేదికలకు కొదవలేదు. ముఖ్యంగా ఇప్పుడు యూపీఎస్సీ ప్రిలిమ్స్, ఎస్ఎస్‌సీ, బ్యాంకు పీవో, క్లర్క్, స్పెషలిస్టు ఆఫీసర్, రైల్వే ఉద్యోగాలు మొదలైన వాటికి మ్యాథ్స్ సంబంధిత క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ తప్పనిసరిగా ఉంటుంది. చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సబ్జెక్టుపై పట్టుంటే.. ఈ రంగంలో పేరు సంపాదించుకోవడంతోపాటు మంచి వేతనాలు లభిస్తాయి.

ప్రభుత్వ ఉద్యోగాలు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వంటి పోస్టుల భర్తీకి పీజీ/ పీహెచ్‌డీ అర్హతగా నిర్ణయిస్తారు. యూజీసీ నెట్ పరీక్షల్లో అర్హత సాధిస్తే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఒకవేళ ఇందులో టాప్‌లో నిలిస్తే జేఆర్ఎఫ్ కూడా లభిస్తుంది. దీంతో నెలకు దాదాపు రూ.34వేలు అందుకోవచ్చు. దీంతోపాటు పీహెచ్‌డీ పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుంది. మ్యాథ్స్‌లో డిగ్రీ పూర్తి చేసి బీఈడీ చేసిన వారు ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ పోస్టులకు పోటీపడవచ్చు. ఈ పోస్టులకు ఎంపికైతే మంచి వేతనాలతో పాటు సుస్థిరమైన కెరీర్ ఏర్పరచుకోవచ్చు. మ్యాథ్స్ అభ్యర్థులు ఈవిధంగా బోధనరంగంలో అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

డేటా సైన్స్

సాంకేతిక రంగంలో సరికొత్త విప్లవం డేటాసైన్స్. భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి టెక్నాలజీలదే అనే అంచనా. వీటన్నింటికి గణితం నిపుణుల అవసరం ఉంటుంది. కాబట్టి మ్యాథ్స్, సంబంధించిన సబ్జెక్టుల్లో పీజీ చేస్తే డేటా సైంటిస్టులుగా రాణించవచ్చు. డేటా సైంటిస్టులకు మంచి వేతనాలు, ఉన్నతమైన కెరీర్ లభిస్తుంది. ప్రోగ్రామ్‌కు లాజిక్ రాయాలంటే మ్యాథ్స్‌పై అవగాహన ఉంటేనే సులువవుతుంది. మ్యాథ్స్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్ చదివిన వారిని సాఫ్ట్‌వేర్ సంస్థలు నియమించుకుంటున్నాయి. వీరు సాఫ్ట్‌వేర్ రంగంలో బిజినెస్ అనలిస్టుగా, ఆపరేషన్స్ రీసెర్చ్ ఎనలిస్ట్, కంప్యూటర్ సిస్టం ఎనలిస్ట్ తదితర హోదాలతో రాణించవచ్చు.

పీజీలో స్పెషలైజేషన్లు

కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఐటీ వంటి డిమాండ్ ఉన్న కోర్సుల్లో చేరడానికి మ్యాథ్స్ నేపథ్యం తప్పనిసరి. అంటే.. మ్యాథ్స్‌ను కేవలం ఒక సబ్జెక్టులా కాకుండా.. దాన్ని ఆధారంగా కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడానికి ఉన్న అవకాశాలను వెతుక్కోవాలి. మ్యాథ్స్‌ను డిగ్రీలో ఒక సబ్జెక్టుగా చదివినా, లేక ఆనర్స్‌గా కోర్సు పూర్తి చేసినా చాలా అవకాశాలు లభిస్తాయి. పీజీ స్థాయిలో కొన్ని సంస్థల్లో గణితంలోనూ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని యూనివర్సిటీల క్యాంపస్ కళాశాలల్లో మ్యాథ్స్ యూజీ, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆయా యూనివర్సిటీల అనుబంధ కళాశాలల్లోనూ మ్యాథ్స్ కోర్సు నిర్వహిస్తున్నారు.

కొన్ని ముఖ్యమైన ఇన్‌స్టిట్యూట్స్

- చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- **వెబ్‌సైట్:** http://www.cmi.ac.in/admissions
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్, చెన్నై
- **వెబ్‌సైట్:** https://www.imsc.res.in
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు
- వెబ్‌సైట్: http://www.math.iisc.ac.in/
- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
- వెబ్‌సైట్: http://www.uohyd.ac.in/
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్
- వెబ్‌సైట్: http://www.tifr.res.in/
- ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (కలకత్తా,చెన్నై, న్యూఢిల్లీ, హైదరాబాద్, బెంగళూర్, తేజ్‌పూర్, గిరిధ్)
- వెబ్‌సైట్: https://www.isical.ac.in/
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణే, తిరువనంతపురం
- వెబ్‌సైట్: www.iiserb.ac.in
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, భువనేశ్వర్ ❖ వెబ్‌సైట్:http://sms.niser.ac.in/
- హరీశ్ – చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అలహాబాద్,
- వెబ్‌సైట్: http://www.hri.res.in/
- ఐఐటీ ఢిల్లీ, గాంధీనగర్, హైదరాబాద్, కాన్పూర్, ఖరగ్‌పూర్, మద్రాస్, రూర్కీ, రోపార్.
- వీటిల్లో ప్రవేశాలు జామ్ ద్వారా జరుగుతాయి.



కెనరా బ్యాంక్ 450 పీవో పోస్టులు

కెనరా బ్యాంక్ 450 ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్-బెంగళూరు లేదా ఎన్ఐటీటీఈ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్-మంగుళూరుల్లో ఏదో ఒకచోట ఏడాదిపాటు పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు చదవాల్సి ఉంటుంది. అనంతరం పీవో లేదా అసిస్టెంట్ మేనేజర్ హోదాతో కెనరా బ్యాంక్‌లో ఉద్యోగం కల్పిస్తారు. ఈ నేపథ్యంలో... కెనరాబ్యాంక్‌లో పీవో పోస్టుల భర్తీ ప్రక్రియ, నోటిఫికేషన్ సమాచారం గురించి తెలుసుకుందాం...

- **మొత్తం ఖాళీలు:** 450 (అన్ రిజర్వ్‌డ్-227, ఓబీసీ-121, ఎస్సీ-67, ఎస్టీ-35)
- **అర్హత:** 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 55శాతం)
- **వయోపరిమితి:** జనవరి1, 2018 నాటికి కనిష్టంగా 20, గరిష్టంగా 30 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తుకు ప్రారంభ తేదీ:** జనవరి 9, 2018
- **దరఖాస్తుల చివరి తేదీ:** జనవరి 31, 2018
- **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.118, మిగిలిన అందరికీ రూ.708 (జీఎస్టీతో కలిపి)
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **పరీక్ష తేదీ:** మార్చి 4, 2018
- **కాల్ లెటర్లు:** ఫిబ్రవరి 20 తర్వాత డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ❖ **పరీక్ష కేంద్రాలు:** ఏపీ–చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
- తెలంగాణ– హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
- **వెబ్‌సైట్:** www.canarabank.com

ఆన్‌లైన్ పరీక్ష విధానం

రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ఐబీపీఎస్ నిర్వహించే ఈ పరీక్షల్లో సెక్షనల్‌వారీ కటాఫ్‌లు, నెగిటివ్ మార్కులు(ప్రతి తప్పుకు 1/4 నెగెటివ్ మార్కులు) ఉంటాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు.

- ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఉన్న ఖాళీలకు మూడు రెట్లు అధికంగా అభ్యర్థులను జీడీ, ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. జీడీ(50), ఇంటర్వ్యూ(50)లు రెండూ 100 మార్కులకు ఉంటాయి. ఆన్‌లైన్ పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూల వెయిటేజీ 50:20:30 గా ఉంటుంది.

ప్రిపరేషన్ విధానం


- **రీజనింగ్:** నాన్–మ్యాథ్స్ అభ్యర్థులు సైతం సులభంగా చేయొచ్చు. కోడింగ్– డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజమ్, ఫజిల్ టెస్ట్, ఇన్‌పుట్–అవుట్‌పుట్, డేటా సఫిషియన్సీ, స్టేట్‌మెంట్–అజమ్షన్స్, ఆర్గుమెంట్స్, కోర్సెస్ ఆఫ్ యాక్షన్, ఇన్ఫరెన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లు రెండింటిలోనూ ఈ విభాగం ఉంది. రీడింగ్ కాంప్రహెన్షన్, ఫైండింగ్ ఎర్రర్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సెంటెన్స్ కంప్లీషన్స్, రీ అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, క్లోజ్‌టెస్ట్, సినినిమ్స్, యాంటనిమ్స్ నుంచి ఆబ్జెక్టివ్ ప్రశ్నలుంటాయి. ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. డిస్క్రిప్టివ్ టెస్ట్ గట్టెక్కాలంటే.. రైటింగ్ స్కిల్స్‌పై పట్టుండాలి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగంలో సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్, డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, అర్థమెటిక్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలుంటాయి. అర్థమెటిక్‌లో రేషియో, పర్సంటేజి, టైమ్–వర్క్, పర్ముటేషన్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలు ముఖ్యమైనవి. డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 20–25 ప్రశ్నలుంటాయి. కాలిక్యులేషన్స్ వేగంగా చేయగలిగితే సులభంగా విజయం సాధించవచ్చు.
- **జనరల్ అవేర్‌నెస్:** బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్టాక్‌మార్కెట్, వ్యక్తులు, పుస్తకాలు, రచయితలు, అవార్డులు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లోని వర్తమాన అంశాలకు చెందిన ప్రశ్నలుంటాయి.

పీజీడీబీఎఫ్ కోర్సు

ఆన్‌లైన్ పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూల్లో అర్హత సాధించిన అభ్యర్థులు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్–బెంగళూరు లేదా ఎన్ఐటీటీఈ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్–మంగుళూరుల్లో ఏదో ఒకచోట ఏడాది పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు చదవాల్సి ఉంటుంది. మణిపాల్‌ను ఎంచుకున్న అభ్యర్థులు వసతి, భోజనం, కోర్సు, ఇతర అన్నీ రకాల ఫీజులు కలుపుకుని రూ. 4.13 లక్షలు, ఎన్ఐటీటీఈను ఎంచుకున్న వారు రూ.3.54 లక్షలు చెల్లించాలి. ఈ మొత్తాన్ని తక్కువ వడ్డీతో లోన్ సదుపాయం కల్పిస్తారు. ఉద్యోగంలో చేరిన తర్వాత సులభ పద్ధతిలో వాయిదాల ద్వారా చెల్లించవచ్చు. ఈ ఏడాది శిక్షణలో 9 నెలలు క్లాస్‌రూం టీచింగ్, చివరి మూడు నెలలు ఏదైనా కెనరా బ్యాంక్ శాఖలో ఇంటర్న్‌షిప్ చేయాలి. విజయవంతంగా కోర్సు పూర్తిచేసిన తర్వాత ఐదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగు తామని ఒప్పంద పత్రం సమర్పించాలి. మధ్యలో వైదొలిగితే లోన్ తీసుకున్న ఫీజుతో పాటు అదనంగా రూ.లక్ష చెల్లించాలి. విధుల్లో చేరిన తర్వాత రూ.23,700 బేసిక్ శాలరీతో పాటు డీఏ, హెచ్‌ఆర్ఏ, ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. రెండేళ్ల ప్రొబేషన్ పూర్తయిన తర్వాత శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తారు. ఐదేళ్ల సర్వీసును పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఏడాదికి కొంత మొత్తం చొప్పున పదేళ్ల సర్వీసు పూర్తయ్యే లోపు కోర్సు ప్రారంభంలో చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చేస్తారు.

నూతన చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఓం ప్రకాశ్ రావత్





కాంపిటీటివ్ గైడెన్స్
కరెంట్ అఫైర్స్

జాతీయం

సమ్మిళిత అభివృద్ధి సూచీలో భారత్‌కు 62వ స్థానం

అభివృద్ధి చెందుతున్న దేశాల సమ్మిళిత అభివృద్ధి సూచీలో భారత్‌కు 62వ స్థానం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత సమ్మిళిత ఆధునిక వ్యవస్థల జాబితాలో నార్వే మొదటి స్థానంలో ఉండగా, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల జాబితాలో లిథ్వేనియా తొలి స్థానంలో నిలిచింది. ఈ సూచీని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో(జనవరి 22న) విడుదల చేశారు. ఇందులో పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్‌ల కంటే భారత్ వెనుకబడి ఉంది. జీవనప్రమాణాలు; పర్యా వరణ పరిరక్షణ; రుణ భారం నుంచి భావితరాలను కాపాడటం; అభివృద్ధి–సుస్థిర ప్రగతి; సమ్మిళిత వృద్ధి; తరాల మధ్య సమానత్వం వంటి అంశాల ఆధారంగా సూచీని రూపొందించారు. భారత్‌కు అభివృద్ధి–సుస్థిర ప్రగతిలో 66వ స్థానం, తరాల మధ్య సమానత్వంలో 44వ స్థానం దక్కింది.

ఆకర్షణీయ నగరాల జాబితాలోకి మరో తొమ్మిది

ఆకర్షణీయ నగరాల ప్రాజెక్టులో కొత్తగా తొమ్మిది నగరాలు చేరాయి. దీంతో వీటి సంఖ్య 99కి చేరింది. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ, మొరాదాబాద్, సహరన్‌పూర్; తమిళనాడులోని ఈరోడ్; బిహార్‌లోని బిహార్‌షరీఫ్, దాద్రా నగర్ హవేలీలోని సిల్వాసా, లక్షద్వీప్‌లోని కవరత్తి; అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్ తదితర నగరాలు తాజా జాబితాలో ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ జనవరి 19న ప్రకటన చేశారు.

ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

లాభదాయక పదవుల్లో కొనసాగిన 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అనర్హత వేటు వేశారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం జనవరి 21న నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంటరీ కార్యదర్శులుగా కొనసాగిన ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘం సిఫారసు చేయడంతో రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నారు.

హజ్ రాయితీ రద్దు



హజ్ యాత్రలో భాగంగా మక్కా వెళ్లేవారికి ఇక నుంచి రాయితీ ఉండదని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ జనవరి 16న ప్రకటించారు. హజ్ రాయితీలతో ముస్లింలకు ఎలాంటి ప్రయోజనం చేకూరట్లేదని, ఇక నుంచి ఆ మొత్తాన్ని మైనార్టీల అభివృద్ధి, సాధికారతకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు 2012లో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కాగా, భారత్ నుంచి ఓడల ద్వారా హజ్ యా త్రికులను అనుమతించేందుకు సౌదీ అరేబియా సూత్రప్రాయంగా అంగీకరించింది.

అంతర్జాతీయం

అమెరికాలో ముగిసిన షట్‌డౌన్



అమెరికాలో జనవరి 19 అర్ధరాత్రి 12.01 గంటల(స్థానిక కాలమానం ప్రకారం)కు మొదలైన షట్‌డౌన్..జనవరి 22న ముగిసింది. అమెరికా పాలనా యంత్రాంగ నిర్వహణా ఖర్చులను నిర్దేశించే వినిమయ బిల్లును ఆ దేశ సెనేట్ తిరస్కరించింది. దీంతో పెంటగాన్ సహా ఇతర కేంద్ర సంస్థల నిర్వహణకు అవసరమైన నిధులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అనంతరం రిపబ్లికన్లు, డెమొక్రాట్ల మధ్య సయోధ్య కుదరడంతో ఫెడరల్ ప్రభుత్వానికి నిధులు సమకూరుస్తూ సెనేటర్లు ఆమోదం తెలిపారు. దీనికి సంబంధించిన దస్త్రంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. గతంలో 2013, అక్టోబర్‌లో 16 రోజులు; 1996లో 21 రోజులపాటు షట్‌డౌన్ కొనసాగింది.

ఆస్ట్రేలియా గ్రూప్‌లో భారత్

భారత్‌కు జీవ, రసాయన ఆయుధాల నియంత్రణ సంస్థ.. ఆస్ట్రేలియా గ్రూప్‌లో చోటు దక్కింది. ఈ గ్రూప్.. జీవ, రసాయన ఆయుధాల తయారీ నిరోధానికి కృషిచేస్తుంది. ఇందులో భాగంగా జీవాయుధాల తయారీకి అవసరమైన పరికరాలు, ముడిపదార్థాలు, సాంకేతికత వ్యాప్తిని వ్యతిరేకించే దేశాలను సమన్వయం చేస్తుంది.

వార్తల్లో వ్యక్తులు

ఓం ప్రకాశ్ రావత్: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా ఓం ప్రకాశ్ రావత్ జనవరి 23న బాధ్యతలు చేపట్టారు. 1977 ఐఏఎస్ బ్యాచ్, మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన రావత్..భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శిగా పనిచేసి.. రిటైర్ అయ్యారు. కాగా, ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక లావసా కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా నియమితులయ్యారు.

ఆనందిబెన్:



గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జనవరి 19న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

చండీ లాహిరీ: ప్రముఖ కార్టూనిస్టు, రచయిత చండీ లాహిరీ (87) జనవరి 18న కోల్‌కతాలో మరణించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన లాహిరీ 1952లో పాత్రికేయుడిగా వృత్తి జీవితం ప్రారంభించారు. తర్వాత కొన్నేళ్లకు పూర్తి స్థాయి కార్టూనిస్టుగా మారి విశేష కీర్తి గడించారు. దీంతోపాటు ఆయన అనేక పుస్తకాలను రచించారు.

ఏపీ ఎన్నికల ప్రధాన అధికారిగా సిసోడియా:



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ప్రధాన అధికారి (సీఈఓ)గా ఆర్‌పీ సిసోడియా నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న సిసోడియాను సీఈఓగా నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జనవరి 18న ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్ఎస్‌జీ డీజీగా సుదీప్ లఖ్టాకియా: అత్యంత ప్రముఖుల వ్యక్తిగత భద్రతా బాధ్యతలను నిర్వహించే నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్(డీజీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సుదీప్ లఖ్టాకియా జనవరి 19న నియమితులయ్యారు. 1984 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన లఖ్టాకియా ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డీజీగా పనిచేస్తున్నారు. బ్లాక్ క్యాట్స్‌గా పిలిచే ఎన్ఎస్‌జీ గుర్‌గావ్‌లోని మనేసర్ కేంద్రంగా పనిచేస్తుంది.

రాష్ట్రీయం

విశాఖలో మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు

భారత మహిళా పారిశ్రామికవేత్తల సమాఖ్య(అలీప్), దక్షిణాసియా మహిళాభివృద్ధి ఫోరం(ఎస్ఏడబ్ల్యూడీఎఫ్)ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జనవరి 17న అంతర్జాతీయ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ఏపీ సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

అగ్ని-5 క్షిపణి పరీక్ష విజయవంతం



అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని–5ను భారత్ జనవరి 18న అబ్దుల్ కలాం దీవి (ఒడిశా)లోని సమీకృత పరీక్ష వేదిక(ఐటీఆర్) నుంచి 5వసారి విజయవంతంగా పరీక్షించింది. కాగా, సైనిక దళాల సమక్షంలో ఈ క్షిపణిని ప్రయోగించడం ఇదే తొలిసారి. అగ్ని–5..19 నిమిషాల్లో 4,900 కిలోమీటర్లు ప్రయాణించింది.

ఆర్థికం

29 వస్తువులు, 54 సేవలపై జీఎస్టీ తగ్గింపు

29 వస్తువులు, 54 విభాగాల్లోని సేవలపై పన్ను తగ్గించాలని జనవరి 18న న్యూఢిల్లీలో సమావేశమైన వస్తు–సేవల పన్ను (జీఎస్టీ) మండలి నిర్ణయించింది. తాజా నిర్ణయం ఈ నెల 25 నుంచి అమల్లోకి రానుంది. సమావేశంలో చిన్న వ్యాపారులపై పన్ను మదింపు భారం తగ్గేలా.. జీఎస్టీ రిటర్నుల దాఖలు ప్రక్రియను సరళతరం చేయడంపై చర్చ జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు.

క్రీడలు

ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా కోహ్లీ

- భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ (గ్యారీఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ) అవార్డు దక్కింది. దీంతోపాటు ఐసీసీ టెస్ట్ టీం ఆఫ్ ది ఇయర్, వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్‌కు కోహ్లీ కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. ఐసీసీ వార్షిక అవార్డులను జనవరి 18న దుబాయ్‌లో ప్రకటించారు.

అవార్డు విజేతలు

- ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్: స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా)
- ఐసీసీ అసోసియేట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్: రషీద్ ఖాన్ (అఫ్గానిస్తాన్)
- ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్: హసన్ అలీ(పాకిస్తాన్)
- ఫ్యాన్స్ మూమెంట్ ఆఫ్ ది ఇయర్: పాకిస్తాన్ చాంపియన్స్ ట్రోఫీ కైవసం చేసుకోవడం.
- ఐసీసీ అంపైర్ ఆఫ్ ది ఇయర్: మరాయిస్ ఎరాస్‌మస్ (దక్షిణాఫ్రికా)

అంధుల వన్డే ప్రపంచకప్ నెగ్గిన భారత్

అంధుల 2వ ప్రపంచకప్‌ను భారత్ గెలుచుకుంది. షార్జాలో జనవరి 20న జరిగిన ఫైనల్లో పాకిస్థాన్‌ను ఓడించి..టైటిల్ నిలబెట్టుకుంది. తెలుగు వాడైన అజయ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని భారత జట్టు టోర్నీ ఆసాంతం అద్భుతంగా ఆడింది. ఒక వికెట్ తీయడంతోపాటు కీలక ఇన్నింగ్స్ ఆడిన సునీల్ రమేష్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' పురస్కారం దక్కింది.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

సాక్షి బిజినెస్
గురువారం 25-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
22 ▲	2 ▲
36,162	11,086

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)


సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,419	▽	42
డోజోన్స్	26,282	▲	71
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,643	▽	88
డాక్స్	13,415	▽	145
షాంఘై	3,561	▲	14
నికాయ్	23,941	▽	183

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.45	64.58
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.71	90.90
€	యూరో	ఎస్‌బీఐ	79.60	79.76
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.80	58.92
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.88	51.99
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.10	49.20
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.41	18.27
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.04	11.44

బ్యాంకులకు బూస్ట్



ఈ ఆర్థిక సంవత్సరం రూ. 88 వేల కోట్ల అదనపు మూలధనం

- సంస్కరణల అమలు బట్టి కేటాయింపులు
- ఐడీబీఐ బ్యాంకుకు అత్యధికంగా రూ. 10,610 కోట్లు

న్యూఢిల్లీ: మొండిబాకీలతో సతమతమవుతున్న 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌బీ) ఊతమిచ్చే దిశగా కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 88,139 కోట్ల అదనపు మూలధనాన్ని అందించనుంది. ఇందులో అత్యధికంగా ఐడీబీఐ బ్యాంక్‌కి రూ. 10,610 కోట్లు, ఎస్‌బీఐకి రూ. 8,800 కోట్లు దక్కనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం ఈ విషయాలు తెలిపారు. పీఎస్‌బీలకి అందించే అదనపు మూలధనంపై విస్తృతంగా కసరత్తు చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. మొండిబాకీల సమస్యకు చెక్ చెప్పే దిశగా బ్యాంకింగ్ రంగంలో మరిన్ని సంస్కరణలు చేపడుతున్నట్లు తెలిపారు. భారీ రుణాల మంజూరుకు నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు, రూ. 250 కోట్ల పైబడిన రుణాలను బ్యాంకులు తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ బ్యాంకులకు ఏకంగా రూ.2.11 లక్షల కోట్లు అందించేలా కేంద్రం గతేడాది అక్టోబర్‌లో ప్రణాళిక ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో రూ.1.35 లక్షల కోట్లు బాండ్ల జారీ ద్వారా, మిగతా రూ. 76,000 కోట్లు బడ్జెట్ కేటాయింపులు, మార్కెట్ నుంచి నిధుల సమీకరణ రూపంలో ఉండనుంది.



బ్యాంకులు అత్యున్నత ప్రమాణాలు పాటించేలా గవర్నెన్స్‌ని మెరుగుపర్చేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జైట్లీ తెలిపారు. వారసత్వంగా వచ్చిన తీవ్రమైన సమస్యను పరిష్కరించడమొక్కటే కాకుండా.. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా సంస్థాగతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకులు అన్ని విధాలా మెరుగ్గా ఉండేలా చూడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. తాజా చర్యల లక్ష్యం కూడా అదే' అని జైట్లీ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సుమారు రూ. 9.5 లక్షల కోట్ల మేర మొండిబాకీలు పేరుకుపోయిన నేపథ్యంలో అదనపు మూలధనం వాటికి కొంత ఊరటనివ్వనుంది.

ద్రవ్య లోటుపై ప్రభావం ఉండదు..

ఆయా బ్యాంకుల పనితీరు, అవి అమలు చేసే సంస్కరణలను బట్టి రీక్యాపిటలైజేషన్ ఉంటుందని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. బ్యాంకులు వ్యాపార వ్యూహాలకు పదును పెట్టాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ప్రధానేతర విభాగాల నుంచి తప్పుకుని.. ప్రధాన వ్యాపారంపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. బాండ్లతో పాటు.. బ్యాంకులు షేర్ల విక్రయం ద్వారా మార్కెట్ నుంచి సమీకరించే నిధులను కూడా కలిపితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రీక్యాపిటలైజేషన్ పరిమాణం రూ. 1 లక్ష కోట్లు దాటుతుందని రాజీవ్ కుమార్ చెప్పారు. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులకు అదనంగా రూ. 5 లక్షల కోట్ల మేర రుణాలు ఇవ్వగలిగే సామర్థ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటిదాకా రూ. 10,312 కోట్లు మార్కెట్ల నుంచి సమీకరించిన బ్యాంకులు.. మిగతా వ్యవధిలో మరిన్ని నిధులు సమీకరించే అవకాశాలు ఉన్నాయి.

రూ.250 కోట్లు దాటే రుణాలపై పర్యవేక్షణ ..

ప్రభుత్వం నుంచి అదనపు మూలధనాన్ని అందుకునే బ్యాంకులు పలు సంస్కరణలు అమలు చేయాల్సి ఉంటుందని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఖాతాదారులతో వ్యవహరించే తీరు, బాధ్యతాయుతమైన బ్యాంకింగ్, రుణ మంజూరీ తీరుతెన్నులు, చిన్న.. మధ్యతరహా సంస్థలకు రుణాలు ఇవ్వడం, డిజిటలైజేషన్, అందరికీ ఆర్థిక సేవలు అందించే దిశగా చేస్తున్న ప్రయత్నాలు మొదలైన వాటన్నింటినీ బ్యాంకుల పనితీరు మదింపులో పరిశీలించడం జరుగుతుందని వివరించారు. అలాగే, బ్యాంకులు రుణాల మంజూరీ, రికవరీపై మరింత నిశితంగా దృష్టి సారించాల్సి ఉంటుంది. రూ. 250 కోట్ల పైబడిన రుణాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. నిరర్థక ఆస్తులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలి. అందరికీ ఆర్థిక సేవలు అందించే క్రమంలో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌కి ఇంటి వద్దనే బ్యాంకింగ్ సర్వీసులు అందించేలా చర్యలు తీసుకోవాలి. బ్యాంకుల బోర్డులో ఒక స్వతంత్ర డైరెక్టరు ప్రతి మూడు నెలలకోసారి సంస్కరణల పురోగతిని సమీక్షించాల్సి ఉంటుంది. బ్యాంకుల ర్యాంకింగ్ కోసం సేవల లభ్యత, నాణ్యతకు సంబంధించి ఈఏఎస్ఈ సూచీ ఏర్పాటు చేస్తున్నట్లు కుమార్ తెలిపారు. దీని ఆధారంగా స్వతంత్ర ఏజెన్సీలు వాటి పనితీరును మదింపు చేసి, సంస్కరణల అమలు ప్రాతిపదికన వార్షికంగా రేటింగ్ ఇస్తాయి కనుక.. ఇది ప్రభుత్వ రంగ బ్యాంకుల జవాబుదారీతనాన్ని మరింతగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకులు తీసుకునే వ్యాపారపరమైన నిర్ణయాల్లో ప్రభుత్వం జోక్యం ఉండదని, అవి స్వతంత్రంగానే వ్యవహరిస్తాయని చెప్పారు. అయితే.. అవి కచ్చితంగా సంస్కరణలు అమలు చేయాలని, రుణాలివ్వడంలో వివేకవంతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుందని కుమార్ తెలిపారు.

రీక్యాపిటలైజేషన్ బాండ్ల జారీ ఇలా..

రీక్యాపిటలైజేషన్ ప్రణాళికలో భాగంగా బ్యాంకులకు బాండ్ల జారీ ద్వారా రూ. 80,000 కోట్లు సమకూర్చనున్నట్లు రాజీవ్ కుమార్ వివరించారు. మరో రూ. 8,139 కోట్లు బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఉంటుందని పేర్కొన్నారు. బాండ్ల వ్యవధి 10–15 సంవత్సరాలు ఉంటుందని, ఇవి స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో (ఎస్‌ఎల్‌ఆర్) పరిధిలోకి రావని తెలిపారు. ఈ బాండ్లపై వడ్డీ రేటు సుమారు 8 శాతంగా ఉంటుందని అంచనా. రీక్యాపిటలైజేషన్ ప్రణాళిక కింద బాండ్ల జారీ ద్వారా బ్యాంకుల నుంచి వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వం మళ్లీ వాటికే బదలాయించి.. ప్రతిగా కొంత వాటా తీసుకోవడం జరుగుతుంది. అదనపు మూలధన ప్రణాళిక కింద కేంద్రం జారీ చేసే రీక్యాపిటలైజేషన్ బాండ్లను ముందుగా బ్యాంకులు కొనుగోలు చేస్తాయి. వాటికి సంబంధించిన నిధులను ప్రభుత్వానికి బదలాయిస్తాయి. కేంద్రం ఈ నిధులనే మళ్లీ పెట్టుబడి కింద ఆయా బ్యాంకులకు అందించి ప్రతిగా ఈక్విటీ తీసుకుంటుంది. ఇదంతా ఖాతాల్లో మార్పులు, చేర్పులతోనే జరుగుతుంది. నికరంగా ప్రభుత్వం తన ఖజానా నుంచి బ్యాంకులకు నిధులు ఇవ్వడం ఉండదు. కాబట్టి బ్యాంకులకు అదనపు మూలధనం అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రుణ సమీకరణ ఏమీ జరపదు కాబట్టి.. ద్రవ్య లోటుపై కూడా ప్రభావం ఉండదు. ఇక, బ్యాంకులపరంగా చూస్తే.. సాధారణంగా అవి తమకి వచ్చే డిపాజిట్లలో కొంత భాగాన్ని ఎస్‌ఎల్‌ఆర్ కింద కచ్చితంగా ప్రభుత్వ సెక్యూరిటీస్‌లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అయితే, తాజాగా వచ్చే బాండ్ల స్వరూపం పెట్టుబడి రూపంలో ఉండనుంది కనుక .. వీటి కొనుగోలు ఎస్‌ఎల్‌ఆర్ కిందికి రాదు.

ఏ బ్యాంకుకు ఎంత

బ్యాంకు	రూ. కోట్లలో
ఐడీబీఐ బ్యాంకు	10,160
ఎస్‌బీఐ	8,800
బ్యాంక్ ఆఫ్ ఇండియా	9,232
యూకో బ్యాంక్	6,507
పీఎన్‌బీ	5,473
బ్యాంక్ ఆఫ్ బరోడా	5,375
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	5,158
కెనరా బ్యాంక్	4,865
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు	4,694
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	4,524
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	3,571
దేనా బ్యాంక్	3,045
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	3,173
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	2,634
కార్పొరేషన్ బ్యాంక్	2,187
సిండికేట్ బ్యాంక్	2,839
ఆంధ్రా బ్యాంక్	1,890
అలహాబాద్ బ్యాంక్	1,500
విజయ బ్యాంక్	1,277
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్	785

ఐడియా నష్టాలు రూ.1,284 కోట్లు

- ప్రతికూల ప్రభావం చూపిన ఐసీయూ చార్జీల కోత
- 5 శాతం పతనమైన షేర్



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజ కంపెనీల్లో ఒకటైన ఐడియా సెల్యులర్‌కు ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో భారీగా నష్టాలు వచ్చాయి. గత క్యూ3లో రూ.384 కోట్ల నష్టాలు రాగా, ఈ క్యూ3లో రూ.1,284 కోట్ల నష్టాలు వచ్చాయని ఐడియా తెలిపింది. కాల్ కనెక్షన్ చార్జీలు భారీగా తగ్గడం, టారిఫ్‌ల ఒత్తిడి ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయని వివరించింది. ఆదాయం రూ.8,668 కోట్ల నుంచి 25 శాతం తగ్గి రూ.6,510 కోట్లకు చేరిందని పేర్కొంది. గత క్యూ3లో రూ.1,501 కోట్లుగా ఉన్న ఇబిటా ఈ క్యూ3లో రూ.1,223 కోట్లకు తగ్గిందని వివరించింది. ఇంటర్ కనెక్షన్‌యూసేజీ (ఐయూసీ) చార్జీలను ప్రభుత్వం 57 శాతం తగ్గించడం వల్ల ఆదాయం రూ.820 కోట్లు, ఇబిటా రూ.230 కోట్ల చొప్పున తగ్గాయని ఐడియా పేర్కొంది. ఐయూసీ చార్జీల కోత గత ఏడాది అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చిందని, అందుకని ఈ క్యూ3, గత క్యూ3 ఫలితాలను పోల్చడానికి లేదని వివరించింది. వొడాఫోన్ విలీనం తుది దశకు చేరిందని, ఈ ఏడాది జూన్‌కల్లా విలీనం పూర్తవుతుందని తెలిపింది.

నిరుత్సాహకరమైన ఫలితాల ప్రభావంతో ఐడియా షేర్ 5.3 శాతం నష్టంతో రూ.94 వద్ద ముగిసింది.

తగ్గుతున్న మొండి బకాయిల భారం!

జూలై-డిసెంబర్ మధ్య గణనీయమైన మార్పు

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాల ప్రక్షాళన కార్యక్రమంతో దేశ బ్యాంకింగ్ రంగంలో వసూలు కాని మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గణనీయంగా పెరిగిపోగా, అవి కాస్త నెమ్మదిస్తున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై–డిసెంబర్ కాలంలో ఇవి చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గాయి. ఫిక్కీ–ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ తాజా సర్వేలో ఈ వివరాలు తెలిశాయి. 19 ప్రభుత్వరంగ, ప్రైవేటు, విదేశీ బ్యాంకుల నుంచి సర్వే కోసం అభిప్రాయాలను సేకరించారు. 58 శాతం మంది ఎన్‌పీఏలు పెరిగినట్టు పేర్కొనగా, అంతకుముందు నిర్వహించిన సర్వేలో 80 శాతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్టు తెలిసింది. మెటల్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తుల రంగాలకు ఇచ్చిన రుణాలు ఎక్కువగా ఎన్‌పీఏలుగా మారాయి. తమ రుణాలను పునరుద్ధరించాలన్న అభ్యర్థనలు ఎక్కువైనట్టు కేవలం 28 శాతం బ్యాంకులే తెలిపాయి. ఇది అంతకుముందు సర్వేలో 40 శాతం కావడం గమనార్హం. ఎన్‌పీఏలకు చేసే నిధుల కేటాయింపులకు పూర్తిగా పన్ను మినహాయింపు కల్పిస్తూ బడ్జెట్‌లో నిర్ణయం ప్రకటించాలని బ్యాంకులు కోరాయి. ''కార్పొరేట్ పన్నును 30 నుంచి 25 శాతానికి తగ్గించాలని చాలా వరకు బ్యాంకులు డిమాండ్ చేశాయి. అలాగే, మ్యాట్ (కనీస ప్రత్యామ్నాయ పన్ను)ను 15 శాతానికి తీసుకురావాలని కోరాయి. వ్యక్తులకు పన్ను మినహాయింపులు, రాయితీలను పెంచాలని కూడా డిమాండ్ చేశాయి. దీనివల్ల కార్పొరేట్, రిటైల్ రుణాలకు డిమాండ్ పెరుగుతుంది''అని ఫిక్కీ తన నివేదికలో పేర్కొంది. కాగా, భారతీయ అకౌంటింగ్ ప్రమాణాలకు మారుతున్నందున బ్యాంకులు రుణాలకు సంబంధించి అదనంగా రూ.89,000 కోట్ల మేర కేటాయింపులు చేయాల్సి రావచ్చని ఇండియా రేటింగ్స్ రీసెర్చ్ పేర్కొంది.



ఆటో షోలో మారుతీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కాన్సెప్ట్!



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ 'మారుతీ సుజుకీ ఇండియా' తన కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ కాంపాక్ట్ ఎస్‌యూవీ 'ఇ-సర్వైవర్'ను ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచనుంది. కంపెనీ తొలిసారిగా 2017 టోక్యో మోటార్‌షోలో ఇ-సర్వైవర్ కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది. ఇది టూ సీట్స్ కలిగిన ఓపెన్ టాప్ ఎస్‌యూవీ. విడిభాగాల స్థానిక తయారీ, చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బ్యాటరీల రిసైక్లింగ్ సహా ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను పూర్తిగా భారత్‌లోనే తయారు చేసేందుకు దోహదపడతాయని కంపెనీ పేర్కొంది. కాగా కంపెనీ కాన్సెప్ట్ 'ఫ్యూచర్ ఎస్' (ఎస్‌యూవీ ప్రత్యేకతలు కలిగిన కాంపాక్ట్ కారు)ను, సరికొత్త మూడో జనరేషన్ స్విఫ్ట్ కారును, నెక్ట్స్ జనరేషన్ సుజుకీ హైబ్రిడ్ సిస్టమ్ (హెచ్‌ఈవీ) వర్కింగ్ మోడల్‌ను ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచనుంది. కంపెనీ 2020 నాటికి ఎలక్ట్రిక్ వెహికల్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న విషయం తెలిసిందే.

టాప్-250 గ్లోబల్ రిటైలర్ల జాబితాలో రిలయన్స్ రిటైల్

ముంబై: ఈ ఏడాది టాప్–250 గ్లోబల్ రిటైలర్ల జాబితాలో రిలయన్స్ రిటైల్ స్థానం పొందింది. 189వ స్థానంలో నిలిచింది. 'రిలయన్స్ తన ఎఫ్‌ఎంసీజీ విభాగం నుంచి బలమైన అమ్మకాలు రాబట్టింది. 2015–16లో కంపెనీ రిటైల్ ఆదాయంలో 59.2 శాతం మేర వృద్ధి కనిపించింది' అని డెలాయిట్ గ్లోబల్ తన 'గ్లోబల్ పవర్స్ ఆఫ్ రిటైలింగ్' నివేదికలో పేర్కొంది. టాప్–250 గ్లోబల్ రిటైలర్లు సంయుక్తంగా 2016 ఆర్థిక సంవత్సరంలో 4.4 ట్రిలియన్ డాలర్ల ఆదాయం పొందాయని తెలిపింది. కాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) అనుబంధ సంస్థనే రిలయన్స్ రిటైల్. ఆదాయం పరంగా చూస్తే భారత్‌లో ఇదే అతిపెద్ద రిటైలర్.



కొత్త నగరాలకు 'ట్రూజెట్'

- సంస్థ ఖాతాలోకి అయిదవ ఎయిర్‌క్రాఫ్ట్
- మిలియన్ మార్కు దాటిన ప్రయాణికులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రూజెట్ పేరుతో ప్రాంతీయ విమానయాన సేవల్లో ఉన్న టర్బో మేఘా ఎయిర్‌వేస్... జనవరి 19 నాటికి 10 లక్షల మంది ప్రయాణికులను వివిధ నగరాలకు చేరవేసి మిలియన్ మార్కును దాటింది. తాజాగా ట్రూజెట్ ఖాతాలో 5వ ఎయిర్‌క్రాఫ్ట్ చేరికతో కొత్త నగరాల్లో విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఫిబ్రవరి నుంచి సేలంలో అడుగుపెడుతోంది. మార్చిలో షిర్డీ, ఏప్రిల్‌లో వైజాగ్‌కు సర్వీసులను అందిస్తామని టర్బో మేఘా ఎయిర్‌వేస్ కమర్షియల్ హెడ్ సెంథిల్ రాజా సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. ఉడాన్ స్కీమ్ కింద కడప, మైసూరు, విద్యానగర్, నాందేడ్‌కు విమానాలు నడుపుతున్నట్టు చెప్పారు. కొత్త పైలట్లు, సిబ్బంది చేరగానే సర్వీసులు పెంచుతామన్నారు.

మే నాటికి ఆరవ విమానం..

ఈ ఏడాది మే నాటికి ఆరవ విమానం వచ్చి చేరుతుందని సెంథిల్ తెలిపారు. '2018 డిసెంబరుకల్లా కంపెనీ ఖాతాలో 8 విమానాలు ఉంటాయి. ప్రస్తుతం 12 నగరాలకు సర్వీసులు నడిపిస్తున్నాం. ఈ ఏడాది మరో 4 నగరాల్లో అడుగు పెడతాం. సర్వీసుల సంఖ్య 20 ఉంది. కొత్త నగరాలు, విమానాల రాకతో ఇది మూడు రెట్లకు చేరుతుంది. సీట్ల ఆక్యుపెన్సీ 77 శాతముంది. ఇది 85 శాతానికి పైగా చేరుతుందని అంచనా వేస్తున్నాం. 500 మంది సిబ్బంది ఉన్నారు. మరో 100 మందిని నియమించుకుంటున్నాం. ట్రూజెట్ మాత్రమే ఉడాన్ స్కీమ్ కింద దక్షిణాది నుంచి సర్వీసులు అందిస్తోంది. 2018 చివరికి మరో 10 లక్షల మంది ప్రయాణికులను చేరవేస్తామన్న దీమాతో ఉన్నాం' అని వివరించారు. కంపెనీ కార్యకలాపాలు 2015 జూలై 12న ప్రారంభం అయ్యాయి.

'ఫ్యూచర్' లక్ష్యం 40 వేల కోట్లు

- హైదరాబాద్ నుంచి 10% వాటా
- ఫ్యూచర్ గ్రూప్ సీఈవో కిశోర్ బియానీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం ఫ్యూచర్ గ్రూప్ విస్తరణ ద్వారా 2018–19లో రూ.40,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరం రిటైల్ బిజినెస్ ద్వారా సంస్థ రూ.28,600 కోట్లు ఆర్జించింది. 2017–18లో రూ.30,000 కోట్లు అంచనా వేస్తున్నట్టు గ్రూప్ సీఈవో కిశోర్ బియానీ బుధవారం తెలిపారు. గోల్డెన్ హార్వెస్ట్ సోనామసూరి రైస్‌ను ఇక్కడ లాంఛనంగా ఆవిష్కరించిన అనంతరం సినీ నటుడు రానా దగ్గుబాటితో కలిసి మీడియాతో మాట్లాడారు. గ్రూప్ టర్నోవరులో హైదరాబాద్ మార్కెట్ 10% వాటా కైవసం చేసుకుందని చెప్పారు. ఫ్యాషన్, ఫుడ్ విషయంలో ఇక్కడ వినియోగం అధికంగా ఉంటుందని కొనియాడారు. గోల్డెన్ హార్వెస్ట్ సోనామసూరి రైస్ వాణిజ్య ప్రకటనను సురేష్ ప్రొడక్షన్స్, అన్నపూర్ణ స్టూడియోస్ చిత్రించాయి.

చిన్న స్టోర్లతో విస్తరణ..: బిగ్ బజార్, సెంట్రల్, ఫుడ్ బజార్, హోమ్ టౌన్, ఫుడ్ హాల్, ఈ–జోన్, ప్లానెట్ స్పోర్ట్స్, బ్రాండ్ ఫ్యాక్టరీ వంటి బ్రాండ్లు ఫ్యూచర్ గ్రూప్ కింద ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని బ్రాండ్లలో 1,700లకుపైగా స్టోర్లను ఈ గ్రూప్ నిర్వహిస్తోంది. ఈజీడే, నీల్‌గిరి, హెరిటేజ్ ఫ్రెష్, కేబీ కన్వీనియెంట్లీ యువర్స్ బ్రాండ్లలో భారీ విస్తరణకు సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. 2022 నాటికి 10,000 స్మాల్ ఫార్మాట్ స్టోర్లను ఏర్పాటు చేయాలన్నది కంపెనీ ఆలోచన. ఇక గోల్డెన్ హార్వెస్ట్ బ్రాండ్ ఒక్కటే రూ.1,200 కోట్ల వ్యాపారం చేస్తోంది. 2018–19లో ఈ బ్రాండ్ ద్వారా రూ.2,000 కోట్లు సమకూరతాయని బియానీ వెల్లడించారు. గోల్డెన్ హార్వెస్ట్ బ్రాండ్‌లో పిండి, పప్పులు, మసాలాలు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్, ఇతర ఆహార పదార్థాలను విక్రయిస్తోంది.



దగ్గుబాటి రానాతో కిశోర్ బియానీ

తెలంగాణలో గార్మెంట్స్ యూనిట్!

ఫ్యూచర్ గ్రూప్ తెలంగాణలో మెగా గార్మెంట్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎక్కడ, ఎంత పెట్టుబడితో రానుంది అన్న విషయాలను అధికారికంగా కంపెనీ ప్రకటించలేదు. అయితే తెలంగాణలో యూనిట్ వచ్చే విషయాన్ని గ్రూప్ కంపెనీ ప్రతినిధి ఒకరు అనధికారికంగా ధ్రువీకరించారు. ఫ్యూచర్ గ్రూప్ పశ్చిమ బెంగాల్‌లో ఇటువంటి యూనిట్‌ను ఈ ఏడాదే నెలకొల్పుతోంది. వివిధ బ్రాండ్లలో ఏటా 35 కోట్ల యూనిట్ల దుస్తులను తాము విక్రయిస్తున్నట్టు కిశోర్ బియానీ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. ఈ స్థాయికి చేరడం ద్వారా ప్రపంచంలో టాప్–10 రిటైలర్‌గా నిలిచామన్నారు. బెంగాల్ తర్వాత గార్మెంట్స్ తయారీకి మరొక యూనిట్ స్థాపనకు పలు రాష్ట్రాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఇందులో తెలంగాణ ఒకటని వివరించారు.

ప్రపంచీకరణను అడ్డుకోలేరు

- వాణిజ్యం ఆగితే యుద్ధం మొదలవుతుంది
- చైనా అలీబాబా గ్రూపు చైర్మన్ జాక్‌మా

దావోస్: చైనా అలీబాబా గ్రూపు చైర్మన్ జాక్‌మా దావోస్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచీకరణ ఆగకూడదని, వాణిజ్యం ఆగిపోతే యుద్ధానికి దారితీస్తుందన్నారు. సమస్యలకు ముగింపు పలకాలంటే ప్రపంచీకరణను అక్కున చేర్చుకోవాలని సూచించారు. ఇది మన బాధ్యతని, ఎదిగేందుకు అవకాశమని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు సందర్భంగా జరిగిన ప్రత్యేక సెషన్‌లో ఆయన ప్రసంగించారు. ''రానున్న 30 సంవత్సరాల్లో ప్రపంచం అనూహ్యంగా మారిపోతుందని ఆందోళన చెందుతున్నారా? ఏదైనా యుద్ధం జరిగితే అది వ్యాధులు, పర్యావరణ కాలుష్యం, పేదరికానికి వ్యతిరేకంగానే ఉండాలి. మనపై మనం యుద్ధం చేసుకోరాదు. ప్రపంచీకరణను ఎవరూ ఆపలేరు. ఒక వేళ వాణిజ్యం ఆగిపోతే ప్రపంచం కూడా ఆగిపోయినట్టే. వాణిజ్యం అన్నది యుద్ధాన్ని అంతం చేసేది. అంతేకానీ యుద్ధానికి దారితీయదు'' అని జాక్‌మా తన అభిప్రాయాలను స్పష్టం చేశారు. టెక్నాలజీ కారణంగా ప్రస్తుతం ప్రపంచం మార్పు దశలో ఉందని, ఆసక్తికరమైన ఉపాధి అవకాశాలకు ఇది సాయపడుతుందని చెప్పారు. అలాగే, సామాజిక సమస్యలకూ కారణం కావచ్చన్నారు.



నూతన అవకాశాల వైపు చూస్తున్నాం: కొచర్

వృద్ధికి అవకాశం ఉన్న కొత్త విభాగాల వైపు చూస్తున్నామంటూ ఐసీఐసీఐ బ్యాంకు చీఫ్ చందాకొచర్ అన్నారు. నోట్ల రద్దు తర్వాత నూతన అవకాశాలకు మార్గం ఏర్పడిందన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు వచ్చిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ''అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి మరిన్ని చిన్న, మధ్య స్థాయి సంస్థలు వచ్చి చేరుతున్నాయి. దీంతో వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి (ఎంఎస్‌ఎంఈ) సంస్థలకు రుణ వితరణను పెంచేందుకు ప్రభుత్వం కూడా తగిన ప్రేరణనిచ్చింది'' అన్నారు.

ఇండిగో లాభం 56 శాతం అప్..

- క్యూ3లో రూ.762 కోట్లు...
- రూ.6,178 కోట్లకు మొత్తం ఆదాయం

ముంబై: ఇండిగో విమానయాన సంస్థను నిర్వహిస్తున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 56 శాతం ఎగసింది. గత క్యూ3లో రూ.487 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.762 కోట్లకు పెరిగిందని కంపెనీ పేర్కొంది. ఆదాయ నిర్వహణ ఉత్తమంగా ఉండటంతో ఈ స్థాయిలో నికర లాభం సాధించామని ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్య ఘోష్ చెప్పారు. ఆదాయం రూ.4,986 కోట్ల నుంచి 24% వృద్ధితో రూ.6,178 కోట్లకు పెరిగిందని తెలిపారు. ప్రయాణికుల టికెట్ల ఆదాయం 22 శాతం వృద్ధితో రూ.5,322 కోట్లకు, ఇతర ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.700 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు.



ఏటీఆర్‌లతో ప్రాంతీయ సర్వీసులు....

ఏటీఆర్ విమానం ద్వారా ప్రాంతీయ విమాన సర్వీసులను అందించడం అరంభించామని, భారత్‌లో మరిన్ని నగరాలకు తమ సర్వీసులను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ క్యూ3 తమకు ప్రత్యేకమైనదని, 20 కోట్ల మందికి విమాన సర్వీసులందజేశామని వివరించారు. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్‌ఈలో ఇండిగో షేర్ 3.7 శాతం లాభంతో రూ.1,238 వద్ద ముగిసింది.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, (వ్యాపారస్తులు)	రూ.4,660 (కనిష్ఠం) రూ.4,935 (గరిష్ఠం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.7,500 (కనిష్ఠం) రూ.11,600 (గరిష్ఠం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	-- --
ఉల్లి (కర్నూలు)	రూ.1,760 (కనిష్ఠం) రూ.2,880 (గరిష్ఠం)
చక్కెర (చెన్నై)	రూ.3,500
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	30,425	▲ 185
బంగారం (99.5, 10గ్రా)	30,275	▲ 185
వెండి (కిలో)	39,145	▲ 385
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)		
బంగారం (22 క్యారెట్లు)	28,950	▲ 130
వెండి (కిలో)		
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	30,870	0
బంగారం (22 క్యారెట్లు)	28,870	▲ 10
వెండి(కిలో)	39,265	0
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	30,850	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	28,480	0
వెండి(కిలో)	39,900	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	31,100	▼ 290
బంగారం (22 క్యారెట్లు)	28,800	▲ 20
వెండి(కిలో)	40,500	▲2000
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	31,300	▲ 300
బంగారం (22 క్యారెట్లు)	28,850	▲ 50
వెండి(కిలో)	40,100	▲ 100
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	31,300	▲ 140
బంగారం (22 క్యారెట్లు)	28,950	▲ 130
వెండి(కిలో)	40,200	▲ 200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.89 రాత్రి 11.30కు	$64.47 మంగళవారం ముగింపు
బ్రెంట్	69.92 రాత్రి 11.30కు	$69.96 మంగళవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 25-1-2018

వరంగల్	382-00
విజయవాడ	397-00
24-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	380-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.40

త్వరలోనే బీమా బ్రోకర్ల మార్గదర్శకాలు

రూ.30 వేల కోట్ల సాధారణ బీమా ప్రీమియం బ్రోకర్ల ద్వారానే

- జీవిత బీమాలో రూ.1.60 లక్షల కోట్ల వాటా వీళ్లదే
- సాంకేతికతను అందుకోకపోతే మనుగడ కష్టమే
- ఐబీఏఐ 14వ వార్షిక సదస్సులో ఐఆర్‌డీఏ చైర్మన్ టీఎస్ విజయన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో బీమా రంగంలో బ్రోకర్ల పాత్ర గణనీయంగా వృద్ధి చెందుతోందని.. అందుకే బ్రోకర్ల కొత్త మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) చైర్మన్ టీఎస్ విజయన్ చెప్పారు. ఇన్సూరెన్స్ బ్రోకర్ల యాజమాన్యం, భాగస్వామ్యం తదితర అంశాలన్నీ ఇందులో పొందుపరిచామని.. కొద్ది మార్పులతో కొత్త నిబంధనలను గెజిట్ నోటిఫికేషన్ కోసం పంపిచామని.. త్వరలోనే వెలువడతాయని ఆయన పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబీఏఐ) 14వ వార్షిక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయన్ మాట్లాడుతూ.. ''బీమా పరిశ్రమతో పాటూ బ్రోకర్ల కాంట్రిబ్యూషన్ కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో సాధారణ బీమా ప్రీమియం రూ.1,28,129 కోట్లను దాటింది. ఇందులో రూ.30 వేల కోట్లు ప్రీమియంలు బ్రోకర్ల ద్వారా సమీకరించినవే. జీవిత బీమా రూ.4 లక్షల కోట్లు. ఇందులో రూ.1.60 లక్షల కోట్లు బ్రోకర్ల వాటా ఉందని'' వివరించారు. ఆరోగ్య బీమా ఏటా 43 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని.. జీవిత, సాధారణ బీమా ఉత్పత్తులే కాకుండా ఎస్ఎంఈ, రిటైల్, కార్పొరేట్ రంగాల్లో వివిధ రకాల బీమా పాలసీలను తీసుకురావాల్సిన అవసరముందని సూచించారు.



పాలసీలే కాదు క్లయిమ్‌లూ ఆన్‌లైన్‌లోనే..

పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో బీమా పరిశ్రమ డిజిటల్ వైపు అడుగులేసేలా చేశాయని విజయన్ పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోకపోతే బీమా సంస్థల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని.. అంతేకాకుండా టెక్నాలజీ ద్వారా బీమా ఉత్పత్తుల ధర కూడా తగ్గుతుందని సూచించారు. ఆన్‌లైన్‌ను కేవలం పాలసీల విక్రయానికే కాకుండా క్లయిమ్‌లకూ వినియోగించాలని.. ఇది బీమా రంగంలో పారదర్శకతను తీసుకొస్తుందని అభిప్రాయపడ్డారు.

అవార్డులు: ప్రస్తుతం దేశంలో 428 మంది గుర్తింపు పొందిన బ్రోకర్లున్నారు. ఐబీఏఐ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబర్చిన పలు బీమా కంపెనీలకు అవార్డులను అందించారు. చిన్న ప్రైవేట్ సెక్టార్ సాధారణ బీమా విభాగంలో ఫ్యూచర్ జెనరల్లీ, పెద్ద ప్రైవేట్ సెక్టార్ సాధారణ బీమా రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ లాంబార్డ్, టాటా ఏఐజీ, ఐఎఫ్ఎఫ్‌సీఓ టోక్యో, బజాజ్ అలయెన్జ్, పబ్లిక్ సెక్టార్ సాధారణ బీమా రంగంలో న్యూ ఇండియా ఇన్సూరెన్స్ అవార్డులు అందుకున్నాయి.

క్యూ3 ఆర్థిక ఫలితాలు

బయోకాన్: ఈ సంస్థ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో (క్యూ3) 46% తగ్గింది. గత క్యూ3లో రూ. 171 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ3లో రూ.92 కోట్లకు క్షీణించింది. ఆదాయం రూ.1,044 కోట్ల నుంచి రూ.1,058 కోట్లకు పెరిగింది.



కెనరా బ్యాంక్: ఈ బ్యాంక్ నికర లాభం ఈ క్యూ3లో 61% తగ్గింది. గత క్యూ3లో రూ.322 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.126 కోట్లకు పడింది. స్థూల మొండి బకాయిలు 10.51% నుంచి 10.38 %కి, నికర మొండి బకాయిలు 7.02% నుంచి 6.78 %కి తగ్గాయి. నికర వడ్డీ ఆదాయం 52%, ఇతర ఆదాయం 11% చొప్పున పెరిగాయి.

విజయ బ్యాంక్: ఈ బ్యాంక్ ప్రస్తుత క్యూ3లో రూ.80 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ3లో సాధించిన నికర లాభం (రూ.230 కోట్లు)తో పోల్చితే 65% క్షీణించింది. మొత్తం ఆదాయం రూ.3,714 కోట్ల నుంచి 7% క్షీణించి రూ.3,451 కోట్లకు తగ్గింది.

హెచ్‌పీసీఎల్ కొనుగోలుకు

ఓఎన్‌జీసీ రుణ సమీకరణ

ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.4,000 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని ఓఎన్‌జీసీ, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.4,000 కోట్ల రుణాన్ని తీసుకుంది. హెచ్‌పీసీఎల్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 51.11 వాటాను ఓఎన్‌జీసీ కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రూ.36,915 కోట్లు ఓఎన్‌జీసీకి అవసరమవుతాయి. ఇప్పటికే మూడు బ్యాంకుల నుంచి రూ.18,060 కోట్లను ఓఎన్‌జీసీ రుణాలుగా తీసుకునేందుకు ఒప్పందాలు చేసుకుంది. పీఎన్‌బీ నుంచి రూ.10,600 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి 4,460 కోట్లు తీసుకుంటుండగా, యాక్సిస్ బ్యాంకు మరో రూ.3,000 కోట్ల మేర సమకూర్చనుంది. రూ.25,000 కోట్ల నుంచి రూ.35,000 కోట్ల వరకు రుణాలు తీసుకునేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపినట్టు ఓఎన్‌జీసీ చైర్మన్, ఎండీ శశి శేఖర్ రెండు రోజుల క్రితమే తెలిపారు. తమ దగ్గరున్న రూ.12,000–13,000 కోట్ల నగదు నిల్వల్ని వినియోగించిన తర్వాత లిక్విడ్ ఆస్తుల గురించి ఆలోచిస్తామని, ఆ తర్వాతే రుణం రూపంలో అవసరమైన మేర తీసుకోవడం ఉంటుందన్నారు. హెచ్‌పీసీఎల్ కొనుగోలుతో ఓఎన్‌జీసీ సమగ్ర చమురు కంపెనీగా అవతరించనుంది. అంతేకాదు, ఈ సంస్థకు ఇదే అతిపెద్ద కొనుగోలు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌కు కేజీ బేసిన్‌లో ఉన్న 80 శాతం వాటాను ఓఎన్‌జీసీ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఓఎన్‌జీసీకి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో 13.77 శాతం వాటా ఉండగా, దీని మార్కెట్ విలువ రూ.26,000 కోట్లు. గెయిల్ ఇండియాలోనూ 4.86 శాతం వాటా ఉంది. దీని మార్కెట్ విలువ రూ.3,800 కోట్లు.



ఆరో రోజూ ఆగని పరుగు

22 పాయింట్ల లాభంతో 36,162కు సెన్సెక్స్

స్టాక్ సూచీల రికార్డ్‌ల పరంపర బుధవారం కూడా కొనసాగింది. వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. స్టాక్ సూచీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ కొత్త రికార్డ్‌లను సృష్టించాయి. నేడు(గురువారం) ఎఫ్ అండ్ ఓ ముగింపు కావడంతో కొన్ని షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ట్రేడింగ్ ఒడిదుడుకుల మధ్య సాగింది. స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. మూలధన నిధుల తాజా ప్రకటన కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. ఐటీ, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. సెన్సెక్స్ 22 పాయింట్ల లాభంతో 36,162 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 2 పాయింట్ల లాభంతో 11,086 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 36,268 పాయింట్లు, నిఫ్టీ 11,110 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి. ఇవి రెండూ ఈ సూచీలకు జీవిత కాల గరిష్ఠ స్థాయిలు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,102
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	42,329
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	10,41,405
ఎఫ్ఐఐ	776
డీఐఐ	194

బోర్డ్ మీటింగ్స్

మారుతీ సుజుకీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అవెన్యూ సూపర్ మార్ట్(డిమార్ట్), ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, టాటా కాఫీ, అజంతా ఫార్మా, జిందాల్ స్టీల్ అండ్ పవర్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్, నీల్ కమల్, తారా జ్యుయల్స్, యూపీఎల్, ఆర్ఎస్ సాఫ్ట్‌వేర్, వీఐపీ ఇండస్ట్రీస్.

అక్టోబర్ - డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017-18	2016-17	వృ/క్షీ(%)	2017-18	2016-17	వృ/క్షీ(%)
మోతీలాల్ ఓస్వాల్ ఫైనా. సర్వీ.	148	89	66	736	456	62
టీటీకే ప్రెస్టీజ్	47	35	36	503	469	7
ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్	283	248	14	1,884	1,667	13
రాడికో ఖైతాన్	35	20	78	1,748	1,244	41
ఫైజర్	87	62	40	457	510	-10
జిందాల్ సా	96	81	19	2,181	1,467	49
రేమండ్	31	(15)	--	1,514	1,331	14

Dwaraka



భక్తిశ్రద్ధలతో మండ మెలిగె పండుగ

మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరలో భాగంగా బుధవారం మండమెలిగె పండుగ ఘనంగా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలోని సమ్మక్క గుడిలో, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలోని పూజారులు పండుగ నిర్వహించారు. సమ్మక్క పూజారి కొక్కెర కృష్ణయ్య అమ్మవారి శక్తిపీఠం గద్దెలను పవిత్రమైన పుట్టమట్టితో అలికారు. నాగేశ్వర్‌రావు అమ్మవారి దూపదీపాలను కడిగి శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క ఆలయ ప్రధానపూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటి నుంచి ఆడపడుచులు ఆచారం ప్రకారం పసుపు, కుంకుమ, కంకణాలు, పవిత్రమైన జలంను డోలువాయిద్యాలతో సమ్మక్క గుడికి తీసుకెళ్లారు. అమ్మవారి గద్దెపై పసుపు, కుంకుమ వేసి అలంకరించారు. –ఎస్ఎస్ తాడ్వాయి

నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

నేరేడుచర్ల(హుజూర్‌నగర్): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ సైదులు దర్గా ఉర్సు నేటి (గురువారం) నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి. 26న వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తెచ్చిన పవిత్ర గంధాన్ని గుర్రంపై జాన్‌పహాడ్ పురవీధుల్లో ఊరేగించి దర్గాలో సమాధులపైకి ఎక్కిస్తారు. 27న దీపారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు రానున్నారు.





పాతగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని పాతగుట్ట బ్రహ్మోత్సవాలు బుధవారం స్వస్తి వాచనంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సర్వసైన్యాధ్యక్షుడు, ఉత్సవాలకు ఆద్యుడైన విశ్వక్సేనుడిని ఆవాహన చేసి సర్వసన్నద్ధం చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలతో కంకణాలకు ప్రత్యేక పూజలు చేశారు. స్వయంభూ మూర్తులకు కంకణ ధారణ చేశారు. రాత్రి మత్స్యంగ్రహణం (పుట్టమన్ను తేవడం), అంకురార్పణ (కుండల్లో నవధాన్యాలు వేయడం) కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు ధరింపజేసి అభిషేకం చేశారు. అనంతరం శేషవాహనంపై అధిష్టింపజేశారు. –యాదగిరికొండ

కడుపులో పెట్టుకుని చూసుకుంటాం

- నిర్వాసితుల అంశంపై మంత్రి హరీశ్‌రావు
- మీ త్యాగంతోనే రాష్ట్రానికి సాగునీరు అని వ్యాఖ్య



ముంపు గ్రామప్రజలతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి హరీశ్

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలోని బీడు భూముల్లో గోదావరి, కృష్ణా జలాలు పారించే ప్రయత్నంలో భాగంగా గ్రామాలు, భూములు కోల్పోయిన నిర్వాసితులను ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని భారీ నీటి పారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అనంతగిరి సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని కొచ్చగుట్టపల్లి నిర్వాసితులకు పునరావాసం, ఉపాధితో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం లింగారెడ్డిపల్లిలో 140 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి బుధవారం మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రిజర్వాయర్‌లో గ్రామం మొత్తం మునిగిపోతోందని, పాత గ్రామానికి తీసిపోని విధంగా కొత్త గ్రామం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

నిర్వాసితుల త్యాగ ఫలంతోనే..

సంస్కృతి, సంప్రదాయాలు, తీపి గుర్తులను త్యాగం చేసి ప్రాజెక్టుల నిర్మాణానికి చేయూతనిచ్చిన నిర్వాసితుల త్యాగఫలమే రాష్ట్రానికి సాగునీరు అని హరీశ్ అన్నారు. మల్లన్న సాగర్ కింద 8 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, వారికి గజ్వేల్ పక్కనే మొత్రాజుపల్లి వద్ద నూతన గ్రామాలు నిర్మిస్తామన్నారు. మరోవైపు కొండపోచమ్మ ప్రాజెక్టులో మునిగిపోయే మరో రెండు గ్రామాలకు తునికి బొల్లారం వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి త్వరలో భూమి పూజ చేస్తామని తెలిపారు. 123 జీవో ప్రకారం వారికి పరిహారం ఇచ్చామన్నారు. 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించలేకపోతున్నామని, అందుకే 21/2017 సవరణ చట్టం కింద మెరుగైన పరిహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాలు నిర్మించడం, ఉపాధి, యువతకు నైపుణ్యాల శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి హామీనిచ్చారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ఈ ఏడాది చివరిలో ఎన్నికలు: ఉత్తమ్



చింతలపాలెం/మఠంపల్లి: రాష్ట్రంలో ఈ ఏడాది చివరిలో సార్వత్రిక ఎన్నికలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం, మఠంపల్లి మండలాల్లో బుధవారం ఆయన పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని తెలిపారు. బీమా ప్రీమియం కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. అన్నిపంటలకు మద్దతుధర వచ్చేలా కృషి చేస్తామన్నారు. పత్తికి రూ.4,300 నుంచి రూ.6 వేలు, మిర్చి, పసుపు పంటలకు రూ.10 వేలు చెల్లిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 6 శాతం కమీషన్ల కోసమే కక్కుర్తిపడి మిషన్ కాకతీయ, భగీరథ ప్రాజెక్టులు చేపట్టారని ఆరోపించారు. బంగారు తెలంగాణ అంటూ బంగారు కుటుంబంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇక టీఆర్ఎస్ పతనం ఖాయమని పేర్కొన్నారు.

ప్రాణం తీసిన రూ.200

- బిల్లు కోసం దాబా యాజమాన్యం పట్టు
- తోపులాటలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు



సంగారెడ్డి క్రైం: దాబాలో రూ.200 బిల్లు విషయంలో తగాదా ఏర్పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. కొండా పూర్ మండలం తెర్పోల్‌కి చెందిన షాకీర్ మియా(45), చాకలి రాములు, గంగ్యా నర్సింలు పెద్దాపూర్‌లో సిమెంట్ రింగులు కొనుగోలు చేసి, వాటిని వాహనంలో గ్రామానికి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో ఆ వాహనం పాడవడంతో షెడ్‌కు తరలించారు. అనంతరం పట్టణ శివారులోని 65వ నంబర్ జాతీయ రహదారి పక్కనున్న ఫ్రెండ్స్ ఫ్యామిలీదాబాకు వెళ్లారు. మద్యం సేవించి భోజనం చేశారు. బిల్లు రూ.1,200 కాగా, రూ.వెయ్యి చెల్లించారు. మిగతా రూ.200 వాహనంలో ఉన్నాయని, తీసుకువస్తామని చెప్పినా దాబా యజమాని అశోక్ చౌహాన్‌తోపాటు ఆయన కుమారుడు పూర్తి డబ్బులు చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు. ఇది పెద్ద గొడవకు దారి తీయడంతో ఒకరినొకరు తోసుకున్నారు. ఈ క్రమంలోనే షాకీర్ మియా మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షాకీర్‌మియా మృతదేహాన్ని ఘటనాస్థలం నుంచి తరలించేది లేదని బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. దాబాపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.

కాళేశ్వరంతో పచ్చదనం పెంపు

కేంద్ర పర్యావరణ కార్యదర్శి సీకే మిశ్రా

కాళేశ్వరం(మంథని): కాళేశ్వరం ప్రాజెక్టుతో భూగర్భ జలాలు పెరిగి పచ్చదనం వెల్లివిరుస్తుందని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా అన్నారు. బుధవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న అన్నారం బ్యారేజీని సందర్శించారు. అన్నారంలో అటవీశాఖ, ట్రైనీ ఐఏఎస్‌లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు సాగు, తాగునీరుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో కేంద్రం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో కొంత అటవీభూమి కోల్పోవాల్సి వచ్చిందని.. దానికి బదులు మరోచోట భారీగా మొక్కలను పెంచుతున్నట్లు వివరించారు. ఆయన వెంట అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, పీసీసీఎఫ్‌వో పీకే.ఝా, ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్, సీసీఎఫ్‌వో ఎంజే.అక్బర్ ఉన్నారు.

మిర్చి ధరకు రెక్కలు

ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.11,275



ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధరకు రెక్క లొచ్చాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ మిర్చి ధర గరిష్ఠంగా రూ.11,275 పలికింది. మంగళవారం రూ.10,800 ఉన్న మిర్చి ధర ఒక్కరోజు వ్యవధిలోనే రూ.475 పెరిగి రూ.11,275 పలికింది. గతేడాది మిర్చికి ధర లేని కారణంగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం దేశ వ్యాప్తంగా గణనీయంగా తగ్గింది. దీనికి తోడు ఈ ఏడాది పంట సాగు ఆరంభంలో వర్షాల కారణంగా ఉత్పత్తిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. కాగా.. ధర రూ.10 వేల మార్కు దాటినప్పటి నుంచి పంట విక్రయాలు పెరుగుతున్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిత్యం 20వేల బస్తాల వరకు మిర్చి విక్రయానికి వస్తోంది.

జగిత్యాలలో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

- భూసమస్యతో ఒకరు..
- కేసు భయంతో మరొకరు..

జగిత్యాల క్రైం:

జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు యత్నించారు. ఒకరు ఎస్పీ కార్యాలయం ఎదుట, మరొకరు అటవీశాఖ కార్యాలయం ముందు పురుగుల మందు తాగారు. వారిద్దరూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాయికల్ మండలం మైతాపూర్‌కు చెందిన ఎట్టెం జైపాల్‌కు ఎకరం భూమి ఉండగా.. నేమిళ్ల నారాయణ భూమి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఏడాదిగా వీరిమధ్య రహదారి వివాదం జరుగుతోంది. మంగళవారం మరోసారి గొడవ జరగగా.. జైపాల్‌పై నారాయణ దాడిచేశాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం ఎస్పీని కలిసేందుకు జైపాల్ వెళ్లి.. కార్యాలయం బయటే పురుగుల మందు తాగాడు. పోలీసులు అతడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ అనంతశర్మ అతడి నుంచి వివరాలు సేకరించారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ జైపాల్



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవి

కేసు పెట్టారని మరొకరు...

సారంగాపూర్ మండలం రేచపల్లి శివారులో మంగళవారం ఉదయం విద్యుత్ షాక్‌పెట్టి ఓ సాంబర్ అనే అటవీ జంతువును హతం చేశారు. అనంతరం దాని మాంసాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా.. అటవీశాఖ అధికారులు గమనించి అజ్మీరా రవి, సుబ్రహ్మణ్యంలను పట్టుకుని కేసు నమోదు చేశారు. బుధవారం కార్యాలయానికి తీసుకువచ్చారు. కోర్టులో హాజరు పరుస్తారనే భయంతో రవి వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగాడు. రవిని తొలుత ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ముగ్గురు రైతుల బలవన్మరణం

తుర్కపల్లి (ఆలేరు)/చింతలపాలెం (హుజూర్‌నగర్)/ రాజన్న సిరిసిల్ల: అప్పులబాధతో ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రైతన్న ఆరుగాలం కష్టపడినా అప్పులబాధలు తప్పడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో పెట్టుబడికి కోసం తెచ్చిన అప్పులుకుప్పలయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాని రైతులు మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో బుధవారం ఈ ఘటనలు వెలుగుచూశాయి. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన అన్నం శంకర్‌రెడ్డి(57), సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం నక్కగూడెం గ్రామానికి చెందిన గుగులోతు హరినాయక్ (34), రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన రైతు ఎగుర్ల ఎల్లయ్య(55) అప్పులబాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు.

తల్లాడ రేంజ్‌లో చిరుత అడుగుజాడలు



తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ అటవీ రేంజ్ పరిధిలోని పెనుబల్లి మండలం లింగగూడెం సెక్షన్ గుర్రంగూడ బీట్‌లో బుధవారం చిరుత అడుగుజాడలను గుర్తించారు. అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పృథ్వీరాజ్ పర్యవేక్షణలో మాంసాహార జంతువుల గణన చేపట్టగా చిరుత కాలి ముద్రలు కనిపించాయి. కార్యక్రమంలో ఖమ్మం ఫారెస్ట్ డివిజనల్ అధికారి వి.సతీష్, రేంజ్ అధికారి ఉమ, వి.మంగారావు పాల్గొన్నారు.

మనోవేదనతో 'మోహన్‌రెడ్డి' బాధితుడి మృతి



ముజీబ్ (ఫైల్)

కరీంనగర్ క్రైం: మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డి బాధితుడు ఒకరు బుధవారం మృతి చెందాడు. రూ. 5 లక్షల అప్పు కింద రూ. కోటి విలువైన ఇంటిని కోల్పోయిన బాధితుడు మనోవేదనతోనే మృతి చెందినట్లు మోహన్‌రెడ్డి బాధిత సంఘంతో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గోదాంగడ్డకు చెందిన ఎండీ గోరిమా తన భర్త ముజీబ్ వైద్యం కోసం హోంగార్డ్ పూదరి శ్రీనివాస్ ద్వారా మోహన్‌రెడ్డిని కలసి రూ. 5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకోసం తన ఇంటిని మోహన్‌రెడ్డి తండ్రి ఆదిరెడ్డి పేరిట జీపీఏ చేయించింది. వడ్డీ రూపంలో రూ. 50 వేలు చెల్లించింది. పూర్తి రుణం చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మోహన్‌రెడ్డి, పూదరి శ్రీనివాస్, బొబ్బల మహేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, బొబ్బల ఆదిరెడ్డిలు 2015 సెప్టెంబర్ 6న వచ్చి.. దంపతులను బెదిరించి సదరు ఇంటిని నిమ్మ మాలతి పేరిట సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇల్లు కూడా ఖాళీ చేయించారు. సుమారు రూ. కోటి విలువ చేసే ఇంటిని రూ. 5 లక్షల కింద పోగొట్టుకోవడంతో ముజీబ్ మనస్తాపానికి గురయ్యాడు. హైదరా బాద్ వెళ్లి ఆటో డ్రైవర్‌గా కొన్నాళ్లు పని చేశాడు. సోదరుడు చనిపోవటంతో తిరిగి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మోహన్‌రెడ్డి అరెస్టు అయిన తర్వాత పలు నిరసన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఇల్లు పోయిందన్న బెంగతో అనారోగ్యం పాలైన ముజీబ్ బుధవారం చనిపోయాడు. మోహన్‌రెడ్డి బాధితుల సంఘం సభ్యులు వెళ్లి నివాళులు అర్పించారు.

సాక్షి స్పోర్ట్స్
గురువారం 25-1-2018



ఫెడ్‌కప్‌లో బరిలో దిగనున్న సెరెనా

గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచినప్పటి నుంచి టెన్నిస్ కోర్టులో దిగని స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ వచ్చే నెలలో జరిగే ఫెడ్ కప్‌తో తిరిగి బరిలోకి అడుగు పెట్టనుంది. గతేడాది జనవరిలో చివరి టైటిల్ సాధించిన సెరెనా... సెప్టెంబర్‌లో పాపకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి టెన్నిస్‌కు దూరమైన ఆమె ఫిబ్రవరిలో జరిగే ఫెడ్‌కప్‌లో ఆడనుందని అమెరికా టెన్నిస్ అసోసియేషన్ బుధవారం ప్రకటించింది.

పేస్‌కు పడిపోయారు



కోహ్లి

కీలకమైన టాస్ మననే వరించింది... ఐదుగురు పేసర్లతో దిగినా, భారత్ అనూహ్యంగా బ్యాటింగ్ ఎంచుకుంది. అంతలోనే అసలు సిసలు పేస్ పిచ్ అంటే ఏమిటో తెలిసొచ్చింది... అటు పరుగులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రత్యర్థి భీకర బౌలింగ్... ఇటు తంటాలు పడుతూ భారత బ్యాటింగ్... మధ్యలో కెప్టెన్ విరాట్ కోహ్లి క్లాస్ ఇన్నింగ్స్... చతేశ్వర్ పుజారా అపరిమిత సహనం... చివర్లో భువనేశ్వర్ కుమార్ పరిణతి! మొత్తంమీద బంతి రెప్పపాటులో దూసుకొస్తున్న వాండరర్స్ వికెట్‌పై కాస్తోకూస్తో చెప్పుకోదగ్గ స్కోరు... ఇక ప్రత్యర్థిని ఎంత తక్కువకు కట్టడి చేస్తే మూడో టెస్టుపై భారత్‌కు అంతగా పట్టు చిక్కుతుంది.

జొహన్నెస్‌బర్గ్: అందరూ అనుకున్నట్లే ఎదురైన పచ్చిక పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్ నిలవలేకపోయారు. సఫారీ పేస్ దళం నిప్పులు చెరిగే బంతులకు సమాధానం ఇవ్వలేకపోయారు. బంతి బంతికి గండం అన్నట్లు ఆడిన ఓపెనర్లు పూర్తిగా నిరాశ పరిచారు. కానీ... అడ్డుగోడ పుజారా (179 బంతుల్లో 50; 8 ఫోర్లు) తోడుగా కెప్టెన్ విరాట్ కోహ్లి (106 బంతుల్లో 54; 9 ఫోర్లు) పట్టుదల చూపాడు. లోయరార్డర్ లో భువనేశ్వర్ (49 బంతుల్లో 30; 4 ఫోర్లు) విలువైన పరుగులు జోడించాడు. దీంతో జొహన్నెస్‌బర్గ్‌లో బుధవారం దక్షిణాఫ్రికాతో ప్రారంభమైన మూడో టెస్టులో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకు ఆలౌటైంది. రబడ (3/39), మోర్కెల్ (2/47), ఫిలాండర్ (2/31), ఫెలూక్‌వాయో (2/25) సమష్టిగా రాణించారు. పిచ్ పరిస్థితి చూస్తే భారత్‌ది పోరాడే స్కోరుగానే కనిపిస్తోంది. దీనికి తగ్గట్లే భువీ.. ప్రత్యర్థి ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఓపెనర్ మార్క్‌రమ్ (2)ను చక్కటి బంతితో అవుట్ చేశాడు. ఆట ముగిసే సమయానికి ఎల్గర్ (4 బ్యాటింగ్), రబడ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

కోహ్లి స్థైర్యం... పుజారా సహనం...

అచ్చంగా పేసర్లే రాజ్యమేలే వాండరర్స్‌లో ఉదయం టాస్ గెలిచిన కోహ్లి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కానీ... ప్రొటీస్ బౌలర్ల పదునుకు ఓపెనర్లు నిలవలేకపోయారు. కేఎల్ రాహుల్ (0) డకౌట్‌గా వెనుదిరగగా, మురళీ విజయ్ (8) విఫలమయ్యాడు. ఈ స్థితిలో పుజారాకు జత కలిసిన కోహ్లి ఇలాంటి పిచ్‌పై ఎలా ఆడాలో సహచరులకు చూపాడు. ఓ వైపు ఫిలాండర్, మోర్కెల్, రబడ, ఇన్‌గిడి కదం తొక్కుతుండగా... పరిస్థితులు పూర్తి ప్రతికూలంగా ఉన్నప్పటికీ స్థైర్యం కోల్పోకుండా నిలిచాడు. లంచ్ విరామానికి భారత్ 45/2తో నిలిచింది. ఈ సెషన్లో ఫిలాండర్ అత్యంత ప్రమాదకరంగా కనిపించాడు. లంచ్‌తర్వాత పుజారా ఫిలాండర్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టి టచ్‌లోకి రాగా, రబడ బౌలింగ్‌లో బౌండరీతో కోహ్లి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే... మరుసటి ఓవర్లో తక్కువ ఎత్తులో వచ్చిన ఇన్‌గిడి బంతిని డ్రైవ్ ఆడబోయి స్లిప్‌లో డివిలియర్స్‌కు చిక్కాడు. మూడో వికెట్‌కు వీరిద్దరూ 84 పరుగులు జోడించారు. దీంతో అజింక్య రహానే (9) క్రీజులోకి వచ్చాడు. ఎన్నో అంచనాల మధ్య తుది జట్టులోకి వచ్చిన అతడు అవకాశాన్ని మాత్రం సద్వినియోగం చేసుకోలేకపోయాడు. వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ (2) తోడుగా పుజారా అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 12 బంతుల వ్యవధిలో ఒక్క పరుగూ రాకుండానే మూడు వికెట్లు పడిపోవడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది.

54 తొలి పరుగు తీసేందుకు చతేశ్వర్ పుజారా ఎదుర్కొన్న బంతులు. భారత్ తరఫున రాజేశ్ చౌహాన్ (57-శ్రీలంకపై, 1994) పేరిట ఈ రికార్డు ఉంది. అయితే ఇన్నింగ్స్ మధ్యలో పరుగు తీయకుండా ఎక్కువ బంతులు ఆడింది మాత్రం రవి శాస్త్రి. ఇదే జొహన్నెస్‌బర్గ్‌లో 1992 సిరీస్‌లో శాస్త్రి 9 పరుగుల స్కోరుకు చేరుకున్నాక వరుసగా 68 బంతుల పాటు పరుగే తీయలేదు.

అవకాశాలు వచ్చినా...

కోహ్లి వ్యక్తిగత స్కోరు 11 వద్ద ఉండగా ఇచ్చిన అతి సునాయాస క్యాచ్‌ను ఫిలాండర్... 32 పరుగుల వద్ద క్యాచ్‌ను స్లిప్‌లో డివిలియర్స్ జారవిడిచారు. పుజారా సున్నా మీద ఉండగా... స్పష్టంగా ఎల్బీ అయినా సందేహంతో దక్షిణాఫ్రికా రివ్యూ కోరలేదు. రహానే 3 పరుగుల వద్ద ఫిలాండర్ బౌలింగ్‌లో అవుటైనా నోబాల్‌గా తేలడంతో వెనుక్కు పిలిపించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) రబడ 8; రాహుల్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 0; పుజారా (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 50; కోహ్లి (సి) డివిలియర్స్ (బి) ఇన్‌గిడి 54; రహానే (ఎల్బీ డబ్ల్యూ) మోర్కెల్ 9; పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 2; పాండ్యా (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 0; భువనేశ్వర్ (సి) ఫెలుక్‌వాయో (బి) రబడ 30; షమీ (సి) రబడ (బి) ఫిలాండర్ 8; ఇషాంత్ (సి) డు ప్లెసిస్ (బి) రబడ 0; బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం:** (77 ఓవర్లలో) 187 ఆలౌట్.

వికెట్ల పతనం: 1-7, 2-13, 3-97, 4-113, 5-144, 6-144, 7-144, 8-163, 9-166, 10-187. **బౌలింగ్:** మోర్కెల్ 17-5-47-2, ఫిలాండర్ 19-10-31-2, రబడ 19-7-39-3, ఇన్‌గిడి 15-7-39-3, ఫెలుక్‌వాయో 7-1-25-2. **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** ఎల్గర్ నాటౌట్ 4; మార్క్‌రమ్ (సి) పటేల్ (బి) భువనేశ్వర్ 2; రబడ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (6 ఓవర్లలో వికెట్ నష్టానికి) 6. వికెట్ల పతనం:** 1-3. **బౌలింగ్:** భువనేశ్వర్ 3-2-3-1, బుమ్రా 3-2-3-0.

ఫెడరర్ మరింత జోరుగా...

- సెమీ ఫైనల్లో స్విస్ దిగ్గజం
- హలెప్, కెర్బర్ కూడా...
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్



ఫెడరర్



కెర్బర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నిలబెట్టుకునే దిశగా రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) మరో అడుగు వేశాడు. ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అతను సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్‌లో మాజీ విజేత ఏంజెలిక్ కెర్బర్ (జర్మనీ), టాప్‌సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా) సెమీస్ చేరారు. పురుషుల విభాగంలో ఫెడరర్‌తో పాటు దక్షిణ కొరియాకు చెందిన అన్‌సీడెడ్ హ్యోన్ చుంగ్ కూడా సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న జోడీ సెమీఫైనల్ పోరుకు అర్హత సంపాదించింది.

రోజర్ 43వ సారి...

రెండో సీడ్ ఫెడరర్ తన గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో 43వ సారి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే అతను సెమీస్ చేరడం ఇది 14వ సారి కావడం విశేషం. బుధవారం ఏకపక్షంగా సాగిన క్వార్టర్ ఫైనల్లో రోజర్ 7-6 (7/1), 6-3, 6-4తో థామస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్)పై వరుస సెట్లలో విజయం సాధించాడు. మరో క్వార్టర్ ఫైనల్లో కొరియన్ సంచలనం హ్యోన్ చుంగ్ 6-4, 7-6 (7/5), 6-3తో టెనిస్ సాండ్‌గ్రెన్ (అమెరికా)పై గెలుపొందాడు. శుక్రవారం సెమీస్‌లో ఫెడరర్... హ్యోన్ చుంగ్‌తో తలపడతాడు.

హలెప్ అలవోకగా..: మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ హలెప్, జర్మనీ స్టార్ కెర్బర్ అలవోక విజయాలతో సెమీఫైనల్ చేరుకున్నారు. క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ హలెప్ 6-3, 6-2తో ఆరో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందింది. మరో పోరులో 21వ సీడ్ కెర్బర్ ధాటికి అమెరికా క్రీడాకారిణి మాడిసన్ కీస్ చేతులెత్తేసింది. జర్మనీ స్టార్ వరుస సెట్లలో 6-1, 6-2తో 17వ సీడ్ కీస్ (అమెరికా)ను చిత్తు చేసింది. 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ అయిన కెర్బర్ 51 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను ముగించింది. సెమీస్ మ్యాచ్‌ల్లో కెర్బర్‌తో హలెప్, ఎలైస్ మెర్టెన్స్ (బెల్జియం)తో వోజ్నియాకి (డెన్మార్క్) పోటీపడతారు.

సెమీస్‌లో బోపన్న జోడి

మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)-తిమియా బాబోస్ (హంగేరి) జంట సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ భారత్-హంగేరి జోడీ 6-4, 7-6 (7/5)తో సెబాస్టియన్ కెబల్ (కొలంబియా)- అబిగెల్ స్పియర్స్ (అమెరికా) జంటను కంగుతినిపించింది.

సెమీస్‌లో పాకిస్తాన్

అండర్-19 వరల్డ్‌కప్

క్రైస్ట్‌చర్చ్: బౌలర్లు రాణించడంతో పాటు బ్యాటింగ్‌లో అలీ జర్యాబ్ (111 బంతుల్లో 74 నాటౌట్; 5 ఫోర్లు) అద్భుత ప్రదర్శన చేయడంతో పాకిస్తాన్ అండర్-19 వరల్డ్‌కప్ సెమీస్‌కు చేరింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో పాకిస్తాన్ 3 వికెట్లతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు చేయగా... పాకిస్తాన్ 47.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసి విజయం సాధించింది. బంగ్లాదేశ్, భారత్‌ల మధ్య శుక్రవారం జరిగే మరో క్వార్టర్స్‌లో విజయం సాధించిన జట్టుతో పాకిస్తాన్ సెమీస్‌లో తలపడనుంది.

భారత్ శుభారంభం

హామిల్టన్: నాలుగు దేశాల ఇన్విటేషనల్ హాకీ టోర్నమెంట్ రెండో అంచెలో భారత్ శుభారంభం చేసింది. తొలి అంచె ఫైనల్లో బెల్జియం చేతిలో ఓటమి పాలైన భారత్... బుధవారం రెండో అంచె తొలి మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ పై 3-2తో విజయం సాధించింది. మన జట్టు తరఫున లలిత్ ఉపాధ్యాయ్ (7వ ని.లో), హర్జీత్ సింగ్ (32వ ని.లో), రూపిందర్ పాల్ సింగ్ (36వ ని.లో) తలా ఓ గోల్ నమోదు చేశారు.

సైనా, సింధు శుభారంభం

ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ



జకర్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పీవీ సింధు, సైనా నెహ్వాల్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ పోటీల్లో సింధు 21-13, 21-10తో హన్న రమదిని (ఇండోనేసియా)పై, సైనా 22-24, 21-15, 21-14తో ఏడో సీడ్ చెన్ యుఫె (చైనా)పై గెలుపొందారు. పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మకు మొదటి రౌండ్లోనే చుక్కెదురైంది. అతను 16-21, 21-12, 10-21తో కజుమస సాకాయ్ (జపాన్) చేతిలో కంగుతిన్నాడు. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-15, 21-17తో ఎనిమిదో సీడ్ తకుటో ఇనోయె - యుకి కనెకో (జపాన్) జంటపై విజయం సాధించగా, మను అత్రి- సుమిత్ రెడ్డి జోడి 18-21, 21-16, 16-21తో లు చింగ్ యో- యంగ్ పొ హన్ (చైనీస్ తైపీ) జంట చేతిలో పరాజయం చవిచూసింది. పారుపల్లి కశ్యప్ 18-21, 18-21తో వీ ఫెంగ్ చోంగ్ (మలేసియా) చేతిలో ఓటమి చవిచూశాడు.

ఆనంద్ గెలుపు

విక్ అన్ జీ (నెదర్లాండ్స్): ప్రతిష్టాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ మూడో విజయాన్ని సాధించాడు. జోన్స్ గవాయిన్ (ఇంగ్లండ్)తో బుధవారం జరిగిన పదో రౌండ్ గేమ్‌లో ఆనంద్ 40 ఎత్తుల్లో విజయం సాధించాడు. 14 మంది గ్రాండ్‌మాస్టర్లు తలపడుతున్న ఈ టోర్నీలో పదో రౌండ్ తర్వాత ఆనంద్ 6 పాయింట్లతో నాలుగోస్థానంలో ఉన్నాడు.

కరుణ్ నాయర్ మెరుపు సెంచరీ

కోల్‌కతా: కరుణ్ నాయర్ (52 బంతుల్లో 100; 8 ఫోర్లు, 7 సిక్సులు) అద్భుత సెంచరీతో సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ సూపర్ లీగ్‌లో బుధవారం కర్ణాటక 123 పరుగులతో జార్ఖండ్‌పై గెలుపొందింది. తొలుత కర్ణాటక 201 పరుగులు చేయగా జార్ఖండ్ 78 పరుగులకే ఆలౌటైంది. ఇతర మ్యాచ్‌ల్లో తమిళనాడుపై బెంగాల్; ముంబైపై రాజస్తాన్; బరోడాపై యూపీ గెలుపొందాయి.



సప్తవాహనాలపై సర్వాంతర్యామి

సూర్య జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో బుధవారం శ్రీవారి రథసప్తమి మహోత్సవం అశేష భక్తజన సందోహం నడుమ వైభవంగా జరిగింది. పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఉదయం 5.30కు ప్రారంభమైన సూర్యప్రభ వాహన సేవ ఉదయం 7.50 వరకు సాగింది. 6.10 కల్లా శ్రీవారు సూర్యప్రభ వాహనంపై ఉత్తర మాడవీధి కూడలికి ఊరేగింపుగా చేరుకున్నారు. భానుడి లేలేత కిరణాలు ఉదయం 7.04 గంటలకు ఏడుకొండలస్వామి పాదాలను తాకాయి. దినకరుని స్పర్శతో మలయప్పస్వామి మరింత తేజోమూర్తిగా దర్శనమివ్వడంతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. అనంతరం ఏడు వాహనాలపై ఊరేగుతూ మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ మూర్తిని దర్శించుకునేందుకు భక్తులు చొచ్చుకురావటంతో తోపులాటలు చోటు చేసుకున్నాయి. – సాక్షి, తిరుమల

ఏమో గుర్రమెగరావచ్చు.. చేప నడవావచ్చు..



గుర్రం ఎగురుతుందో లేదో తెలియదు గానీ.. ఈ చేప మాత్రం నడుస్తుంది.. చూడ్డానికి అవి వేళ్ల మాదిరి కనిపిస్తున్నాయి కదూ.. ప్రపంచంలో అత్యంత అరుదైన మత్స్యాల్లో ఒకటిగా పేర్కొంటున్న ఈ చేపను టాస్మేనియా సముద్ర జలాల్లో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ చేప పది సెంటీమీటర్ల వరకు మాత్రమే పెరుగుతుంది. ఇలాంటివి ఇక్కడ కేవలం 20–40 మధ్య ఉండి ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇవి అంతరించిపోకుండా వీటి సంతతిని పెంచడానికి చర్యలు తీసుకుంటామని వారు చెబుతున్నారు.

అద్భుతం.. ఆదిత్యుని నిజరూప దర్శనం



శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో శ్రీసూర్యనారాయణస్వామి జయంతి ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గర్భాలయంలో కొలువైన శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీసూర్యనారాయణ స్వామి వారి మూలవిరాట్టుకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 6 వరకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. పిడకల పొయ్యిలపై క్షీరాన్నం వండి స్వామికి నివేదనగా పెట్టారు. ఆలయ ఉత్సవ అధికారి, డిప్యూటీ కమిషనర్ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆలయ ఈవో వి.శ్యామలాదేవిల ఆధ్వర్యంలో రథసప్తమి ఉత్సవం ప్రశాంతంగా ముగిసింది. అనధికారికంగా వీవీఐపీ మార్గం నుంచి పోలీసు, రెవెన్యూ సిబ్బంది కుటుంబాలను పంపించడంపై ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. – అరసవల్లి (శ్రీకాకుళం)

ఐదు వేదికలు.. ఆరు ప్లీనరీలు

- రేపటి నుంచి మూడు రోజులు 'హైదరాబాద్ సాహిత్యోత్సవం'
- బేగంపేట్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఏర్పాట్లు
- విభిన్న సాహిత్య, సామాజిక అంశాలపై సదస్సులు
- అతిథి దేశంగా స్పెయిన్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సాహిత్యోత్సవ ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. శుక్రవారం నుంచి 3 రోజులపాటు బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. 3 రోజులపాటు 5 వేదికలపైన ఆరు ప్లీనరీలను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ కన్వీనర్ విజయ్‌కుమార్ తెలిపారు. తొలిరోజు ఉదయం 'కన్నడ సాహిత్యం అప్పుడు–ఇప్పుడు' అనే అంశంపై ప్రముఖ రచయిత్రి ప్రతిభానందకుమార్ ప్రధాన ప్రసంగం చేస్తారు. మధ్యాహ్నం 'లైఫ్ ఇన్ ఏ డ్యాన్స్'పై ప్రముఖ నృత్యకారిణి సోనాల్‌మాన్‌సింగ్ మాట్లాడుతారు. 27న 'సిటిజన్' ఎడిటర్, సీనియర్ జర్నలిస్టు సీమా ముస్తఫా 'బీయింగ్ ఏ సెక్యులర్ ముస్లిం ఇన్ ఇండియా'పై ప్రసంగించనున్నారు. బాలీవుడ్ నటుడు శశికపూర్ కూతురు సంజనా కపూర్ నాటక రంగం, థియేటర్ ఆర్ట్ తదితర అంశాలపై తన అనుభవాలను వివరిస్తారు. 28న 'మీడియా టుడే'పై సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ మాట్లాడతారు. సాయంత్రం జరిగే ప్లీనరీలో సమాచార హక్కు చట్టం కార్యకర్త అరుణారాయ్ ప్రసంగించనున్నారు. వీటితోపాటు విభిన్న సామాజిక, సాహిత్య, సాంస్కృతిక అంశాలు, కళలపై మరో 30కిపైగా సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహిస్తారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక జీవితాన్ని ప్రతిబింబించే కళారూపాలనూ ప్రదర్శించనున్నారు.

ముస్తాబవుతున్న వేదికలు

పబ్లిక్ స్కూల్‌లోని 'తెలంగాణ టూరిజం పెవిలియర్' వేదికపై 6 ప్లీనరీలు, కార్వే క్యానోపీ, టాటా, గోథె గ్యాలరీల్లో పలు రకాల కార్యక్రమాలు జరుగుతాయి. వేడుకలకు స్పెయిన్ అతిథిగా హాజరుకానుంది. సాహిత్యోత్సవాలకు ఆదేశ మేధావులు, రచయితలు, కళాకారులు, అమెరికా, బ్రిటన్, కొలంబియా, కెనడా, ఇజ్రాయెల్ ప్రతినిధులు తరలిరానున్నారు. ఉత్సవాలకు ప్రముఖ కన్నడ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కేంద్ర సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ కంబారా హాజరుకానున్నారు. బెంగళూర్‌లో ప్రఖ్యాత రంగశంకర్ థియేటర్ నిర్మాత అరుంధతి నాగ్, ప్రముఖ దళిత సామాజిక కార్యకర్త ఉ.సరస్వతి, దివంగత పాత్రికేయురాలు గౌరీ లంకేష్ స్నేహితురాలు, ఆర్టిస్టు పుష్పమేలా పలు అంశాలపై ప్రసంగిస్తారు. ప్రముఖ గాయని గిరిజాదేవి, బాలీవుడ్ దిగ్గజం శశికపూర్, మరో నటుడు టామాల్టర్, ప్రముఖ పాత్రికేయురాలు గౌరీలంకేష్‌లను స్మరిస్తూ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభంకానుంది.

ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వైవిధ్యభరితమైన సాంస్కృతిక, కళారూపాలను సమున్నతంగా ఆవిష్కరించే లక్ష్యంతో 2010 నుంచి ఏటా నగరంలో సాహిత్యోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈసారి స్పెయిన్ కళాకారుల జానపద నృత్యం 'ఫ్లెమెంకో' ఆకర్షణగా నిలవనుంది. కన్నడంలో ప్రముఖ దర్శకుడు గిరీష్ కాసర వల్లి దర్శకత్వంలో వెలువడిన 'ఘటశ్రాధ', 'గులాబీ టాకీస్', 'ద్వీప', శశికపూర్ 'షేక్స్‌పీరియానా', 'టామాల్టన్' సినిమాలు ప్రదర్శిస్తారు. వంట చేస్తూ చెప్పే ఉ.సరస్వతి రామాయణం కథ, 'నన్న నుక్కడ్' (చిన్నారుల వీధి మలుపు), హైదరాబాద్ దక్కనీ హాస్య కవితాసమ్మేళనం, 'బాంబే బైరాగ్', వికలాంగుడైన కళాకారుడు బందే నవాజ్ నదీఫ్ ఫుట్ అండ్ మౌత్ పెయింటింగ్, తెలంగాణ విమెన్ రిసోర్స్ సెంటర్ మహిళా చిత్రకారుల ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

మే 2 నుంచే ఎంసెట్

ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షలను మే 2వ తేదీ నుంచే నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. గత షెడ్యూల్ ప్రకారం మే 2 నుంచి 7 వరకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని, 7వ తేదీని రిజర్వ్‌గా పెట్టామన్నారు. మే 6న నీట్ పరీక్ష ఉన్నందునా ఆ రోజును మినహాయించి మిగతా తేదీల్లో పరీక్షలను నిర్వహించేలా రోజువారీ షెడ్యూల్‌ను ఖరారు చేస్తామన్నారు. మే 2, 3 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సులకు, 4, 5, 7 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహించే అవకాశముందన్నారు. తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థుల నుంచి వచ్చే దరఖాస్తులను బట్టే రోజువారీ పరీక్ష తేదీలు ఉంటాయన్నారు. అగ్రికల్చర్, ఇంజనీరింగ్ విభాగాల రోజువారీ పరీక్షల తేదీలు, వాటి ఫీజులు తదితర అంశాలపై ఎంసెట్ కమిటీ సమావేశంలోనే తుది నిర్ణయం తీసుకుంటామన్నారు

795 మందికి పతకాలు

పోలీసు అధికారులకు గణతంత్ర దినోత్సవ పతకాలు ప్రకటించిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 795 మంది పోలీసు అధికారులకు కేంద్రం పతకాలు ప్రకటించింది. ఇందులో 107 మంది అధికారులకు శౌర్య పతకాలు, 75 మందికి రాష్ట్రపతి పతకాలు, 613 మంది అధికారులకు విశిష్ట సేవా పతకాలు దక్కాయి. రాష్ట్రం నుంచి ఆరుగురికి శౌర్య పతకాలు, ఇద్దరికి రాష్ట్రపతి పతకాలు, 13 మందికి విశిష్ట సేవా పతకాలు దక్కాయి.

రాష్ట్రపతి పతకాలు..

1. జితేందర్–ఏడీజీపీ ఆర్‌బీవీఆర్‌ఆర్ హైదరాబాద్, 2.నారాయణరావు చుంగి–డీఎస్పీ హైదరాబాద్.

విశిష్ట సేవా పతకం..

1. మస్తిపురం రమేశ్, గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్. 2. డి.శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్, టీఎస్‌ఎస్పీ. 3. పి.వీరాస్వామి, అసిస్టెంట్ కమాండెంట్, హైదరాబాద్. 4.ఎస్.రంగారావు, ఏసీపీ, హైదరాబాద్. 5.తుల్జారామ్ నరేందర్ సింగ్, డీఎస్పీ, హైదరాబాద్. 6.చెట్లూరు శ్రీనివాస శాంతి, ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్. 7.గెడ్డిపల్లి రణవీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్. 8.పల్లె శంకర్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్. 9.ఎండీ ఫయాజ్ అహ్మద్ షరీఫ్, ఏఆర్ సబ్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్. 10. వేమూరి శివానందరావు, హెడ్ కానిస్టేబుల్, హైదరాబాద్. 11. రాథోడ్ రోహిదాస్ నాయక్, ఏపీసీ హెచ్‌సీ, హైదరాబాద్. 12.పి.శ్రీనివాస్, జూనియర్ కమాండో, హైదరాబాద్. 13. ఎం.సిద్ధయ్య, హెడ్ కానిస్టేబుల్, హైదరాబాద్.

పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ

జి.సురేశ్–జేసీ, ఎం.మురళి – జేసీ, బి.శ్రీరాములు–ఏఏసీ, వెంకట శ్రీనివాస్ రెడ్డి–ఏఏసీ, పి.లక్ష్మణుడు–జేసీ, హరీశ్–జేసీ

బెయిల్‌పై గజల్ శ్రీనివాస్ విడుదల



హైదరాబాద్: లైంగిక వేధింపుల కేసులో చంచల్‌గూడ జైల్లో ఉన్న గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయటంతో బుధవారం రాత్రి బెయిల్‌పై విడుదల అయ్యారు. ఈ కేసులో పరారీలో ఉన్న రెండో నిందితురాలు పార్వతికి కూడా బెయిల్ మంజూరైంది. రూ.10 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని, ప్రతి ఆది, బుధవారాల్లో పంజగుట్ట పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని ఆయనకు షరతులు విధించింది.

కోర్టు పరిధిలో ఉంది: గజల్


ఈ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఇప్పుడేమీ మాట్లాడలేనని, కేసు నుంచి నిర్దోషిగా బయటికి వస్తానని గజల్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

30 నుంచి 'ఎక్సైజ్' పీక్యూటీ

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 2 వరకు ప్రిలిమినరీ క్వాలిఫయింగ్ టెస్టులు (పీక్యూటీ) నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ బుధవారం తెలిపింది. అనంతరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపడతామని పేర్కొంది. అభ్యర్థుల హాల్‌టికెట్లను www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

తౌఖీర్ పాత్రపై అనుమానాలు

- సిటీ పేలుళ్లలో ఐఎం ఉగ్రవాది హస్తం?
- నగరానికి రాకపోకలపై ఆధారాలు
- ఢిల్లీ పోలీసులకు చిక్కడంతో విచారణకు వెళ్లిన ఇంటెలిజెన్స్ బృందం



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఉగ్రసంస్థ నగరంలో 2007, 2013ల్లో పాల్పడిన జంట పేలుళ్ల కేసులో ఈ సంస్థ వ్యవస్థాపక సభ్యుడు అబ్దుల్ సుభాన్ ఖురేషీ అలియాస్ తౌఖీర్ పాత్రపై రాష్ట్ర నిఘా విభాగం లోతుగా ఆరా తీస్తోంది. దశాబ్దకాలంగా పరారీలో ఉన్న ఈ ఉగ్రవాదిని ఢిల్లీ స్పెషల్ సెల్ అధికారులు అక్కడి ఘాజీపురలో శనివారం అరెస్టు చేసిన నేపథ్యంలో అతడిని విచారించేందుకు రాష్ట్రంలోని నిఘా విభాగానికి చెందిన ఓ ప్రత్యేక బృందం ఢిల్లీకి వెళ్లింది.

సిమిలో ఉండగా సిటీకి

మధ్యప్రదేశ్‌లోని రామ్‌పూర్‌కు చెందిన తౌఖీర్ కంప్యూటర్ కోర్సు కోసం ముంబై వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) ఆలిండియా చీఫ్ సఫ్దర్ నఘోరీ పరిచయంతో ఓ సంస్థలో ఉన్నతోద్యోగానికి 2001లో రాజీనామా చేశాడు. సిమి వెలువరిస్తున్న 'ఇస్లామిక్ మూవ్‌మెంట్' పత్రికకు ఎడిటర్‌గా వ్యవహరించాడు. ఈ సమయంలోనే నఘోరీతో కలసి హైదరాబాద్ వచ్చి సిమి సానుభూతిపరుల్ని కలిశాడు. వీరికి గుజరాత్ అల్లర్లు, రెచ్చగొట్టే ప్రసంగాలతో కూడిన వీడియోలు ఉన్న హార్డ్‌డిస్క్‌ను ఓ వ్యక్తి ఇచ్చినట్లు నిఘా వర్గాలు చెప్తున్నాయి. ఈ ఒక్క 'పర్యటనే'రికార్డుల్లోకి ఎక్కినప్పటికీ వీరు పలుమార్లు నగరానికి వచ్చినట్లు అనుమానాలున్నాయి.

ఐఎం ఏర్పాటులో కీలకంగా

బండ్లగూడలోని ఓ విద్యాసంస్థలో పని చేసి, అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో అరెస్టయిన ముఫ్తీ అబు బషర్‌ను తౌఖీర్ కలసినట్లు అనుమానిస్తున్నాయి. 2001 సెప్టెంబర్‌లో కేంద్రం సిమిపై నిషేధం విధించడంతో అతడితోపాటు మరికొందరు అప్పట్లో ముంబైలో ఉంటున్న రియాజ్ భత్కల్, ఇక్బాల్ భత్కల్‌లను కలసి ఐఎంను స్థాపించారు. బాంబుల తయారీలో నిష్ణాతుడిగా పేరున్న తౌఖీర్ పేరు అహ్మదాబాద్, ముంబై పేలుళ్లలో నేరుగా వెలుగులోకి వచ్చింది. అప్పట్నుంచి పరారీలో ఉన్న అతడు కొన్నాళ్ల పాటు పాక్, దుబాయ్‌ల్లో తలదాచుకున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి.

ఆ రెండు పేలుళ్ల వెనుక

ఐఎం గోకుల్‌చాట్, లుంబినీపార్క్ (2007), దిల్‌సుఖ్‌నగర్ (2013)లో జంట పేలుళ్లకు పాల్పడింది. ఈ రెండు కేసుల్లోనూ రియాజ్ భత్కల్, ఒకదాంట్లో ఇక్బాల్ భత్కల్, అమీర్ రజా ఖాన్ నిందితులుగా ఉన్నారు. వీటికి సంబంధించిన సమావేశాల్లో భత్కల్ సోదరులతో పాటు తౌఖీర్ కూడా పాల్గొని ఉండొచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇది రూఢీ అయితే నగరంలోని జంటపేలుళ్లకు సంబంధించిన నాలుగు కేసుల్లో ఇతడు వాంటెడ్‌గా మారతాడు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.